
డూండీ రూపకల్పనలో మరో మరపురాని కథ
త్రిమూర్తి ప్రొడక్షన్స్ వారి
అభిమానవతి
స్క్రీన్‌ప్లే దర్శకత్వం: డూండీ
నిర్మాతలు: జి. సాంబశివరావు, పి. బాబ్జీ
VEEKAY
శ్రీ ఫిలింస్

# మార్చి 1975

సచిత్ర మాసపత్రిక సంపుటి: 13; సంచిక: 2


## విషయసూచిక


17. చీకటి పొద్దున వెలుగురేఖ (సీరియల్)—డి. కామేశ్వరి

33. కన్నీటి కథలు/(కవిత)—ఆర్. కామేశ్వరరావ్

34. గెలుపెవరిది?—చిత్రవు హనుమంతరావ్

43. పాలిష్—వేదగిరి రాంబాబు

49. కథాకేళి—వాడపల్లి విజయభాస్కర రామారావు

59. నేనొక మంచి వెధవను

62. కర్ఫ్యూరాత్రి—మల్లాది వెంకటకృష్ణమూర్తి

[illegible]. వస్తు గుణ విశేషములు—సుగుణ

70. వెలుగు కోరని చీకటి—కె. వి. యల్. నరసింహశాస్త్రి

76. గాంధీయం-రైల్వేలు—ఈడ్పుగంటి లక్ష్మణరావు

78. కబుర్లు—చలపాని ప్రసాదరావు

84. సినిమా

97. 'జ్యోతి నవలానుబంధం'లో పోలాప్రగడ సత్యనారాయణమూర్తి నవల 'ప్రేమాయణం' మూడవ భాగం


మారుతీ ప్రొడక్షన్స్‌వారి 'బాబు' చిత్రంలో శోభన్‌బాబు, వాణిశ్రీ


సంస్థాపకులు: కీ. శే. వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్: శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

జ్యోతి, 40/1 మూసాసెయిట్ స్ట్రీట్, టి. నగర్, మద్రాసు-600017.
ఫోన్: 440548; సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) రు. 29/-

# విజయవంతముగా ప్రదర్శింపబడుతున్నది



# తొలిమాట

సాహిత్య పరమావధి ఏమిటి?

ఈ ప్రశ్నకు

సమాధానాలు ఎవరెన్ని రకాలుగా చెప్పుకొన్నా-

సాహిత్యం

చదివింపజెయ్యాలి

ఆలోచింపజెయ్యాలి

సమాజానికి ఉపయుక్తమై కూడా ఉండాలి

అన్నది

జ్యోతి ఉద్దేశ్యం.

ఆ దృష్టితోనే

జ్యోతి

తన సంపాదక శాఖను నిర్వహించుకొంటోంది.

ఆ నిర్వహణలో ఎన్నుబడిన

మంచి సాహిత్యాన్ని

నెలనెలా మీ ముందు పరుస్తోంది

మీ అభిప్రాయాలూ, ఆలోచనలూ

తెలుసుకొనేందు కెప్పుడూ

జ్యోతి సిద్ధంగానే వుంటోంది

— వె. రాఘవయ్య

# పాలిడార్ అభిమానులకు సరికొత్త విడుదలలు!

| | | |
|---|---|---|
| ఎన్. టి. ఆర్. నటించిన | | సంగీతం: |
| మాయామచ్ఛీంద్ర | పి. యస్. ఆర్. పిక్చర్స్ | సత్యం |
| సంసారం | అనిల్ ప్రొడక్షన్స్ | టి. చలపతిరావు |
| వైకుంఠపాళి | శ్రీ రామకృష్ణా ఆర్ట్స్ | కె. వి. మహదేవన్ |
| డి. రామానాయుడు సమర్పించు | | |
| అమ్మాయిల శపథం | సురేష్ ఇంటర్నేషనల్ | విజయభాస్కర్ |
| ప్రభాకరరెడ్డి సమర్పించు | | |
| స్వాతంత్ర్యం వచ్చింది | జయప్రదా మూవీస్ | సత్యం |
| పి. గంగాధరరావు సమర్పించు | | |
| అమ్మాయిలూ జాగ్రత్త | నవశక్తి ఫిలింస్ | సత్యం |

డీలర్లు లేనిచోట కావలయును. నేడే వ్రాయండి

పాలిడార్ మార్కెటింగ్ కంట్రోలర్,

11-ఎ/1, అన్నాసాలై, మద్రాసు-600 002.

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

## పబ్లిక్ హెల్తు మరియు మ్యునిసిపల్ యింజనీరింగు డిపార్టుమెంటు

### చిట్ టెండరు నోటీసు నెం. 8519/75-9/DB/HD/Dt 11-2-75

ఈ దిగువ నుదహరించబడిన పనులకు సీల్డు టెండర్లు [illegible] కాంట్రాక్టుమీద (కె)క్లాసు II లోగాని అంతకు పై క్లాసులోగాని రిజిష్టర్ కాబడిన కాంట్రాక్టర్ల నుండియు మరియు రిప్యూటెడ్ ఫరముల నుండియు సూపరింటెండింగు యింజనీరు (పి. హెచ్) విశాఖపట్నం-3 వారిచే 31-3-'75 సాయంత్రము 3-30 గంటలవరకు తీసుకొనబడి, అదేరోజు సాయంత్రము 4-00 గంటలకు హాజరు కాబడిన టెండరుదార్ల సమక్షమున సూపరింటెండింగు యింజనీరు వారిచేగాని, లేక వారి పెర్సనల్ అసిస్టెంటువారిచేగాని తెరువబడును.

| వరుస నెంబరు | పని పేరు | ధరావత్తు సొమ్ము | | షెడ్యూలు ఖరీదు | టెండరు షెడ్యూలు అమ్మకమునకు లభించు తేదీ | టెండరు షెడ్యూలు సప్లయి కొరకు దరఖాస్తులు చేరవలసిన కడపటి తేదీ | టెండర్లు చేరవలసిన కడపటి తేదీ | పనిని పూర్తి చేయు కాలము |
|---|---|---|---|---|---|---|---|---|
| | | ట్రెజరీ చలాను లేక క్రాసు డిమాండ్ డ్రాఫ్టు | ఎగ్రిమెంటు సమయమున ఇవ్వవలసిన బ్యాంకు గ్యారంటీ | | | | | |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| మేహాద్రిగెడ్డ మంచినీటి సరఫరా పథకము. విశాఖపట్టణమునందలి పరిశ్రమలకు మంచి నీరు సరఫరా చేయుట. | | | | | | | |
| (1) 12 లక్షల గ్యాలన్ల కెపాసిటీగల గ్రౌండు లెవెలు రిజర్వాయరు భారత్ హెవీ ప్లేట్సు & వెసల్స్ లిమిటెడ్ దగ్గర పైపు కనక్షన్లతో సహా నిర్మించుటకు. | రూ 8700/- ఎనిమిది వేల ఏడు వందల రూపాయలు మాత్రం | రూ 5800/- ఐదు వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రం | రూ 31-20 ముప్పది ఒక్క రూపాయల ఇరువది పైసలు మాత్రం | 1-3-75 | 25-3-75 | 31-3-75 | 12 నెలలు |
| (2) ఒక యం.జి.డి కెపాసిటీగల ఫిల్ట్రేషన్ ప్లాంటు కావలసిన అన్ని మెకానికల్ మరియు ఎలక్ట్రికల్ ఎక్యూప్‌మెంటు సప్లై చేసి సివిల్ వర్క్సుతో సహా జింకు స్మెల్టరు ప్లాంటువద్ద నిర్మించుటకు. | రూ 9000/- తొమ్మిదివేల రూపాయలు మాత్రం | రూ 6000/- ఆరువేల రూపాయలు మాత్రం | రు. 20-80 ఇరువది రూపాయల ఎనభై పైసలు మాత్రం | 1-3-75 | 25-3-75 | 31-3-75 | 12 నెలలు |

టెండరు షెడ్యూల్సు, డాక్యుమెంట్లు, ఈ దిగువ సంతకపుదారు, వారి ఆఫీసునుండి పై నుదహరించబడిన తేదీలలో పొందవచ్చును. ఇందుకుగాను, టెండర్లు పెట్టగోరువారు పైన తెలియ బరచిన షెడ్యూలు ఖరీదును ఒక్కొక్క పనికి విడివిడిగా ఏ గవర్నమెంటు ట్రెజరీలోనైనా "882 కేష్ రెమిటెన్సెస్ ఎడ్జస్టబుల్ III అదర్ రెమిటెన్సెస్ (బి) ఐటమ్ ఎడ్జస్టబుల్ బై పబ్లిక్‌వర్క్సు" అకౌంటు క్రింద ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (పబ్లిక్ హెల్తు) విశాఖపట్నం వారి జమకు చెల్లించి, సదరు చలానును, టెండరు షెడ్యూల్సు, పొన్లు సప్లయికొరకు.

(తరువాయి పేజీ చూడుడు)

పెట్టుకొను దరఖాస్తులలో జతపరచి, యీ దిగువ సంతకందారు ఆఫీసులో 25-3-1975 లోపుగా చేరునట్లు పంపవలెను. టెండరు షెడ్యూలు ఖరీదును రొక్కముగాగాని, మనియార్డరు ద్వారాగాని, డిమాండు డ్రాఫ్టు ద్వారాగాని, చెక్కుల ద్వారాగాని తీసుకొనబడదు టెండరు. షెడ్యూల్సు పోస్టు ద్వారా తెప్పించుకొనగోరువారు (రూ 10-00) రూపాయలు పది మాత్రం స్టాంపులతో తమ యడ్రస్సుగల 25 సె.మీ × 50 సె.మీ. సైజుగల కవర్లు ఒక్కొక్క పనికి, ఒక్కొక్క కవరు చొప్పున విడివిడిగా దరఖాస్తులతో జతపరచవలెను. ఏ విధమైన పోస్టలు డిలేసుకు డిపార్టుమెంటు బాధ్యత వహించదు.

నోటు:—రిప్యూటెడ్ ఫరమ్‌లు మరియు జి. ఓ. నెం 1077 రు పి. డబ్ల్యు. డి. తేదీ 10-7-1967 ప్రకారము II వ తరగతిలోగాని అంతకు పై తరగతిలోగాని రిజిస్టరు గాబడిన కాంట్రాక్టర్లు మాత్రమే యీ పనికి టెండర్లు పెట్టుటకు అర్హులు. ఇంతకు పూర్వము జి. ఓ. నెం 1077 రు పి. డబ్ల్యు. డి. తేది 10-7-1967 ప్రకారము రిజిష్టరుగానివారు, తగు రిజిస్ట్రేషను ఫీజు చెల్లించి తగు సమయము లోపునే తమ పేరును నమోదు చేయించుకొనవలయును. రిజిస్ట్రేషన్ లెటరుయొక్క ఆధరైజ్డు కాపీ ఒక దానిని టెండరు షెడ్యూల్సు కొరకు పంపు అప్లికేషనుకు తప్పని సరిగా జతపరచవలెను. లేనిచో టెండరు షెడ్యూల్సు సప్లయి చేయబడవు.

రిజిస్ట్రేషను చేయుటకు కావలసిన వివరములన్నియు, కాంట్రాక్టర్లు తగు సమయములో ఇవ్వకపోవుటవలనగాని, మరి ఏ యితర కారణములచేగాని రిజిస్ట్రేషన్ ఆలస్యమయినచో యీ డిపార్టుమెంటు ఎట్టి బాధ్యత వహించదు. క్లాసు II మరియు అంతకన్న ఎక్కువ క్లాసులో కాంట్రాక్టర్లుగా రిజిస్టరు అవుటకు అప్లైచేసినంత మాత్రాన టెండరు షెడ్యూల్సు తీసుకొనుటకు అర్హులు కాలేరు.

(2) టెండరు షెడ్యూల్సు సప్లయికొరకు జమచేసిన సొమ్ము ఎట్టి పరిస్థితులలోనూ తిరిగి యివ్వబడదు.

(3) కాలమ్ (4) లో నుదహరించబడిన ధరావత్తు సొమ్ము గెలుపొందిన టెండరుదారుడు ఎగ్రిమెంటు కంక్లూడుజేయు సమయమున ఏదైనా షెడ్యూలు బ్యాంకునుండి, సరియైన బ్యాంకు గ్యారంటీ ఫారములో సమర్పించవలసి యుండును.

సం॥ వి. వి. ఆర్. శంకర్
సూపరింటెండింగు యింజనీరు,
పబ్లిక్ హెల్తు యింజనీరింగ్ సర్కిల్,
విశాఖపట్నం-3.

AGMARK

# అగ్‌మార్క్ నాణ్యమయిన సరుకు కొనటంలో మీకు తోడ్పడుతుంది

వెన్న, నెయ్యి, నూనె, మసాల పొడులు, గోధుమ పిండి, తేనె, గ్రుడ్లు మొ॥ కొనేప్పుడు వాటి మీద అగ్‌మార్క్ ముద్ర ఉందేమో చూడండి.

అగ్‌మార్క్ నాణ్యతకు ముద్ర

davp 74/4

# తెలుగు రచయిత్రుల సప్తమ మహాసభలు-

ఈనెల 7, 8, 9 తేదీలలో విజయవాడ పట్టణంలో జరిగినవి. ఈసభలు జయప్రదమయేందుకు యీ పట్టణ పౌరులెంతగానో సహకరించారు. విజయవాడ పౌరుల ఆతిథ్యపు ఔన్నత్యం కొత్త ఎత్తులు చూసింది. ఇతర ప్రాంతాలనుంచీ యీ సభలలో పాల్గొనడానికి వచ్చిన వారందరూ తమ సంతృప్తిని వెల్లడించేలా జరిగాయి ఏర్పాట్లు

రచయిత్రుల సభల ఎడ ప్రజలు ఇంత ఆసక్తి కనపరుస్తున్నారంటే రచయిత్రుల బాధ్యతలు మరింత పెరుగుతున్నట్లే లెక్క. సమాజానికి ఉపయోగకరమైన సాహిత్యాన్ని అందించవలసిన బాధ్యత రచయిత్రులపైనున్నది. ఆ బాధ్యతలు గుర్తుచేసుకోవడానికి యిటువంటి సభలు ఎంతో సహకరిస్తాయి.

## సభా విశేషాలు

సభలకు విచ్చేసిన ప్రతినిధులకూ, అతిథులకూ శ్రీమతి కాట్రగడ్డ వెంకటలక్ష్మమ్మగారి స్వాగత వచనాలతో సభలు ప్రారంభమయాయి. సభా ప్రారంభకులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి. పుస్తక ప్రదర్శనను శ్రీమతి భానుమతీ రామకృష్ణ ప్రారంభించారు. ఆనాడు విజయవాడలో నున్న సినీనటి శ్రీమతి జమున కూడా సభలకు రావడం సభకు మరింత అందాన్ని సమకూర్చింది. 'వచ్చే సంవత్సరం నేనూ రచయిత్రిగా యీ సభలలో పాల్గొనాలని వున్నది' అన్నది జమున. నిజంగానే అంత ఉత్సాహమూ, ఉత్తేజమూ కలిగించాయీ సభలు. రెండవరోజు సభలకు శ్రీమతి రామలక్ష్మి, మూడవరోజు సభలకు శ్రీమతి లత అధ్యక్షత వహించారు.

## తెలుగునవల-సామాజిక చైతన్యం

ఈ మకుటంతో జరిగిన గోష్ఠిని శ్రీమతి పరిమళా సోమేశ్వర్ ప్రారంభించారు. ఈనాడు రచయిత్రులలో చాలా మంది 'ఆడ పేరు'తో రాస్తున్న 'మగరచయిత్రు' లేనని చమత్కరించారు శ్రీమతి రామలక్ష్మి. మొత్తానికి యీ గోష్ఠిలో నవల సమాజ చైతన్యం కలుగజేసేదిగా వుండాలన్న అభిప్రాయమే బలంగా వ్యక్తమయింది. 'ప్రచార సాధనాలు-సాహిత్యం' అన్న అంశంపై కూడా గోష్ఠి జరిగింది.

## రచయిత్రులు-వాస్తవిక దృక్పథం

ఈ అంశంపై జరిగిన గోష్ఠిని వాసిరెడ్డి సీతాదేవి ప్రారంభించడమే గాక, రచయిత్రులకు వాస్తవిక దృక్పథం ఉండవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ విషయంగా పత్రికలపైన గూడా గురుతరమైన బాధ్యత వుందన్నారామె. వాస్తవికత లోపించిన రచనలు ప్రచురించటమంటే పత్రికలు సమాజానికి మత్తుమందు పెడుతున్నట్లుగానే భావించాలన్నారు. కొందరు సాహిత్యం పేరుతో అసహ్యం కలుగజేసే

స్థాయిలో అశ్లీలాన్ని ప్రచారం చేస్తున్నారని, యీ నేరాన్ని ఏక కంఠంతో ఖండించాలని ఎంతో ఆవేదనతో (గోష్టి మధ్య కలుగజేసుకొని మరీ) చెప్పారు శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ.

చివరిరోజున సాయంత్రం శ్రీమతి నాయని కృష్ణకుమారి అధ్యక్షతన సభ జరిగింది. ఆరోజు సభలో 'జానపద సాహిత్యము-మన సంస్కృతి' అన్న అంశంపై గోష్టి జరిగింది. జానపద సాహిత్యంలో మన సంస్కృతి ఎన్నో రూపాల నిక్షిప్తమై ఉన్నదనీ, దానిని వెలికి తెచ్చుకొని మన సంస్కృతిని ఇనుమడింప జేసుకోవచ్చుననీ గోష్టిలో పాల్గొన్నవారు తమ భావాలు వ్యక్తపరిచారు. వింజమూరి సోదరీమణులు జానపద సాహిత్యాన్ని గానంచేసి సభను రంజింపజేశారు.

సభల తర్వాత?

సభలూ, సమావేశాలూ సందడిగానే వుంటాయి. అభిప్రాయ వ్యక్తీకరణకూ, చర్చలకూ చక్కని వేదిక లౌతాయి. అయితే సభలు విజయవంతంగా జరగడం తోపాటు సభల ప్రభావం ప్రగతివైపు, విజయంవైపు దారితీయాలి.

రచయిత్రులు ఈనాడు చాలా ఎక్కువ సంఖ్యలోనే వున్నారు. ఎక్కువ సంఖ్యలోనే రాస్తున్నారు. రచనలలో మంచీచెడ్డా (అవి రచయిత్రులవైనా రచయితలవైనా) ఉంటూనే ఉంటాయి. ప్రత్యేకంగా రచయిత్రుల రచనలు ఇటీవల ఎక్కువ విమర్శలకు గురి అవుతున్నాయి. రచయిత్రులు చేపట్టే కథాంశాలు ఒకపరిధి దాటి బయటపడడం లేదనీ, కేవలం కుటుంబ వ్యవస్థా, సెంటిమెంట్లూ, ప్రేమా వీటి చుట్టూనే పరిభ్రమిస్తుంటాయన్న విమర్శ ఒకటుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం స్త్రీలలో రావాలి; స్త్రీల రచనలలో కూడా రావాలి;

ఏటేటా సభలు జరుపుకోవాలి రచయిత్రులు. సభల ఫలితంగా చైతన్య వంతమైన మార్పువైపుకు విజయవంతంగా పయనించాలి. 'ఉమెన్స్‌లిబ్' కోసం పాటుపడుతోంది స్త్రీజాతి. 'స్త్రీల రచనలు' అన్న మార్కు-నుంచి లిబరేట్ అయేందుకు అన్నివిధాలా కృషి జరపాలి రచయిత్రులు.

రచనాకర్తలకే గాని రచనలకు స్త్రీ, పురుష భేదాలుండదని నిరూపణ జరగాలి. ఇందుకోసం రచయిత్రులేగాక, 'మగ రచయిత్రులు' కూడా కృషిచేయాలి;

వే. లీలావతిరాఘవయ్య



పుస్తక సమీక్ష :

## మనిషి—మనుగడ

(నవల)

రచన: వాసిరెడ్డి కాశీరత్నం. జయంతి పబ్లికేషన్స్, విజయవాడ-2 వెల: రు. 6-50.

ఈ నవల ప్రారంభం రాజకీయ సామ్యాలతో చాలా హుషారుగా ఉంది. (తరువాత కథమీద రాజకీయాల ప్రభావం అంతగా కనిపించదు.) పల్లెటూరి వాతావరణాన్నీ అచటి వ్యక్తుల మనస్తత్వాలను, జీవితాలను. వీరకొలువుల లాటి ఆచార వ్యవహారాలను చక్కగా చిత్రించారు రచయిత్రి. భాష, పదాల కూర్పు చాలా బాగున్నది. కాని చురుగ్గా సాగలేదు నవల. కథకోసం కష్టపడి చదవవలసి వస్తోంది. ఇరుగు పొరుగున నున్న చిన్ననాటి స్నేహితులు సరళ, శ్రీనివాసులు. గడుగ్గాయి సరళ, దత్తత తలిదండ్రుల చాటున పెరిగిన శ్రీనివాసుల స్నేహాన్ని చివరి వరకు స్నేహంగానే పోషించారు రచయిత్రి. సరళ స్నేహితురాండ్రతో రైలుప్రయాణ సన్నివేశం నవల మధ్యలో జొప్పించారు. అది సందర్భానుసారంగా లేదు. మొదట్లో నయినా బాగుండేది.

పోతే పాపడిది స్వామిభక్తి పరాయణుడిగా నమ్మకమైన నౌకరుగా చక్కగా చిత్రించి న్యాయం చేకూర్చారు ఆ పాత్రకు.

"పట్నంలోకన్న పల్లెటూళ్ళలో జీవితాలకు భద్రత ఎక్కువ వుంది." "పట్టణం కాగితపు పువ్వయితే పల్లెటూరు చెట్టుకు పూసిన పువ్వు" "పల్లెటూరు పండుగల్లోని జీవకళ పట్టణాలలో ఉండదు" అంటూ పల్లెటూళ్ళ శోభపై జీవితాలపై రచయిత్రి తనకు గల అభిమానాన్ని చూపించారు.

"ఈ దేశంలో వివాహం వ్యక్తిగత విషయం కాదు. అదొక సాంఘిక వ్యవస్థ. సాంప్రదాయం, సంఘం, డబ్బు, అన్నీ మనిషికి సంకెళ్ళు వేస్తాయి. ఈ సంకెళ్ళు బరువు వదిలించుకోలేక నలిగిపోతాడు వ్యక్తి" అనే యదార్థాన్ని శ్రీనివాసు జీవితంలో చక్కగా నిరూపించారు. కథా నాయకుడు శ్రీనివాసు చిన్నతనంలో పిరికివాడుగా, పెద్దయాక మంచివాడుగా పరోపకారిగా ఉండి పై సాంఘిక వ్యవస్థకు లోనై గయ్యాళి భార్యకు భర్తవుతాడు.

అపర్ణగంభీరమైన వ్యక్తిత్వం చక్కగా చిత్రించారు. కాని ఆ కుటుంబం ఆ పల్లెకు (ఎందుకు) వచ్చి, ఎందుకలా విచ్చిన్నమైంది అనిపిస్తుంది. సరళ పై చదువులకు విదేశాలకు వెళ్ళిపోయింది. పుస్తకం పూర్తిగా చదివాక "ఎవరికివారే యమునా తీరే" అన్నట్లుంది గాని కథ సరైన గమ్యాన్ని చేరుకోలేదనే అసంతృప్తి కలుగుతుంది పాఠకులకు.

రచయిత్రిగారు మరి కొంచెం కృషిచేసి కథను ఇంకా పటిష్ఠం చేసియుండవచ్చు.

—'సుగుణ'

## శ్రీ స్వామి బాలానంద జీవిత విశేషాలు

రచన: నిర్మలం. వెల రు. 5-00.

'యువకులారా ఉవ్వొంగు మీ కార్య దీక్ష యే మాతృదేశ రక్ష' అంటూ యువకులకు సందేశ మిచ్చిన శ్రీ స్వామి బాలానంద జీవిత విశేషాలతో వెలువడిన గ్రం

థము. మూడు దశాబ్దాలుగా పాపికొండల పరిసరాలలోని గిరిజనులకు అనేక విధాల తోడ్పడుతూ, వారిని విద్యావంతులుగా, సంస్కార వంతులుగా, ఆరోగ్యవంతులుగా, తయారు చేయడంలో తన కాలాన్ని సద్వినియోగం చేసుకొంటున్న శ్రీ స్వామి బాలానంద జీవిత చరిత్ర అగమ్యగోచరమయిన పరిస్థితులలో కొట్టుమిట్టాడుతున్న యువకులకు 'ఆదర్శప్రాయంగా' వుండగలదు.

శ్రీ స్వామి బాలానంద రచనలు.

(I) రామాయణంలోనున్న నిజములు Facts in Ramayana అన్న శ్రీ స్వామి రచనకు 'శారదా-శివం' అనువాదం. వెల రు. 1-00.

(ii) మన వివేకానంద: తనను ప్రభావితం చేసిన స్వామి వివేకానందపై స్వామి బాలానంద అభిప్రాయలు వెల రు. 1-00

పై మూడు గ్రంథముల ప్రచురణ: బాలానంద భక్తబృందము, దేవాలయం వీధి, కాకినాడ.

## యుగ పురుషుడు

రచన: వేదవ్యాస

I. A. S ఆఫీసరుగా ప్రభుత్వంలో పనిచేస్తూనే తీరిక సమయాల్లో సమాజసేవా ధర్మనిర్వహణకై వేదశాస్త్ర పరిశోధన, ప్రాచీన భారతీయ సంస్కృతీ పునరుద్ధరణకు కృషిచేస్తూ మన ప్రాచీన వేదాలలోని ఆధ్యాత్మిక సత్యాలను, ఈనాటి విజ్ఞాన, సాంకేతిక, అణు సిద్ధాంత రహస్యాలతో పోల్చి చేసిన పరిశోధనల సారాంశముగా ప్రచురించబడ్డది వ్యాససంపుటి. ప్రచురణ: భారతీయాధ్యాత్మిక సంస్థ (యూస్కెఫీ): ధర తెలుపలేదు. వివరములకు USCEFI. పోస్టుబాక్సు: 1815, హైదరాబాదుకు రాయవచ్చును.

——ఎస్వీనారాయణ

---


సెక్సు విజ్ఞానార్జనకు మొదటిమెట్టు

# వాత్స్యాయన కామసూత్రాలు

## ధనికొండ రచన

ప్రపంచప్రసిద్దిగన్న వాత్స్యాయన కామసూత్రాలను ఎంతో శ్రమించి, ఎన్నో యితరభాషాగ్రంథాలను పరిశీలించి, ప్రఖ్యాత రచయిత శ్రీ ధనికొండ వ్రాశారు.

ఎటువంటి స్త్రీని ఏ ఆలింగన, చుంబన, రతివిశేషాలతో తృప్తిపర్చవచ్చునో దీనిని చదివితే తెలుస్తుంది. చిత్తినిజాతి రతి, పద్మినీజాతి చుంబన, హస్తినిజాతి ఆలింగనము, శంఖినిజాతి ముఖరతివంటి ఎన్నో మర్మవిషయములు చక్కగా వివరించే శాస్త్రీయశృంగార గ్రంథము. దీనిని ప్రతి స్త్రీ, పురుషుడు చదివి తీరవలసినది.

కొన్ని ఫుల్ పేజీ ముఖ్య చిత్రములుగల పుస్తకం వెల: రు. 10/-

పోస్టేజి అదనము. ఇటువంటి గ్రంథము తెలుగులో మున్నెన్నడు వెలువడలేదు.

బాలసరస్వతీ బుక్ డిపో, మద్రాసు-600001. ఫోన్: 29868


---

**జ్యోతి సప్లిమెంటు మార్చి 1975 సంచికలో చదవండి!**

# వ్యర్థ కుసుమాలు

[నవల]

## చిట్టూరెడ్డి సూర్యకుమారి

---


యాజమాన్యం తదితర వివరాలు

**జ్యోతి**

ఫారం 4 (8 వ నిబంధన ప్రకారం)

ప్రచురణ స్థలము : మద్రాసు

ఎంతకాలానికొకసారి : మాస పత్రిక

ముద్రాపకుని పేరు : డి. హనుమంతరావు

జాతి : భారతీయుడు

విలాసం : 12, ఫ్రాన్సిస్ జోసెఫ్ స్ట్రీట్, మద్రాసు-600 001

ప్రకాశకుని పేరు : శ్రీమతి వి లీలావతి

జాతి : భారతీయురాలు

విలాసం : 40/1, మూసా సెయిట్ స్ట్రీట్, మద్రాసు-600 017

సంపాదకుని పేరు : } డిటో
జాతి : } డిటో
విలాసం : } డిటో

పత్రిక యజమానులు : డిటో

పై విషయములు నాకు తెలిసినంతవరకు వాస్తవమైనవని తెలియజేయుచున్నాను.

మద్రాసు-17 (సం) వి. లీలావతి.

## సీరియల్




"అంటే, నీవు ప్రాక్టీసు చెయ్యవా నాయనా" అమ్మ ఆరాటంగా అడిగింది.

"నాకేం అవసరం! ఆ యిల్లు మీ అమ్మాయిది. ఆ నర్సింగ్ హోమ్ మీ అమ్మాయిది. చదువుకుంది. సంపాదిస్తుంది. పిల్లలు కావాలంటే నన్ను భరిస్తుంది. భరించలేదంటే సరే.

"లేదు లేదు... నేనే సంపాదిస్తాను, మీరు సంపాదించకపోయినా ఫరవాలేదు" ఆరాటంగా చెప్పేసుకున్నాను.

"నీవు నేను లోకానికి మాత్రమే భార్యాభర్తలం! యింక నీకు నాకు ఏ సంబంధం వుండదు" ఆ మాటకి ఎంతో రిలీఫ్ ఫీలయ్యాను. నా భయం అల్లా-ఆయనతో మళ్లీ కాపురం యెలా సాగించడం. ఆయన యింక దిగజారి నా కళ్ళముందే బజారు మనిషితో వున్న ఆయన్ని మళ్ళీ యెలా భర్తగా అంగీకరించి కాపురం చెయ్యను అనే భయపడ్డాను. ఆ మాట ఆయనతో ఎలాచెప్పడం, చెపితే మళ్ళీ కోపగిస్తే ఏం చెయ్యడం అని బెంగపడిన నాకు ఆ మాటతో తల

మీదనించి పెద్ద బరువు దించినట్లయింది. గుండెల నిండా తేలిగ్గా ఊపిరితీసుకున్నాను. ఆ నా భావం, నా సంతోషం మొహంమీద కనిపిస్తే, నేను సంతోషించడం కనిపెట్టి నా మీద కసితో మళ్ళీ ఆ అభిప్రాయం మార్చుకుంటారని మొహంమీద ఏ భావం కనపరచకుండా 'సరే-' అన్నాను.

"నే నా యింటికి రావాలంటే మీ బావ ఆ యింట్లో వుండకూడదు. అయింది. ఆఖరికి, నేను భయపడుతూ, ఆరాటంగా ఎదురు చూసిన ఆ షరతు పెట్టారు. ఇందాకటినించి బావ ప్రసక్తి రానందుకు సంతోషిస్తూ, ఆ ప్రసక్తి ఆయన తేకూడదని దేముణ్ని ప్రార్థిస్తూనే వున్నాను. భగవంతుడు నా మొర ఆలకించలేదు! పిల్లల కోసం ఆ షరతును అంగీకరించడం మినహా ఏం చెయ్యను. నేను జవాబుకి తటపటాయిస్తూండగా అమ్మ 'ఆనంద్ కాస్త ఆరోగ్యం చిక్కగానే వెళ్ళిపోతాడు. యిక్కడెందుకు వుండి పోతాడు నాయనా జబ్బుపడ్డాడు. నా అన్నవాళ్ళు లేరు గనక మేమే వాడి ఆప్తులం కనక వున్నాడు. నాలుగు రోజులుండి వెళ్ళిపోతాడు. వాడికి వుద్యోగం సద్యోగం లేదూ ..యిక్కడెందుకు వుంటాడు."

"టట్, వీల్లేదు వాడుంటే ఆ యింటికి నేను రాను నేను రాకపోతే నా పిల్లలు రారు " నిస్సహాయంగా ఆయన వంక అమ్మ వంక చూశాను.

"రంగారావు, నీవు పెట్టిన షరతు లన్నింటికి అది అంగీకరించింది. ఒక్క పది రోజులుంటే ఆనంద్ వెళ్ళిపోతాడు. దాని మనసు బాధపెట్టకు. ఆనంద్ కి, దానికి నీ వనుకునేదేంలేదు " అమ్మ సంజాయిషీ యిస్తూ అంది.

"అదంతా నా కనవసరం, వాడి మొహం నాకు కనపడడానికి వీలులేదు" మొండిగా అన్నారు.

"రావ్!" ఆమె హెచ్చరికగా పిలచింది. ఆయనకి కళ్ళతో ఏదో సౌంజ్ఞ చేస్తూ, తరువాత వయ్యారంగా..."వుండనీ రావ్, పాపం నీ భార్య వాళ్ళ బావని వదిలి వుండలేదేమో.. నీకు నేను, ఆవిడకి ఆయన యింక చక్కగా యేర్పాటుగా వుంటే నీ వెందుకు అభ్యంతరం చెపుతావు....పాపం వుండనీ. ." కళ్ళు వాల్చి ప్రక్కచూపుతో నా వంక చూస్తూ అంది. ఆమె మాటలు వింటూంటే చాచిపెట్టి లెంపకాయ కొట్టాలనిపించింది. అంత నీచంగా నా గురించి మాట్లాడడానికి ఆమెవంక ధైర్యం వచ్చిందంటే ఆయనిచ్చిన ప్రోత్సాహం, ధైర్యం కాదూ! అలా మాట్లాడుతున్న ఆమెని ఏమనలేక యెగిసి పడుతున్న గుండెలతో ఆమెవంక తీక్షణంగా చూశాను.

"ఆహాహా. ." ఆయనకి ఆ మాటలలో ఏం హాస్యం కనిపించిందో కాని పగలబడి నవ్వారు. ఆయన వా.గా త్రాగి వున్నారు. అప్పుడునూ అని తెలుస్తూంది .."అంతే నంటావా డియర్ " అన్నారు ఆమెని చూస్తూ, "మనకు కావల్సినవి మనకు యీయచం మనకు కావాలిగాని ఆవిడేం చేస్తే నీవెందుకు . ?' అంది విలాసంగా పమిట సరిచేసుకుంటూ.

అంటే వాళ్ళిద్దరూ ముందే యీ విషయం గురించి చర్చించారన్నమాట! యీ నాల్గు రోజులలో పిల్లలని చూసు

## : జరిగిన కథ :

డాక్టర్ కల్యాణి దగ్గర హౌస్ కీపర్ సుజాత. కల్యాణి దగ్గర అసిస్టెంటుగా చేరిన రామకృష్ణ, సుజాతలు ప్రేమించుకున్నారు. వారి పెళ్లి కళ్యాణే జరిపించింది. కళ్యాణి భర్త డాక్టర్ రంగారావు త్రాగుబోతు. భార్యను చాలా హీనంగా చూసుంటాడు. బావ ఆనంద్ వచ్చి తన దగ్గర వున్నంతకాలం ఉత్సాహంగా ఉండేది కల్యాణి. ఎంతో మంచిదనుకున్న కల్యాణి భర్తను మోసంచేస్తూ బావతో ప్రేమకలాపాలు సాగించడం వింతగా అన్పించింది సుజాతకు. సుజాత అనుమాన నివృత్తిచేస్తూ తనకథ చెప్పసాగింది కల్యాణి.

కల్యాణి మామయ్య కొడుకు ఆనంద్. బీదవాడు. కల్యాణి ఇంట్లోనే ఉండేవాడు. యౌవనంలో ప్రవేశించిన కల్యాణి,ఆనంద్‌లు ప్రేమించుకొన్నారు. కల్యాణి తండ్రి వారి పెళ్ళికి వప్పుకోలేదు. కల్యాణి ఎదురు తిరిగింది. ఆనంద్ ఇంట్లోంచి వెళ్ళగొట్టబడ్డాడు. కళ్యాణిని బలవంతాన పెళ్లికి వప్పించారు. కల్యాణిని చూడటానికి ఆనంద్ చాలా కాలానికి రావడంతో ఆనందం, బాధపట్టలేక అతన్ని కౌగలించుకొని ఊరటచెందింది కల్యాణి. అదిచూచిన ఆమెభర్త రంగారావు వీరిదరినీ అనుమానించి, ఆనంద్‌ను అవమానించి పంపాడు. యుద్ధంలో గాయపడ్డ ఆనంద్‌ను కల్యాణి ఇంటికి తీసుకురావడంతో భార్యాభర్తల మధ్య కలత లెక్కువయ్యాయి. రంగారావు స్త్రీలోలుడై, తన ప్రియురాలిని ఇంటికి తీసుకురావడంతో పరిస్థితులు మరింత అధ్వాన్నమయాయి. అది సహించలేని కళ్యాణి రంగారావుపై విరుచుకు పడింది. రంగారావు పిల్లల్ని తీసుకుని ఇల్లువదిలి పోయాడు_బిడ్డల ఎడబాటు సహించలేని కళ్యాణి రంగారావు దగ్గరకెళ్లి తిరిగి రమ్మని ప్రార్థేయ పడింది.

---

కోడం యిచ్చింది అయి, వాళ్లని పెంచలేమని అర్థం అయివుంటుంది. నన్ను కాదని ఆయన ఎదో వుద్యోగం చూసుకుని నెలసరి జీతంతో పిల్లలని పెంచడం, ఆమెని భరించడం. ఆయన ఖర్చులు అన్నీ జరగవని అర్థమై వుంటుంది. అంచేత పిల్లలని అడ్డం పెట్టుకుని, నానించి డబ్బు గుంజవచ్చని, వాళ్ళ యిష్టం వచ్చిన ఆటలు ఆడుతూ నన్నేడిపించవచ్చని, పిల్లలకోసం, పిల్లలని పొందడం కోసం నేనేదన్నా చేస్తానని అర్థం చేసికుని నారాకకోసం ఎదురు చూస్తూన్నారన్నమాట. వాళ్ళంతట వాళ్ళు వస్తే లోకువవుతామని, నే వచ్చి అడిగితే ముందు కాదని తరువాత పిల్లలకోసం వప్పుకుంటున్నట్లు ఈ షరతులతో నన్ను బంధించడానికి ముందే ఆలోచించారన్నది స్పష్టపడింది .. తెల్సినా నేను ఏం చెయ్యగలను? ఏమైతేనేం ఆమె ఆక్షణంలో నా శత్రువులా కాక నాపాలిట దేవతలా కనిపించింది! ఆమె మోజులోవున్న ఆయన బావ విషయం తేలిగ్గా వదిలేశారు. ఆయన కాసేపు ఆలోచించి నావంక వంకర చూపు విసిరి "సరే. .మరో వారం పదిరోజులలో వాడ్ని పంపేయాలి ." అన్నారు. ఆ మాత్రం కూడా ఎదురు చూడని నేను సంతోషంగానే ఆ షరతుకి అంగీకరించాను.

"ఆ యింట్లో మన గదులువేరు, మన బ్రతుకులు వేరు. నీ మొహం నాకు చూపించకూడదు. నేనేం చేసినా నాతో మాట్లాడకూడదు...నీకు నాకు ఏ విషయం లోనూ సంబంధం వుండదు... నేను చెప్పిన షరతులన్నింటిని వప్పుకుంటున్నట్టు కాగితం రాసి సంతకం పెట్టాలి....

"సరే" నేను ఒక్కొక్క షరతు అంగీకరిస్తుంటే ఆయన కళ్లల్లో తళుకు, విజయగర్వం తొంగి చూశాయి. నామీద విజయం సాధించినందుకు ఆయన మొహం ఆనందంతో పొంగింది. ఆయన చెప్పిన వన్నీ రాసి కాగితం సంతకం చేశాను.

ఆ క్షణంనించీ నా జీవితం మరింత నరకంలో పడింది. పిల్లలకోసం ఆయన షరతులన్నీ వప్పుకున్న ఆ షరతులు యమ పాశల్లా నన్ను బంధిస్తాయని ముందు ఊహించలేదు. అప్పటి నా ఆరాటంలో ఆయన చెప్పినవన్నీ వప్పుకుని నన్ను నేను యెంత దుర్భర నరకంలో పడేసుకుంటు న్నానో ఆలోచించ లేకపోయాను! అను కోడమేగానీ ఆలోచించీ నేను చెయ్యగల్గింది ఏముంది అప్పుడు? నా నిస్సహాయతని ఆధారంగా తీసుకుని నామీద కక్ష సాధించ గలిగారు.

## 50

తరువాత.. ఆ రోజునించి యీ రోజు వరకు ఆయన నా మీద ఏంత కక్ష సాధించారో నన్నెన్నిరకాలుగా హింసించి, కాల్చుకు తిన్నారో ఎంతకని చెప్పగలను? ఆ నాటి షరతులు ఆయనకి వరాలు, నా పాలిట శాపాలు!

ఆయనకి తను సుఖపడక పోయినా ఫరవాలేదు, నేను సుఖపడకూడదు అన్నదే ధ్యేయం! కేవలం నన్ను హింసించడమే ఆయనకి పనిగా మిగిలింది! తను నానించి పొందలేని సుఖం నేను మరొకరినించి పొందకుండావుండేట్టు చేయడమే ఆయన ఉద్దేశం! విడాకులు యీయడానికి యిష్ట పడకుండా, పిల్లలసాకు అడ్డం పెట్టుకుని ఆ రోజునించి యీ రోజువరకు ఆయన అనుకున్నది సాధిస్తూ నామీద విజయం సాధించారు.

ఆ రోజు ఆయన పెట్టిన షరతులు విన్న బావ జాలిగా నా వంక చూశాడు. "కళ్యాణీ...ఎలా నెగ్గుకువస్తావు ఆయనతో ...యీ రోజునించే నీ బ్రతుకులో నరకం ఆరంభమనుకొంటాను"...విషాదంగా అన్నాడు.

"నరకం అన్నది ఎప్పుడో ఆరంభ మయింది...యిప్పుడు క్రొత్తగా వచ్చేది ఏముంటుంది..." వ్యధగా అన్నాను. కాని అప్పటివరకు నేననుభవించిన నరకానికి, అనుభవించబోయే నరకానికి ఎంత తేడా వుందో తర్వాత తెలిసింది.

"ఆడదానివి... యీ ఇల్లు, సంసార భారం అన్నీ మోయగలవా? ఒక్కర్తివీ సంపాదించి యిల్లు నడపడం ..ఆయన చేసేవి అన్నీ భరిస్తూ సహించడం యిదంతా ఎలా భరిస్తావు కళ్యాణీ .." బాధగా, దైన్యంగా వాపోయాడు బావ.

"పిల్లలకోసం...ఆ పసివాళ్లకోసం ఆ పసివాళ్ల సుఖంకోసం నన్ను నేను బలి పెట్టుకుంటున్నాను బావా. ఓ తల్లి. నిస్సహాయురాలైన కన్నతల్లి ఇంతకంటె ఏం చెయ్యగలదు! ఆడదాన్ని ఇంత నిస్స

హాయురాలుగాసృష్టించిన ఆ దేముడికేఇంత పక్షపాతం వుంటే . యింక ఇంతకంటె నేనేం చెయ్యగలను బావా!'' అన్నాను. ఇన్నింటి మధ్యా ఆయన బావని చూడడానికి వీలులేదని, కలవరాదని వ్రాత మూలకంగా ఏ ఆంక్ష పెట్టలేదన్న పెద్ద తృప్తి సంతోషం మిగిలింది. ఆయన అమితంగా ద్వేషించే బావని, అసలు యీ గొడవకి అంతటికీ మూలకారణమైన బావ విషయం ఆయన యిలా చూసి చూడనట్లు తేలిగ్గా వదిలేస్తారని కలలో కూడా అనుకోలేదు నేను. బావ విషయంలో అంత అలక్ష్యంగా ఆయన వుండడంలో అర్థం ఏమిటో నాకు బోధపడలేదు. కావాలని వున్నారా! .. మరిచిపోయారా....మరిచిపోతే యింత ముఖ్య విషయాన్ని ఎలా మరిచిపోయారు అన్న సందేహం నన్నేకాక బావని ఆశ్చర్యంలో ముంచింది. అన్ని వైపులనించి నా సుఖానికి దారులు మూసి నన్ను బందీని చేసిన ఆయన ముఖ్యమైన ఈ దారీ మూయకుండా ఎందుకు వదిలారు! . ఆమె చెప్పిందనా! . ఆయనకి నాకు ఏం సంబంధం లేదన్నారు గనక నే నెలా ప్రవర్తించినా ఆయనకి అనవసరం అనా! అంత ఉదారత చూపెట్టగలిగిన మనిషి సర్వంగా విడాకులు యిచ్చి నాకు స్వేచ్ఛ ఎందుకు యీయలేదు! పూర్తిగా స్వేచ్ఛ యిస్తే బావని వివాహం చేసుకుంటానని, పూర్తిగా ఆంక్ష విధించకుండా యిలా దగ్గిరా దూరం కాలేని స్థితిలో మే మిద్దరం బాధపడుతూంటే చూసి ఆనందించాలనా? బావ వస్తూ పోతూవుంటే నన్ను సాధించడానికి వంక వుంటుందనా? లేక బావకి భయపడ్డారా?...ఎంత ఆలోచించినా ఆయన బావ విషయంలో పట్టు పట్టకుండా ఎందుకువదిలారో అర్థంకాలేదు.

"నాకు ఒకటనిపిస్తుంది కళ్యాణీ. ఆయనచేసే పనులెవరూ విమర్శించకుండా వుండేదుకు, ఆయన లోకం సానుభూతి సంపాదించుకోవడానికి నన్ను అడ్డం పెట్టుకోవడం అవసరమనుకుని వుంటాడు— నీ ప్రవర్తనవల్లేతను అలా తయారయినట్లు లోకానికి చెప్పడానికి నన్ను అందరిముందు దోషిని చేసి తను నిర్దోషి ననిపించుకుని సానుభూతి సంపాదించు కోవాలంటే నా రాకపోకలకి అడ్డు పెట్టకూడదని, ఈ విషయం చూసి చూడ నట్టూరుకున్నారనుకుంటాను. లేకపోతే నావల్ల ఆరంభమయిన ఈ గొడవకి - యిప్పుడు నన్ను యింత సులువుగా వదిలేయడంలో అర్థం మరేం వుంటుంది!' అన్నాడు బావ ఆలోచించి.

నేను తెల్లబోయి చూశాను. ఎంత ముందాలోచన! ఎంత వక్రబుద్ధి! ఆయన తెలివితేటలకి ఆశ్చర్య పోయాను!- సరే, ఆయనెందుకు చేసినా ఆయన నిర్ణయం నాకు ఆనందాన్నిచ్చింది. కనీసం బావని కళ్లారా చూసేఅదృష్టం మిగిలిందని సంతోషించాను. అదే అన్నాను బావతో.

''పోనీ బావా, ఆయనే ఉద్దేశంతో చేస్తేనేం నాకు మేలేచేసారు , అప్పుడప్పుడన్నా నిన్ను చూడగలనన్న తృప్తి నాకు శాంతినిస్తుంది .."

"అది సరేకాని తక్కినవన్నీ ఎలా వున్నా...ఆ మనిషిని యింటికి తీసుకు వచ్చి, నీ యింట్లో నీ కళ్లముందు పెట్టితే ఎలా భరిస్తావు కళ్యాణీ ఆ న్యూసెన్స్ అంతా!'

నేను భారంగా నిట్టూర్చాను..."ఏం చెయ్యను బావా....అమ్మ, నేను ఎంత బ్రతిమిలాడినా ఆయన పట్టు విడవలేదు. మీరు బయట ఏంచేసినా పరవాలేదు.. కానీ యింట్లో యీ గొడవంతా పెట్టదు... ఒక్కటేమాట-పిల్లలు కావాలంటే, నన్ను భరించాలి.. నేనుండాలంటే ఆమె వుంటుంది ... అంటూంటే ఏం చెయ్యగలను? రేపటి నించి మా బ్రతుకు నడి బజారెక్కుతుంది. ఇంట్లో నౌకర్లు, వూర్లో అందరిముందు మా బ్రతుకు ఎంత లోకువవు తుందీ నాకు తెలుసు - మరింకేం గత్యంతరం లేక... అన్నాను బరువుగా. బావ ఏం అంటాడు! నిట్టూర్చాడు.

నిజంగా పిల్లలకోసం గత్యంతరం లేక కాపీ..ఆయన ఆ తరువాతచేసిన పనులన్నీ సహించడం నాతరమయ్యేదా! నాకోపాన్ని ఆవేశాన్ని అణుచుకుని కళ్ళు, చెవులు మూసుకుని ఆ యింట్లో మసలడం అల వాటు చేసుకోడానికి చాలా రోజులే పట్టింది. ఏ సన్నివేశం ఎదురయినా బాధ పడకుండా, చలించకుండా, ఏది విన్నా, ఏ వ్యంగ్యోక్తులు, ఏ అవహేళనలు విని పిస్తున్నా నన్ను కాదన్నట్టు తప్పుకుని పోవడానికి నా ఆవేశాన్ని నిగ్రహించుకో డానికి కొన్నాళ్ళుపట్టినా ఆఖరికి నన్ను నేను అన్నివిధాలా అదుపులో పెట్టకోగలిగాను నేనే మనిషినని మరిచి,నాలో చీమునెత్తురు ప్రవహిస్తున్నదని మరిచిపోవడానికి, నాకే మనసున్న దన్న సంగతి మరిచి-నాబ్రతుకుకి ఏ గమ్యంలేదని - కేవలం పిల్లలకోసం బ్రతుకుతున్నానని నన్ను నేను నమ్మించు కుంటూ ఆ పిల్లలని...ఆ పిల్లలకోసం ఆ పిల్లల తండ్రిని పోషించడానికి డబ్బు సంపాదించటం మినహా నా బ్రతుక్కి మరో ధ్యేయంలేదని ఈ జీవితంతో రాజీ పడక తప్పదని నా మనసుని వప్పించి బ్రతకడానికి అలవాటు పడ్డాను.

లేకపోతే...నాయింట్లో..నా కళ్ళముందు ఆయన ఇరవై నాలుగు గంటలు త్రాగుతూ, కుళ్ళుతూ అమసిషితో సరసాలాడుతూ, మేడ మీద నానా అల్లరి చేస్తూన్న ఆ అల్లరి విని విన్నట్టూరుకునే దాన్ని. నా యింట్లో నా గదిలో చేరి ఆమె యింటి యజమాను రాలికన్న స్వతంత్రంగా, అధికారంతో తిరుగుతూంటే యింటి యజమానురాలిని నేను నౌకరి దానిలా తలవంచుకు, ఒదిగి ఒదిగి బ్రతకడానికి అలవాటు పడ్డాను. యింట్లో అందరిమీద అధార్టి చేస్తూ, నౌకర్ల మీద ఎగురుతూ, ఇది కావాలి అది కావాలి అని అధికారం చేస్తుంటే చూస్తూ కూడా ఆవేశాన్ని, ఆగ్రహాన్ని అదుపులో పెట్టు కునే దానిని. ఆమె నన్ను చూపి విసిరే చూపులలో ఎంతహేళన, ఎంత వ్యంగ్యం ఎంత చులకన కనిపిస్తున్నా నన్ను కాద న్నట్టు తలవంచుకునే దాన్ని. ఆయన కావా లని నా ఎదురుగా మరీ మరీ ప్రేమ కలా పాలు సాగిస్తూంటే చూసి చూడనట్టు తప్పుకుపోయే దాన్ని. ఇద్దరూ కలిసి త్రాగడం, పేకాడడం, నవ్వులు. కేరిం తలు, పాటలు, డాన్సులు ఒకటేమిటి ఆ మేడమీద నానా అల్లరి చేసేవాళ్ళు. ఆయన అడిగినప్పుడల్లా అడిగినంత డబ్బి యడం, ఇంట్లో జరిగేది చూస్తూ నోరు మూసుకుని పడివుండడం చాలా త్వరగానే అలవాటయింది.

ఆమె మేడమీద అడుగుపెట్టాక ఆయన గది వేరయినా వాళ్లిద్దరి మాటలు వింటూ, చూస్తూ ఆ మేడమీద వుండడం నా కిష్టంలేక నా సామాను, ప్రక్క పిల్లల ప్రక్కలు అన్నీ క్రింద గెస్‌రూములోకి మార్చేసుకున్నాను.

ఇంట్లోవుండి వాళ్లిద్దరి భాగోతం చూస్తూ, వాళ్లచేత అడుగడుగునా అవమానాలు పడ్తూండడం భరించలేక నా టైము అంతా యించుమించు నర్సింగ్‌హోమ్‌లోనే గడపడం ఆరంభించాను. ఆ ఉద్దేశమేకాక ఆస్పత్రి పని అంతా నేను ఒక్కర్తినే చూసుకోవాలి కనక అంతసేపు ఆస్పత్రిలో గడపడమూ అవసరమయ్యేది. ఉదయం ఎనిమిదికి వెళ్లిపోవడం, ఏ రెండుగంటలకో రావడం. మళ్లీ ఏ మూడున్నరకో వెళ్ళి రాత్రి తొమ్మిదికి రావడం మొదట్లో అంత శ్రమకి తట్టుకోలేక నలిగిపోయే దాన్ని. కాని యింట్లోవుండి .మానసిక విశ్రాంతి లేకుండా బాధపడడం కంటె శరీరక శ్రమని తట్టుకోడమే ఎన్నుకున్నాను. శ్రమపడక తప్పేదేముంది! యింటిని నడపాల్సినభారం నామీదవుంది! ఒక్క యింటిని నడపడానికయితే అంత శ్రమ పడక్కరలేదు. ఆయన ఆయనని భరించడానికి రోజు 16 గంటలు పని చెయ్యడం అనివార్యమైంది. తనని భరించాలి అని ఆయన విధించిన షరతు నెరవేర్చడం అంటే ఎంత కష్టమో రోజులు గడుస్తున్న కొద్దీ గాని తెలిసిరాలేదు ఆయన డబ్బు మంచినీళ్ళలా ఖర్చుపెట్టేవారు. త్రాగుడేమిటి. వాళ్ళ సినిమాలు, షికార్లు, క్లబ్బులు, పేకాట, ఆవిడ విలాసాలకి, వినోదాలని అన్నింటిని భరించడం నావంతు అయింది, ఆయన ఎంతకావాలని అడిగితే అంత నోరుమూసుకు యివ్వడమే! రెండొందలు రెండు రోజులలో ఖర్చు పెట్టిన రోజులు వున్నాయి. అధమం నెలకి రెండు వేలు ఖర్చుపెట్టేవారు. నా సంపాదనలో సగం ఆయనకే ఖర్చవుతూ ఖర్చులవి తట్టుకోలేక గిజగిజ లాడేదాన్ని. నెలకి ఎంత సంపాదించినా డబ్బుకి కటకట అయ్యేది! ఖర్చు పెరుగుతున్న కొద్దీ నేను కష్టపడడమూ ఎక్కువయింది! ఇదంతా ఎవరితో చెప్పుకోడం! అమ్మ, నేను మూగగా బాధపడడం మినహా ఏం చెయ్యలేని అసహాయులం అయిపోయాం. అమ్మ నా అవస్థ చూడలేక అప్పుడప్పుడు ఆయనతో డబ్బుగురించి చెపుతూ ఖర్చు తగ్గించమని బ్రతిమిలాడేది. 'ఎవడికోసం భరిస్తుంది. పిల్లలు కావాలంటే భరిస్తుంది' అని వికటంగా నవ్వేవారట.

కేవలం నన్ను కక్షసాధించడానికే యింతా చేస్తున్నారని నాకు తెలుసు. లేకపోతే డబ్బు సంపాదించడం తప్ప మరో ధ్యేయం లేని మనిషికి, ఏ వ్యసనమూ లేని మనిషి ఒక్కసారిగా యిన్ని వ్యసనాలకి బానిసయి, డబ్బు యిలా ఖర్చుపెట్టడంలో అర్థం అంత కంటె ఏముంది? ఆయన నర్సింగ్ హోమ్‌కి రాకపోవడంతో ఆస్పత్రిలో నర్సులు వాళ్ళు గుసగుస లాడుకోడం, వచ్చే పేషంట్లుకి ఆయన లేకుండా నేనొక్కర్తినే రోజుల తరబడి అంతపని చూసుకోడం మొదట్లో ఏదో అనుకుని వూరుకున్నా....యిలాంటి సంగతులు ఎంత కాలం దాగుతాయి! యింట్లో పనివాళ్ల

ద్వారా యించుమించు అందరికీ తెలిసే వుంటుంది నాకు మరీ పరిచయస్థులు సూటిగా మొహంమీద అడగలేక వూరు కునేవారు. ఏదో యధాలాపంగా అడిగి నట్టు అడిగి విషయం రాబట్టాలని కొందరు చూసేవారు నోటి కొచ్చిందేదో చెప్పే దాన్ని. పరిచయం లేనివాళ్లు, ఆస్పత్రి కొచ్చే పేషంట్లు వెనకాల అనుకుంటారు. గాని మొఖం ఎదుట ఏం అనరుగదా! మొత్తంమీద మాయింటి సంగతి రోడ్డున పడడానికి అట్టే రోజులు పట్టలేదు. మా యింటి విషయం అతి త్వరలోనే అందరికీ పాత విషయం అయిపోయింది. ఎవరేం అనుకున్నా నేను చెయ్యగలిగింది ఏమి లేదుగదా! మొదట్లో కొన్నాళ్లు సిగ్గుపడ్డా. నలుగురి ఎదుట మొహం చెల్లనట్లు అని పించినా రోజులు గడిచేసరికి నాకూ అల వాటయిపోయింది .మొండితేరి పోయాను..

ఓ ఆరునెలలు ఆయన, ఆమె యింట్లో యిష్టారాజ్యం ఏలి, నన్నెంత హింస పెట్టాలో అంతా పెట్టారు నాశరీరం, మనసు మొద్దుపారిపోయాయి ఆ ఆరు నెలల్లో! రోగులు, రోగాలు, మందులు, డబ్బు ఆర్జించడం అదే నాలోకం! ఇంట్లో అమ్మ అంతా చూసుకుంటు వుండేది పిల్ల లతో కూడా గడిపే సమయం నాకు దొరక నంత బిజీగా వుండేదాన్ని

బావ అప్పుడు, పూర్తిగా కోలుకునే వరకు ఓనెల రోజులు వున్నాడు పూర్తిగా ఆరోగ్యం చిక్కబడ్డాక శలవు అయి డ్యూటిలో జాయిన్ అవడానికి వెళ్లిపో యాడు. బావ వున్నన్ని రోజులు కాస్త ఏదో ఊరటగా బావసమక్షంలో వున్నంత సమయం ఏదో ధైర్యంగా వుండేది. బాగ్గి చూపులలో ఓదార్పు అశాంతితో మన పోయే నా మనసుని చల్లపరిచేది! బావ అభి మానం సానుభూతితో నా బాధని మరిచిపో గలిగేదాన్ని. యింట్లో గొడవ అంతా చూస్తూ ఎవరిని ఎవరు ఏమనలేని స్థితిలో ఒకరివంక ఒకర్తం చూసుకునే వారం. నా స్థితికి నాకంటె బావ బాధ పడిపోయేవాడు. ఎలా బ్రతుకుతున్నావు కళ్యాణీ, ఎన్నాళ్ళు ఇదంతా సహిస్తావు, ఎన్నాళ్లు యిలా యీ భారం అంతా మోయగలవు అన్నింటికీ నేనే కారణం. నీ యీ స్థితికి నేనే కారకు డిని ' అంటూ బాధపడిపోయేవాడు 'నేను వెళ్ళిపోతాను కళ్యాణీ, యిక్కడ వుండి నీదయా నీ యీ స్థితిని చూస్తూ భరించలేను' అని వాపోయేవాడు. ఇంట్లో ఆయన విసిరే విసుర్లకి ఆమె వ్యంగ్యోక్తు లని వింటూ నాకంటె ఆవేశపడిపోయే వాడు! ఎవరెంత ఆవేశపడినా, ఏం చెయ్యగలం! మా చేతులు కట్టేశాను ఆయన ...ఆ బంధాల్ని విప్పుకునే శక్తి యుక్తి మాకు లేకుండా అయిపోయాయి బావ వెళ్ళిపోయాక నాకు జీవితంలో బొత్తిగా శూన్యం ఏండింది ఇంట్లో కనీసం బావ వుంటే మనసు విప్పి మాట్లాడుకోడానికి, నా కష్టానికి సానుభూతి చూపి ఓదార్చే మనిషి వున్నాడన్న ధైర్యంవుండేది అమ్మ నేను ఇద్దరం ఆశవాళ్ళం నాబాధలు చూసి కన్నీళ్ళు పెట్టుకోడం మినహా ఏం చెయ్యలేని అవిశ, నాలో నేను కుము లుతూ నేను బ్రతుకంతా నిర్లిప్తత నిండి పోయింది. ఏదో విరక్తి, వైరాగ్యం అన్నింటిపట్లాకలిగింది. జీవితంపట్ల కోరిక

నశించింది. కేవలం ఆ పసివాళ్ల మొహం చూసి ఆ పసివాళ్ళకోసం వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళవడంకోసం రోజులు లెక్కపెట్టు కుంటూ జీవచ్ఛవంలా బ్రతికేదాన్ని.

ఆరేడు నెలలు గడిచాక పరిస్థితి కాస్త మెరుగయింది.

## 51

ఆయనకే ఆమె మీద మోజు పోయిందో, ఆవిడకే యీయనమీద మనసు పోయిందో గాని ఓ ఆరేడు నెలలు గడిచిం దగ్గరనించి యిద్దరూ ఇంట్లో తరచు అరుచుకుంటూండే వారు. మేడమీది నించి గొంతులు గట్టిగా వినిపిస్తూండేవి ఇద్దరూ కలిసి బయటికి తిరగడం తగ్గింది. అలా ఒకనెల గడిచాక ఓ రోజు ఇద్దరూ చాలా గట్టిగా దేనికో దెబ్బలాడు కున్నారు ఆ తరువాత ఆమె విసురుగా సూట్‌కేస్ పట్టుకుని క్రిందికి వచ్చి వెళ్ళిపోయింది. ఆ తరువాత మళ్ళీ ఆమె ఇంటికి రాలేదు. ఆమెకి ఆయనకి చెడిందని ఆయనను వదిలి వెళ్ళిందని అర్థమైంది. అమ్మ, నేను కాస్త తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాం. మళ్లీ ఇంటి మీదకి ఎవరినీ తీసుకురాకుండా వుండాలని మనసులో కోరుకున్నాం ఆయన ధర్మమా అని తరువాత ఎవరినో అప్పుడప్పుడు తీసుకొచ్చినా ఓ రాత్రి మాత్రం వుండి వెళ్ళిపోయే వారు

ఇంట్లో గోల తగ్గిందని సంతోషించాం. ఆమె ఇంట్లోంచి వెళ్ళిందగ్గరనించి బొత్తిగా ఆయన ఇంటిపట్టున వుండేవారు కాదు. ఎక్కడెక్కడ తిరిగేవారో ఏం చేసేవారో, ఎప్పుడు ఏ వేళకి ఇంటికి వచ్చినా తప్పత్రాగి వచ్చేవారు. బారుల్లో, క్లబ్బుల్లో త్రాగడం, పేకాడ్డం, ఏ హోటల్లోనో, ఏ ఆడవాళ్ళని వెంటేసుకుని తిరుగుతున్నట్టు, ఎక్కడ పడితే అక్కడ ఎవరెవరితోనో తిరుగుతున్నట్టు పీళ్ల వాళ్ళు చెప్పేవారు. అందరి మాటలూ వింటూ తల దించుకోడం ఒక్కటే నేను చెయ్యగలిగింది ఆమె వెళ్లింతర్వాత ఖర్చు తగ్గుతుందని ఆశించాను. కాని త్రాగుడు, పేకాట అవి మరింత ఎక్కువయి డబ్బు మరింత ఖర్చుపెట్టడం ఆరంభించారు.

ఆ ఆరేడు నెలల్లో ఆయన చాలా తగ్గారు. కళ్ళక్రింద నల్ల చారలు బయలు దేరాయి ఎప్పుడూ త్రాగుడు మైకంలోనో, హేంగోవర్ తోనో తప్ప ఆయన మామూలుగా వుండడం నేను చూడలేదు. పూర్తిగా త్రాగుడుకి బానిస అయ్యారని తాగకుండా ఇంక ఆయన వుండలేరని అర్థమైంది. వేళంటూ లేని భోజనం, నిర్ణీత సమయం అంటూ లేని నిద్ర, స్త్రీ వ్యసనం, ఇవన్నీ కలిసి ఆయనని శారీరకంగా మానసికంగా ఎంత క్రిందకి దిగజార్చాయో అర్థమైంది.

సాధారణంగా ఆయన నేను ఒకరికంట ఒకరం పడేవారం కాదు నేను ఉదయం ఆస్పత్రికెళ్లే వేళకి ఆయన నిద్రలోనూ, మధ్యాహ్నం భోజనానికి వచ్చేసరికి ఇంట్లో వుండకుండానో, వున్నా పడుకునో, రాత్రి ఏ రెండు గంటలకో ఇంటికి వచ్చే ఆయన నేను ఎప్పుడోగాని ముఖాముఖి తారస పడే వారం గాదు. ఎప్పుడో ఏ మధ్యాహ్నమో నేను భోజనం చేస్తున్నప్పుడు ఆయన బయటినించి గనక వచ్చినప్పుడు కంటబడే వారు నన్ను చూసి మొఖం తిప్పుకుని వెళ్ళిపోయే వారు. ఆయన మొహం,

ఆయన వాలకం చూసి నిట్టూర్చే దాన్ని. ఎంత కాదనుకున్నా, ఆయనకు నాకు మధ్య ఏ సంబంధం మానసికంగా, శరీరకంగా మిగలక పోయినా, ఒకరిపట్ల ఒకరికి ద్వేషం తప్ప మరో భావం లేకపోయినా, ఆయన్ని ఆ స్థితిలో చూసి మనస్సు చివుక్కుమనేది. ఆయన ఆరోగ్యం ఎంత క్షీణిస్తుందో చూసి, భార్యగా కాకపోయినా తోటి మనిషిగా బాధ పడేదాన్ని.

ఆయన స్థితికి. .మా కాపురం యీ స్థితికి రావడానికి నేనే కారణం అన్న బాధ అప్పుడప్పుడు నన్ను పీడించేది ఆయనని పెళ్ళి చేసుకుని ఆయనని ప్రేమించలేక పోవడంలో, బావ రాక తర్వాత జరిగిన సంఘటనలలో నాదే ఎక్కువ నేరం వుందేమో అనిపించేది కాని మరు క్షణంలో-పెళ్ళికాక పూర్వం నా మనసుకి నచ్చిన బావని ప్రేమించటం నా పొరపాటు! పరిస్థితులకి ఎదురీదలేక, పెద్దల ముందు తలవంచి ఇష్టంలేని పెళ్ళి చేసుకోడంలో నా దోషం వుందా? పెళ్లి అయ్యాక మనసులేని కాపురం అయినా సరిపెట్టుకుని ఏదోలా కాపురం కొనసాగిస్తూండగా బావ వస్తే ఒక్క క్షణం నన్ను నేను మరవటం క్షమించలేని నేరమా! ఆ చిన్న నేరానికి ఆయన అనుమానపడి, నన్నవమాన పరుస్తూంటే తిరగ బడడం తప్పా! నీ ఇంట్లో అసహాయుడైన బావకి ఆశ్రయం ఇవ్వడానికి కూడా అధికారం లేని బ్రతుకుని ధిక్కరిస్తే అది భర్తని కాదనడమా? చిన్న తప్పుకి పదేపదే శిక్షిస్తూంటే ఇంక మనసులో కలవని కాపురం వద్దనుకోడం, విడిపోదామనడం క్షమించలేని నేరాలా? విడిపోడానికి ఇష్టపడక ఆ కారణంతో నన్ను సాధించడానికి, కక్ష తీర్చుకోడానికి ఆయన కన్న పిల్లలని దూరం చేస్తే ఆయన కాళ్లమీద పడి పిల్లలని తెచ్చుకుంటే అది ఆయన విజయం అనుకుని, బ్రతికినన్నాళ్ళూ నన్ను నరకంలో పడేయడానికి ఆయన ఇలా త్రాగుడు తందనాలు ఆడుతూ డబ్బు ఖర్చుపెడుతూ నన్ను శిక్షిస్తున్నాననుకుని ఆయన్ని ఆయన నాశనం చేసుకోడంలో నా దోషం వుందా. అన్న ప్రశ్నలు-పుట్టేవి! ఈ జరిగిందానికి ఆయనా, నేనా బాధ్యులం అని ఆలోచిస్తే సమాధానం దొరికేది కాదు! ఆఖరికి మా ఖర్మ. మా రాక అని కనబడని దేముడ్ని నిందించుకోడంతో తృప్తి పడేదాన్ని!

మొదట్లో నన్ను సాధించడానికి, కక్ష తీర్చుకోడానికి అనుకుని ఆరంభించిన ఆయన తాగుడు, పేకాటలు, స్త్రీలు. యీ వ్యసనాలన్నింటికి ఆయన ఒక సంవత్సరంలో పూర్తి బానిస అయి. ఏదీ వదులుకోలేని బలహీనత ఆయన్ని వశపరచుకుంది అని అర్థమైంది నాకు. .యిప్పుడింక పూర్తిగా ఆయన నామీద ఆధారపడి తప్ప వేరే బ్రతకలేరు. ఆయన యీ వ్యసనాలతో మళ్లీ ఆయన మామూలు మనిషి అయి, సంపాదించగలగడం, అన్నది అబద్ధం అని బోధపడింది. ఆయన వ్యసనానికి బానిస అవుతున్న కొద్దీ ఆయనలో గంభీరత, ధైర్యం, తగ్గిపోతూ వాటిస్థానే అధైర్యం బలహీనత, పిరికితనం చోటు చేసుకుంటున్నాయి అడవిలో మృగరాజుగా తిరిగే సింహాన్నిపట్టి బంధించి బోనులో పెట్టితే క్రమంగా కొన్నాళ్ళకి

ఆ సింహంలో గాంభీర్యం. పౌరుషం రాజసం అన్నీ చచ్చిపోయి మందకొడిగా, ఎవరో తెచ్చిపెట్టే తిండి తింటూ బద్ధకంగా పడుకునే సింహం గుర్తువస్తుంది ఆయన్ని చూస్తే।

నా ఊహ అబద్ధంకాదని ఒకటి రెండు సంఘటనలు నిరూపించాయి బావ వెళ్ళిపోయిన తరువాత ఎనిమిది నెలలకి కాబోలు ఒక్కసారి ఏదో పనిమీదవచ్చి ఒక రోజు వున్నాడు. యింటికి రావడానికి యింకా భయపడుతూనే వచ్చినట్లు ఫోనుచేసి క్షేమ సమాచారాలు అడిగాడు 'యింటికి రాకుండా ఎక్కడో ఎందుకు దిగావు' అని దెబ్బలాడాను 'బాబోయ్ నేను రాను కళ్యాణీ. నే ఎప్పుడొచ్చినా ఏదో గొడవ తప్పడం లేదు. యీసారివస్తే యీమారు నీ తల తోపాటు, నా తల బద్దలు గొడ్తారు' అన్నాడు హాస్యంగా.

"మరేం పరవాలేదు. బద్దలు కొట్టనీ హాయిగా చచ్చిపోయన్నా సుఖంగా కలిపి వుందాం" అన్నాను.

"నిజంగా అలాగే నాకూ అనిపిస్తుంది కళ్యాణీ . ఈ లోకంలో కలిసి బ్రతకడానికి అవకాశంలేని మనం కనీసం అక్కడైనా కలుసుకుని బ్రతకాలి."

బావ నేను ఎప్పుడూ మా దురదృష్టాన్ని గురించి వగస్తూ ఉత్తరాలు రాసుకునే వారం, ఉత్తరాలలోనే బావ నన్ను ఓదారుస్తూండేవాడు. నా కష్టాలకి, నా అవస్థలకి సానుభూతి చూపిస్తూ ధైర్యాన్ని ప్రోత్సాహాన్ని అందించేవాడు. ఈ దేశంలో జన్మించిన మనం యిలా బాధపడడం కంటె చెయ్యగలిగిందేముంది కళ్యాణీ, ఈ కర్మ భూమిలో కర్మసిద్ధాంతాన్ని నమ్మి బ్రతుకీడ్చడం కంటె ఏం చెయ్యగలం అనేవాడు।

"రా బావా, నిన్ను చూసి అప్పుడే కొన్ని యుగాలయినట్టుంది కనీసం కంటితో చూసి సంతృప్తిపడే అవకాశం యియ్యి పరవాలేదు యింక ఆయన మన జోలికి వస్తారనుకోను" అన్నాను.

"సరే, వస్తాను కళ్యాణీ నిన్ను చూడకుండా నేను మాత్రం ఎలావుండగలను?" అన్నాడు

బావ వచ్చాడు కరువు దీరా కబుర్లు చెప్పుకుంటూ సంతృప్తి పడ్డాం 'నిన్ను చూస్తే మళ్ళీ ఓ నాలుగైదు నెలలు బతకడానికి ఏదో టానిక్ పుచ్చుకున్నట్టుట్టంది కళ్యాణీ. ఏదో క్రొత్త శక్తి ఉత్సాహం వస్తుంది. నా శూన్య జీవితానికి నీవు, నీ ఊహలే పరిపూర్ణతనిస్తాయి" బావ అలా మాట్లాడుతూంటే నా మనసు బాధతోనిండిపోతుంది. ఈ ప్రపంచంలో వంటరి అయిన జీవితంలో వెలితికి నేనే కారణం అనుకుంటే మనస్సు కలుక్కుమంటుంది. చాలా రోజులుగా ఓ మాట చెప్పాలనుకుంటున్నది ఆ రోజు చెప్పాలనుకున్నాను.

"బావా, నా కోరిక ఒకటుంది నెరవేరుస్తావా నీవు "

"తప్పకుండా కళ్యాణీ . నీ సంతోషం కోసం యేదన్నా చేస్తాను. నీ కోసం ఏది చెప్పినా చెయ్యగలను" అన్నాడు గర్వంగా బావ

"మాట తప్పకూడదు బావా. ముందు మాటయియ్యి" 'బావ కాస్త అనుమానంగా చూశాడు. నా మొహంలో భావం చదవ

డానికి ప్రయత్నిస్తూ 'నేను చెయ్యలేనిది అడిగి, మాట తప్పిన దోషం అంటగట్టకు' అన్నాడు.

''నీవు చెయ్యగలిగిందే బావా. ఎన్నాళ్ళిలా వంటరిగా జీవితం వెళ్ళబుచ్చుతావు. ఎన్నాళ్ళు ఏకాకిగా, ఏ ఆనందాలకి నోచుకోకుండా శూన్య జీవితంలో బ్రతుకుతావు. యిప్పటికయినా నీ వంటరి జీవితానికి స్వస్తి చెప్పి తోడు నీడగా బ్రతికే మనిషిని తెచ్చుకో నీకైనా సుఖంగా బ్రతకాలని నా కోరిక బావా!'' అన్నాను పట్టుకున్న గొంతుతో.

బావ వ్యధగా నవ్వాడు.. 'కళ్యాణీ, ఆ పని నేను చెయ్యగలననే అడిగావా? నా మనసేమిటో నీకు తెలుసు అదెక్కడ వుందో నీకు తెల్సు. తెలిసీ, నీలాగే మన సొకచోట మనిషొక చోటు అయి నరకం అనుభవించమన్నావా? నాతోపాటు నన్ను కట్టుకున్న మనిషిని నాశనంచేసి ఆత్మ వంచనలో బ్రతకమన్నావా? ఇది సాధ్య పడుతుందనే అడిగావా?'

"బావా. .నా కోసం. నావల్ల నీ జీవితం అంతో వృధా అయిపోవడం నేను సహించ లేక పోతున్నాను యింక మనకే ఆశ మిగలలేదు నాలాంటి దానికోసం, నీదాన్ని కాలేని నా కోసం ఎన్నాళ్ళు నిరీక్షించినా ప్రయోజనం లేని దాని కోసం నీ జీవితం నాశనం చేసుకోకు బావా! ఎప్పుడూ ఏ సుఖం ఎరగకుండానే బ్రతికావు యిప్పటి కయినా సుఖపడడం నేర్చుకో జీవితంలో ఆనందాన్ని చేతులారా నాశనం చేసుకుని మోడుగా నిలిచి, మోడుగానే వాడి పోనీయకు నీ బ్రతుకు బావా నీవు పెళ్ళిచేసుకుని, సంసారంలో పిల్లపాపలతో సుఖంగా వుంటే కనీసం నీవయినా సుఖంగా వన్నావన్న సంతృప్తి నాకు మిగులుతుంది.' భారంగా అన్నాను, కళ్లు తుడుచుకుంటూ.

బావ తల అడ్డంగా తిప్పాడు. 'లేదు కళ్యాణీ.. యిది నేను చేయలేనిది, నన్ను నేను మోసం చేసుకోడంకాక మరొకర్ని మోసం చెయ్యడం నా కిష్టం లేదు చేతులారా కష్టాల్ని కొని తెచ్చుకోడం ఎందుకు? ..నీకోసం నన్ను నేను అర్పణ చేసుకోడంలోనే నా కానందం కలుగుతుంది కళ్యాణీ నాది అన్న ఊహ ఒక్కటే నాకు చాలు. నీవు నేను ఎన్నివేల మైళ్ల దూరాన వున్నా నీ ఆలోచనల సహచర్యం తోనే నా వంటరితనాన్ని మరిచి తృప్తి పడగలను. నీ ఊహలు యిచ్చే ఆనందం నాకు చాలు. యీ జీవితంలో ఇంక నాకు అంతకంటె ఏదో అనుభవించాలనే కోరిక లేదు ఇలా ఎప్పుడో వచ్చి నిన్ను కళ్లారా చూసి కళ్లనిండుగా నీ రూపాన్ని దాచుకుంటాను. ఇలా అప్పు డప్పుడు వచ్చి నీతో మాట్లాడిన సంతృప్తిని అపురూపంగా భద్రంగా పదిలపరుచుకుంటూ రోజులు గడుపుతాను. ఇంతే. ఇంతకంటె నా కింకేం అక్కరలేదు కళ్యాణీ ''కళ్ల నిండా అభిమానం, అనురాగం చిందుతూండగా అన్నాడు. బావకి నా పట్లవున్న ప్రేమానురాగా లెలాంటివో తెలిసి ఇంకే మనగలను? అలాంటి బావ ప్రేమని పొంద లేని నా దౌర్భాగ్యానికి కళ్లు నిండు కున్నాయి....'ఎంత దురదృష్టవంతులం బావా మనం!' గాద్గదికంగా అన్నాను... ఏం పాపం చేశానని దేముడు నన్నిలా

శిక్షిస్తున్నాడు. ఏ నేరానికి నే వింత నరకం అనుభవించాలి?" అంటూ ఏడిచాను. బావ ఏం జవాబు చెప్పగలడు? జాలిగా చూశాడు.

"నాకీపిల్లలు ఎందుకు పుట్టారు బావా?... నన్నిలా కట్టిపడేసిన యీ పిల్లలు. నా సుఖా లన్నింటిని బలిగోరుతున్న యీ పిల్లలు. యీ పిల్లలు నా కెందుకు పుట్టారు బావా ఈ పిల్లలే లేకపోతే ఈ లోకం అంతా అడ్డు నిలిచినా నీ దగ్గిరకి వచ్చే దాన్నిగదా..."

బావ అదోలా నవ్వాడు.

"అవును బావా, నీకు నవ్వులాటగానే అనిపిస్తోంది నా బ్రతుకు! నిజంగా చెప్తున్నాను ఇంట్లో యీ గొడవలు, యీ హింస భరించలేక ఆ పిల్లల కింత విష మిచ్చి నేనింత త్రాగి యీ బాధలనించి విముక్తి పొందాలని ఎన్ని సార్లను కున్నానో నీకు తెలియదు కాని ఆ పసి వాళ్లని నా చేతులతో చంపే సాహసంలేక ఇలా జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను. నా బాధ నీ కెలా అర్థం అవుతుంది నే నెలాంటి నరకం అనుభవిస్తున్నానో నీ కర్థం కాదు బావా," అంటూ చేతులతో మొహం కప్పుకున్నాను. బావ ఆరాటంగా లేచి నా దగ్గిరకివచ్చి నా తల నిమిరాడు 'కళ్యాణీ పిచ్చి కళ్యాణీ ఏడవకు, నాకు తెలుసు నీ వనుభవిస్తున్న దుర్భరనరకం ఎలాంటిదో నీ బాధలు అన్నీ చూస్తూ కూడా నీ కేం చెయ్యలేని నిస్సహాయత నన్నెంత బాధ పెడ్తోందో నీ కర్థం కాదు. నేనేం చెయను కల్యాణీ' ఓదార్చసాగాడు తల నిమురుతూ ఆవేదనగా.

'అదే సమయంలో ఆయన యింట్లోకి వచ్చారు. డ్రాయింగురూములో సోఫాలో కూర్చుని ఏడుస్తున్న నన్ను, నన్ను ఓదారుస్తున్న బావని చూసి ఆయన ఒక్క క్షణం అలా చూస్తూ నిలబడ్డారు. ఆయన మొహం ఎర్రబడింది ఆరక్షణం. ఏదో అనాలని నోరు తెరచి అంతలోనే విరమించుకుని మొహం తిప్పుకుని గబ గబ మేడమీదకి వెళ్లిపోయారు. బావ నేను కాస్త ఆశ్చర్యపోయాం. మళ్లీ ఏ దుమారం లేవదీస్తుందోనని ఒక్క క్షణం భయపడిన నేను ఆయన ఏమనకుండా వెళ్లిపోవడంతో తేలిగ్గా నిట్టూర్చాను. ఆయన ఏమనక పోవడానికి కారణం అప్పు డర్థం కాలేదుకాని, తరువాత జరిగిన సంఘటనలు అన్నీ కలిసి ఇంక ఆయనకి నన్ను ప్రతిఘటించే శక్తి, నన్ను కాదంటే ఆయన జీవితంలో బ్రతికే శక్తిలేని అసమర్థత ఆయన్ని లొంగదీసు కుందని అర్థమైంది. డబ్బుకోసం నన్ను ఆశ్రయించుకోవాలి అన్న సంగతి ఆయనకి అర్థమై, నన్నే విషయంలోనన్నా కాదంటే పౌరుషాని కన్నా మళ్లీ పిల్లలని తీసికెళ్లి పోతానని బెదిరించేశక్తి ఆయన కిక లోపించిందని బోధపడింది. కోరలు తీసిన పాములా అయిపోయారు. అంచేత అసలు నన్ను తప్పించుకుని, ఏది చూసినా చూడ నట్లు వెళ్లిపోయి ఆయన పరువు ఆయన దక్కించుకోడం ఆరంభించారు. ఇదంతా నాకు రోజులు గడిచినకొద్దీ అర్థమైంది.

బావ విషయం ఆ రోజు అలా జరిగాక మరోసారి ఆయన ఖర్చులు మితిమీరి భరించడం కష్టమై, అమ్మ సలహామీద ఆయనకి నెలకింత ఇస్తాను అని తేల్చి చెప్పడం తప్ప మరో గత్యంతరం లేదు.

నెలకి మూడు వేలు ఒక్క మనిషి ఖర్చు చేస్తూంటే నే నెన్నివేలు సంపాదిస్తే ఈ ఖర్చులు తట్టుకోగలను! ఎంత కష్టపడినా ఖర్చులకి తట్టుకోడం నా తలకి మించిన దయింది. అంచేత ఆఖరికి ఓ రోజు ఆయనతో మాట్లాడక తప్పలేదు. ఏడాది తరువాత నేను మాట్లాడిన మొదటి మాటలు అవే! ఆ రోజు డబ్బు కావాలంటూ వంటవాడి ద్వారా కబురంపారు అప్పటికే ఆ నెలలో రెండు వేలు ఖర్చు చేశారు. ఇంకా కావాలంటూంటే ఆవేశం పట్టలేక 'ఇంక లేదు' అని చెప్పు అన్నాను నాయరుతో. "లేదూ. లేదని చెప్పిందా ఏం మళ్లీ బుర్ర తిరగడం ఆరంభించిందా. ఫో నాకు కావాలి. వెంటనే కావాలి అని చెప్పు. నే నెంత కావాలంటే అంత యీయడానికి వప్పుకుంది ఎవడికోసం యిస్తుంది' అంటూ ఎగిరారు. నా కంతా వినిపిస్తూనే వుంది. నాయరు ఆ మాటలు చెప్పడానికి రాగానే 'సరే. నే చెప్తాలే నీ వెళ్లు' అని పంపేశాను. ఆయన గది గుమ్మంవరకు వెళ్లి "మీ రిలా ఖర్చు చేస్తూంటే నే నెంతకని భరిస్తాననుకున్నారు. నెలకి మూడు వేలు ఖర్చు పెడుతూంటే నే నెక్కడనించి తెచ్చి యీయగలననుకున్నారు' సూటిగా అడిగాను.

ఆయనతో మాట్లాడినందుకు ఆయన కళ్లల్లో కాస్త ఆశ్చర్యం ఒక్కనిమిషం తొంగి చూసింది. వెంటనే కళ్లల్లో కఠినత అలుముకుంది. హేళనగా, తిరస్కారంగా చూస్తూ 'డబ్బెక్కడనించి వచ్చేది, ఎలా వచ్చేది నా కనవసరం. డబ్బు కావాలి అంతే! నే నడిగినంత డబ్బు యీయాలన్న మన షరతు మరిచిపోయావా? .."

"లేదు మరిచిపోలేదు కాని దేని కయినా ఓ హద్దుపద్దువుండాలి అన్నాను గదా అని. యిలా పీడిస్తే మీకు డబ్బీయడం అన్నది నా శక్తికి మించింది అవుతూంది. దయవేసి ఖర్చులు తగ్గించండి నేను భరించలేను మీ ఖర్చులు మీకు లేక పోయినా పిల్లల గురించిన చింత నాకుంది. వాళ్లు పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు "

ఆయన విసుగ్గా చేయి ఆడించి .. 'వెళ్ళు వెళ్ళు. అనవసరంగా వాగకు... నీవు నీ పిల్లలు యీ యిల్లు యివన్నీ నా కనవసరం. నాక్కావలసింది డబ్బొక్కటే ఆ డబ్బు ఎలా వస్తుందో నా కనవసరం. యివ్వాల్సిన బాధ్యత నీది. ' అన్నారు.

నాకు వళ్ళు మండింది ఆయన నిర్లక్ష్యానికి 'సరే నే చెప్పాల్సింది నేను చెప్పాను ఈనెలనించి వెయ్యిరూపాయలు మించి ఒక్కరూపాయి కూడా నేనీయను. ఆ పైన మీయిష్టం ఆ డబ్బులో మీరేం చేసేది నా కనవసరం. అంతకు మించి మాత్రం నేనీయను ఈయలేను' అన్నాను కఠినంగా. ఆయన మొహం కోపంతో ఎరుపెక్కింది 'ఎవరికోసం యివ్వవో నేనూ చూస్తాను ' పళ్ళు బిగపట్టి అన్నారు.

నేను చెప్పాల్సిందేం లేనట్టు వచ్చేశాను. అన్నట్టే ఆయనకి వెయ్యి రూపాయలు ఇచ్చాను. అది పదిహేను రోజులలో ఖర్చుపెట్టి డబ్బుకోసం కబుర్లు పెట్టడం ఆరంభించారు. నేను యీయలేదు మొండిగా, నాలుగైదు సార్లు కబుర్లు పెట్టి వూరుకున్నారు. సరే, నే నింకయీయనని అర్థమై వూరుకున్నారు గాబోలు అని సంతోషించాను.

కాని నా సంతోషం ఆ నెల తిరిగేసరికి ఎగిరిపోయింది. ఆయన క్లబ్బు బిల్లులు, బారుల బిల్లులు, హోటలు బిల్లులు అన్నీ తిన్నగా యింటికి నాకు రాసాగాయి అంటే అప్పులు పెట్టి మరీ తాగి తందనాలు ఆడుతున్నారు ఏం చెయ్యాలో తోచక మతిపోయింది అవన్నీ కలసి రెండువేలు దాటి పోయాయి ఆ సారికి చెల్లెంచి ఆయన చేసే బిల్లులకి నే నెంతమాత్రం బాధ్యురాలిని గానని వాళ్లందరిని వ్రాతమూలకంగా హెచ్చరించాను. అక్కడ కుదరకపోగానే ఎరిగిన వాళ్ళ దగ్గిర చేబదుళ్ళు తీసుకోడం ఆరంభించారు. అవన్నీ చెల్లించడం నా వంతయింది మార్వాడీల దగ్గర వడ్డీలకీ అప్పులు ఆరంభించారు. అవన్నీ తీర్చుకున్నాను. ఓ మూడు నాలుగు నెలలు యీవరస చూసి యిదివరకటి కంటె ఖర్చు ఎక్కువవడం చూసి ఆఖరికి ఆయనకి అప్పులు యిచ్చితే అవన్నీ తీర్చవలసిన బాధ్యత నాది కాదని. నేను బాధ్యురాలిని కానని పత్రికా ప్రకటన చేశాను. అక్కడితో ఆయన సంగతి తెలిసి యింక వూళ్ళో ఎవరూ డబ్బియడం మానేసినట్టున్నారు

అప్పటినించి రోజు తగువు ఆరంభించారు డబ్బుకోసం....ఆయన త్రాగుడుకి డబ్బులేని రోజు, పేకాటికి క్లబ్బుకి డబ్బు లేక వెళ్ళలేనిరోజు, ఏ హోటలుకో బజారు మనిషితో కాలక్షేపాలు చేయడానికి డబ్బు లేని రోజున పిచ్చెత్తిపోయి నానా అల్లరి చేసేవారు.

అంతలా అలవాటున త్రాగుడు ఓపూట లేకపోతే ఆయన పిచ్చెత్తి కేకలేమిటి, అరుపులేమిటి. నన్ను తిట్టడం ఏమిటి ఇంట్లో ఏది కనిపిస్తే అది విసిరేయడం. కాఫీవేసి వేడితే నాయరు మొహాన విసిరి కొట్టడం. అన్నం పెట్టమని కంచం విసిరేయడం పుస్తకాలు విసిరేసి, కుర్చీలు తన్నేసి, యిల్లంతా నానా భీభత్సం చేసేవారు. ఆయన అవతారానికి ఆయన పిచ్చి కోపానికి అమ్మ, నౌకర్లు, పిల్లలు అందరూ భయపడి బిక్కచచ్చిపోయేవారు. ఆ రభసకి అమ్మ భయపడిపోయి 'పారెయ్యవే ఆడబ్బు అతని మొహాన. యీ దిక్కుమాలిన గొడవ ఎలా భరిస్తాం " అంది ఇంట్లో అన్నీ విరక్కొడుతూంటే చూస్తూ ఎలా వూరుకోడం ఆ గొడవ భరించలేక ఆ డబ్బు పంపే దాన్ని. దానితో చల్లబడి డబ్బు పట్టుకుని వెళ్ళిపోయాదు. అలా డబ్బు కావలస్తే గొడవచేసి సాధించచ్చు అనుకుని యీ పద్ధతికి ఆరంభించారు. అది కనిపెట్టి ఏమయితే అయిందని ఏం చేస్తారో చూద్దామని రెండు మూడు సార్లు గొడవంతా భరించి డబ్బు యీయలేదు మొండిగా. ఆయన ఆ ఎత్తు పారకపోయేసరికి మరి లాభం లేదనుకున్నారు. గాబోలు . "ఇదిగో డబ్బిస్తావా పిల్లలని తీసుకుని మళ్ళీ వెళ్ళి పొమ్మన్నావా 'అంటూ బెదిరించారు. ఆయన బెదిరింపుకి బెదరకుండా ధైర్యంగానే ' తీసికెళ్ళండి. .తీసికెళ్ళండి తీసికెళ్ళి వాళ్ళని పెంచడానికి డబ్బు సంపాదించండి. అప్పుడు తెలుస్తుంది డబ్బు విలువ. యిలా నన్ను పీడించి డబ్బు తగలేయడంలో బాధ మీరు ఆర్జిస్తే తెలుస్తుంది..." అన్నాను.

ఆయన నేనంత ఖచ్చితంగా సమాధానం చెప్పేసరికి ఒక్కక్షణం గడబిడపడి పౌరుషం యింకా పూర్తిగా చావక

బింకంగా ' సరే, తీసికెళ్ళి పెంచుకుంటానో, చంపుకుంటానో అదంతా నీకెందుకు యీసారి మళ్ళీ ఏడుస్తూ నా దగ్గిరకి వచ్చావంటే మాత్రం వూరుకోను. పోనీ గదా అని ఆ సారి ఊరుకున్నాను ' అంటూ వెడుతూంటే ఆ మనిషి మూర్ఖత్వం అర్థం అయిన నేను ఆయన అన్నంత పనీ చెయ్యగలరని నమ్మాను

"ఛీ మీరు మనుష్యులు కారు . రాక్షసులు...కన్న తండ్రి అయివుండీ . పసివాళ్ళని చంపుకుంటానని గొప్పగా చెప్పుకుంటున్నారు ఆ పసివాళ్ళని అడ్డం పెట్టుకుని ఓ ఆడదాని డబ్బు తింటూ బ్రతకడానికి మీకు సిగ్గెలా లేక పోతూంది ఓ భార్యని డబ్బుకోసం పీడిస్తూ ఆ డబ్బుతో జల్సాలు చేసుకుంటూ తిరిగే మీరు . మీరు మగవాళ్లేనా ఛీ ఛీతో మాటలేమిటి నాకు. మానవత్వం చచ్చిపోయిన మీలాంటి మనుష్యులతో మాట్లాడడం నాదే తప్పు... పట్టుకుపోండి...మీక్కావలసింది డబ్బేగా . దాని కోసం ఆత్మాభిమానం, పౌరుషం అన్నీ విడిచేశారుగా ఆడదాని డబ్బు తింటూ బ్రతకడానికి మీకు అభిమానం అడ్డురాక పోతే అలాగే పట్టుకుపోండి.. "అంటూ ఆవేశంగా వెళ్ళి ఆయన అడిగిన డబ్బు తెచ్చి మొహంమీద విసిరి కొట్టాను. ఓ క్షణం అలా చూస్తూ నిల్చున్నారు. కళ్లల్లో కాస్త పాటి పౌరుషం, అభిమానం కానేపు తొంగి చూసినా అలవాట్లకి బానిస అయిన ఆ డబ్బుని వదులు కోలేని బలహీనతకి లొంగి ఆ డబ్బు తీసుకుని బయటికివెళ్ళి పోయారు దాంతో పూర్తిగా ఆయనలో యింకా ఏ అభిమానమూ, అహమూ మిగల లేదని అర్థమైంది నాకు. డబ్బు కోసం-

ఆ డబ్బు నే నిస్తున్నన్ని రోజులూ ఆయన నా జోలికి రారని అర్థమైంది. ఆయనకి డబ్బు యివ్వక తప్పదని మరో గత్యంతరం లేదనీ బోధపడింది ఆ తర్వాత ఆ తర్వాత రోజులు గడిచిన కొద్దీ ఆయన మరీ అంత చొరవగా ఖర్చుపెట్టడంలేదని, తరుచు డబ్బు అడగడానికి కాస్త భయపడుతున్నారని, అడిగే ముందు కాస్త తటపటాయిస్తున్నారని అనిపించేది నాకు. ఆయనని భరించడం యీరోజువరకు నాకుతప్పలేదు.

నవ్వత లేకుండానే రోజులు గడిచిపోసాగాయి పిల్లలు పెద్ద వాళ్లవుతున్నారు. వాళ్లకి జ్ఞానం వస్తున్న కొద్దీ ఇంట్లో తండ్రిని, తండ్రిచేసే గొడవలు అన్నీ చూస్తుంటే ఆ పసివాళ్ల మనస్సుల్లో తండ్రి పట్ల ఎలాంటి భావం ముద్రపడుతుందోనని భయంవేసేది. అప్పటికే ఆయన గొడవలకి ఐదేళ్ల రవి, నాలుగేళ్ల రేఖ బిక్కమొహాలు వేసుకు చూసేవారు. ఆయన్ని చూసి జంకేవారు ఆయన దరిదాపులకి కూడా వెళ్లేవారుకాదు. పసివాళ్లని దగ్గిరకి తీసి, అభిమానంగా పలకరించక పోతే తండ్రి అయితే మాత్రం వాళ్లకి ఎక్కువేమిటి?అసలు తండ్రి అంటే అర్థం తెలియని ఆ పసివాళ్లకి ఆయనమీద అభిమానం, చనువు ఎలావుంటుంది? చిన్నప్పటి నించి తండ్రి ప్రేమకి దూరమైన ఆ పిల్లలకి పెద్దయ్యాక తండ్రి పట్ల గౌరవం ఎక్కడినించి వస్తుంది? తండ్రి ప్రవర్తనని చిన్నప్పటి నించి చూస్తూ పెద్దయ్యాక ఆయనని ఎలా ద్వేషిస్తారో నాకు అర్థమై కనీసం ఆయన ఇంట్లో యీ త్రాగుడు, యీ తందనాలు అవి మానితే బాగుండు ననుకునేదాన్ని.

# కన్నీటి కణాలు

గడగడ వణికిస్తున్న యీ చలి
కాలమనే మహాకాళి ఆకలి
గొర్రెలూ కోళ్లూ కాదు దీనికి బలి
గోచిపాత రాయుళ్లు
మహిషాసురులు కాదు
మదనాతురులు.

ఎముకల్ని నములుతున్న యీ చలి
సామాన్యుల పాలిటి బెబ్బులి
పాంథుల డెందాల్ని డొలుస్తున్న
కందర్పుని ఉలి.

జాలిలేని యీ శీతల వాతూలం
కాలుని దూతల చేతులలో
వ్రేలుతున్న కరవాలం
మూగజీవాలను చావు బ్రతుకుల
మధ్య
ఊగిస్తున్న హిందోళం.

పేదల్ని చుట్టాల్లా
వేధిస్తున్న చట్టాలు
శ్రీమంతులకు సామంతం
చేస్తున్నట్లుగా
ఈ హేమంత శిశిరాలు–
దేహానికీ గేహానికీ ఆచ్ఛాదన లేని
దరిద్ర నారాయణుల నరాలను
తమ కరాళదంష్ట్రలతో
కొరుకుతూ
రగ్గులతో, పెగ్గులతో
స్వెటర్లతో, బ్లేంకెట్లతో
ధనం కలవారికి వెచ్చదనం
కలిగిస్తున్నవి.

బలహీనుల్ని ఫలహారం చేసే
కలవారి జోలికి చలి పోదు
స్వకుల పక్షపాతులయిన
పాలకుల కిది తీసిపోదు
మామూలు జనంమీద
ఏ మూలా కనికరం లేదు
ఆ విషాద తుషార జలాలు
కేవలం మొసలి కన్నీటి కణాలు.

---

ఆర్. కామేశ్వరరావ్.

---

# గెలుపెవరిది?

—చిత్రపు హనుమంతరావ్

ప్రకాశం హైద్రాబాదువచ్చి నెల్లాళ్ళు కూడా కాలేదు. అంతకుముందు విజయవాడ ఆఫీసులో 'యూ. డి. సీ.' గా ఉండేవాడు. ఆఫీసరు ఉద్యోగాలకి ఆ 'డిపార్టుమెంటు' 'సెలక్షన్ టెస్టు' పెట్టడమూ, ప్రకాశం నెగ్గడమూ జరిగింది. అతడిని హైద్రాబాదులో మెయిన్ ఆఫీసులో 'సెక్షన్' ఆఫీసరుగా వేసారు.

విజయవాడనుంచి ఎవరో ప్రమోషను మీద వస్తున్నారని తెలిసినప్పుడు, ఆ 'సెక్షన్ స్టాఫ్' ఆ వచ్చేఆఫీసరు వయసు పైబడ్డవాడే అయివుంటాడనుకున్నారు. తీరా ప్రకాశం వచ్చి చేరాక తెల్ల ముఖాలు వేశారు. వాళ్ళనుకున్నట్లు ప్రకాశం వయసు పైబడ్డవాడు కాదు, అటూ ఇటూగా పాతికేళ్ళ యువకుడు!

'డ్యూటీ'లో చేరిన రెండు మూడు రోజుల్లోనే ప్రకాశం అందరినీ ఆకర్షించాడు. అతడిది చూడముచ్చటైన విగ్రహం, అందుకు తగ్గట్లు అందరినీ ఆకట్టుకునే వాక్చాతుర్యం. అతడు కుర్రకారుకి కుర్రాడు. పెద్దవాళ్ళకి పెద్దవాడు. వయసు పైబడ్డ వాళ్ళతో మాట్లాడుతున్నప్పుడు వాళ్ళ వయసుకి గౌరవమిస్తాడు. 'కుర్రాడైనా పెద్ద వాళ్ళతో ఎలా మాట్లాడాలో తెలుసు' అనుకుని సంతోషిస్తారు వాళ్ళు. ఇక కుర్రకారులతో సమాన వయస్కులతో మాట్లాడినట్లే మాట్లాడుతాడు 'సోషల్గా' 'మూవ్' అవడం ఈయనకు తెలుసు 'అనుకుని ముఖం ఇంత చేసుకుంటారు వాళ్ళు! అంతేకాదు పెళ్ళికాని యువకుల్తో' సాయంత్రం పనేమీ లేకపోతే నాగదికి రాకూడదా, సరదాగా టాంక్‌బండ్‌కో, పబ్లికుగార్డెన్సుకో షికారుగా పోదాం' అంటాడు. వాళ్ళలో ఉత్సాహం ఉరకలు వేస్తుంది. ఆఫీసరు గారు షికారుకి రమ్మని ఆహ్వానిస్తే 'సబార్డినేట్సుకి' అంతకన్న ఇంకేం కావాలి? అంతేకాదు, ఆఫీసులో ఎవరినీ 'సబార్డినేట్సు'గా చూడడు; తను ఆఫీసరునన్న గర్వమూ చూపించడు.

ప్రకాశం పదయ్యేసరికల్లా ఆఫీసుకి వస్తాడు, సాయంత్రం అయిదయ్యేసరికల్లా ఆఫీసు మూయించేస్తాడు. అంతకుముందు ఆఫీసరుగారు పదయ్యేసరికల్లా ఆఫీసుకి వచ్చేవాడు, అంతటితో వూరుకోక, పది అయిదు అయ్యేసరికల్లా అంతవరకూ ఆఫీసుకి రానివాళ్ళందరికీ 'ఆబ్సెంటు' వేసేసేవాడు. మధ్యాహ్నం లంచ్ టైమ్‌కో కూడా సతాయించేవాడు. సాయంత్రం ఆరున్నర దాటితేనేగాని తన సీట్లోంచి

కదిలేవాడుకాదు. ఆఫీసరు ఉండగా ఆఫీసు వదలాలంటే 'సబార్డినేట్సుకి' భయమే కద. అంచేత వాళ్ళు కుక్కినపేలల్లా కూర్చునేవారు. కసిదీరా ఆయన్ని లోలోపలే తిట్టుకుంటూ. ఆ సెక్షనుకి వున్నది ఇద్దరు బంట్రోతులు. వాళ్ళలో ఒకడు ప్రతీనెలా జీతాలిచ్చేరోజున ఆఫీసుముఖం చూసేవాడు. తక్కినరోజులు ఆఫీసరుగారింట్లో బట్టలుతక



డమూ, గిన్నెలు తోమడమూ మొదలైన పనులు చేస్తూ, ఉదయం ఆరింటినుంచి రాత్రి పదింటివరకూ ఆఫీసరు గారింట్లోనే పడుండేవాడు. ఇక ఆఫీసులో వుండే బంట్రోతుకి అయ్యగారికి ఇంటినుండి భోజనమూ, కాఫీ ఫలహారాలు తేవడంతోనే సరిపోయేది. ఇక ఆఫీసులో వాళ్ళకి మంచినీళ్ళు కావాల్సొచ్చినా తెచ్చుకుని తాగాల్సిందే. ఆఫీసరుగార్ని ఆ 'సెక్షనుస్టాఫ్' ఉమ్మడిగా 'వై. డి' అనుకునేవారు. 'వై. డి' అంటే యమధర్మరాజు!

ఆ సెక్షనులో ఇద్దరమ్మాయిలున్నారు. ఇద్దరూ ఇంచుమించు ఒకే వయసువాళ్ళు. దాదాపు ఇరవయ్యేళ్ళు. ఓ పిల్ల పేరు చంద్రసేన. రెండోపిల్లపేరు సులోచన. చంద్రసేన 'స్టెనోటైపిస్టు' సులోచన 'యూ. డి. సి.' సులోచన సన్నగా పొడుగ్గా వుంటుంది, ఆమెది పసిడిఛాయ. చంద్రసేన సులోచనంత పొడవరికాదు, ఆమెది పసిడిఛాయకి ఓ మెట్టు తక్కువ. ఆమెను చూడగానే పుష్పించడానికి సిద్ధంగా వున్న సంపెంగ గుబురు కళ్ళ ముందు

మెదుల్తుంది. సులోచన కళ్ళల్లో ఆకర్షణ వుంటే, చంద్రసేన నాసికలో ఆకర్షణ వుంది. సులోచనది సన్నజాజి పువ్వు అందమైతే, చంద్రసేనది బొడ్డుమల్లెపువ్వు అందం!

చంద్రసేనా, సులోచనా చిన్నప్పటి నుండే కలసిమెలసి తిరిగినవాళ్ళే కాదు!బి.ఏ. వరకూ 'క్లాస్‌మేట్సు' వాళ్ళ ఇళ్ళుకూడా ఒకేవీధిలో ఉన్నాయి. ఉదయం ఆఫీసుకి కలసి వస్తారు; సాయంత్రం ఇళ్ళకి కలసి వెడతారు. ఒక్కముక్కలో చెప్పాలంటే వాళ్ళు ప్రాణస్నేహితురాళ్ళు; వాళ్ళమధ్య దాపరికాలూ, రహస్యాలూ ఉండనేఉండవు.

అదే ఆఫీసులో మరోసెక్షనులో సులోచన పిన్ని పనిచేస్తోంది. అందువల్ల ప్రతిరోజూ 'లంచ్‌టైములో' సులోచన ఆవిడదగ్గరకు వెడుతుంది.

ప్రకాశం 'లంచ్‌టైములో' బంట్రోతులకి పనిచెప్పడు. ఏమైనా కావాల్సివుంటే ముందే తెప్పించుకుంటాడు. కాకపోతే లంచ్‌టైము అయ్యాక తెప్పించుకుంటాడు. కాఫీ మాత్రం ఫ్లాస్కులో ఎప్పుడూ ఉంటుంది. లంచ్‌టైములో ఆ 'సెక్షను'లో మిగిలేదల్లా ఇద్దరు—ఒకరు చంద్రసేన మరొకరు ప్రకాశం. చంద్రసేన ఫలహారం తెచ్చుకుంటుంది అందువల్ల ఆమెకు బయటకు వెళ్ళాల్సిన అవసరం వుండదు. ప్రకాశం తన గదిలో పేపరు చూస్తూ కూర్చుంటాడు.

ప్రకాశం వచ్చిన కొత్తల్లో ఓరోజు 'లంచ్ టైము'లో జరిగిన సంఘటన— చంద్రసేన 'టిఫిన్ బాక్సు' మూత తీసి, టిఫిన్ చెయ్యబోతున్న సమయంలో ప్రకాశం ఏదో ఫైలుకోసం ఆ గదిలోకి వచ్చాడు. అతడు వెళ్ళిపోతాడనుకుంటే ఆ ఫైలు చూస్తూ అక్కడే కుర్చీలో చతికిలబడ్డాడు. చంద్రసేనకి ఏం చెయ్యాలో అర్థమైంది కాదు. అతడు అక్కడే వుండగా, తను వక్కర్తి ఫలహారం చేస్తే ఏం బావుంటుంది? ఆరోజు ఫలహారం 'వెజిటబుల్ బిర్యానీ'. దాన్ని చూస్తూంటే ఆమెకు నోరూరసాగింది. చివరకు అతడికి కూడా 'అఫర్' చెయ్యాలని నిశ్చయించుకుంది. 'టిఫిన్ బాక్సు' మూతలో కొంచెం పెట్టి,

''సార్ కొంచెం 'టేస్టు' చెయ్యండి'' అంది.

ప్రకాశం ఫైలు చూస్తున్నవాడల్లా చంద్రసేనవైపు చూశాడు, ఆ తర్వాత ఫలహారంవైపు చూశాడు 'వెజిటబుల్ బిర్యానీ' అతడిక్కూడా చాలా ఇష్టం. అయినా మొహమాట పడ్డాడు.

''అబ్బే వద్దండీ...మీరు తెచ్చుకొన్నదే కొంచెం.''

''మరేం ఫర్వాలేదు తీసుకోండి.''

ప్రకాశం మరి మాట్లాడక 'బిర్యానీ' తిన్నాడు.

''బిర్యానీ చాలా బాగుందండీ. మీ అమ్మగారు చేశారా?''

''అబ్బే కాదండీ. నేనే చేశాను ''

''మీకు వంట బాగా వచ్చన్న మాట. బి. ఏ. పాసైన మీకు వంటలో ఇంత ప్రావీణ్యత వుందంటే ఆశ్చర్యంగా వుంది ..''

చంద్రసేన చిరునవ్వు నవ్వుతూ అంది

''అంటే మీ ఉద్దేశ్యం చదువుకున్న ఆడవాళ్లకి వంట రాదనా?''

ప్రకాశం సమాధాన మివ్వలేదు. నవ్వేశాడు.

అది మొదలు 'వెజిటబుల్ బిర్యానీ' తెచ్చినప్పుడల్లా ఇద్దరికి సరిపడా తెస్తోంది. ప్రకాశం మొహమాట పడ్డం మానేశాడు ప్రతీసారీ చంద్రసేన వంటని తెగ మెచ్చుకుంటున్నాడు.

ఒక పురుషుడు ఒక స్త్రీకి తన ఇష్టతను చూపే మార్గాలు చాలా వున్నాయి అందులో ఒకటి-ఆ స్త్రీ వంటని మెచ్చుకోవడమేమో? అంతేకాక అతడు తనతో చనువుగా ఉంటున్నాడు దాని అర్థం? ప్రకాశం తన హృదయంలో ఏనాడో తిష్టవేశాడు. ఆలోచించగా అతడు కూడా తనను ప్రేమిస్తున్నా డన్పిస్తోంది. అన్పించడమేమిటి? ప్రేమిస్తున్నాడు. దాన్లో అనుమానంలేదు ప్రకాశం తనను ప్రేమిస్తున్నాడన్న వూహ చంద్రసేనకి రానురాను మరింత బలపడింది.

ఓ శనివారం లంచ్ టైములో ప్రకాశం అన్నాడు.

''వచ్చేవారమంతా నేను సెలవుమీద వుంటాను చంద్రసేనగారూ ''

చంద్రసేనకి ఆరోజు రాత్రి నిద్ర పట్టింది కాదు పాతికేళ్ళ ప్రకాశం పొడుగ్గా బలంగా చూడ ముచ్చటగా వుంటాడు. అతడి నొక్కుల జుత్తును చూస్తుంటే వేళ్లతో దువ్వాలన్పిస్తుంది. తను అతడిని గాఢంగా ప్రేమిస్తున్నది. అయితే ఆమాట అతడితో చెప్పలేకపోతున్నది. అందుకు కారణం తను స్త్రీ. తను సిగ్గుపడటం సహజం అతడు కూడా తనను ప్రేమిస్తున్నాడు. ఆ మాట తనతో చెప్పలేకపోతున్నాడు. ఎంతగా ప్రేమిస్తున్నాడో! కాకపోతే యెవరికీ చెప్పని మనిషి ''వచ్చేవారమంతా నేను సెలవు మీద వుంటాను చంద్రసేనగారూ'' అని ప్రత్యేకంగా తనతోనే యెందుకు చెప్పాలి? అయినా మగాడికి ఆ సిగ్గేమిటి! అంత సిగ్గయితే ఏ బల్లకో, కుర్చీకో చెబుతున్నట్లు ''నిన్ను ప్రేమిస్తున్నాను చంద్రసేనా ...'' అంటే పోలా? పోనీ ఆ ముక్క చెప్పడానిక్కూడా సిగ్గయితే ఓ కాగితం ముక్కమీద 'ఐలవ్ యూ చంద్రసేనా.' అని రాసియిస్తేపోలా? లేకపోతే ఆ మాట చెప్పే ముందు తను ఎలాంటిదో 'స్టడీ' చేస్తున్నాడా? కొందరాడ వాళ్ళు 'లవ్' అన్న ముక్క చెవిన పడగానే విరుచుకు పడతారట! ఖర్మ . తనను కూడా అలాంటి ఆడవాళ్ళలో జమ వేశాడో యేమిటో?...ఎప్పుడో చదివిన కథ గుర్తుకొచ్చింది. దాన్లో నాయకీ నాయకులు ఒకరి నొకరు ప్రేమించుకుంటారు. ఐతే నాయకి తనను ప్రేమిస్తున్నట్లు నాయకుడికి తెలీదు, నాయకుడు తనను ప్రేమిస్తున్నట్లు నాయకికి తెలియదు. ఒకరి నొకరు అపార్థం చేసుకుంటారు. నాయకుడు తనను ప్రేమించడం లేదనుకుని, తండ్రి స్థిర పర్చిన సంబంధానికి ఒప్పుకుంటుంది నాయకి. నాయకుడు చాలా కాలంపాటు బ్రహ్మచారిగానే ఉండిపోతాడు. చంద్రసేనకి వళ్ళు గగుర్పొడిచింది. తమ కథ కూడా అలాగే అయితే ఇంకేమన్నావుందా.

"ఈ కథ ఇలా కొనసాగకూడదు,సుఖాంతం కావాలి " అన్న నిర్ణయానికి వచ్చింది. కథ సుఖాంతం కావడానికి ఏం చెయ్యాలో మాత్రం అర్థం కాలేదు.

ఇద్దరాడవాళ్లు ఎంత ప్రాణస్నేహితు రాళ్లయినా, ప్రేమ విషయంలో మాత్రం రహస్యంగా వుంచుతారట. చంద్రసేనకీ, సులోచనకీ రహస్యాలు, దాపరికాలు లేక పోయినా, తన ప్రేమ విషయం మాత్రం సులోచనకి చెప్పలేదు చంద్రసేన. తన ప్రేమ విషయంగా సులోచన సలహా అడగాలని ఒకరోజు నిశ్చయించుకుంది చంద్రసేన.

ఆ మరునాడు ఉదయం చంద్రసేన సులోచన ఇంటికి వెళ్ళింది. కొంతసేపు లోకాభిరామాయణం జరిగాక,

"సాయంత్రం 'పబ్లిక్ గార్డెన్సు'కి వస్తావుటే? నీకో విషయం చెప్పాలి" అంది చంద్రసేన.

"అలాగే . నేనూ నీకో విషయం చెప్పాలనుకుంటున్నానే"అంది సులోచన.

ఆ సాయంత్రం చంద్రసేనా, సులోచనా 'పబ్లిక్ గార్డెన్సు'కి వెళ్ళారు. పచ్చికలో కూర్చున్నారు సులోచన ఆత్రుతను ఆణుచుకోలేక.

"చెప్పవే చంద్రా ఏమిటా విషయం" అంది.

తలెత్తి సులోచన వైపుచూసి, సిగ్గుతో ముఖం దించుకుని, అతిమెల్లగా "నే నొకర్ని ప్రేమించానే " అంది.

నమ్మలేని విషయం వింటున్నట్లు చంద్రసేన వైపు చూస్తూ,

"నువ్వు చెప్పింది నిజమేనటే?" అంది సులోచన.

"అక్షరాలా నిజం."

"నువ్వు అతడిని ప్రేమిస్తున్నావు బాగానే వుంది. అతడు నిన్ను ప్రేమిస్తున్నాడో లేదో తెలుసుకొన్నావా? "

"నేను ఫలహారం పెట్టినప్పుడల్లా నా వంటని తెగమెచ్చుకొంటారు ..ఓ మగాడు ఓ ఆడదానికి తన ఇష్టతను చూపే మార్గాల్లో వంటని మెచ్చుకోడం ఒకటంటారు. ఆయన నా వంటని అంతగా మెచ్చుకుంటు న్నారంటే, ఆయన ప్రేమిస్తున్నట్లే కదా?"

సులోచన కొద్ది క్షణాలు ఆలోచించి,అంది:

"అవుననుకో అలాగే అన్పిస్తోంది మరి ఇంతకీ నువ్వు వరించిన అతగా డెవరు?"

"చెబుతాను కాని నువ్వు చెబుదామను కున్న విషయం ముందు చెప్పు."

"నేనూ ఒకర్ని ప్రేమించానే."

"నిజంగా?"

"అవునే. .ఆయనకూడా నన్ను ప్రేమి స్తున్నారన్పిస్తోంది. యెప్పుడూ నేను కట్టు కొచ్చిన చీరని పొగుడుతారు. మీకు చీరల 'సెలెక్షను' బాగా తెలుసండీ అంటారు. మీలా సన్నగా, పొడుగ్గా, పసిడి ఛాయతో వున్నవాళ్ళకి ఇలాంటి చీర చాలా బాగుం టుందండి అంటారు....అంటే దాని అర్థం 'మీరు అందంగా వుంటారు. మీరు నాకు నచ్చేరు' అనేగా? "

"అలాగే అన్పిస్తోంది ఇంతకీ నువ్వు వరించిన అతగాడెవరు? . "

"ముందు నువ్వు చెప్పు."

"మన ప్రకాశంగారేనే."

చంద్రసేన సిగ్గుతో ముఖం దించు

కుంది. సులోచనకి వళ్ళుమండింది.

''ఆయన నీవంటని మెచ్చుకున్నంత మాత్రాన నిన్ను ప్రేమిస్తున్నారని ఎలా గనుకున్నావే వెర్రి బాగుల్దానా ఇంట్లో వంట మనిషి వంట బాగా చేస్తే మెచ్చు కోమా? అలాగే ఆయనా నీవంటని మెచ్చు కుంటున్నారేమో? ''

చంద్రసేన చిన్నబుచ్చుకుని, ''నన్ను వంటమనిషితో పోలుస్తావటే? ఇంతకూ నువ్వు ప్రేమించిం దెవరిని? '' అంది

''ప్రకాశంగారినే . ఆయన నేను కట్టు కున్న చీరని పొగుడుతారు. సన్నగా పొడుగ్గా పసిడిఛాయతో వుంటానంటారు. ఆయన నన్ను గాఢంగా ప్రేమిస్తున్నారు. అందులో అనుమానంలేదు ''

''సర్లే'. నీమాటలకేంలే నువ్వుకట్టు కున్న చీరని పొగిడివుండవచ్చు .సన్నగా, పొడుగ్గా, పసిడి ఛాయతో ఉంటావనవచ్చు. దానర్థం నువ్వు అందాలభరిణెవని కాదు. రంగుండగానే సరా? ఒక్కసారి అద్దం లో చూసుకో చప్పిడవడలూ నువ్వూను పొడుగ్గా ఉండగానే సరా? దానికి తగ్గ శరీరం ఉండద్దూ గెడకర్రలా వుంటావు ప్రకాశం గారు నన్నే ప్రేమిస్తున్నారు. అందులో ఏమాత్రం సందేహం లేదు ''

''నువ్వు మాత్రం పెద్ద అందకత్తె వేమిటే? పొట్టిగా పీపాలా వుంటావు '' అంటూ సులోచన లేచి విసవిసా నడుస్తూ వెళ్ళిపోయింది.

చంద్రసేన నిట్టూర్పు విడచి, ఆ వెను కనే ఇంటికి వెళ్ళింది

* * *

ఆ మరునాడు ఉదయం చంద్రసేన సులోచన ఇంటికి వెళ్ళింది. సులోచన ఏమీ జరగనట్లే నవ్వుముఖంతో.

''రావే చంద్రా '' అంటూ ఎదురు వెళ్ళింది.

వాళ్ళిద్దరూ కొంతసేపు కబుర్లు చెప్పు కున్నాక,

''మన స్నేహం ఈనాటిదికాదే సులో చనా. ప్రేమవిషయంలో దెబ్బలాడు కోవడ మెందుకు? ఇంతకీ ప్రకాశంగారు ఎవరిని ప్రేమిస్తున్నదీ మనకు తెలియనే తెలియదు. ప్రకాశంగారు వచ్చాక తగిన సమయం చూసి ఎవరిని ప్రేమిస్తున్నదీ తెలుసు కుందాం. మన ఇద్దరిలో ఆయన ఒకరినే ప్రేమిస్తున్నారని మన కిద్దరికీ తెలుసు. ఒకరికి గెలుపు ఇంకొకరికి ఓటమి. ఓటమి ఎవరి కెదురైనా తేలిగ్గా తీసు కుందాం. ఇద్దరమూ ఎప్పటిలాగే స్నేహితు రాళ్ళగా ఉందాం'' అంది చంద్రసేన.

''నేనూ ఇవే మాటలు నీతో చెబుదా మనుకుంటున్నానే చంద్రా'' అంది సులో చన. ఇద్దరూ మనసారా నవ్వుకున్నారు.

* * *

సోమవారం రానే వచ్చింది. ప్రకాశం ఉత్సాహంతో ఆఫీసుకి వచ్చాడు. ఆ మధ్యాహ్నం 'లంచ్ టైము'లో చంద్ర సేనతో,

''రేపు ఆఫీసుకి సెలవు. మీరు మా యింటికి రేపు సాయంత్రం 'టీ'కిరావాలి.'' అన్నాడు ప్రకాశం.

చంద్రసేన అంగీకారంగా తలవూపింది ప్రకాశం తన ఇంటి 'ఎడ్రసు' ఓ కాగితం మీద రాసి ఆమె చేతికిస్తూ,

''సాయంత్రం అయిదింటికల్లా వచ్చెయ్యండి'' అన్నాడు.

చంద్రసేన ఆ కాగితం వైపు చూస్తూ.

''అలాగేనండి'' అంది.

చంద్రసేన విజయనగర్ కోలనీలో వున్న ప్రకాశం ఇంటి ఎడ్రసు చూస్తూ. సులోచనను తలచుకుని జాలిపడింది. ''పాపం ఉత్త వెర్రి బాగుల్ది. ప్రకాశం గారు తననే ప్రేమిస్తున్నారని అనుకుంది.''

* * *

ఆ మరునాడు సాయంత్రం నాలుగున్నరయ్యేసరికల్లా 'బస్సుస్టాప్' చేరుకుంది చంద్రసేన. అయితే అప్పటికే 'బస్సుస్టాప్'లో నిలబడి బస్సుకోసం ఎదురు చూస్తోంది సులోచన. చంద్రసేన తెల్ల ముఖం వేసింది. 'సులోచన ఎక్కడికి వెడుతున్నట్లు?' అనుమానం తీర్చుకోడానికి ''ఎక్కడికే వెడుతున్నావ్ సులోచనా'' అంది

''నాంపల్లి స్టేషనుకి. నువ్వెంతవరకూ వెడుతున్నావ్?''

చంద్రసేన తేలిగ్గా ఊపిరి తీసుకుని.

''నేనూ అక్కడికేనే'' అంది.

ఇంతలో నూట ముప్పయ్యేడు నెంబరు బస్సు వచ్చింది. అది నాంపల్లి స్టేషనుకి పోతుంది. బస్సు కదిలిపోయింది కాని. సులోచనా ఎక్కలేదు. చంద్రసేనా ఎక్కలేదు. ఒకరి ముఖాలొకరు చూసుకుంటూ విలబడ్డారు ఆ తర్వాత కొద్ది సేపటికి నూట ముప్పయ్ తొమ్మిది నెంబరు బస్సు వచ్చింది. అది నాంపల్లి మీదుగా విజయనగర కోలనీ పోతుంది. వాళ్ళిద్దరూ బస్సు ఎక్కారు

సులోచన చెప్పినట్లు నాంపల్లి దగ్గర దిగలేదు. చంద్రసేనా దిగలేదు. ఇద్దరూ విజయనగర కోలనీలో బస్సు దిగారు.

''ఎందుకాని మన మధ్య ఈ రహస్యాలు ప్రకాశంగారు నన్ను 'టీ'కి రమ్మని పిలిచారే సులోచనా. ఆయనింటికి వెడుతున్నాను ఇప్పుడు చెప్పు నువ్వెక్కడకు వెడుతున్నావో'' అంది చంద్రసేన.

''ప్రకాశంగారు నన్ను కూడా 'టీ'కి రమ్మని పిలిచారే చంద్రా. ఆయనింటికే నేనూ వెడుతున్నాను ''

ఆ తర్వాత మాటల్లేకుండానే వాళ్ళిద్దరూ ప్రకాశం ఇల్లు చేరుకున్నారు వాళ్లు వెళ్లేసరికి ప్రకాశం హాల్లో కూర్చుని వున్నాడు. వాళ్లను చూస్తూనే, ''సరిగ్గా అయిదింటికల్లా వచ్చేశారే రండి.'' అన్నాడు నవ్వు ముఖంతో.

వాళ్ళిద్దరూ లోపలకు వెళ్ళి సోఫాల్లో కూర్చున్నారు ప్రకాశం కొద్దిసేపు వాళ్లతో మాట్లాడి లోపలకు వెళ్ళాడు. వాళ్ళిద్దరూ అతడి కోసం చూస్తూ కూర్చున్నారు.

ఓ 'ట్రే'లో నాలుగు ప్లేట్లలో టిఫినూ, నాలుగు గ్లాసుల్లో మంచి నీళ్ళూ పెట్టుకుని తిరిగి వచ్చాడు. 'నాలుగో ప్లేటూ, నాలుగో గ్లాసూ ఎవరికోసమూ?' అని వాళ్ళిద్దరూ ఆలోచిస్తూన్నంతలో, ఓ ఇరవయ్యేళ్ళ అమ్మాయి ఓ 'ట్రే'లో నాలుగు కప్పుల్లో కాఫీ పెట్టుకుని వచ్చింది. వాళ్ళిద్దరూ ఆమె వైపు చూశారు. ఆమె సన్నగా పొడుగ్గా, పసిడి ఛాయతో తీర్చిదిద్దిన అవయవ సౌష్ఠ

వంతో అపర రతీ దేవిలావుంది. ఆమె టిఫిన్ ప్లేట్లు వాళ్ళిద్దరికీ, ప్రకాశానికీ ఇచ్చి తనూ ఒకటి తీసుకుని కూర్చుంది.

"నా భార్య వసుంధర" ఆమెను వాళ్లిద్దరికీ పరిచయం చేశాడు ప్రకాశం.

"వసూ వీళ్ళిద్దరూ మా ఆఫీసులో పని చేస్తున్నారు. ఈవిడ చంద్రసేన, ఆవిడ సులోచన" అంటూ వాళ్ళను ఆమెకు పరియం చేశాడు.

వాళ్ళిద్దరూ పాలిపోయిన ముఖాలతో ఒకరి వైపొకరు చూసుకున్నారు.

"చంద్రసేనగారూ 'వెజిటబుల్‌బిర్యానీ' బ్రహ్మాండంగా చేస్తారు మీరు వసూకి నేర్పాలి."

చంద్రసేన తలెత్తి అకడి వైపు చూడకుండానే తలవూపింది.

"సులోచనగారూ, చీరల 'సెలెక్షన్' మీకు చాలా బాగా తెలుసు. వసూ చీరలు కొనుక్కోవాలను కుంటోంది. బజారుకి మీరుకూడా వెళ్ళి వసూకి చీరలు 'సెలెక్టు' చేసి పెట్టాలి"

సులోచన శూన్యంలోకి చూస్తూ, అతి మెల్లిగా 'అలాగే' అంది.

"మీరిద్దరూ మా యింటికి తరచుగా వస్తూవుండాలి నాకు ఈ వూరు అసలే కొత్త. అసలు తోచడంలేదు" అంది వసుంధర.

తెచ్చిపెట్టుకున్న నవ్వు ముఖాలతో "అలాగే"అంటూ వాళ్లిద్దరూ లేచారు. ★




# శ్రీ బాలాజీ వైద్యశాల

డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడీ గుడివద్ద ఫోన్ 551, తెనాలి (ఏ.పి.)

బ్రాంచి 9-D, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

దీర్ఘ రోగులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వప్నస్థులు, కుష్ఠు - బొల్లి, చర్మ వ్యాధులు హెర్నియా (గిలక), పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం, దగ్గులకు ఉచిత వైద్యం. రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండ బాగు చేయబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

# ఆగండి! చదవండి! ఆలోచించండి!

★ మన అంతస్తులనూ, అభిరుచులనూ, సంస్కృతినీ తెలియజేసేవి మనచుట్టూ వుండే స్నేహితులూ, మనం నివసించే ప్రదేశాలునూ.

(అడవిమల్లె వాసిరెడ్డి సీతాదేవి.)

★ అవసరాలకీ, నీతికీ, సంఘర్షణ వచ్చినప్పుడు, అవసరాలు గెలుస్తాయిగాని, నీతిపాఠాలు గెలవవు.

(పద్మవ్యూహం పి. సత్యవతి.)

★ ప్రతి అందం అడుగునా ఒకలోపం, ప్రతి సుఖం వెనుకా ఒక వెల్తి ఉంటాయి.

(సుప్రభాతం కోడూరి కౌసల్యాదేవి )

★ శరీరానికి తగిలిన దెబ్బ మందులతో మానుతుంది, మనసుకు తగిలిన దెబ్బ మాటలతో మానదు.

(వైకుంఠపాళి ద్వివేదుల విశాలక్ష్మి.)

★ అసమర్థునికి ఆలి అవడంకంటె, బలవంతునికి బానిస అవడం మేలు.

(ప్రమదావనం మాలతీ చందూర్.)

★ అహంకారంతో వేసే ప్రతి అడుగు తప్పుగానే పడుతుంది.

(పూల మనసులు మాదిరెడ్డి సులోచన.)

★ తొందరపాటు అనేది యవ్వనం యొక్క ముఖ్య లక్షణం.

(ఆహుతి యద్దనపూడి సులోచనారాణి.)

★ ఒకరి సుఖంకోసం జీవితాన్ని బలి ఇవ్వటం తేలిక, కాని జీవించి హృదయాన్ని పంచి యివ్వటం దుర్లభం.

(భగ్నజీవులు శార్వరి.)

★ మనుషుల బలహీనత పసిగట్టి వాట్లమీద దెబ్బతీస్తే మనిషి బానిస అవుతాడు

(విందు మారేమండ సీతారామయ్య.)

★ సంతాపం కలిగిందా నీ వద్దే వుంచు,
సంతోషం నీ కొస్తే పదిమందికి పంచు.

(సంపెంగలూ—సన్నజాజులూ అవసరాల రామకృష్ణారావు )

★ జీవితంలో మిగతా ఆస్తిపాస్తులకన్నా
ఎక్కువ విలువైన సొత్తు ఒక ఆత్మీయుడైన మిత్రుడు.

(గాజుకటకం రావిశ్రీమన్నారాయణ.)

సేకరణ. పి. వి. వి. వి. నరసింహారావు, బి. యస్ పి.




# పాలిష్

వేదగిరి రాంబాబు

ప్రభాకరం వాచీ చూసుకున్నాడు.

రెండున్నర.

ఎండ నిప్పులు చెరుగుతోంది. చొక్కా చాలాభాగం, లోపలి బనీను పూర్తిగానూ—చెమటతో తడిసిపోయేయి. చిరాగ్గావుంది

ముఖాన్న పట్టిన చెమటని రుమాలుతో తుడుచుకున్నాడు. మొహం గరగరలాడింది. మంటగా తోచింది.

అసహనంగా-చుట్టూ చూసేడు ప్రభాకరం.

బస్స్టాండ్ అంతా పెళ్ళి పందిరిలా సందడిగావుంది. అవును. ప్రయాణీకుల్లో అధికభాగం—పెళ్ళివారే! ఎండాకాలానికీ—పెళ్ళి ముహూర్తాలకూ అసలు చక్కటి ముహూర్తం కుదిర్చేడు భగవంతుడు.

ప్రయాణీకుల కోలాహలంలో-ఒకదాని వెంట ఒకటి, ఒక్కొక్క ప్లాట్ఫారమ్ నుంచీ-బస్సులు పోతూనే వున్నై. ప్రతి బస్సుకూ రద్దీ! త్రొక్కిసలాట! ప్రతి బస్సూ వోవర్లోడెడ్!

కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తూనే వున్నాడు. బస్సు జాడలేదు.

ప్రభాకరం మళ్ళీ వాచి చూసుకున్నాడు. రెండూ ముప్పై అయిదు! నిముషాలు యుగాలు కావటమంటే ఇదే కాబోలు.

వొళ్లంతా చిరాగ్గావుంది. మనసంతా చీదర చీదరగావుంది. ప్రభాకరంకి ఎండలో ప్రయాణం చెయ్యడమంటే మహా చిరాకు. పైగా ఎండగా వున్నప్పుడు, వాకిలికి వట్టివేళ్ల తడికని వేళ్లాడదీసి, హాల్లో సీలింగ్ ఫాన్‌కింద పడక్కుర్చీలో పడుకుని వక్కపొడి నములుతూ శోభతో కబుర్లు చెప్పడమంటే మహా సరదా. కాని ఈ ప్రయాణాన్ని తప్పించుకోలేకపోయేడు.

కాదు, ఈ ప్రయాణాన్ని తప్పించుకునే అవకాశం శేఖర్ తనకివ్వలేదు.

శేఖర్!—

తనకున్న ఒకే వొక్క ఆప్త మిత్రుడు.

ఆప్త మిత్రుడేకాదు, ఆత్మీయుడు కూడా—

అలాంటి శేఖర్ ఈవేళ వోయింటివాడు కాబోతున్నాడు. ఈ రాత్రి ఎనిమిదింటికి శేఖర్ పెళ్ళి.

శేఖర్ పెళ్ళికి తాను వెళ్ళి తీరాలి.

అందుకే ఈ ప్రయాణం.

బస్సు జాడలేదు. కాళ్లు పీకుతున్నాయి. ప్రక్కగావున్న సిమెంటు బెంచీమీద ముగ్గురు కూర్చుని వున్నారు. వాళ్ళకి చివరిగా ఖాళీవుంది.

ప్రభాకరం బెంచీమీద కూర్చున్నాడు.

నిరీక్షణ ఎంతటి శాపమో అర్థమౌతోంది ప్రభాకరంకి. ఎండలో ఇలా పడిగాపులు కాయాల్సొస్తుందనే నిన్న ఫోన్‌లో విచారించాడు తను. దుండూరు వెళ్లే బస్సు రెండు గంటలకు వుందనీ; చివరి బస్సు రాత్రి తొమ్మిదింటికని చెప్పాడు ఎంక్వయిరీ క్లర్కు. రాత్రి బస్‌కి వెళ్తే లగ్నం అయిపోతుంది. అందుకనే ఈ బస్‌కి బయల్దేరాడు తను.

రెండు గంటల బస్సు—

రెండు నలభై దాటుతోంది. అయినా అంతులేదు.

ఎండ నిప్పులు చెరుగుతోంది, వేడిగాలి సుళ్లు తిరుగుతోంది. చిరాగ్గావుంది. నాలుగో నెంబరు ప్లాట్‌ఫారమ్ తాలూకు రేకులషెడ్ తన గ్రీష్మ తాపాన్ని క్రిందకి బదిలీచేస్తోంది.

"బాబూ! పాలీస్ సేత్తాను బాబూ!" ప్రభాకరం ఆలోచనలకి అంతరాయం కలిగింది విసుగ్గా పక్కకి తిరిగాడు.

సుమారు పన్నెండేళ్ళ కుఱ్ఱాడు విలబడున్నాడు. అక్కడక్కడా చిరిగి బాగా మాసిపోయిన వాడి చొక్కా లాగూ వాడివంటిని పూర్తిగా కప్పలేకపోగా, ఒకవిధమైన దుర్వాసనను వెదజల్లుతున్నాయి. తైల సంస్కారంలేని జుట్టు చింధరవందరగా వుండి వాడి దీనస్థితిని మరింతగా వ్యక్త పరుస్తోంది. వాడు తనచేతిలోవున్న సంచీని నేలపై పెట్టి ప్రభాకరం కాళ్ళదగ్గర కూలబడ్డాడు.

'బూటులు తలతలా మెరిసిపోయేట్టు పాలిస్ సేత్తాబాబూ ఒక్క పావలా కాసు ఇప్పింసండి సాలు " అశగా ప్రభాకరం వంక బూట్లవంక మార్చి మార్చి చూస్తూ వాడి ధోరణిలో వాడు చెప్పుకుపోసాగాడు.

"అక్కర్లేదు వెళ్ళు." ప్రభాకరం

మనసులోని విసుగంతా మాటల్లో ధ్వనించింది.

నిస్సహాయంగా ప్రభాకరం వేపొక చూపు చూసి, సంచీ భుజాన తగిలించుకుని, 'పాలీస్' అని అరుచుకుంటూ ముందుకు సాగిపోయాడు వాడు

బస్సింకా ఎందుకు రాలేదో కనుక్కుందామని ఎంక్వయిరీ ఆఫీసువేపు బయల్దేరాడు ప్రభాకరం.

''చుండూరువెళ్ళే బస్సెన్నింటికండీ?'' ప్రభాకరం అడిగాడు ఎంక్వయిరీక్లర్క్‌ని.

''రెండుగంటలకండి '' ఎంక్వయిరీ క్లర్క్ తన మామూలు ధోరణిలో జవాబిచ్చాడు-

''ఇప్పుడు మూడుకావస్తోంది కదండీ!''

''పదిగంటలకి వెళ్లిన బస్సే తిరిగొచ్చి రెండు గంటలకి రెండో ట్రిప్పుగా బయల్దేరుతుందండి. పదిగంటలకు వెళ్ళిన బస్సు ఇంతవరకూ తిరిగిరాలేదు రాగానే బయల్దేరుతుంది. మీరు నాల్గోనెంబరు ప్లాట్ ఫారం మీదకి వెళ్లండి. బస్ అక్కడికే వస్తుంది.'

ప్రభాకరంకి వెంటనే తిరిగి ఆప్లాట్ ఫారం మీదకి వెళ్ళాలనిపించలేదు కాస్త రిలీఫ్‌కోసం కాంటీన్‌వేపు దారితీశాడు. కాఫీ తాగి బస్సొచ్చేసిందేమోనని వెంటనే నాలుగో నెంబరు ప్లాట్‌ఫారమ్ మీదకి వచ్చాడు. ఇంకా రాలేదు. ఇందాక తను కూర్చున్న చోటు ఖాళీగానేవుంది

అదే స్థలంలో కూలబడ్డాడు.

'కనీసం ఆదివారం మధ్యాహ్నం కూడా శోభ చేతి కాఫీ తాగే ప్రాప్తంలేదు. ప్రభాకరం మనసు బాధతో మూల్గింది శోభ గుర్తుకు రాగానే అతని మనసు కొద్దిగా



వుత్సాహాన్ని పుంజుకుంది. ఆలోచన్లు శోభ చుట్టూ పరుగెత్త సాగాయి.

'శోభ తన భార్యకావడం నిజంగా తన అదృష్టమే. శోభను చేసుకున్న తరువాతే తనకి వుద్యోగం వచ్చింది.'

కాఫీ తన ప్రభావాన్ని చూపుతోంది శరీరమంతా వుడికిపోతోంది. గుడ్డలు చెమటతో పూర్తిగా తడిసిపోయేయి, అయినా అతని ఆలోచన్లు శోభ చుట్టూ పరిభ్రమించ సాగాయి.

"సార్ " పిలుపుతో ప్రభాకరం మనసు శోభ దగ్గర్నుంచీ వెనక్కి పరుగెత్తు కొచ్చింది

ఎదురుగా ఇందాకటి పాలీష్ కుర్రాడు నిలబడున్నాడు. చాచి చెంపదెబ్బ కొడదామనిపించింది ప్రభాకరంకి.

"సార్ పాలిస్ "

"ఇందాకే అక్కర్లేదని చెప్పలా-మళ్ళీ ఎందుకొచ్చావ్?"మండిపడ్డాడు ప్రభాకరం.

"ఒక్క పదేను పైస లిప్పించండి సాలు బూట్లు నద్దంలా సేత్తా బాబూ!" ప్రాధేయపడ్డాడు వాడు.

"బూట్లు బూట్లులా వుంటే చాలు. అద్దంలాగానూవద్దు, దువ్వెనలాగానూవద్దు వెళ్ళు" మారు మాట్లాడకుండా చేతిసంచీతో ముందుకు సాగిపోయేడు పాలీష్ కుఱ్ఱాడు

విసుగ్గా వాచీవంక చూసుకున్నాడు. మూడు దాటింది ఇంకా బస్సురాలేదు. మళ్ళీ ఎంక్వయిరీ ఆఫీస్‌వేపు బయల్దేరాడు.

"చుండూరు వెళ్లే బస్సెప్పుడు వస్తుందండీ?"

"ఈపాటికి రావల్సిందండి. బహుశా బస్సు మధ్యలో ఎక్కడో ట్రబులిచ్చి వుంటుంది."

"ఎంతసేపట్లో రావచ్చంటారు?"

"ఆ విషయం నాకెట్లా తెలుస్తుందండీ. ఈపాటి కెప్పుడో రావల్సింది, రాలేదు." అతని కంఠంలో కొద్దిగా విసుగు ధ్వనించింది

ఇంకా అక్కడ నిలబడ బుద్ధిపుట్టలేదు ప్రభాకరంకి బుక్‌స్టాల్‌లో వీక్లీ కొనితిరిగి నాలుగో నెంబరు ప్లాట్‌ఫారమ్ చేరుకున్నాడు

తనచోటు తనని నవ్వుతూ ఆహ్వానిస్తోంది. అక్కడే కూలబడి వీక్లీ తిరగెయ్యసాగాడు.

మరో పావుగంట గడచినా బస్సు రాలేదు. పుస్తకం చదవబుద్ధి పుట్టడంలేదు. పుస్తకం మూసేసి బస్‌స్టాండ్‌లో తిరుగుతున్న మనుషుల్ని చూస్తూ గడపసాగాడు.

నాలుగోనెంబరు ప్లాట్‌ఫారమ్ కెదురుగా ఎనిమిదో నెంబరు ప్లాట్‌ఫారమ్ మీదున్న మనుషుల్ని పైసలడుక్కుంటోంది ఓపిల్ల.

ఆ పిల్లకి షుమారు పదేళ్ళుంటై. ఒక చెయ్యి, ఒక కాలు అవిటి. ఎనిమిదో నెంబరు ప్లాట్‌ఫారమ్ మీద మనుషుల్ని యాచించడం అయిపోగానే నాలుగో ప్లాట్‌ఫారమ్‌కేసి బయల్దేరింది.

ఇంతలో ఓ ముసలమ్మ గబగబా ఆ పిల్ల దగ్గరికొచ్చింది ఆ పిల్ల తన చేతిలో నున్న చిల్లర్ని ముసలమ్మ చేతిలోపోసింది.

ఆ చిల్లర తీసుకుని ఎంత విసురుగా వచ్చిందో, అంత విసురుగానూ వెనుదిరిగింది ముసలమ్మ.

ప్రభాకరంకి తనెప్పుడో చదివిన కథ గుర్తుకొచ్చింది.

'ఒక విర్భాగ్యుడు తనకన్న కొడుకు, కూతురూ అనే మమకారాన్ని కూడా మరచి, చిన్నప్పుడే వాళ్ళకాళ్ళూ చేతులూ విరిచేస్తాడు. తరువాత పొట్టకూటికోసం వాళ్ళతో వ్యాపారాన్ని ప్రారంభిస్తాడు.'

ఆ పిల్ల నాల్గో నెంబరు ప్లాట్‌ఫారమ్ మీద యాచించడం ప్రారంభించింది. ప్రభాకరం చూపులు ముసలి దానికోసం పరుగెత్తాయి. ముసలమ్మ ఎనిమిదో నెంబరు ప్లాట్‌ఫారమ్ చివర మరో ముష్టిపిల్లతో మాట్లాడుతోంది.

"సార్! బూట్లకి పాలిస్ సేత్తాను, మీ ఇట్టంవచ్చినంత దయసేయించండి." జాలిగా దగ్గర కొచ్చాడు పాలిష్ కుర్రాడు.

తన ఆలోచనలకి అడ్డంవచ్చిన వాణ్ణి మూతిమీద తన్నాలనిపించింది ప్రభాకరంకి. కానీ, అది బస్‌స్టాండ్ అని వూరుకున్నాడు.

"నీకెన్నిసార్లుచెప్పాలి. వెళ్ళవతలికి."

"ఆ మాటనకండి సార్. ఇయాల తెల్లారిన తరువాత పచ్చిమంచినీల్లు కూడా తాగలేదు. మీరు బూట్లకి పాలిస్ సేయించుకుని కనీసం పదిపైసలన్నా ఇత్తే సింగిల్ టీ తాగుతా బాబూ" ఆశగా చూడసాగాడు ప్రభాకరంవేపు.

"నాకు పాలిషూ అక్కర్లేదు; పాడూ అక్కర్లేదు. వెళ్ళవతలికి. పో "ప్రభాకరంలోని విసుగు తారస్థాయి నందుకుంది.

'అస లివాళ బస్సొస్తుందో, రాదో



కనుక్కోవాలి! ఎంక్వయిరీ ఆఫీస్‌కేసి బయ ల్దేరాడు.'

"ఏ(వండీ! చుండూరు వెళ్ళే బస్సు ఇవాళ వస్తుందంటారా?"

"ఎన్నిసార్లు చెప్పనండి—పదిగంట లకి వెళ్ళిన బస్సు ఇంతవరకూ తిరిగి రాలేదు."

"అది రాకపోతే ఇక్కడ్నించీ మరో బస్సును పంపరా?"

"ఆ విషయాలేవీ నాకు తెలీవండి ప్లాట్ ఫారమ్ మీద ఇనస్పెక్టర్‌గారుంటారు. ఆయన్నడగండి." విసుగ్గా జవాబిచ్చి ఫోన్ మోగుతుంటే రిసీవర్ అందుకున్నాడు.

చెంపమీద కొట్టినట్లనిపించింది ప్రభాక రంకి. బస్‌రాలేదన్న విసుగు, చిరాకు, కోపం—పోయి, ఎంక్వయిరీ క్లర్క్ సమాధానానికి కోపం, ఉక్రోషం కలిగేయి.

'డర్టీనాన్సెన్స్' గొణుక్కున్నాడు.

'గంటలు గంటలు లేటు' తనలో తాను సణుక్కున్నాడు.

భారంగా అడుగు లేస్తూ పచార్లు చెయ్యటం మొదలెట్టాడు.

"సార్! పాలిస్ " మళ్ళీ ప్రత్యక్షం.

ప్రభాకరం వాడికేసి పురుగుని చూసి నట్లు చూసేడు. కళ్ళు చికిలించేడు, నొసలు చిట్లించేడు; మూతివంకర తిప్పేడు.

వాడి కళ్ళల్లో దైన్యం, వాడి మాటల్లో ప్రాధేయత; వాడి చూపుల్లో అభ్యర్థన వీటన్నిటికీ వెనగ్గా నీడలా వాడిని తరుము తున్న అవసరం, ఆ అవసరానికి మూల మైన ఆకలి!—వీటన్నిటికీ మించి ఎంక్వ యిరీ క్లర్క్ మాటల్లోని విసుగు, కోపం, చిరాకు, అసహ్యం రక్కున స్ఫురించేయి.

ఇవన్నీ గోచరించడంతో ప్రభాకరం విచలితుడైనాడు. ఏదో ఆలోచన మెరు పులా మెరిసింది.

జేబులోనుంచీ అర్థరూపాయి నాణెం తీసి వాడివేపు విసిరేడు. కళ్ళల్లో అనంత మైన మెరుపుతో వంగి దాన్ని తీసు కున్నాడు వాడు. అప్పటికప్పుడే ప్రభాకరం ముందుకి నడిచేడు.

"సార్! పాలీస్ సార్ ." వాడు అరుస్తున్నాడు.

"వద్దులే పోరా " అంటూ గబ గబా కాంటీన్‌వేపు అడుగులు వేయ సాగాడు ప్రభాకరం. 'తనకింక ఏ పాలీష్ అక్కర్లేదు. అవసరం మనిషిని వెన్ను పట్టి నడిపిస్తుంది. ఆత్రుతని పెంచుతుంది; వివేకాన్ని మరుగుపరుస్తుంది, తను ఇత రుల్ని చీదరించుకున్నట్లు మరొకరు తనను చీదరించుకున్నప్పుడే బుద్ధి వికసిస్తుంది.' వేదాంతిలా సన్నగా నవ్వుకున్నాడు ప్రభా కరం.

పిలుస్తున్నా పలక్కుండా వెళ్ళిపో తున్న ప్రభాకరాన్ని చూసి విస్తుపోయి నిలబడ్డాడు పాలిష్ కుర్రాడు. ★

# కథాకేళి

వాడపల్లి విజయభాస్కర రామారావు

గది తలుపులు బార్లా తెరచి వున్నాయి. రెపరెప లాడుతున్న కర్టెన్ లోంచి ఆశలు రేకెత్తించే నీడలు-

తెరచిన తలుపులు తట్టేటంత మూర్ఖుడినా? బ్రతకనేర్చిన వాడినని బజారున పడ్డాను

ఆమె పిలుపుని ఆసరా చేసుకొని తెర తొలగించి లోపల జొరబడ్డాను. లోపలి వెచ్చదనం నన్ను ఉన్మాదుణ్ణి చేసింది, ఆనందపుటంచులు చూపింది.

—మర చెంబునీళ్ళతో, మరోచేత్తో తాంబూలంతో సాక్షాత్కరించింది శ్రీమతి. 'ఇక నీ అల్లిక అంతేలే' - నేపధ్యగానం వినవచ్చింది.

"ఏమండీ" మళ్ళీ ప్రారంభించారూ కథాకేళి?"

ఆర్నెల్లేం ఖర్మ, పదహారేళ్ళయి సాహచర్యం చేస్తోందేమో ఆమెకీ పట్టేసింది నా శ్లేషాభిమానం. అయినా నాలోని నర్తకుని భంగిమల నవగాహన చేసేసుకుందేమోనని నా కెప్పుడూ అనుమానమే.

భుజంమీంచే చదివేసి ఉంటుంది నాలుగు వాక్యాలూ. మరచెంబు టేబిలు మీద పెడుతూనే వ్యాఖ్యానం_"అబ్బ! మీ టేస్ట్ డిసగస్టింగ్"

_కాన్వెంటులో చదువుకొని దరిమిలా మిషనరీల దగ్గర తర్ఫీదయిన శ్రీమతి విశేషణాల ఏర్పు కూర్పుల్లో భావశబలత పటిష్టంగా బహిర్గతం చేయగలదు.

"యూ సిల్లీ!"

_అలా అనిపించు కోవటం మా శ్రీమతికి ఎంత 'ఇద'ంటే మకరంద బిందు తుందిలమైన సురభిన పుష్ప మాలికతో చెక్కిలిపై స్పృశించినట్టు రియాక్ట్ అవుతుంది. మూడ్ ఎలానూ పోయింది కదా అని వేశానా సమాస్త్రం మరోసారి.

"యూ సిల్లీ_బార్లా తెరచిన తలుపుల్లోని తలపులు అసలు నీ ఊహ కందుతాయా?"

"అంతలోతుగా ఉంటాయా, ఆ తలపులు? చవకబారుగా, నాసియేటింగ్ గా వుండవూ?"

డిస్ గస్టింగ్, నాసియేటింగ్_నన్నిష్ వకాబ్యులరీ_తలపులుబోడులుకాని విచిత్ర వ్యక్తులకు సౌకుమార్యం వలకబోసే పద జాలం_ఓర్పు పోగొట్టుకొని భావప్రకటన

చెయ్యలేని అసమర్ధుణ్ణి. హి హేజ్ ఇన్ ఫినిట్ పేషన్స్. అతని ఓర్పుకి అవధులు లేవు. సాధారణంగా నేను పొందే అలిఖిత యోగ్యతా పత్రం. చిరునవ్వు పులుముకున్నాను చంటిపిల్లాడు పసుపు పులుముకున్నట్టు.

“చవకబారు లెక్కడో చక్కనీ! ఐదువందల ఒకటి బారు రేషనుకార్డుల మీద ఇస్తూంటే?”

అప్పటికప్పుడే వచ్చిన శ్లేషతో ఉక్కిరిబిక్కిరి అయ్యాను.

“నలుగురి పిల్లల తండ్రి అయ్యారు. ఇంకా ఏమిటండీ, ఈ ఇమేజరీ?”

“ప్రిసైజ్ లీ. అందుకే ఈ ఇమేజరీ! లేకపోతే తెల్ల వాయిల్ చీర చాలదూ. చెయ్యంత వెడల్పు జరీ కావాలా పాన్పు సేవకి?”

వెనక్కి ఒత్తిగిలిపోయింది శ్రీమతి, కాగల కార్యానికి అవరోధం-ట్యూబ్ లైటు ఆరిపోయింది. చీకటిలోంచి వెన్నెలను “ఊ” చెయ్యడానికి ప్రయత్నం. అలసటలో సుషుప్తి.

“ఆఫీసర్లకు వర్కింగ్ డే, హాలిడే ఒకటే! ఏమిట్రోయ్ ఇంత హడావడిగా వచ్చావ్?”

“కొంచెం సావధానంగా విను” ఇతివృత్తం చెప్పాను.

“అసలు అయిడియా ఎలా వుందంటావు? కథ టైమ్స్కీమ్లో చిన్న కుదుపు. స్వగతం కూడ క్షీరనీరన్యాయంగా .”

“నీస్వగత మెవడిక్కావాలోయ్?”

“స్వగతమే కాదు. నా గతంకూడ వుంది. అది తీసేస్తే ఇతివృత్తంలో వృత్తమే మిగులుతుంది. ఇంతిని ఎలానూ పోగొట్టుకున్నాను. వేలాది కథలు చదివే పాఠకులు ఓ చిన్ని ప్రయోగాన్ని మన్నించరూ?”

“ఆ మన్నిస్తారు ”

“అంటే!” శ్లేష నాకు బోధపడ లేదు, మూర్తి వివరించేవరకు.

“మన్ను ఇస్తారు ”

నాకు కోపం వచ్చింది. నేకొట్టిన కర్రే నా నెత్తిన తిరగేస్తున్నాడని.

“అఁ పాఠకులు మన్నిస్తేనేం, పత్రిక వాళ్ళ మనీ సంగతేమిటి?”

నేను జీవితంలో సాధించలేని వాటిల్లో ఒకటి - డబ్బుకోసం కథలు వ్రాస్తున్నానని మూర్తిగాడిని నమ్మించడం

మిత్రుని ఉపదేశం నాకంత సమ్మతం గాలేదు. వాడి కటువుతనం నాలోని మొండితనాన్ని రెచ్చగొట్టింది. వాడు చెప్పడమూ, నేను వినడమూనా!

ఈ తర్కమ్, ఈ స్వార్థమ్ నన్ను ఇంత మెటీరియల్ గా బాగు చేసింది. మెటీరియల్ గా నేనెంత పైకొచ్చినా నా మెటిల్ మాత్రం అలాగే ఉండి పోయింది. అందుకే ఈ తపన, ఆరాటం. ఈ నా స్వగతానికి వేడి నిట్టూర్పు విసుస్తే అదే పదివేలు.

* * *

సనత్ నగర్ నుండి కోఠీ దగ్గర వున్న హెడ్ ఆఫీసుకు వచ్చేసరికి పన్నెండయింది. చాలా కోపంగా విసుగ్గా వున్నవాడిలా తలుపు తెరుచుకొని లోపలికెళ్ళి బెల్ కొట్టాను. చల్లని

కూలర్‌లో నీళ్ళు తాగి నేద తేరి ఓ పావుగంట భుక్తాయాసం తీర్చుకొని మళ్ళా బ్రేక్ కొట్టాను. "స్టెనో కో బులావ్."

చీర కుచ్చెళ్లు సవరించుకుంటూ వచ్చింది గంజి పెట్టిన నేత చీర రెప రెపలే కాని గాజుల గలగలలు లేవు. లాక్టో కేలమిన్ బేస్ చెదిరి పై మేకప్ కదిలిపోయింది. కుసుమ సౌరభం లేని తలకొప్పు, డిస్‌గస్టింగ్ – పదహారేళ్ళ సాహచర్యం వారు వీరవక ఏం జరుగుతుంది!

"ప్లీజ్ టేక్ డౌన్. డియర్ మిస్టర్ పాండురంగారావ్ .. పూర్తి పేరు రాస్తే చదువుకొంటున్నవాడు కొద్దిగా ప్లీజ్ అవుతాడు. దిస్ హేస్ రిఫరెన్స్ టుయువర్ లెటర్ .. ఈ ఉత్తరానికి నేను మార్జిన్‌లో సూచించిన విధంగా సమాధానాలు కూర్పు చేసి టైపు చేసి సాయంకాలం నాలుగింటికి ఇవ్వండి ప్లీజ్ నన్ను మాత్రం డిస్టర్బ్ చెయ్యకండి. నేనిక్కడ లేననుకోండి"

తలెత్తి వింతగా చూడకుండానే లెటర్స్ బంచ్ పట్టుకొని వెళ్ళిపోయింది. ఏకాంతపు తెరల మధ్య నిర్భయంగా నిస్సంకోచంగా కాగితాల బొత్తి తీసి ఓ కాగితం నునుపు చేశాను



* * *

"పై ఊరు పైచోటు ఎలా వుంటావో! నాన్నగారికంతా హడావిడి, చదువు పూర్తయి రెండు నెలలు కాలేదు, ఇప్పుడేం మునిగిందనీ, ఈ ఉద్యోగానికి?" ఫుల్‌స్టాప్ లేకుండా కామాలతోనే సాధిస్తోంది అమ్మ నాన్నగారిని. నాన్నగారిని సాధించడమంటే అమ్మకెందుకో అంత కుతూహలం? వెయ్యేళ్ల సాహచర్యం నిత్య నూతన రకంగా వుండాలంటే ఈ సాధింపులు. ఎత్తిపొడుపులూ, ఇవేనేమో చిట్కాలు.

"నీచేతి తిండి పుట్టిన దగ్గరనుండి తింటున్నాడు. ఇంకెన్నాళ్ళు తింటాడు? రెక్కలొచ్చిన వాడు ఎప్పటికైనా గూడు వదలాల్సిందే" ఘాటుగా ప్రారంభించినా మార్దవంగా ముగించారు సమాధానం

అమ్మా, నాన్నగారు స్టేషన్‌కి వచ్చారనేమో రైలు మూడు గంటలు లేటు. ఫోన్ చేస్తే ఘంటలేటన్న పెద్దమనిషి స్టేషన్‌కొస్తే "ఇండెఫినెట్లీలేట్ సారీ!" చిక్కం వెనకాల ముఖానికి

ఫోన్ అడ్డు పెట్టేసుకున్నాడు. వెనుకకు వెళ్ళడం అమంగళం_వద్దంది అమ్మ. నేను ఆరోగ్యం విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు అమ్మ చెబుతూవుంటే ఉద్యోగంలో మెలకువలు చెబుతున్నారు నాన్నగారు.

"ట్రైనింగ్ మూడు నెలలూ వాడింట్లో వుండమని రాశాడు. అక్కడే వుండు ఆ తరువాత దగ్గరగా వెయ్యమని రాస్తాను."

నాకు ఇంటికి దూరంగా వుండటమంటే భయమనో, లేక వుండలేనంత అర్భకుడినని వాళ్ళ అనుమానం నన్ను జొత్తిగా కుర్రనాగమ్మలా చూసేవారు - ఆనర్స్ పూర్తిచేసినా.

—"ఏం ఓయ్ రామూ! టెలిగ్రాం అందదని భయమేమో మీ నాన్న రాత్రి ట్రంకాల్ చేశాడు నన్ను స్టేషన్‌కు రమ్మని" కార్లో చెప్పారు వేణుమాధవరావుగారు. నిద్ర మేల్కొని వీధుల్లోంచి సాగిపోయిన కారు వే. మా. గారింటి దగ్గర ఆగింది.

ఆదరాబాదరా లోపలికి కెళ్ళి "ఏమే ఒచ్చేశాడే రామూ అదేనే పిచ్చి మొద్దా మా సూరిగాడి కొడుకు" అన్నారు వే మా గారు "స్నానం చేస్తావోయ్?" నా వేపు తిరిగి అడిగారు.

చేత్తో కాఫీకప్పు పట్టుకొచ్చినావిడ, పెద్ద బొట్టు పెట్టుకొని కన్నాంబలా ఉంది.

"పిచ్చి మొద్దు". ఈవిడ పిచ్చి మొద్దా? దంపతుల మధ్య రాగబంధం, వాడిపోని పూలచెండు. అందులోని దారపుపోగులు అమ్మ సాధింపులు. నాన్నగారి వెక్కిరింతలూ_వే మా గారి తీపితిట్లు. 'కన్నాంబ' గారి_ఆమె పేరు నాటికీ నేటికీ నాకు తెలియదు - కసురుకోడాలు.

"అబ్బ ఉండండి, ఆ అబ్బాయి కాస్త ప్రయాణాయాసం తీర్చుకో నివ్వండి. ఏం బాబూ అమ్మా, నాన్నగారు అంతా కులాసా? మీ అమ్మని చూసి ఎన్నాళ్ళయిందో. పద్మాని క్షణం ఒదిలేది కాదు. పద్మా తెల్లారి లేస్తే మీ ఇంట్లోనే వుండేది" ఆ తరువాత తెలిసింది పద్మా అంటే పద్మ అని. మా నాన్నగారు, వే మా గారు బెజవాడలో కలిసి పనిచేసే వారట చిన్ననాటి స్నేహితులు చాలా కాలానికి కలిశారేమో ఒకే కుటుంబంలా వుండేవారట అమ్మ చెబుతూ వుంటుంది. నాది మరీ నిశితమైన జ్ఞాపకశక్తి కాదేమో ఆ 'పద్మా' ఎవరో నాకు జ్ఞాపకం వచ్చేలోగానే హాలుకి ఆనుకున్న గది కర్టెన్ వయ్యారంగా చేతిలో తొలగిస్తూ నైటు గౌనులో బయటికి వచ్చి నుంచొన్న పద్దెనిమిదేళ్ళ అమ్మాయ్ పద్మా అని వెంటనే తెలిసిపోయింది కొత్త మనిషి. అంతలోనే భీత హరిణేక్షిణలా రివ్వున ఆకుపచ్చ గుబుర్ల కర్టెన్ వెనకాలకు చెంగున గెంతేసింది.

వెళ్ళిన రోజే ప్రారంభమైంది నా ట్రైనింగ్. తొమ్మిదికి వే మా గారితో టేబిల్ మీల్ చేసి ఆయనతోపాటు కారెక్కి వెళ్ళేవాడిని లంచిటైముకి ఆయనతోనే కాస్త టిఫెన్, కాఫీ .. మూడున్నరకు వీలైతే ఓ కప్పు చాయ్ ఐదున్నరకి ఆయనతోపాటు ఇంటికిరాక. కంటిక రెప్పలా కాపాడారు నన్ను వేమా దంపతులు. 'కన్నాంబ' గారు నా

మీద అవ్యాజ్యానురాగం చూపేవారు.

నేను వారింట్లో దిగిన రెండు రోజులకు తెలిసింది పద్మ ఏదో క్రైస్తవ కళాశాలలో బి. ఏ. చదువుతోందని. సాహిత్యం స్పెషల్ గురించి మాత్రం తరువాత తెలిసింది యాదృచ్ఛికంగా. నేను ఆంగ్ల సారస్వతాన్ని అధ్యయనం చేసినట్టు వేమాగారికి తెలుసు. పద్మకి తెలుసునని నాకు తెలియదు. అనుకున్న దానికంటె వేగంగానే నన్ను చూసి చెంగు వెయ్యడం మానేసి భోజన ఫలహారాలు కలసి చెయ్యడం మొదలుకొని నేను చదివే పుస్తకం సోఫా వెనకాల నిలబడి చదివేంత చనువేర్పడింది పద్మకి. 'కన్నాంబ'గారు అలాంటి సీన్లు చూసి చటుక్కున వెనక్కి వెళ్ళిపోయే వారు. ఆమె ముఖాన్ని ప్రసన్నంగా ఉన్నట్టు ఊహించేవాడిని. అలా వెనకకు తిరిగి వెళ్ళిపోతున్నప్పుడు

ఓరోజు ఆదివారం అనుకుంటాను

—"ఏమండీ, ప్లాటుకీ స్టోరీకీ తేడా ఏమిటి?" తలెత్తి మీదకు చూశాను. ఆమె రాకను గమనించిన నాకు ఆమె గొంతు కొంత తత్తరపాటు కలుగ చేసింది. నేను కథలు రాస్తానని ఆమె కెలా తెలిసిపోయిందీ అని ఆశ్చర్యపోయాను. అప్పటికి నా కథ ఒక్కటీ అచ్చు కాలేదు—ఆ రోజే తెలిసింది ఆమె లిటరేచర్ స్పెషల్—సాహిత్య ప్రత్యేకి అని.

"పార్టు క్వొశ్చనా, ఎస్సేనా?" నిద్రలో కూడ మార్కులను బట్టి సమాధానం కూడ—అందుకే నన్ను బ్రతక నేర్చిన వాడంది సారీదునియా.

"సూక్ష్మంగానే సెలవియ్యండి."

—టేబిల్ మీద కూచుంది. నా కథ చూసేసుందేమో అని భయమేసింది. 'జస్ట్ మినిట్' అంటూ తలుపు దగ్గిర కెళ్ళాను. ఆమె టేబిల్ దిగి నా వంక రావడం చూసి గభాలున కాగితాలు



సొరుగులో పెట్టేశాను. కుర్చీమీద కూర్చొని కాస్త సేదదీరి ప్రారంభించాను లెక్చరెట్టి.

"రాజాగారు చనిపోయారు. రాణీగారు చనిపోయారు. ఇది ప్లాటు, అదే ఇతివృత్త మంటారు తెలుగులో. రాజుగారు చచ్చిపోయారు కాబట్టి రాణీగారు చచ్చిపోయారు. ఇది కథ. ఇతివృత్తంలో కనబడని కారణ కార్య సంబంధం కథా కథనంలో కనబడుతుంది. షార్టు ఆన్సర్‌కి ఇది చాలు. చూడు పద్మినీ! ఇదంతా నా స్వంతమనుకు నేవు! లిటరేచర్ స్పెషల్ వి స్వంతంగా ఏదీ వ్రాయకూడదు. కొటేషన్లకు ఇవతల ఉపయోగించే మాటలు తప్ప. కొన్ని కొన్ని సందర్భాల్లో మాత్రం ప్రఖ్యాత విమర్శకులలోంచి వాక్యాలు కొటేషన్లు లేకుండా స్వంతం చేసుకొని రాసేయడం మరొక మెలకువ కొండొకచో జాగ్రత్తకూడా అవసరం"

పదమూడు ఆదివారాలు. మధ్యలో మూడు శలవు దినాలు వెరశి పదహారూ పండుగ దినాల్లా గడచిపోయాయి. ట్రైనింగ్ అయిపోగానే మొదటి పోస్టింగ్ విశాఖపట్నం వెళ్ళవోయ్ అన్నారు వేమాగారు. చదువుకొన్న ఊరు. సరేనన్నాను

* * *

"క్రొత్త ప్రొబేషనరీ ఆఫీసర్‌కు ఇల్లు కావాలట" గదిలో వున్న నాకు బయట మాటలు వినబడ్డాయి.

"బ్రహ్మచారికి ఇల్లెందుకు లేవోయ్?" ఎవరో సందేహాన్ని వెలిబుచ్చారు.

"ఏం, ఇల్లు కావలసిన బ్రహ్మచారు లుండకూడదా?" ఒక కిన్నెర కంఠం. బయిటికివచ్చి చూడాలనుకున్నాను. కా ఆఫీసర్లు బయటపడకూడదు. కూల్ రిజర్వ్, మెంటైన్ కూల్ రిజర్వ్ మై బోయ్" సర్కస్‌లో ట్రైనింగ్ ఇచ్చిన గురువుగారు మాకిచ్చిన సలహా. మా చుట్టూ మేం కట్టుకున్న కంచుగోడ. రెండు రోజులైతే కాని కిన్నెరవీణ లాలిత్యం కంటపడలేదు_ ఆఫీసర్స్‌విూ గదులకు తిన్నగా తలెత్తకుండా వెళ్ళిపోండి ఆఫీసులో సిగరెట్లు కాల్చే గుమస్తా పుంగవులుంటారనేమో. మేం గీసుకున్న ఇదో గీత!

"ఆమె ఆఫీసుకు రాగానే నన్ను చూడమనండి వెరీ ఇంపార్టెంట్" గదిలోంచి వస్తూ సీటులో వున్న ఒకే ఒక గుమస్తాతో చెప్పాను. నిన్న ఆరున్నరై పోయింది. తలనొప్పి, నేరుగా మా రూమ్‌కి వెళ్ళి పడుకున్నాను. తెలివి వచ్చేసరికి పదిన్నరై పోయింది. గ్లాసుడు నీళ్లు తాగి పడుకున్నాను. కటికవుప వాసం, అలవాటులేని పని పొద్దున్నే హోటల్‌కి పంపి మొదటిసారిగా పూర్తి కారియర్ ఖాళీ చేసేశాను.

"ప్లీజ్ సిట్ డౌన్ మిస్ కాంచనమాలా" ఫైళ్ళలోంచి తల ఎత్తకుండ ఆర్డర్ చేసి మళ్ళీ స్వగతంలో మునిగిపోయాను. ఇది వేమాగారిచ్చిన శిక్షణలో మరో భాగం. నీకింద పనిచేస్తున్న వాళ్ళవైపు సూటిగా చూడకూ అని. మెంటల్‌గా ఎస్టిమేట్ చేస్తున్నాను. మల్లెల సౌరభం ప్లస్ కూటికురా స్మెల్. సన్నగా కంకణ నిక్వాణం, కుంకుమ సౌరభం అతి మైల్డ్‌గా, పేరు బాగుంది. ఇక చెప్పదలచుకున్నది చెప్పాలి. బీ

"చూడండి మిస్ కాంచనా" కుర్చీలో చేరబడుతూనే ఆమెవైపు చూడకుండానే ఆమె నావైపు చూసేటట్లు చేశాను. "నాకూ ఒక జీవితం ఉంది. ప్లీజ్. నా జీవితం నన్ను జీవించనివ్వండి నిన్న మీరు వేసిన స్టేట్మెంటులో రెండు ఎంట్రీలు తప్పు వేశారు మీరేమో ఐదింటికే ఇంటికి వెళ్ళి ఉంటారు. ఆ తప్పులు కనిపెట్టటానికి నాకు గంటన్నర పట్టింది. విపరీతమైన తలనొప్పితో ఇంటికి చేరాను. అభోజనం ఉన్నాను "–'గివ్ ఎ పెర్సనల్ టచ్' మరో ఆణిముత్యం. చీవాట్లు పెడుతున్నా చివరన ఓ వ్యక్తిగతమైన స్ట్రోక్.

"క్షమించండి నేను చెయ్యాలని చెయ్యలేదు పొరపాటు"

కంఠంలో ఒణుకు, వీణలో అపశృతి భరించలేకపోయాను.

"మీరు భలేవారే, పొరపాటు చెయ్యాలనుకొని చేస్తారా?"

కొంచెం ధైర్యం చిక్కబట్టుకుందేమో ఇంగ్లీషులోకి తెప్పరిల్లింది. "అయాం రియల్లీ సారీ, ఎక్స్క్యూజ్ మీ."

నేను ఊహించని పరిస్థితి ఆమె కళ్ళలో నీళ్ళు మొదటిసారిగా తలెత్తి చూశాను. తెల్లని మొఖం ఎఱ్ఱగా కంది పోయింది. ఆఫీసర్ వెనక్కి వెళ్ళి పోయాడు. ధీరలలితుడైన కావ్య నాయకుడు ముందుకు వచ్చాడు

"దానికి కంట తడి పెడతారా, డోన్ట్ బి సిల్లీ."

బ్రెస్ట్ పాకెట్లోని రుమాలు తీసి ఇచ్చాను.

తెలుగుతేమ, నల్లని వాలుజడ, తలలో మల్లెల సౌరభం తెర వెనుకగా కనుమరుగైంది.

మరుసటిరోజు.

"మీ కర్చీఫ్."

అదే సౌరభం. మళ్ళీ జడే కనపడింది. కర్చీఫ్లో ఏదో చిన్న పెరఫ్యూమ్. పేంటు జేబులో పెట్టుకున్నాను.

మరుసటిరోజు సాయంకాలం నేను నా రూమ్లో నుండి ఇవతల కొచ్చేసరికి కాంచనమాల ఇంకా సీటులోనే ఉంది.

"ఇంకా మీ పని పూర్తికాలేదా?"

లేచి నిలబడింది నాకు జాలివేసింది.

"మీ పని పూర్తిచేసుకోండి నేను లోపల వెయిట్ చేస్తూంటాను. కలిసి పోదాం."

వెనుతిరిగి పోయాను. స్వీట్ రిట్రీట్. కుర్చీలో రిలాక్సై సిగరెట్ ముట్టించాను పూర్తయిన సిగరెట్ ఆష్ట్రేలో పడేస్తూంటే తలుపు తట్టింది

తలపుల్లోంచి బయటపడ్డాను. కోటు కుర్చీకి తగిలించి ఇవతలకి ఒచ్చాను

"మీరు చాలా మంచివారండీ"

కోటు లేదు కదూ అనుకున్నాను. సముద్రంమీద కెరటాల తుంపరలు చల్లగా హాయిగా మీద పడుతున్నాయి.

"అలాగా, నాకు ఓ సందేహం?"

"చెప్పండి."

కన్నులు పెద్దవి చేసుకుని చూస్తోంది. తను చెప్పగలిగిన సందేహమేమిటా అన్నట్టు.

"బ్రహ్మచారికి ఇల్లు ఎందుకుండాలి."

తెల్లబోయింది.

## శత్రువును నాశనం చెయ్యడం!

**తన శత్రువులయెడ అతి ఉదారతను ప్రదర్శిస్తాడన్న విమర్శ అమెరికన్ ప్రెసిడెంట్ అబ్రహాంలింకన్‌పై వుండేది. శత్రువును సర్వనాశనం చెయ్యాలని సలహా ఇచ్చేవారు శ్రేయోభిలాషులు. దీనికి లింకన్ "శత్రువులను మిత్రులుగా చేసుకోవడం ద్వారా నేను నా 'శత్రువు'లను సర్వనాశనం చేస్తూనే ఉన్నానుకదా" అనే వారట!**

"సారీ మీరు వింటున్నారనుకోలేదు."

"ఇంతకీ మీరు నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు."

ముకుళితమందారం తలను వాల్చేసింది.

"మీ రెక్కడ ఉంటున్నారు?"

"చెంగల్రావు పేట."

"నేను అఫిషియల్ కాలనీలో వుంటున్నాను. బ్రహ్మచారికి ఇల్లు కావాలన్నారుగా. మా ఇంటికి రండి."

బెరుకులేకుండా వచ్చింది. నేనూ వెళ్ళాను వాళ్ళ యింటికి. ఇద్దరం ఆదివారాలు కలుసుకునే వాళ్ళం. ఓ వారం చెప్పింది రాబోయే ఆదివారం తన పుట్టిన రోజని, సాయంకాలం వాళ్ళింటికి రమ్మని. వాళ్ళన్నయ్య దగ్గరకి వెళ్ళారట వాళ్ళ అమ్మ నాన్న.

—పుట్టినరోజు ముద్దు ముచ్చట తీర్చవలసింది నేనే అని అర్థం చేసుకున్నాను. మైసూరు జార్జెట్ లేత నీలిరంగు చీర, బ్లౌజు పీసు తీసుకున్నాను. ఆదివారం సాయంకాలంకోసం ఎందుకింత నిరీక్షణ? మరీ ఎడోలిసెంట్‌లాగ అంగలారుస్తున్నానేమో అనిపించింది.

పిండి ఆరబోసినట్టు వెన్నెల.

గది తలుపులు బార్లా తెరచివున్నాయి. రెపరెపలాడుతున్న కర్టెన్‌లోంచి ట్యూబ్ లైట్ అందమైన నీడలు.

—తెరచినతలుపులుతట్టేమూర్ఖుడినా, ఆమె పిలుపును ఆసరా చేసుకొని తెర తొలగించి లోపల జొరబడ్డాను. లోపలి వెచ్చదనం నన్ను ఉన్మాదుణ్ణి చేసింది. ఆనందపుటంచులు చూపింది.

—కలలో నడుస్తున్నట్టుగా రాత్రి పదయ్యాక నా రూమ్‌కి చేరుకున్నాను. నాఅతి కొత్త జ్ఞాపకాలు ..నలిగిపోయిన జార్జెట్ చీర. వాడిపోయి క్రింద పడిపోయిన మల్లెచెండు

—నా మొత్తం జీవితంలో అతితీపి మూడు నెలలు గడచిపోయాయి. పతాక సన్నివేశం మిత్రుడు మూర్తి కంట పడింది. వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు.

"ఏమిట్రా అది? ఒడిలోతలా? కర్టెన్ వేసుకొంటే సరి అనుకున్నావా? తలుపులు వేసుకోవాలన్న జ్ఞానంలేదూ?"

—ఆమె ఒడిలో నా తల చూశాడో నా ఒడిలో ఆమె తల చూశాడో అడిగే ధైర్యం లేకపోయింది.

గిట్టనివాళ్ళేదో అనుకుంటున్నారంది కాంచనమాల. నేను చెయ్యగలిగిందేమీ లేదనుకున్న మూర్ఖుడిని. హెడ్ ఆఫీసు నుండి వచ్చింది నాకు పిలుపు ఇంట్లో మామూలుగానే మాట్లాడేరు వే. మా గారి ఆఫీసులో ఆయన గదిలో అయింది అసలు ఇంటర్వ్యూ.

“చంపకమాలను ప్రేమిస్తున్నావా?”

—పేరు కరెక్ట్ చెయ్యడానికి ధైర్యం చాలలేదు తడబడుతూ మరో ప్రశ్న వేశాను “ఆమెతో నేనామాట అనలేదే?”

“భేష్ నా శిక్షణ ఫలవంతమైంది అంటే ఆమెతో జస్ట్ తిరుగుతున్నావన్న మాట ”

“అబద్ధం, డౌన్ రైట్ లై నేను, ఆమె ఒక్కరోజు బీచికి కలసివెళ్ళడం తప్ప ఎప్పుడూ ఇద్దరం బయట కలవలేదే?”

“గుడ్. నీకు హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వస్తాయి చంపకమాలకు రెండేళ్ళవరకు శెలవు దొరకదు. యూ కెన్ గో”

—తిరిగి వచ్చిన తరువాత అర్ధమయింది, అసలు విషయం. ఏజెంట్ హెడ్ ఆఫీసులో వేమాగారికి, వేమాగారు మా నాన్నగారికి, మానాన్నగారు వేమాగారికి శరపరంపరగా ఉత్తరాలు పంపుకున్నారని. కాని మాలకి ఏమని చెప్పను? ఆమెకు నా ట్రాన్స్‌ఫర్ సంగతి ఆఫీసులోనే తెలిసింది. బ్రతక నేర్చినవాడు అన్నారు నన్నందరూ.

* * *

“మే ఐ కమిన్ సర్!”



"కమిన్. సిట్ డౌన్ మాలా!"

—పరాకుగా ఆలోచిస్తూ అనేశాను. టైప్ చేసిన ఉత్తరాలు టేబిల్ మీద పెట్టింది స్టెనో చెదిరిన ముంగురులు, నుదుట చిరుచెమట రాస్తున్న కాగితాలు ఫైలులో పెట్టి సొరుగులో భద్రపరచి తల పైకెత్తాను. ఆశ్చర్యంగా చూస్తోంది స్టెనో.

"సారీ, అయామ్ గెటింగ్ ఓల్డ్."

—ఆమె తెచ్చిపెట్టిన ఉత్తరం ఒక్కొక్కటీ ఏగానిగా చూసి సంతకం పెడుతున్నాను. జేబులోంచి ఓ నంబర్ తీసిచ్చి "ప్లీజ్. రింగ్ అప్ దిస్ నెంబర్ ఎండ్ ఆస్క్ ఫర్ మూర్తి" సంతకాలు బరబరా గీకేస్తున్నాను.

"మూర్తి ఆన్ ది లైన్" ఫోన్ అందించింది స్టెనో.

"ఒరేయ్ మూర్తి యూ కెన్ గో . నాన్సెన్స్ నా పనులు చేయడానికా ఆమె ఇక్కడవుంది — అలా అయితే నేరుగా సాయంకాలం నాతోపాటే తీసుకెళ్ళమంటావా ఇంటికి ఆల్ మోస్ట్ రాసేశాను, రణచిత్తు, పికప్ చేస్తాను రెడీగావుండు."

—"నువ్వు పచ్చి మిసోజినిస్ట్ (స్త్రీ ద్వేషి)విరా!"

కాగితాలు నాకిచ్చేశాడు విసురుగా.

"కాదు. ఐ లైక్ ది మెన్. వాళ్ళు . వాళ్ళ తలల్లో పెట్టుకుంటారే పూలచెండ్లు అలాంటివారు. ఏ స్త్రీ ఐనా ఒకేపూల చెండు రెండురాత్రులు ధరించటం చూశావా! అంతగా కాకపోయినా సాధ్యమైనంత తొందరగా మనం మార్చేస్తూండాలి. ఉయ్ హావ్ టు. మనం పిచ్చివాళ్ళం కాకుండా ఉండాలంటే...ఆశ్చర్యపోతావేం ఇదీ నా ప్రతీకారం ..మా నాన్న నేను లిటరేచర్ ఆనర్స్ చదివితే ఆ వే. మా. గారిని పట్టుకొని నాకు ఉద్యోగం వేయించి వారి మధ్యన స్నేహబంధాన్ని శాశ్వతంగా పదిలపరచుకోడానికి పద్మని నాకిచ్చి పెళ్ళిచేశారు. .బ్రతక నేర్చిన వాడివని నన్ను అన్నారు పదిమందీ .. కాంచనమాలకూడా అలాగే అనుకుని ఉంటుంది. కాని నేను ఆమెతోనే రోజూ కాపురం చేస్తున్నాను. సహస్ర భంగిమలలో నా కళ్ళముందు సాక్షాత్కరించినది ఆమే. నేను ఏకపత్నీ వ్రతుణ్ణి!" గదిలోకి వచ్చిన శ్రీమతిని చూసి ఆఖరివాక్యం గట్టిగా అన్నాను.

—"ఏకపత్నీవ్రతుణ్ణని చెప్పుకుంటున్నారా అతనితో మీ కథలు చదివే వాళ్ళందరికీ తెలిసిపోతుంది మీరు మరో స్త్రీవైపు చూడరని!"

ఆడవాళ్ళ ప్రాక్టికల్ మైండెడ్ నెస్ బొత్తిగా వచనకవితలా ఎబ్బెట్టుగా ఉంటుంది నిజం చెప్పుకోలేని సమరుణి. ధణ బ్రతక నేర్చినవాడిని. గ్రీష్మతాపంలో చెమట పట్టినా కొంత చల్లగా ఉంటుంది; కాని కన్నీరు, దాని విషాదం మనిషిని నిలువెల్లాదహించే కర్కోటకాగ్నిశిఖలు. మస్తిష్కంలో నిరంతరం మెదిలే మెరపు తీగను కాగితంమీద ప్రతిష్టించి మనసులో నింపుకున్నాను

—ఆర్పుతున్న స్విచ్ శబ్దంలో నా నిట్టూర్పు కలసిపోయింది. ★

ప్రయోజనాత్మకమైన మంచిశీర్షిక!



# నేనొక మంచి వెధవను!

నేను నా స్నేహితురాలు బస్‌స్టాండులో నుంచున్నాం. బస్‌స్టాండులో నుంచోవటం మాకిది కొత్తకాదు ఆరు నెల్లనుండీ ఇలా నుంచుంటూనే వున్నాం. ఆలస్యంగా వచ్చే బస్సును తిట్టుకుంటూనే ఎక్కుతూ వుంటాం. బస్‌స్టాండులో కాళ్లు పీక్కుపోయేలా నుంచోవటం ఒక ఎత్తు. బస్ ఎక్కాక బస్సులో నుంచోవడం ఒక ఎత్తు. ఈ బస్సు కిక్కిరిసి వుంది కదా అని ఇంకో బస్సు వచ్చేదాకా ఆగి ఎక్కడానికి కాలేజీకి టైమ్ అయిపోతుందని భయము తర్వాత వచ్చే బస్ మాత్రం ఖాళీగా ఉంటుందనే నమ్మకమూ లేదు. అందుకే ఏ బస్ ముందువస్తే దాంట్లోనే ఎక్కేస్తాం సీటు దొరుకుతుందేమోనని ఆశగా వెతుకుతాం. కానీ సీటుమాత్రం దొరకదు. 'స్త్రీలు మాత్రమే' అని వ్రాసివున్న సీట్లలో కూడ మగమహారాజులే ఆక్రమించేసే ఉంటారు అంతకుముందు కూర్చుంటే కూర్చున్నారు కనీసం ఆడవాళ్లు వచ్చాకనైనా సీటు ఇవ్వవచ్చుకదా! ఎర్రగా వున్న అంతంత పెద్ద అక్షరాలు వాళ్ళకి కనబడలేదా? పోనీండి ఆ సంగతి వదిలేద్దాం. మా చేతినిండా బుక్స్, పొడుగాటి రికార్డుబుక్స్, డిసెక్షన్ బాక్స్, మేం మధ్యాహ్నం తినడానికి తీసికెళ్లే టిఫిన్ ఇన్ని పట్టుకోవటమే కాకుండా మా పైటలు జారిపోకుండా సర్దుకుంటూ మేం పడిపోకుండా దేనినైనా పట్టుకుని నుంచున్న మమ్మల్ని చూస్తూవుంటే వాళ్ళకి జాలి పుట్టదా? పైగా వినోదంలా మమ్మల్నే చూస్తూ కూర్చుంటారు. మాకు ఒకోకసారి 'స్త్రీలు మాత్రమే' అని వ్రాసిన సీట్లలో కూర్చున్న వారి చెవి పట్టి లేపి ఈ సీట్లు స్త్రీలకు కాని మీకు కాదు అని చెప్పి ఆ సీట్లలో మేం కూర్చుని మాతోపాటు నుంచున్న స్త్రీలను కూర్చోబెట్టాలి అనిపిస్తుంది కానీ మేం ఆ పని చేయలేకపోయాం.

నుంచోవటమే ఒక బాధ అనుకుంటే దానికితోడు సిగరెట్ వాసన. మనం చూడకపోయినా ఎదురుగా కన్పిస్తుంది

'పొగ త్రాగరాదు' అనే బోర్డు చూస్తే మళ్ళీ అందరూ విద్యావంతులు లాగానే ఉన్నారు. చదువురాని వాళ్ళకైతే చెప్పొచ్చుకానీ చదువు వచ్చిన వాళ్ళకి ఏంచెప్పాలి. మీరు నమ్ముతారో నమ్మరో గానీ ఈ ఆర్నెలలో ఒకసారికూడ బస్ సీటులో కూర్చోలేదు. సిగరెట్ వాసన చూడకుండా బస్సు దిగలేదు.

—సమ్మెట ఆండాళు, కరీంనగర్.

అబ్బబ్బా! అంతా హడావిడే ఫస్టు వస్తే చాలు అన్నీ హడావిడిగా జరగాల్సిందేకదా వెచ్చాలు తేవాలి నూనెలు తేవాలి రేషన్ తేవాలి. అన్నీ తొందరే గొణుక్కుంటూ కిరాణాషాపు లోకి అడుగు పెట్టాను

ఇక్కడా జనం. ఇంతమందికీ ఫస్టు నాడే కావల్సి వచ్చాయా సరుకులు. రెండ్రోజులు పోయాకో, రెండురోజులు ముందో తెచ్చుకోకూడదు; అనుకున్నాను అఫ్‌కోర్సు నేను వచ్చింది ఫస్టు సాయంత్రమే అన్న సంగతి అప్పుడు మర్చిపోయా ననుకోండి.

ఆ చిట్టా కాస్త ఇటు ఇవ్వండి సార్. అవతల చాలామంది ఉన్నారు

ఆ తొందర. నీకూ తొందరేనా! అవును మరి అవతల గిరాకీ లేదూ! ఎన్ని లాభాలు సంపాదిస్తున్నాడో వాడి బొజ్జ చూస్తే తెలియటంలా తినడం మరిగారు. అనుకొంటూ కావలసిన సరుకుల లిస్టు ఇచ్చాను

పావుగంట తరువాత, ఇవిగోండిసార్ మీ సరుకులు వాటి ధర సరుకుల పక్కనే వేసాను. మొత్తం ఎనభై రూపాయలు అన్నాడు వాడు

లిస్టు అందుకొని రేట్లు ఒకసారి పరిశీలించాను. మొత్తం ఒకసారి కూడాలి. ఎందుకయినా మంచిది.

మొత్తం ఒకసారి కూడాను.

అరె. ఇదేమిటి! వీడు తప్పుకూడాడు. వీడి లెక్క ప్రకారం ఐదు రూపాయలు నాకు తక్కువపడింది. పిలిచి ఇచ్చేద్దామా ఆ ఎందుకు. ఈ ఐదు రూపాయలలో వాడికి మునిగేదేమిటిలే. అనుకొంటూ వాడికి ఎనభై రూపాయలు ఇచ్చేసి త్వరగా బయటపడ్డాను

ఇంటికి వస్తుంటే దారిలో హరికథ జరుగుతున్నట్లుంది. హరిదాసుగారుగొంతు చించుకొంటున్నారు నాయనలారా తెలిసి నేరం చేయకూడదు అది దొంగ తనంతో సమానమే. దొంగతనం మహా పాపం. అలా చేస్తే నరకానికి వెళతారు.

వద్దనుకున్నా నా చెవిన పడ్డాయి

నాకు వెంటనే కిరాణాకొట్టు జ్ఞాపకం వచ్చింది. ఏమిటి నేను దొంగనా? మరి. తెలిసికూడా నీవు వాడికి అయిదు రూపాయలు తక్కువ ఇచ్చావే. అది తప్పు కాదా. నా మనసు నన్ను హెచ్చరించింది తిట్టింది. నరకానికి వెళతానన్నే భయంలేదు కాని, ఇప్పుడు నేను ఈ పని చేసినందుకు నా మానవత్వం నన్ను పశ్చాత్తాపుణ్ణి చేసింది. ఇక ఇలాంటి పని చేయకూడదని ఒట్టుపెట్టుకున్నాను.

మరి నన్ను మంచివెధవగా అంగీకరిస్తారా?

కె. యస్. నాగేశ్వరరావు,
సికింద్రాబాదు.

'నేనొక మంచి వెధవను' శీర్షిక పాఠకులనుంచి అమితమైన ప్రోత్సాహాన్ని కట్టుకొంది. అయితే శీర్షిక పేరు మార్చవలసిందిగా ఎంతో మంది సూచిస్తూ వచ్చారు. ఈ శీర్షిక పాఠకులలో 'ఆత్మ విమర్శ' రేకెత్తించేదిగా వుండాలన్న మా ప్రయత్నం సఫలీకృతమైనందుకు గుర్తుగా మాకొచ్చిన, ఇప్పటికీ వస్తున్న పాఠకుల వ్యాసాలే గురుతు. 'మంచి చేయడమేగాదు-చెడును ఖండించవలసిన బాధ్యతకూడా మనపై నున్నది' అన్నదే యీ శీర్షికద్వారా పాఠకులు ఎందరో వెలిబుచ్చిన భావం.

'క్యూ' పద్ధతి ఉన్నప్పుడు అది పాటించక పోవడం, అవసరానికి బస్సులో రైళ్ళలో కండక్టరుకు కొంచెం డబ్బు ఎక్కువ ముట్ట చెప్పడం, బస్సులో కిటికీలోంచి జేబురుమాలో, తువ్వాలో వేసి టికెట్ కొనకముందేసీటు 'రిజర్వ్' చేసుకోవడం, రోడ్డుమీది అరటి తొక్కనో, గాజు పెంకునో చూసీ చూడనట్లు పోవడం, రేషన్ కార్డులపై ఉన్నవారికంటే ఎక్కువ మంది సభ్యులను నమోదు చేయించుకోవడం, సినిమా టిక్కెట్లు బ్లాకులో కొనడం, ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించబడ్డ ఉద్యోగులు కొందరు 'దొంగ మందుల బిల్లులు' సృష్టించి డబ్బు క్లెమ్ చేసుకోవడం, సిటీ బస్సులో, ఖాళీలున్నప్పటికీ ప్రక్కన చువ్వలు పట్టుకొని వేలాడటం, కాలేజీకి రాని మిత్రుని పేరిట హాజరు పలకడం, నాలుగు గోజుల గ్రాసానికో, ఒక్కరోజు మత్తుకో ప్రలోభపడి ఓట్లను అమ్ముకోవడం...

ఇలా ఎన్నో పొరపాట్లు ఎత్తిచూపుతూ రాసిన వ్యాసాలు వచ్చాయి మా కార్యాలయానికి. వీటిలో దాదాపు అన్నీ అందరికీ తెలిసినవే! జ్యోతిలోని 'నేనొక మంచి వెధవను' శీర్షికకు ప్రచురణకోసం వ్యాసం పంపడమేగాక-పంపినవారందరూ, కనీసం వారిలో కొంతమందైనా ఈ శీర్షిక ప్రభావాన, వారు వ్యక్తపరచిన భావాల కనుగుణంగా నడుచుకోగలరని మా నమ్మకం. ఈ శీర్షికను యీ సంచికతో నిలిపివేస్తున్నాము త్వరలోనే పాఠకులకోసం మరో శీర్షిక ప్రారంభిస్తాము. సమాజంలో అవినీతి ఊహ కందని మేరకు ఎదిగిపోయి వున్నా, ప్రాణంలేని సమాజంలోని అవినీతిని నిర్మూలించేందుకు ప్రాణమున్న వ్యక్తులు ఎవరికివారు ఆత్మవిమర్శ చేసుకొంటూ కృషి చేస్తే ఆ కార్యం సాధించేందుకు నిజానికి జయప్రకాష్‌నారాయణ్ లాంటి వ్యక్తుల సారధ్యంలో అంత పెద్ద ఎత్తున ఉద్యమాలు జరపవలసిన అవసరమే ఉండదు మరి. ఏమంటారు?

—ఎడిటర్.



రామారావ్

# కర్ఫ్యూరాత్రి

స్పీకర్ అమర్చిన పోలీస్‌కారులోంచి ప్రజలకి చెప్తున్నారు పోలీస్ అధికారులు కర్ఫ్యూ విధించినట్లుగా. సాయంత్రం అరున్నరనుంచి, మర్నాడు వుదయం అరున్నర దాకా ఎవరూ బయటకి రాకూడదు.

బాబులు బద్ధకం పోగొట్టుకోడానికి జేబులోంచి బీడీతీసి వెలిగించాడు. కర్ఫ్యూకి సిద్ధమవడానికి హడావిడిగా తిరుగుతున్న జనాన్ని చూశాడు, బీడీ కాలిపోయేదాకా ఓ అయిదు నిముషాలసేపు.

బాబులుకి కర్ఫ్యూ అంటే భయంలేదు. తుపాకులు ధరించి తిరిగే సి. ఆర్. పి అంటే అంతకన్నా భయంలేదు. ఓ విధమయిన వుత్సాహం, సరదా ఆ కర్ఫ్యూ రాత్రి పోలీసులని ముప్పతిప్పలు పెట్టచ్చు

జనవరి ఇంకా రాలేదు కాబట్టి చలి ఇంకా తగ్గు ముఖం పట్టలేదు. ఏడున్నర అయేటప్పటికి వూరులోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా అయిపోయాయి. కరెంట్ లేదు, చిక్కటి చీకటి అంతా. అప్పుడప్పుడు తిరిగే పోలీస్ వేన్స్ హెడ్‌లైట్స్ తప్ప అంతా చీకటి

ఎనిమిదికల్లా బాబులు నెహ్రూ పనిచేసే కార్ఖానా చేరుకున్నాడు నెహ్రూ అప్పటికే ఎదురు చూస్తున్నాడు బాబులు కోసం.

"ఆలస్యంగా వచ్చావా" అడిగాడు



మల్లాది వెంకట
కృష్ణమూర్తి

బాబులు నెహ్రూవంక కొద్దిగా జాలిగా చూసాడు బాబులుకి ఎందుకో నెహ్రూ అంటే ఇష్టం.

ఇష్టంకన్నా అది ఎక్కువ భాగం జాలే.

సన్నగా పీలగా వుంటాడు నెహ్రూ. నవ్వి నపుడు అందంగా కనపడ్డా, నెహ్రూ ముఖంలో విచారం కనిపిస్తూంటుంది ఎక్కువ. అన్నిటికీమించి నెహ్రూ ఎంతో మంచివాడు

బాబులుకి తెలుసు నెహ్రూలో తనలో లేని మంచితనం, అమాయకత్వం వున్నాయని. బ్రతక నేర్వనివాడు అనే అభిప్రాయం కూడా వుంది. అప్పుడప్పుడు అయిదు, పది అప్పు యిస్తూంటాడు కూడా. తిరిగి అడగడానికి మొహమాటపడి ఇస్తే

బాబులు, నోట్లో కొత్త బీడీతో.

"లేదు. ఇవాళ ఇంటికి వెళ్ళటం లేదు బాబులు" చెప్పాడు నెహ్రూ.

"ఏం?"

"కర్ఫ్యూ."

"అయితే ఏం? నేను తీసుకు వెళ్తాను. నా వెంట నిర్భయంగా రండి సార్."

"వద్దు బాబులు నువ్వు కూడా తెల్లారే దాకా ఇక్కడే వుండి పో."

పగలబడి నవ్వాడు బాబులు.

"బలే వారే మీరు. అయితే నిజంగా రారా?"

"వూహూ. రాత్రి షిఫ్ట్‌లో కూడా పని చేస్తాను. జనరేటర్ వుంది. రాత్రి షిఫ్ట్ వాళ్ళు లేరు"

తీసుకుంటాడు. లేకపోతే లేదు

నెహ్రూకోసం ఏం చెయ్యడానికైనా సిద్ధమే బాబులు అందుకే రోజూ నెహ్రూకి తోడుగా ఇంటిదాకా వస్తున్నాడు. ఎలా గోలా వీలుచేసుకుని

''ఇంకా షిఫ్ట్‌కి టైం వుంది టీ తాగుదాం వస్తావా?'' ఆహ్వానించాడు నెహ్రూ బాబులుని

ఇద్దరూ ఆ కార్ఖాన తాలూకు చిన్న క్యాంటీన్‌లోకి వెళ్ళారు. నెహ్రూ అన్నాడు టీ తాగుతూ

"ఇందాకేం జరిగిందో తెలుసా బాబులూ?''

'ఏం జరిగింది?'' అడిగాడు బాబులు ఆసక్తిగా. నెహ్రూ చాలా తక్కువ మాట్లాడతాడు మాట్లాడితే మాత్రం, క్లుప్తంగా చెప్పేది ముగించేస్తాడు. మాటలను పొదుపుగా వాడి జాగ్రత్తగా వింటే కాని తన మొద్దు బుర్రకి ఎక్కదని అనుభవం మీద గ్రహించాడు బాబులు

'నా ప్రక్కన పనిచేసే ఫోర్‌మేన్ భార్యని ఎవరితోనో చూసి, చావ చితక కొట్టాడు ఇద్దరినీ''

''ఎవరు ఆ ఫోర్‌మేనా?'' అర్థం కాక అడిగాడు బాబులు

' అవును ''

'మంచి పనిచేసాడు. పొడి చెయ్యాల్సింది ఇద్దరినీ అసలు.''

'ఛ. తప్పుకదూ ''

''తప్పుచేసిన వాళ్ళని అలాచేస్తే కాని తృప్తివుండదు ఏ మగాడికయినా. పొడిచి పొడిచి చంపాలి.''

''బాబులు. నీకు చెడ్డతనం అలవాటు.''

బాబులు ఖాళీ గాజుగ్లాసు కింద పెట్టి అన్నాడు

''ధైర్యంలేని మగాళ్ళయితే నాలాంటి వాడికి సందో. రెండొందలో పారేసి పని చేయించుకుంటారు సూర్యారావు పేటలో ఆ మధ్య గొడవయి నన్ను పోలీసులుపట్టు కెళ్ళింది అందుకేగా ''

''మనిషిని మనిషి చంపటం తప్పు'' అందామనుకున్నాడు నెహ్రూ. కాని పెదవి దాట నివ్వలేదు తన అభిప్రాయాన్ని. మౌనంగా వుండి పోయాడు అలవాటుగా

''ఒకవేళ మీకే అలా అయితే ఏం చేస్తారు?''

షిఫ్ట్ మరో అయిదు నిముషాలలో మొదలవుతున్నట్లుగా గంట కొట్టారు కార్ఖానాలో అంటే వెళ్ళి మెషీన్స్ శుభ్రం చేసుకోవాలి టూల్స్ అన్నీ సర్దుకోవాలి. తయారవాలి మళ్ళీ బెల్ వినపడే లోపల.

నెహ్రూ టీకి డబ్బులు చెల్లించాడు. తన ప్రశ్న నెహ్రూకి వినపడ లేదను కున్నాడు బాబులు వెళ్తూ చెప్పాడునెహ్రూ.

"నా భార్య చాలా మంచిది ''

చిన్నగా నవ్వాడు బాబులు.

''నా భార్యకూడా నాకళ్ళ పడనంత కాలం మంచిదే అనుకున్నాను''

చిరునవ్వు నవ్వాడు నెహ్రూ

''రాత్రి జాగ్రత్త బాబులు. తిరక్క..''

''రేపు వుదయం వస్తాను ఆరున్నరకి.''

''రాగలిగితేనే రా.'

'మాట వరసకి అన్నాను కాని. మీ ఆవిడ మంచిదే'' అన్నాడు బాబులు తను

ఇందాక తప్పుగా మాట్లాడానని గ్రహించి.

"అవును. నా విషయంలో అలా జరగదు. జరిగితే కనకదుర్గ కొండమీద, దేవి ఆలయం ప్రక్కనే కోనేరు వుంది. కృష్ణా నది వుంది. వూరినిండా కాలవలున్నాయి."

"ఆత్మహత్యా?" ఆశ్చర్యపడ్డాడు బాబులు.

"అవును."

"అంత ఖర్మేం పట్టింది? విడాకు "

"దేముడు కొంతమందికి ధైర్యంగా బ్రతక గలిగే శక్తి యివ్వలేదు బాబులు. కొన్ని కొన్ని సంఘటనలకి వాళ్ళు తలకిందు లవుతారు కాని తట్టుకోలేరు."

"అంతా మీ పిచ్చి."

"మెషిన్ ఎదురు చూస్తూంటుంది. జాగ్రత్తగా వెళ్ళు బాబులు." మరోసారి హెచ్చరించి కార్ఖానాలోకి వెళ్ళిపోయాడు నెహ్రూ.

బాబులు గేటుదాటుతూండగా రెండో గంట వినపడింది. ఎనిమిది గంటలు పని చేసి మరో ఎనిమిది గంటలు నెహ్రూ ఎలా పనిచేయగలడో అర్థం కాలేదు బాబులుకి.

బహుశ ఆరునెలల క్రితం పుట్టిన తన కొడుకుకు బంగారపు టుంగరం చేయించే ప్రయత్నంలో వుండి వుంటాడనుకున్నాడు బాబులు. నెహ్రూ ఆరునెలల కొడుకును గుర్తు తెచ్చుకుని చిన్నగా నిట్టూర్చాడు.

తనకా ప్రాప్తంలేదు.

బాబులు, మరి కొందరు బాబులులాంటి వాళ్ళు మాత్రం తిరుగుతున్నారు విజయవాడ వీధుల్లో రహస్యంగా. చీకట్లో కలిసి పోయిన పీడల్లాగ. చేతిలో సూదులతో నింపిన సోడా బుడ్లు, కర్రలు వాళ్ల ఆయుధాలు. రోడ్ల మధ్య అక్కడక్కడ అడ్డంగా పడవేసిన దుంగలు, తారు డ్రమ్ములు



మొదలయినవి పి. ఆర్. పి. వేన్స్‌కి అడ్డంకులు.

బాబులు కురుక్షేత్రంలో అర్జునుడిలా, పద్మవ్యూహంలోని అభిమన్యుడిలా జాగ్రత్తగా సందులు దాటుతున్నాడు చకచకా. బొడ్లో నాలుగయిదు సోడా కాయలు వున్నాయి. చేతిలో పచ్చి మొద్దుకర్రవుంది.

ఎలాగయినా ఓ పోలీస్ వేన్‌నయినా తగలబెట్టాలనే పట్టుదలతో వున్నాడు బాబులు, బాబులులో ప్రాణంమీద తీపి కాని, ఏమయినా అవుతుందనే భయం కాని ఏనాడో చచ్చిపోయాయి

అందుకే ఎలాంటి పనినయినా చేయగలడు ఎవరినీ లెక్కచేయకుండా. ఒక్కొక్కసారి పోలీస్ ఇన్‌స్పెక్టర్లే బాబులు సహాయం కోరుతారు కొన్ని కేసుల్లో.

చిన్న సైజు రౌడీలు, మురానాయకులు మొదలు ఎం. ఎల్. ఏల దాకా బాబులుకి తెలుసు

కార్ఖానా వదిలిన దగ్గరనుంచి, అర్థరాత్రి పన్నెండు దాకా, షుమారు నాలుగు గంటలసేపు బాబులు తిరుగుతూనే వున్నాడు రోడ్లమీద. సోడా బుడ్లన్నీఅయిపోయాయి.

విసిగి ఇక పడుకోవాలని ఇంటికి బయలుదేరాడు. రైలు కట్టదాటి సందులోకి ప్రవేశించాడు. ఆ సందులోనే బాబులు ఇల్లు. సందు చివరవుంది. గబగబా అడుగులు వేసాడు.

కటిక చీకటిని చీల్చుకుంటూ సందుకి అవతల చివరనుంచి వస్తున్న రెండు కాంతి కిరణాలని గమనించి బాబులు చటుక్కున ఓ ఇంటి అరుగు కింద నక్కాడు కదలకుండా.

పోలీస్ వేన్ అది.

పి ఆర్. పి లతో నిండిన పెట్రోల్ వేన్ అది. బాబులు వూపిరి పీల్చటంకూడా మర్చిపోయి అలాగే కదలకుండా వుండిపోయాడు. వేన్ వెళ్లిపోయింది.

రెండు నిముషాల దాకా అలాగే వుండిపోయాడు బాబులు. 'వెధవ నాయాళ్ళు.' తిట్టుకున్నాడు మనసులోనే.

నెమ్మదిగా అరుగు కిందనుంచి లేచి, కాళ్ళకి అంటుకున్న బురదని రోడ్డుమీద రాపి వదిలించుకున్నాడు కొంత. అయినా పూర్తిగా వదలలేదు.

రెండడుగులువేసి చటుక్కున ఆగిపోయాడు బాబులు. జాగ్రత్తగా విన్నాడు.

కొద్ది కొద్దిగా మాటలు, నవ్వు వినపడుతోంది యెక్కడనుంచో చెవులు రిక్కించి విన్నాడు. సందేహంలేదు. భ్రమకాదు. నిజంగా వినపడుతున్నాయి.

ఎవరు? ఇంత రాత్రివేళ ఎవరు మేలుకుని నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకునేది? బాబులు తన ఆసక్తిని చంపుకో లేకపోయాడు. జాగ్రత్తగా గోడవైపు నడిచాడు ఆ చీకటిలో.

ఆ గోడ వెనకవున్న పెంకుటింట్లోంచి.

బాబులు భృకుటి కొద్దిగా ముడిపడింది. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా వుండిపోయాడు ఏం చేయాలా అని. ఆ ఇంట్లో వుండేది ఎవరో బాబులుకి తెలుసు.

ఓ నిశ్చయానికివచ్చి, చప్పుడు చేయకుండా రోడ్డుమీదకివున్న తలుపుని తీసాడు. తెరచుకోలేదు. లోపల గడియవేసి వుంది.

ఎగిరి, రెండు చేతులతో ప్రహరీ గోడ

అంచు అందుకుని గోడ పైకి ఎక్కి, బాబులు లోపలకి జారాడు పిల్లిలా. ఎదురుగా చీకటిలో నల్లటి కాటుక కుప్పలా వుంది పెంకుటిల్లు.

కిటికీ దగ్గరకి నడిచాడు. ఇప్పుడు కొద్దిగా స్పష్టంగా వినపడుతున్నాయి. గుసగుసలు.

చెవులప్పగించి విన్నాడు.

ఆడా, మొగా కంఠాలని గుర్తించాడు. కొద్దిగా వులిక్కిపడ్డాడు బాబులు. గుండె టకటక కొట్టుకుంటోంది.

చాలాసేపు. దాదాపు పావు గంటసేపు మౌనంగా నిల్చుండి పోయాడు బాబులు కిటికీ ప్రక్కనే, గోడ కానుకుని. లోపల చీకటిగా వుండటంవల్ల ఏమీ కనబడటం లేదు. కాని యెవరో తెలుసు బాబులుకి.

బాబులు మళ్లీ గోడదాటి రోడ్డుమీదకి వచ్చాడు. బీడీ తాగాలనిపించింది. ఇంటికి వెళ్ల బుద్ధికాలేదు. రోడ్డుమీద నుంచుని బీడీతాగితే, ఏ. పి. ఆర్. పి వేన్ సందులోకి తిరిగినా తను కనపడతాడు ఆ చీకటి సందులో; బీడీ నిప్పువల్ల గుర్తించవచ్చు సందులో ఎవరో వున్నారని.

బీడీ తాగే ప్రయత్నం విరమించుకుని సందు చివరవున్న తన ఇంటివైపు రెండడుగులువేసి, బీడీ తాగాలనే కోరికని చంపుకోలేక మళ్లీ వెనక్కి తిరిగాడు బాబులు.

సందుకి ఇటుచివర అనుకునివున్న రైలుకట్ట దగ్గరకి చేరుకుని రైలుకట్ట ప్రక్కన మొలచి గుబురుగావున్న పిచ్చిమొక్కల మధ్య కూర్చున్నాడు బాబులు.

బీడీ వెలిగించాడు అగ్గిపుల్లగీసి. పొగ వూపిరితిత్తులలోకి వెళ్ళగానే మేధస్సు పని చేయసాగింది.

ఎంత ధైర్యం!

అసలు ఎప్పటినుంచి ఈ తతంగం?

మరో రెండుసార్లు బీడీ పీల్చాడు.

నెహ్రూ గుర్తుకువచ్చాడు. ఎంత అమాయకుడు. ఎంత మంచివాడు. లోకంలో అతి మెత్తనివాడు. ఓ విధంగా చేతకాని వాడు. అంతా తనకి మంచి చేస్తారనే విశ్వాసంతో. గానుగెద్దులా పనిచేస్తూ, అందరినీ నమ్మేవాళ్ళ కీలోకంలో ఎప్పుడో ఓసారి ఎదురుదెబ్బ తగలక తప్పదు.

అది తగిలిననాడు మంచి అంతా ఇగిరి పోయి చెడ్డవాడిగా మారవచ్చు. అలా మారలేనప్పుడు.

నెహ్రూ అన్న మాటలు గుర్తుకొచ్చాయి బాబులుకి

'కనకదుర్గ కొండమీద, దేవి ఆలయం ప్రక్కనే కోనేరుంది. కృష్ణానది వుంది. వూరునిండా కాలువలున్నాయి'

నిజమే మానసిక దౌర్బల్యం ఆత్మహత్యకి పురికొల్పుతుంది.

నెహ్రూభార్య గుర్తుకువచ్చింది.

ఒకే సందుకాబట్టి. వీధి పంపు దగ్గర ఎన్నో వందలసార్లు చూసాడు బాబులు. చాలాసార్లు ఆశ పడ్డాడు కూడా. నల్లగా వున్నా, చక్కటి సౌష్ఠవంతో వుంటుంది నెహ్రూ భార్య.

నెహ్రూ మంచితనం బాబులు మనస్సులోని చెడు కోరికలని చల్లార్చింది. నెహ్రూ అంటే ఎంతో ఇష్టం బాబులుకి. కోరినప్పుడు డబ్బు ఇస్తాడనిగాదు. తనమీద భయంతో చాలామంది ఇస్తారు అలా.

నెహ్రూ మంచితనం అంటే బాబులుకి ఇష్టం.

నెహ్రూభార్య పతివ్రతగా భ్రమపడ్డాడు తను ఇన్నాళ్ళు. కాదు. ముమ్మాటికీకాదు.

ఇప్పుడు... ఈ క్షణంలో నెహ్రూభార్య చీకటిలో, పరుపుమీద, ఎదురింటి దర్జీ కొట్టు వాడి కౌగిలిలో వుంది. తను ఎదురుచూడని, కలలోకూడా అనుకోని సత్యం అది.

ఆరిపోయిన బీడీని కసిగా నలిపేసి, కొత్తబీడీ అంటించాడు బాబులు. గుండెని నిప్పుమీద కాల్చి పైన కారం చల్లినట్లుగా అనిపించింది బాబులుకి.

ఇంకా నయం. తను చూసాడు కాని నెహ్రూ చూసివుంటేనా?

రెండో బీడీ కాలిపోయేదాకా అలాగే కూర్చున్నాడు బాబులు. మనసునిండా ఆలోచనలతో. లేచి అడుగులు వేసాడు సందు వైపు. కొద్దిగా భారంగా.

తను ఎన్నోసార్లు నెహ్రూకి సహాయ పడదామనుకున్నాడు నిజమైన సహాయం- సైకిల్‌మీద ఎక్కించుకుని కార్ఖానాదగ్గర ఆలస్యమయిపోతే చేర్చేపాటి చిన్న సహాయాలుకావు.

నిజమయిన మంచిసహాయం. సందు చేరుతుంటే వెనకాల చప్పుడు విని తల వెనక్కిత్రిప్పి చూసాడు బాబులు.

అంతదాకా మత్తుగావున్న చీకటిని చీల్చుకుంటూ, నిశ్శబ్దాన్ని చంపుతూ వస్తోంది గూడ్సుబండి వకటి, పట్టాలమీద వేగంగా.

బాబులు ఆగి, అలాగే వెళ్తున్న ఆ గూడ్సుబండివంక చూస్తూండిపోయాడు. చివరిపెట్టెకివున్న ఎర్రరంగు లైట్ కాంతి అదృశ్యమయ్యేదాకా.

రైళ్ళు తిరుగుతున్నాయి పుదయం నుంచి. తర్వాతి రైలు మరో గంటలో వస్తుంది. గుంటూరునుంచి మచిలీపట్నం వెళ్ళే పేసెంజర్ రావడానికి ఇంకో గంట టైం వుంది అనుకున్నాడు బాబులు.

గబగబా అడుగులువేస్తూ అనుకున్నాడు బాబులు బిగ్గరగా.

'నిజమయిన సహాయం చేయాలి. నెహ్రూ ఎప్పుడూ ఆత్మహత్య చేసుకునే పరిస్థితి రాకుండా చేయాలి!

* * *

మర్నాడు పుదయం ఆ సందులోని వాళ్ళు, రైలుకట్టమీద, రైలుక్రింద చితికి పోయి చచ్చి పడివున్న నెహ్రూభార్యని, కొంచెం దూరంలో పడివున్న నెహ్రూభార్య కట్టుకున్నచీర పీలికలని చూసి ఏం జరిగి వుండవచ్చో వూహాగానం చేసారు.

సి. ఆర్. పి. వాళ్ళు నెహ్రూ భార్యని రేప్‌చేసి రైలుక్రింద తోసి చంపారు.

"అంతే జరిగివుండవచ్చు విచారపడకు నెహ్రూ. నేనున్నాను నీకు. నెలతిరిగేలోగా నీకో భార్య, నీకొడుకు కో తల్లికూడా వుంటారు" భరోసాగా భుజం తడుతూ ఓదార్చాడు బాబులు నెహ్రూని.

బాబులుకి క్రితం రాత్రి తన గుండెలో మొదలయిన బాధ పూర్తిగా పోయింది. తను చేయగలిగిన సహాయం చేసినందుకు.

ఆ తర్వాత ఆ పట్టాలమీద చాలారైళ్ళు పరిగెత్తాయి. ఆ రైళ్ళ చక్రాలలో ఒక చక్రానికి తెలుసు జరిగిన నిజం-మౌనంగా వుండిపోయింది. బహుశ ఆ కర్కోట్ల రాత్రి జరిగింది తనకి సమ్మతమే నన్నట్లుగా. ★

# వస్తుగుణ విశేషములు

సుగుణ

## దానిమ్మ

దానిమ్మపండు అనగానే తెలుగు సాహిత్యంలో ఏ మాత్రం పరిచయమున్నవారికైనా పలువరుసలను దానిమ్మ గింజలతో పోల్చి వర్ణించడం జ్ఞాపకం రాకమానదు.

సంస్కృతంలో దానిమ్మకు "దంతబీజ" అనీ, "మణి బీజ" అనికూడ పేర్లున్నవి.

ఆకర్షణీయమైన ఎఱ్ఱని పూలతోను, కాయలు పండ్లతోను నిండివున్న దానిమ్మ చెట్టు చూడటానికి చాలా అందంగా ఉంటుంది. పండ్లు బాగా పక్వమయితే చెట్టునే పగులుతాయి, లోపలిగింజలు ఎఱ్ఱగా మణుల దొంతర్లలా అందంగా మెరుస్తుంటాయి.

దానిమ్మలో కేవలం పూలు మాత్రమే పూసే జాతి ఒకటుంది. పూవు దానిమ్మ అంటారు దాన్ని. కాయలుండవీ జాతికి పువ్వులు మంచి ఎరుపు రంగుతో చిన్న ముద్ద మందారపూల్లా చెట్టునిండా పూసి ముచ్చటగా ఉంటాయి.

తీపి, వగరు, పులుపు రుచులు గల దానిమ్మపండు మంచి రుచిగానుండి ఆరోగ్యకరమైనది, త్రిదోషహారమైనది. ఈపండు రక్తాన్ని శుభ్రపరచి దేహపుష్టిని, రక్తపుష్టిని కలుగజేస్తుంది. కాంతినిస్తుంది. అరుచిని, దప్పికను పోగొడుతుంది. కంఠరోగములను హరిస్తుంది. ఆకలిని పుట్టించి, జీర్ణశక్తిని పెంచును.

భోజనానంతరం దానిమ్మపండు తింటె తిన్న భోజనం జీర్ణంకావించి ఆరోగ్యాన్నిస్తుంది.

పుల్లదానిమ్మ పండు పొత్తికడుకు బలాన్నిస్తుంది. రక్తపైత్యము. మేహము పోగొట్టును. దుష్టరక్తమును హరించును. వేరు చెక్క కషాయం పుక్కిలించిన నోటిపూత తగ్గును.

పచ్చి పువ్వులు నూరి పండ్లకు పూసిన చిగుళ్ళవెంట పడు రక్తము తగ్గును.

పువ్వుల రసము లేక లేత ఆకుల రసము 3, 4 చుక్కలు ముక్కులోపిండిన ముక్కువెంట కారే రక్తము కట్టును.

దానిమ్మచెక్క రసములోవికిచ్చినమూలశంకలు, రక్తము పడుట తగ్గును.

దానిమ్మపండు పై బెరడు చూర్ణముచేసి పంచదార కలిపి తీసికున్న నోటివెంటపడు రక్తము కట్టును.

దానిమ్మవేరు కషాయము క్రిములను చంపును.

లేత ఆకులు గుప్పెడు తెచ్చి నూరి అందులో గచ్చకాయంత వెన్న పటికబెల్లం పొడి కలిపి గచ్చకాయంత మాత్రలు తుల మెత్తుపెరుగుతో పూటకొక మాత్ర చొప్పున రోజుకు మూడు పూటల పుచ్చుకొనిన గ్రహణి, రక్తగ్రహిణి కట్టును.

మొగ్గల చూర్ణము దగ్గు, గ్రహిణి, నీళ్ళ విరేచనములు కట్టును, దానిమ్మపండు జ్వర రోగులు పథ్యము తీసికొన్న తరువాత మితముగ తీసుకుంటూన్న మంచి ఆరోగ్యము నిచ్చును.

★



# వెలుగుకోని చీకటి

## కె.వి.యస్. నరసింహశాస్త్రి

వ్యభిచారిణుల వెనకటి కథలన్నీ ఒకేలా ఉంటాయనుకుంటా.

ఎందుకంటే నేను చదివిన అన్ని కథల్లోనూ దాదాపు ఒకే కథనం నడిచింది పెళ్లి కాకో, మొగుడు సరిగా చూడకో బయటపడి. ప్రపంచంలో మునిగి సానికొంపల్లో తేలుతారు. అనేకమంది రచయితలు వాళ్ళ కొంపల్లోకి పోయి (కథల్లో మాత్రం) వాళ్ల వెనకటి కథలు తెలుసుకుని జాలిపడ్డవాళ్లున్నారు. పెళ్ళి చేసుకున్నవారున్నారు. ఆశ్చర్యం ఏమిటంటే ప్రతి రచయితకు తన కథ చెప్పేస్తుందా సుందరి. కొంత

మంది విషాదంగా 'మా గతి ఇంతే' అంటూ ఉంటారు. అప్పుడు రచయిత లోకాన్ని, లోకాన్ని పుట్టించినవాణ్ణి, వాడి బాబుని ఏక బిగిన ఏకేస్తూ ఆడ పాఠకజనాన్ని దుఃఖ సముద్రంలోకీ, యువ పాఠకజనాన్ని ఆవేశ సముద్రంలోకీ తోసేసి ఒడ్డున కూర్చుని వింత జూస్తుంటాడు.

నా కల్లాంటి కోరికలు లేవు.

•

ఆరోజు నేను రెండో ఆట చూసి వస్తున్నాను. ఆ థియేటర్ వెనక సందు చీకటి బజారు. ఆ బజారులో ట్యూబ్‌లైట్లు తక్కువగా ఉంటాయి, చీకటిని ప్రోత్సహించటానికేమో! వరసగా గుడిసెలు. అటు పక్కన కాలువ. పది గజాలకో సారా కొట్టు, సాయంత్రం అవగానే వెలుస్తాయి ఇంకా చాలా చిల్లరకొట్లు.

రష్‌గా ఉండటంచేత థియేటర్ వెనక గేటు తెరవటంతో ఆ సందున రావటం తప్పనిసరి అయింది. వడివడిగా నడిచి వచ్చేస్తున్నాను.

"బాబూ కొత్తపిట్ట వచ్చింది."

"పదహారేళ్ళ పడుచుపిల్ల బాబూ."

"చెంగావి రంగు చీర కట్టుకున్న చిన్నదీ. దాని అందమంతా 'చీర' లోనే ఉన్నది."

"ఎందుకొచ్చిందోయ్ మామా."

"రండి బాబూ మాట."

వాళ్ళ పిలుపులు, పాటలు చెవిలో హోరెత్తిస్తున్నాయి. ఆ బజారున వచ్చే వాళ్ళకి ఆ పిలుపులు, పాటలు కొత్త కాక పోయినా ఒక్కోసారి ఒక్కో రకంగా ఉంటుంది.

తల వంచుకు వస్తున్న నాకు ఏదో చెయ్యి పట్టుకున్నట్టయి పక్కకి చూశాను.

ఎవరో అమ్మాయి! అలంకారం అధికం కావటంతో ముఖం వెలవెల పోతోంది.

'రండి బాబు' అంది దీనంగా.

ఆ కళ్ళలోని దీనత్వాన్ని ఎక్కువసేపు చూడలేకపోయాను. నా గుండెల నిండా జాలి నిండి పోయింది.

నా తటపటాయించటం చూసి మరో సారి 'రండి బాబు' అంది కొద్ది హాయ లుతో.

ఎందుకో ఆమెను అనుసరించా లని పించింది.

"జాగ్రత్త బాబూ, తల వంచండి" అంది గుడిసెలోకి దారితీస్తూ.

ఆ గుడిసెలో ఓ గుడ్డి దీపం వెలుగు తోంది.

అటు పక్కన ఓ మంచం ఉంది. మంచం నిండా ఏవో వాసన విరజిమ్మే పూలు.

నన్ను ఆ మంచంపై కూర్చోమంది. తనిప్పుడే వస్తానని చెప్పింది.

ఆ చుట్టుపక్కలా కలయ చూడ్డా వి కక్కడ ఏం లేవు.

ఆమె మళ్ళీ వచ్చింది చీర మార్చు కున్నట్లుంది.

ఆమె దగ్గరగా వచ్చింది.

నేను లేచి నుంచున్నాను.

దగ్గరకు వచ్చి చెయ్యి పట్టుకో పోయింది.

"ఆగు" అన్నాన్నేను.

ఏమిటన్నట్లు చూసింది.

"నాకు నువ్వేమీ ఇవ్వక్కరలేదు గాని,

నీ కెంత కావాలో చెప్పు'' అన్నాను.

అనటంకూడ కాస్త కఠినంగా అన్న ట్లున్నాను.

అంత గుడ్డి వెలుతురులోనూ ఆమె ముఖం మారటం గమనించాను.

''అదేమిటి బాబూ, నా దగ్గరనుంచీ ఏమీ తీసుకోకుండానే డబ్బెలా ఇస్తారు? అది తప్పు కదా బాబూ.''

''అది తప్పని తెలుసుండి కూడ ఈ తప్పు ఎందుకు చేస్తున్నావ్?''

''అట్టా అడుగుతారేమిటి బాబూ, మీకేమి తెలియనట్టు.''

''అవును నాకేమీ తెలియదు. నీ పేరేమిటి?''

''సావిత్రి బాబూ.''

''ఇక్కడందరి పేర్లు సీత, అనసూయ, అరుంధతి అని ఉంటాయని విన్నాన్లే'' వెటకారంగా అన్నాను.

''పేరుంటే మీ కెందు కంత కసి బాబూ? మా జీవితా లెంత మలినమై పోయినా మాకూ ఉంది బాబూ మనసు, ఏ క్షణాని కా క్షణం గడచిందే చాలు ననుకునే జీవితాలూ మావి.''

''అయితే సావిత్రీ, నువ్వేమన్నా చదువుకున్నావా?''

''ఏదో చదువుకున్నాలే బాబూ.''

''మరి . ఈ మాటలు....''

''నాలుగురోజు లిక్కడ ఉంటే కొన్ని పోకిరి మాటలు, కొన్ని ఈ మాటలు వస్తాయి బాబూ. మొదటివి రసికుల్ని రంజింప జేయటానికి, రెండోవి మీలాంటి వాళ్ళని కరగించటానికీ.''

''ఉన్న విషయాన్ని ఉన్నట్లు చెప్పావు, థాంక్స్. నీ వెనకటి జీవితాన్ని నే నడగ దలచుకోలేదు. ముందు జీవితానికో దారి చూపిస్తాను, వస్తావా.''

''వద్దు బాబూ, ఓసా రిలాగే ఒకాయన పెళ్ళి చేసుకుంటానని తీసుకుపోయి రెండు నెలలు పోయాక ఇక్కడ దింపి వెళ్లాడు.''

''ఛీ, నిన్ను పెళ్ళి చేసుకోటానికి కాదు. నాతో రమ్మంటా నీకు పని పాటలు వచ్చా.''

''ఏం బాబు? బాగానే వచ్చు.''

''మా ఇంట్లో పని చేస్తావా?''

''మీ ఇంట్లోనా, ఇది వదిలేసి రమ్మం టారా? ఎప్పుడు బాబు? ఎప్పుడు రాను? ఇప్పుడే వెడదామా?''

''అవునూ నువ్విక్కడ ఎవరితోనూ చెప్పక్కర లేదా? మీ గుంపుకి మేనేజ రెవరూ లేరా? (కొన్ని కథల్లో చదివాను. రంగమ్మో, కనకమ్మో కంపెనీ మేనేజరనీ, కింద కొందరు రౌడీలుంటారూ అవటా అనీ.)

''లేరు బాబూ, ఎవరి తిండి వాళ్ళదే. కాకపోతే హోయలుతో పెద్దోళ్ళని వశ పర్చుకుని కార్లంట తిరిగే ఆ దాబా యింట్లో లేరూ, వాళ్ళప్పుడప్పుడూ జాలి చూబిస్తుంటారు మా మీద.''

''సరే. సావిత్రీ, రేపు మధ్యాహ్నం నే నిక్కడికి వస్తాను. మా ఇల్లు చూపి స్తాను. సాయంత్రం పనిచేస్తానంటూ రా. మా అమ్మగార్నో, నాన్నగార్నో అడుగు. వాళ్ళని ఒప్పించి పనిలో కుదురు. పాత పనిమనిషి మానేసి పదిరోజు లయిందిట. నువ్వు నమ్మకంగా చెబితే వాళ్ళు వెంటనే ఒప్పుకుంటారు.''

## ఆగండి! చదవండి! ఆలోచించండి!

సాహిత్యాభిలాషతో, విజ్ఞానాభిలాషతో మనము రకరకాల గ్రంథాలెన్నో చదువుతుంటాము. వందలకొద్దీ పేజీలున్న గ్రంథంలో నిజానికి మనని నిలబెట్టి ఆలోచింపజేసే భావాలు కేవలం కొన్ని వాక్యాలలో ఇమిడి వుంటాయి. ఏ పుస్తకంగానీ-మీరు చదువుతున్నప్పుడు అలా మిమ్మల్ని ఆలోచింపజేసిన వాక్యాలను సేకరించి మాకు పంపండి. మీతోటి పాఠకులకు వాటిని పై శీర్షిక ద్వారా అందజేస్తాము. ఇతరులకు పంచి ఇస్తే తరగకపోగా పెరిగి మనల్ని మరింత విజ్ఞుల్నిగా చేసేదే మరి విజ్ఞానం. (చూడండి పేజి 42)

నాకు ఒక వ్యభిచారిణిని పెళ్ళి చేసుకునేంతటి ధైర్యమూ, కరుణా, జాలీ లేవు. అందుకే పనిమనిషిగా కుదరమన్నాను.

"అలాగే బాబు." అంది సావిత్రి.

"మన రక్తం పంచుకున్న ఓ ఆడపడుచుకి, మనం జారవిడుచుకున్న జాతి పరువు" కి నీడ కల్పించానన్న తృప్తి కలిగింది.

"ఇదుగో సావిత్రీ, ఇక్కడ నీకున్న అలవాట్లన్నీ మానుకోవాలి. గొప్ప లోగిళ్ళలో చాలా జాగ్రత్తగా మసలుకోవాలి సుమా" అన్నాను.

"నాకు తెలియదా బాబూ, మీ రింతగా చెప్పాలా? రేపు మీరు వస్తారుగా?"

"తప్పకుండా వెళ్తున్నాను సావిత్రీ" అంటూ ఐదురూపాయల కాగితం అందించాను.

తీసుకుని "దండాలు బాబూ" అంది.

అప్పుడు నేను సావిత్రి వంక చూడ్లేదు. చూస్తే ఆమె పొందుతున్న ఆనందం వంక చూపినట్లయ్యేది.

నేను బయటకు వచ్చి బయల్దేరాను.

*　*　*

"ఒరేయ్, ఇవాల్టినుంచి నాకు లేశ్రెం దని నామీద కస్సుమన్నావంటే ఊరుకోను. నిన్ననే కొత్త మనిమనిషి వచ్చి చేరింది. పేరు సావిత్రిట. అన్ని పనులు దానికి చెప్పి చేయించుకో" అంటూ వన్ను లేపింది అమ్మ.

నాకూ సావిత్రికీ ఇదివరకే పరిచయం ఉందని తెలియగూడదు. సావిత్రి సాని కొంపల్లోంచి వచ్చిందని అస్సలు తెలియగూడదు.

అందుకే అడిగాను.

"డబ్బూ అవి మాట్లాడుకున్నారుటే."

"ఆఁ అన్నీ అయినయ్. ఎంతో కొంత ఇవ్వండమ్మా అంది. చాలా అణకువగా కనిపిస్తోందిరా. నాన్న వచ్చేసరికి నాతో పని విషయం మాట్లాడుతోంది. ఆయనకు దారి ఇచ్చి ఎంత సిగ్గు పడిందనీ" అంటూ అమ్మ వెళ్ళిపోయింది.

నాలో నేను నవ్వుకున్నాను.

సావిత్రిని సాధ్యమైనంతవరకు తప్పుకు తిరుగుతున్నాను. సావిత్రిని నేను చూపిన చోటు వేరు. ఇప్పుడు చూస్తున్న చోటు వేరు.

ఓ రోజున యాధాలాపంగా సావిత్రి వంక చూశాను. సావిత్రి మెళ్లో మంగళ సూత్రం కనిపించింది. "సావిత్రికి పెళ్ళయిందా" అనుకున్నాను.

ఆ విషయమే అమ్మ నడిగాను.

"అయిందటరా, దాని మావ నైజాం పోయాట్ట. "సరిగ్గా ఇల్లుగూడ లేదం డమ్మా, మీ పంచనే పడుకోనియ్యండి" అంది. సరే అని వరండా గదిలో పడుకో మన్నాను." అంటూ చెప్పింది అమ్మ.

"ఇది ఎంతవరకు నిజం?" అనుకున్నాను.

ఉండబట్టలేక ఇంకోసారి సావిత్రి నడిగాను.

సావిత్రి చెప్పిన సమాధానం వేరు.

"బాబూ, మీరు నాకు దారి చూపిన వాళ్ళు మీరు అడిగారు కాబట్టి చెబుతున్నా. మా ఇళ్ళ ఇంకా మా ఇళ్ళేంది సాని కొంపల కొచ్చే రసిక మహారాజులు కొందరికి పెళ్ళయిన ఆడోళ్ళంటే యిష్టం ఉంటుంది వాళ్ళ కదో పిచ్చి. ఎవడి పిచ్చి వాడి కానందం. అందుకోసం 'మంగళ సూత్రం' సేని కట్టుకున్నాను. అంతే బాబూ నాకు పెళ్ళీ కాలా మావా లేడు. అమ్మగారి కలా చెప్పాను." సావిత్రి ఆగింది.

"ఉష్, బిగ్గరగా అనకు. అమ్మ వింటుంది" అన్నాన్నేను.

"అమ్మగారు చాలా మంచివారు బాబూ."

"సావిత్రీ" అని పిలిచింది అమ్మ లోపలినుండి

సావిత్రి వెళ్ళిపోయింది.

"ఏమోలే, ఒక అభాగిని జీవితాన్ని గట్టెక్కించాను" అనుకున్నాను భారంగా.

సావిత్రి పనిమనిషిగా చేరి దాదాపు ఇరవై రోజు లవుతోంది. అందరికీ తల్లో నాలుకలా అందరి పనులూ చేస్తూ మా ఇంట్లో అందరి మెప్పు పొందింది.

ఆ రోజున రాత్రి పదిగంటల సమయం.

నేను బయటనుంచీ వస్తున్నాను. గేటు దాటాక ఎవరో నన్ను గాఢంగా కౌగలించుకున్నారు.

చూస్తే సావిత్రి!!

నేను గబుక్కున విదిలించుకుని చుట్టు పక్కలా చూశాను. అమ్మయ్య! ఎవరూ లేరు!!

సావిత్రి తల వంచుకుని కొద్దిదూరంలో నుంచుంది.

"ఇదేం పని సావిత్రీ" అని అడిగాను మెల్లగా.

"నన్ను క్షమించండి బాబూ, ఉద్రేకంలో మిమ్మల్నలా చేశాను. ఆ రకపు జీవితాని కలవాటు పడ్డవాళ్ళు ఇంకోరకపు జీవితాని కతకరు బాబూ. నేనెంత ప్రయత్నించినా ఆపుకోలేక పోయాను. ఇవాళ చాలా చెడ్డరోజు. అదోరంగు జీవితం. సాయింత్రం ఐదయ్యే సరికల్లా ముస్తాబు చేసుకుని బయట కూనిరాగాలుతీస్తూ, వచ్చేపోయే పాసింజర్లని పిలుచుకుంటూ, నాంచారయ్య కాకాహోటల్లో టీనీళ్ళు తాగుతూ, ఉన్నరోజున తిని, లేనిరోజున

వస్తుందే జీవితాని కతికిపోయాను. ఎంత ప్రయత్నించినా మారటం నావల్ల కాలేక పోయింది. ముందు మీరు నన్ను అడిగినప్పుడు ఎంత సంతోషించానో ` ఎందుకులేబాబూ...అదోరొంపి...మురికి కూపం. దాంట్లోంచి బయటకు రావడమే కష్టం. వచ్చినా బయట బతకటం చాలాకష్టం మీలాంటివాళ్ళ చేయూత నిస్తానన్నా ఆ చేయి పట్టుకునేపాటి అదృష్టం ఉండొద్దు. అవన్నీ మీకు చెప్పి విసిగించను బాబూ. రేపు అమ్మగారితో చెప్పి వెళ్ళిపోతాను.'' అంటూ సావిత్రి అక్కడనుంచి వెళ్ళిపోయింది.

నిముషం సేపు అలాగే ఉండిపోయాను.

అవును మురికి కూపంలో మగ్గుతున్నవాళ్ళు సెంటువాసన ఎలా భరించగలరు? పాసింజర్లని పిలుచుకుంటూ టీనీళ్ళు తాగుతుందిట, పోనీ పొమ్మను. ఏమిటి దానికీ నాకూ సంబంధం? ఇంకా అల్లరి చేయకుండానే వదిలిందిలే...దాని చావు అదే చస్తుంది అనుకున్నాను కసిగా.

కసి!

ఎవరిమీద? ఏదో అర్థంలేనికసి! నేనేదో మార్గం చూపాను. అది నచ్చలేదు వెళ్ళిపోతోంది నాకెందుకు కసి?అప్పట్లో అంత వివేకంగా ఆలోచించ లేక పోయాను.

మర్నాడు ''ఒరేయ్, లే. ఎవరిపనులు వాళ్ళు చేసుకోవాలి. సావిత్రి పనిమానుకొని వెళ్ళిపోయింది'' అంటూ లేపింది అమ్మ.

''ఆఁ సావిత్రి వెళ్ళిపోయిందా?'' ఆశ్చర్యం నటిస్తూ అడిగాను. అవును, అమ్మకు తెలియగూడదు మరి!

''దాని మావ వచ్చి నైజాం తీసికెడతానన్నాడట. అందుకని మానుకుని వెళ్ళిపోయింది. వెళ్ళేటప్పుడు ఎంత బాధ పడుతూ వెళ్ళిందనీ'' అంటూ ఏవో చెప్తోంది అమ్మ

నే నవి వినిపించు కోవటంలేదు.

''మావ పిలవలా, మావలు పిలిచారు. నైజాంకాదు, దానిశ్రాద్ధానికి'' అనుకున్నాను మళ్ళీ ''కసి''గా.

చీకటి వెనక వెలుగు, వెలుగు వెనక చీకటి వస్తాయి ఈ చీకటికి మాత్రం వెలుగు లేదా? ★



# ★ గాంధేయం - రైల్వేలు! ★

"మన అంతస్థులు పెంచేశారు" అన్నారో ప్రయాణీకుడీ మధ్య రైల్లో ప్రయాణం చేస్తూ ఆయన వ్యాఖ్యకు పూర్తిగా అర్థం తెలియలేదు ప్రక్కనే కూర్చున్న మా హరికి

"ఏమిటండీ...మన అంతస్థు లెక్కడా పెరిగింది" అంటూ బాతాఖానీలో దిగాడు

ఆయనో లాయరట. కాకినాడ నుండి ప్రయాణం చేస్తున్నాడు. తానూ అర్ధాంగి మూడవతరగతి టిక్కెట్టుకొని బండి అంతా వెదికారట. కాని అంతా సెకండ్‌క్లాస్ అనే ఉండటముతో కొంతసేపు తటపటాయించి, ఆ తర్వాత గుర్తుకొచ్చి 'అవునే యీ మధ్య మనమంతా రెండవ తరగతి ప్రయాణీకుల మయ్యాము మూడవ తరగతి ఎత్తివేశారు. రెండోతరగతి పెట్టిలోనే ఎక్కాలి మనం' అంటూ భార్యకు బోధించాడట! తర్వాత సంభాషణలో తన వృత్తి ప్రస్తావన వచ్చి 'మా శ్రీమతితో అర్గ్యుమెంట్సులో కొంచెం తగ్గిపోతాను కాని కోర్టులో ఫర్వాలేదండీ' అంటూ హరికి వివరించా డాయన ఆమాటను ఆయన భార్య అందుకొని "ఏమి కోర్టో ఏమో గాని. మీకు కోర్టులోఉండే బెంచీలు, కుర్చీలు తప్ప మరోటి గుర్తుండదా స్వామీ. ఇక్కడ కూడా కోర్టులోమాదిరే కూర్చోబెట్టారు. సెకండ్‌క్లాసు అంటే మెత్తలా, పరపులా ఉండేవి గదండీ మా నాన్నగారెపుడు ఉత్తము, మధ్యలో అంటూ మధ్యములోనే తీసికెళ్లేవారు మిమ్మల్ని చేసుకొన్నాకే యీ బెంచీల పాలబడ్డాను. మీరెంత లాయర్లయినా యీ బెంచీలను సోఫాలనీ వేరుగా! యువరానర్! అంటూ బల్లగుద్దితే వినేవారూ, వ్రాసుకొనే వారూ లేరాయనిక్కడ" అంటూ హాస్యం చేసింది.

అంతేకాదు సినిమా కెళ్లినప్పుడు తనకు కలిగిన ఓ అనుభవాన్ని వివరించింది "మొన్నో సినిమా కెళ్లానండీ పక్కింటి పిన్నిగారితోకలిసి. పైతరగతి వెడదామంటే వద్దం దావిడ తెరకు దగ్గరగా కూర్చుంటేగాని ఆవిడకు బాగుండదట. సరేనని నేలక్లాసు కెళ్లాం. పేరుకి నేలక్లాసేగాని అక్కడా కుర్చీలే చూసి ఆశ్చర్యపోయాను. ఎందుకయినా మంచిదని టిక్కెట్టు చూశాను. దానిపైనా నేల అనే ఉంది" అందావిడ "వాళ్లేనయం మీకన్నా" అంటూ భర్తపై మరో విసురును చేరుస్తూ.

ఆయన నిస్సహాయంగా హరివైపుచూస్తూ "హరిగారూ! ప్రతివాద భయంకరాచార్యులవంటి ఉద్దండితో వాదించి గెలిచానుగాని యీకేసే నాకర్థంగావడం లేదు. ఎంతకీ అన్నారు, కొంచెం సేపాగి "ఆకేసే కాదు, ఈ రైల్వేల క్లాసుల మార్పిడి కేసుకూడా అంతుపట్టి చావడంలేదు. ఎంతకూ వాదులూ, ప్రతివాదులూ, పైళ్ళు కోర్టులో. వీటిమధ్య బ్రతుకుతున్న నాకు బయటి ప్రపంచంతో సంబంధాలు తక్కువై పోతున్నాయి" అంటూ నిస్పృహకు వ్యక్తం చేశారు,

ఆయనకు ఎదురుగా కూర్చునివున్న వయసు మళ్ళిన ఓ శుద్ధ ఖద్దరుదారి యీ

సంభాషణలోకి ప్రవేశిస్తూ "ఇదేముందండీ! గ్రహిస్తే సూక్ష్మమే! గాంధీగారు . మహానుభావుడు గాంధీగారు లేరండీ ఎప్పుడూ యీ చెక్కల బండిలోనే ప్రయాణం చేసేవారు కదండీ. మనది సోషలిష్టు ధ్యేయ రాజ్యం. అంతా సమానంగా వుండాలనేదే ముఖ్యోద్దేశ్యం "అన్నాడు.

"ఫస్ట్ క్లాసంటూ వేరే మరో క్లాసుందండి గదండీ" అన్నాడు అమాయకంగా మా హరి.

"వస్తున్నా! వస్తున్నా!" ఆ విషయానికే వస్తున్నా. తొందరలోనే అదికూడా ఎత్తేసి అందరికీ సమాన హోదా, సమాన ప్రతిపత్తి కల్గించడానికే నా కృషికూడా. ఇందాక అమ్మాయి సినిమా హాలులో నేల టిక్కెట్టుక్కూడా కుర్చీలే వున్నాయని ప్రస్తావించారు అవి ప్రయివేటు యాజమాన్యాలు. ఆడంబరాలు వారికి ప్రధానం. ఆడంబరం లేనిదే ఆనందం లేదు. ఇహ రైల్వేలంటారా మనవి. వచ్చే లాభనష్టాలు మనవి!" అన్నాడా గాంధేయుడు.

"మీరేం చేస్తున్నారు సార్" అన్నాడు మా హరి, ఆయనకు గల లోకజ్ఞానానికి అబ్బురపడిపోతూ.

"అబ్బే. ఏమీ లేదండీ. గతంలో యింతో అంతో మీ కోసమే పాటుపడ్డాను! ఇప్పుడూ మీ కోసమే నేను రాజకీయ బాధితుడిని. తామ్రపత్రమిచ్చారిటీవల. అయిదెకరాలూ, నెలకో రెండొందలూ ఇస్తున్నారు. ఇంకేం చెయలేనుగా బాబూ యీ వయసులో" అన్నాడాయన వయసు కారణంగా తను ప్రజాసేవ చేసే అదృష్టాన్ని కోల్పోయానన్న బాధను కనిపింపజేస్తూ, తనని సమర్థించుకుంటూ.

ఇంతసేపటినుంచీ వీరందరి మధ్య ఆగకుండా నడిచిన సంభాషణల వలెనే రైలుకూడా ఆగకుండా ప్రయాణం చేయడంతో గమ్యస్థానం చేరింది. రైలు గమ్యస్థానం చేరడంతోనే సంభాషణ లాపేసి ఎవరికివారే యమునాతీరే అయ్యాము.

—ఈడ్పుగంటి లక్ష్మణరావు.


## విహార యాత్రికులకు సిండికేట్ బ్యాంకు సేవ!

తన ఖాతాదార్లకు ప్రత్యేక సదుపాయాలెన్నో కలుగజేస్తున్న సిండికేట్ బ్యాంకు ఇప్పుడో నూతన తరహా సదుపాయం అందజేస్తున్నది. 'టూరిష్ట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడ్ సర్వీస్' పేరిట తన ఖాతాదార్లకు ఈ బ్యాంకు కలుగజేసే సదుపాయాలలో యాత్రా స్థలాల గురించిన వివరాలందించే 'ఫోల్డర్' సమకూర్చడమూ, బ్యాంకు తరఫున నియమించబడిన 'గైడ్'ల సహకారాన్నందించడమేగాక యాత్రికులకు ప్రయాణపు ఏర్పాట్లు, నివాస సౌకర్యాలు కూడా అందిస్తుంది. ప్రథమంగా యీ పథకాన్ని కర్ణాటక రాష్ట్రంలో త్వరలో ప్రవేశపెట్టబోతున్నారు.

# కబుర్లు

జలసాని ప్రసాదరావు

"నశించాలి" అన్నాడు సుబ్రావు బల్ల గుద్ది.

బల్లమీద ఏమీ లేవు. కనుక ఏదీ ఎగిరి నామీద పడలేదు.

"అవును! నశించాలి" అన్నాన్నేను కూడా బల్ల గుద్ది.

ఆ బల్ల నాదీ కాదు. వాడిదీ కాదు. హోటలు వాడిది.

"ఏమిటీ?" ప్రశ్నించేడు సుబ్రావు.

"అవును! నశించాల్సిందే!" అన్నాను, మళ్లీ ఓ సారి బల్ల గుద్ది నా విప్లవ తత్వాన్ని రుజూ చేసుకుంటూ

"ఏం నశించాలంటావూ?"

"బాగుంది! నాకేం తెల్సు ఇంటాక నువ్వేదో నశించాలంటున్నావు గదా? నేనూ డిటో!"

సుబ్రావు ఆలోచించేడు

"ఏం నశించాలన్నా నబ్బా! ఆ ఆ! గుర్తొచ్చింది. మనం అకాడమీని తగలెయ్యాలి!"

"అకాడమీనా! కష్టమేనే?"

సుబ్రావు గుర్రుమన్నాడు

"ఏం! అగ్గిపుల్లల్లేవా?" అనరిచేడు.

"బాబ్బాబు, మరేదన్నా పాకగానీ, గడ్డి వామిగానీ చూద్దూ! అకాడమీని తగలేయాలంటే కష్టం. మూడంతస్తుల పిమ్మెంటు మేడలో వుంది గదా" అన్నాన్నేను ప్రాధేయ పడుతూ.

"ఏం! బజార్లో పెట్రోల్ దొరకటం లేదా?"

"బజార్లో కాదుగానీ బంకుల్లో దొరుకుతోంది నాలుగు రూపాయలకో లీటర్ ఇస్తున్నారు."

"మరింకేం! ఇంతకీ నీ జేబులో ఏ మాత్రం వుంది!"

"ఏమిటీ? పెట్రోలా?"

"కాదు! పెట్రోలుకు పైసలు!"

"ఎబ్బే! నెలాఖరు గదా! సాయంత్రం బస్సుకో పావలా వున్నట్టుంది!"

సుబ్రావు నిట్టూర్చేడు "ఏం మనుషుల్రా బాబూ! ఒక్క మగవెధవా కనపడి చావడుగదా!" అని విసుక్కున్నాడు.

సుబ్రావును ఓదార్చాను. "నిరాశ పడకు బ్రేడ్! కానువ్వున్నావు గదా! నేను కూడా వున్నాననుకో!" అని నపిగేను.

నపిగి, ఇంతకూ మనం దాన్నెందుకు తగలేయాలి?" అని ప్రశ్నించేను.

సుబ్రావ్ మళ్లీ గుర్రుమన్నాడు. "ఎందుకు తగలెయ్య గూడదూ?" అని ఎదురు ప్రశ్న వేసేడు.

కాస్సేపాగి నా మీద దయదలిచేడు "దాన్నిండా ముసలిపీనుగు లున్నారు" అన్నాడు

"అయితే?"

"మనం పడుచు పీనుగులతో మరో అకాడమీని స్థాపిద్దాం!"

"డబ్బు?"

"అకాడమీకి ఎక్కడ్నించి వస్తోందను కున్నావు?"

"ఏలిన వారిస్తున్నారు గదా!"

"మనకూ ఆ ఏలిన వారి మొగుళ్ళ లాంటి వారిస్తార్లే!"

"మనకు వాళ్లెందు కిస్తారు?"

"చొప్పదంటు ప్రశ్నలు వెయ్యకు? ఎందుకివ్వాలో వాళ్లకు తెలీదనుకున్నావా?"

"సరే! మనం కుర్ర పీనుగుల అకాడమీ పెడదాం! ఆ తర్వాత?"

"అకాడమీ చెయ్యని పనులు చేద్దాం!"

"అకాడమీ నా సావనీరుకు అడ్వర్టయిజుమెంటు ఇవ్వలేదు గురూ! మన కుంకల అకాడమీ తప్పకుండా ఇస్తుంది గదా?"

"అవన్నీ అల్ప విషయాలు శిష్యా! మనం అకాడమీ ఇచ్చే ప్రైజులను తల దన్నే ప్రైజులిద్దాం!"

"అయితే నన్ను అర్జంటుగా ఓ పుస్తకం రాసి పడేయమన్నావా?"

"ఆగరా, నాయనా! నువ్వింకా కుర్ర వాడివి. మన ప్రైజులు చాలా పెద్దవి."

"అంటే! జ్ఞానపీఠం అవార్డు కన్నానా? గురూ?"

"అబ్బే! మనం జాక్‌పాట్లు ఇవ్వం! ప్రైజులిస్తాం కనుక మనం ఇచ్చేది మరీ అంత ఎక్కువగా ఉండగూడదు."

"ఊ! తర్వాత?"

"అకాడమీ ప్రచురించే పుస్తకాలన్నీ చెత్త"

"అవును, చెత్తే! కాలేజీలో నాకు ఆ బాపతు పుస్తకం ఒకటి తగిలించేరు. చదవ లేక చస్తున్నాను. కానీ, గురూ! మన్లోమాట! వాటిల్లో కొన్ని పారాలు మాత్రం మా పసందుగా ఉంటాయనుకో!"

"నాన్సెన్స్! ముసలి పీనుగులా మాట్లాడకు!"

"కాదు గురూ! నిజంగానే! ఓపారంలో రంభ యేడుస్తూ నలకూబరుడికి చెప్పు కుంటుంది. రావణుడు తనను యెలా చెరిచిందీ నోరూరేలా వర్ణిస్తుందనుకో! ఎక్కడ ఎలా పట్టుకున్నాడో, ఎక్కడ ఎలా నొక్కాడో, గిల్లాడో, కొరికాడో ఎంత పసందుగా వర్ణించాడనుకున్నావూ?"

"ఎవడాడు?"

"పేరు గుర్తులేదు గానీ మొత్తంమీద ఎవడో మన ముత్తాతల ముత్తాల నాటి ముసలి పీనుగే అయి ఉంటాడు"

"అదేరా, అసలు సంగతి! ముసలోళ్లు అందుకే అలాంటి పుస్తకాలిచ్చేసి ప్రజాధనం తగలేస్తున్నారు."

"మరయితే మనం ఎలాంటి పుస్తకాలకు తగలేద్దామంటావూ?"

"మనం యువ రచయితల, యువ రక్తపు వేడి నిండిన, యువ గ్రంథాలచ్చేసి ఆంధ్ర ప్రజానీకాన్ని చైతన్య వంతుల్ని చేస్తాం."

"నీ కవిత్వం ఆపి మామూలు మాటల్లో చెప్పు గురూ!"

"క్రిందటేడాది నా పుస్తకం వచ్చింది చదివావు గదా! దాని గొప్ప దనం మన

ముసలి అకాడమీకి ఏమన్నా అర్థం అయి చచ్చిందా?''

''అర్థం కాలేదు గనుకే ఇంకా బ్రతికున్నారేమో!''

''నీ మాట వరహాలమూటరా! చూడూ! మనం అలాంటి మహద్గ్రంథాల్ని పుంఖాను పుంఖంగా ఆంధ్ర దేశం మీదికి అచ్చేసి వదలాల్సి ఉంది.

''ఆ పని బెజవాడ ఏలూర్రోడ్డు సాహితీ సేవకులు చేస్తున్నారు గదా గురో!''

''నాన్సెన్స్! వాళ్ళది పక్కా వ్యాపారం. మనది సాహిత్యసేవ!''

''అయితే అకాడమీ వేసే పుస్తకాలు సాహిత్యం కాదని మనం ఢంకా బజాయించాలన్న మాట!''

''నిస్సందేహంగా!''

''మనంవెయ్యబోయేవేసాహిత్యం?''

''కాదన్న వాడు ముసలిపీను గన్నా అయ్యుండాలి! లేదా, సదరు ముసలి పీనుగల అకాడమీ ముష్టికోసం కాకా పట్టే వాడేనా అయ్యుండాలి.''

''మరయితే మనం వెయ్యబోయే పుస్తకాల్లో రంభల్లాంటి ఆడపిల్లలు గానీ, వాళ్ళ పెదాల, బుగ్గల వర్ణనలుగానీ, ప్రేమాయణాలు గానీ ఉండ గూడదంటావు. మరి నేనింతవరకూ రాసినవన్నీ తగలేయాల్సిందేనా? మన అకాడమీ డబ్బుతో ఒక్కటన్నా వెయ్యవా?''

''బెంగపడకు! మనం యువకులం! పిలక పండితులం కాము! మనం ఈగల్ని తోలుకుంటూ, దోమల్ని తిట్టుకుంటూ కథలూ, కవిత్వం రాసే ఆధునికులం. తూగుటుయ్యాలల్లో పవ్వళించి రంభ కూతురు అందించే కర్పూర తాంబూలాలు నములుతూ రాసే ప్రాందసులం కాము. కనుక మన నవలల్లో ఏం ఉన్నా అది అభ్యుదయమే!''

''నా పుస్తకాలు వేస్తానంటే నువ్వేన్ని చెప్పినా నాకు అభ్యంతరం లేదనుకో! కానీ. తిట్టకు గురూ! ఇంతకీ అసలు ప్రజా సేవ, సాహిత్యసేవ అంటే ఏంటి?''

''ఏంటంటే ! ఏంటంటే !ఇప్పుడున్న అకాడమీ చెయ్యని వెధవ పన్లన్నీ చెయ్యటమే!

''వెధవ పనులా ?''

''అబ్బే! మాటవరసకు అన్నా నంతే! మనం వెధవ పన్లు ఎందుకు చేస్తాం!ప్రజల కోసం ఏదైనా చేస్తాం గానీ!''

''మరయితే, మనం ముసలి పీనుగల అకాడమీకి పోటీగా కుర్ర పీనుగల అకాడమీ పెట్టటం దేనికి గురో! ప్రజలకోసం ఓ ప్రజల అకాడమీ పెట్టగూడదా?''

''శిష్యా! విను! నీ అయిడియా బాగానే ఉందనుకో! కానీ, కానీ ప్రజలకు అసలు మన గొడవే పట్టదు. వాళ్ళక్కావాల్సింది నీ నా పుస్తకాలూ కాదు.– సాహిత్యమూ కాదు. మన్లో మాట !ఎక్కడేనా నోరు జారేవు సుమా !వాళ్ళక్కావాల్సిందేమి టంటావా ? కూడూ గుడ్డా!''

''వ్వాట్! వ్వాట్?''

''అవును తమ్ముడూ! వాళ్ళ అవసరం వాళ్లది! మన అవసరం మనది. వాళ్ల ఏడుపు వాళ్లది. మన ఏడుపు మనది. పద పోదాం!''

''ఎక్కడికి ?''

''మర్చిపోయావా? పెట్రోల్ బంకుకి!''

★

# ఈ నెల విడుదలలు

పాలిడార్ డీలర్లకూ అభిమానులకూ ప్రతి నెలా పండగే. పక్కాలూ, పిల్లలూ ఆరువారాలకు అరుస్తుంటే, రికార్డోదయ కంపెనీ తాజాగా అందిస్తున్నది. "పరివర్తన" విడుదలకు ముందే అందిన ఇ. పి. లో (2221 130) ఆంధ్రదేశం మెచ్చిన మూడు పాటలున్నవి. 'విని పించనా' అని ఆరుద్ర మనకోసం గీతం వ్రాస్తే దానికి టి. చలపతిరావు సంగీతం చేస్తే దానిని బాలుడు అందరికోసం గీతమయంగా ఆలాపించాడు. దాశరథి రచన 'గుడిలో ఒక దీపం' సుశీల కంఠంద్వారా చలపతిరావు వెలిగించిన ఒక స్వరదీపం. 'చెయ్యి చూసి చెబుతావా బావా' అన్న ఎమ్. గోపి రచన ఒకపైలా పచ్చీసు యువ గీతం (శీల_బాల). చిన్ననాటి వలపు దూకుడూ తాకిడీ పెద్ద వయసులో జ్ఞాపకం తెచ్చుకోవాలంటే వినవలసిన పాట.

'వనజ_గిరిజ' ఇ. పి. (2221 132) చాలా ముందుగానే వచ్చింది. ఒక ప్రక్కంతా కొసరాజు రచన 'జై జై సీతారాం' పాడిన రమేశ్, సుశీల కంఠాలలో ఇప్పపూవు సారాలో వుండే కైపూ ఊపూ రెండు వినబడుతున్నవి. బాల పాడిన 'కంటిలో మెరుపు' వయసులో వచ్చే వలపు జబ్బుకు మంచి తార్కాణం. జానకి పాడిన రెడ్డి రచన 'నేనున్నాను నీ కోసమే' వింటే ప్రతిశ్రోతీ అది తనని ఉద్దేశించినదే అనుకోవాలి. తప్పదుమరి. ఆకర్షణీయమైన యీ వరుసలూ చలపతిరావువే. కంటిలో ఒక నలుసు యీ రెండింటి కవర్లు. అలుకతో ఓ అమ్మాయి కళ్లాపి జల్లేసినట్టున్నాయి.

"కృష్ణవేణి" చిత్రంలో ఆంధ్ర శ్రోతల హృదయాలలో తిష్టవేసుకో నారంభించిన సంగీత దర్శకుడు విజయ భాస్కర్ చేసిన రెండు వరసలు 'అమ్మాయిల శపథం" ఎస్. పిలో (2067 243) వినవచ్చు. ఒకటి 'నా వయసు' అనే యుగళము (శీల_బాల). ఆత్రేయ రచన కతి తీర్చడానికి ప్రయత్నిస్తుంది. అభిరుచి ఉన్న వారికి మతిపోతుంది. 'నీకు నాకు' అన్నది అతని రచనే, వాత్సల్యరాగంలో వ్రాయబడి వరస చేయబడి సుశీలచే గానం చేయబడ్డది. ఇది బాగున్నది.

ఇన్ని తెలుగు రికార్డులుండగా మళయాళ గీతాలెందుకు పరిచయం చేస్తారని వ్రాస్తారు కొందరు శ్రోతలు. కారణాలు రెండు. ఇప్పుడు ప్రాంతీయ వాతావరణమే మాత్రమైనా ప్రతిబింబిస్తున్న చిత్ర సంగీతమేదైనా ఉందంటే అది మళయాళ చిత్రాలదే. అదీగాక సంస్కృతభాషలో అనాదిగా శ్రోత పరిచయమున్న తెలుగువారికి కాస్త ప్రయత్నిస్తే ఉరామరికగా అందుబాటులో ఉండే గీతరచనలో అద్భుతసౌందర్యాలు దాగివుంటాయి. ముఖ్యంగా వయలార్ రామవర్మ రచనలలో. "అతిథి" ఇ. పిలో

(2221 131) 'సీమంతిని' పాటలో దేవరాజన్ సంగీత సౌరభం రామవర్మ సువర్ణ రచనకు తోడౌతుంది తెలుగు వారికి పరిచితుడే అయిన జేసుదాస్ కంఠం దానికి మరింత మెరుగు పెడుతుంది. 'తంగ తింగళ్' వయసుకనే స్వప్న నగరాల గురించి. మాధురిలో కొరవడిన గళ మధురిమను వేణువు కాంతులీను వాద్యగోష్టి కొంత వరకు పూరిస్తుంది. ముగ్గురు మగవారు పాడిన 'అహం బ్రహ్మాస్మి' అన్న బృందగానం మరొక హిప్పీ గీతం. అయితే ఇందులో అల్లరి లేదు. అలా తేలించే లాలసలాలన వున్నది. ఒకసారి వింటే మీకే తెలుస్తుంది.

తమిళ భాషలో క్రైస్తవ గీతాలు నాల్గింటిని ఒక మాదిరి, ఫర్వాలేదు, బాగున్నది. అన్న మూడు తరగతులలో క్రిష్టియన్ ఆర్ట్స్ కమ్యూనికేషన్స్ సర్వీసు వారు సమర్పించిన ఇ.పి లో(2221 137) జె. ఎం రాజు పాడిన 'గోల్గోత కన్నీర్' అన్నది ఉన్న వాటిలో మెరుగైనది. వీటికి సంగీతం పీటర్_రూబెన్.

వచ్చింది వచ్చింది లలిత సంగీత ప్రియులకు వీనుల విందు హుషారు పసందు (రామలక్ష్మి కొంగుబంగారం క్షమించాలి కాపీరైట్ అని గ్రహించాలి) త్యాగ్ ఎల్. ప. (6405 023) చూడటానికి పాల కడిగిన ముత్తెంలా ఎంత ముద్దుగా మురుపు నునుపుగా వుందో వింటానికి తేనె ముంచిన పనస తొనలా అంత మృదువుగా మధురంగా వుంది. 'మన్ పుకారే' పిలుపు ఒక కలకండ పలుకు (లత_కిశోర్). 'కోరా కాగజ్' వలపు ఒక పంచదార పొదివిన వెన్నముద్ద (ఆశా_కిశోర్). ఇ పిలో లేని 'తుఝ్కో ప్యాస్ హై' అన్ని రకాల దాహాలను ఎత్తిస్తూ, తీరుస్తూ ప్రాణాలు తీస్తుంది. 'హంతుం' నదీ తీరాలలా కలవక వుండే ప్రేమికులను ఒక సుధా ప్రవాహం ద్వారా ఆద్యంతం పట్టేస్తుంది. (లత_కిశోర్) 'ఏక్ రాజేకా బేటా' కరడుగట్టిన హృదయాలు కరిగించే కమ్మని కథలు చెబుతుంది (కిశోర్_సుషమ శ్రేష్ఠా) ఈ పాట లెందుకింత బాగున్నవి, చేసినది ఒక స్వరమాంత్రికుడు కనుక (ఎస్. డి. బర్మన్). రచన ఒక గీతాంజాలికునిది కనుక (ఆనంద్ బక్షి). ఇందులో రెండు ముక్కలు 'మన్ పుకారే,' హంతుం ఒక ఎస్. పి. పైనా (6158 010) వినవచ్చు.

ఉత్తరదేశంలో విడుదలై అఖండ విజయాన్ని సాధించిన "దీవార్" చిత్రంలో ఆరుపాటలు ఎల్. పి. లో (2392 060) వినగలరు సంగీతం ఆర్.డి. సాహిత్యం సాహిర్. నిజం చెప్పకోవాలంటే సాహిర్ సాహిత్యం తక్కిన వారిని మింగివేసింది. ముఖ్యంగా 'దీవారోంకీ జంగల్ మే' (మన్నాడే) కోయీ మర్ జాయే' (ఆశాబృందం)అన్న పాటలో ఆశా_కిషోర్ల రెండు యుగళ గీతాలు 'కేహదో తుమ్హే' మైం తుఝ్ మాంగా హై' ఈనాటి వలపు తలపులకు ప్రతీకలు_ ఉర్సులా పాడిన ఆంగ్ల గీతం 'నేను ప్రేమలో పడుతున్నాను' అన్న సారాంశం కలది ప్రత్యేకాకర్షణ. వ్రాసిందెవరో నాకు తెలియదు. రికార్డుపై లేదు (జాకెట్టుపై యే వివరాలూ లేవు!?) సాహిర్

కాదు. భూపేంద్ర పాడిన కోరస్ పక్కన సమాజంపై మైత్రెలు వరద

"చత్తే చత్తే" ఎల్. పి వచ్చింది (2392 056). ఎందులోని ఆరుపాటల్లో రెండు పాటలు శ్లేగా వున్నవి. రచయితా, సంగీత దర్శకుడూ కొంచెం కొత్తవారే (అమిల్ ఖన్నా, భప్పీలాహిరి) శైలేంద్రసింగ్ సులక్షణాపండిట్‌తో పాడిన యుగళగీతమూ (సపోంకా రాజా), లతాతో పాడినదీ (ప్యార్‌కేమే కభీకభీ) రెండూ హాయిగా వున్న పాటలు. వాద్యగోష్టి వంపులతో ఆకట్టేసేది 'జానా కహాఁహై' (సులక్షణా-బప్పి). లతాసోలో 'దూర్‌దూర్', కిశోర్ పాడిన టైటిలు పాటలు రెండు మిగతావి. కవరు ఫేషన్గా వుంది.

మన తెలుగు దర్శకుడు మాధవస్వామి (రావు) దర్శకత్వం వహించిన హిందీ సినిమా "సూరజ్ ఔర్ చందా"లో పాటలు పాలిడార్‌పై వచ్చిన వన్నారు నిజమా అని ఒక పరిశ్రోత (ఆర్. రామ్మూర్తి) విజయవాడనుంచి వ్రాశారు. మహారాజులా నంబరు (6405 025) పాములా మెలికలు తిరిగే 'పూరబ్ దిశాసే' (లత బృందం), పాత పద్ధతిలో వున్నా ఆ పాట మధురంగావున్న 'తేరా నామ్ కా దీవానా', 'తూముకో' (రఫీ) 'హాథీ తో హాథ్‌కేరహే' (లతా ముకేశ్ బృందం) ఎన్నదగిన పాటలు.

ఇక పాశ్చాత్య సంగీతానికి సరళోదాహరణలు ఆస్మాండ్స్ అవర్ బెస్ట్ టు యు లో (2315 300) పధ్నాలుగు పలు విధాల పాటలూ, బీచ్‌పార్టీ 5 లో కైవార్నర్ పాపాటల మూలాతడాఖాలూ (2371 503), డేవిడ్ కస్సిడీ డ్రీమ్స్ఆర్ నథిన్ మోదాన్ విషెస్‌లో (2309 075) 'బాలీహై' నుంచి 'హోల్ట్ ఆన్ మి' వరకూ రకరకాల రవాల పాప్ పాటలూ; కైవార్నర్ పవర్ హిట్స్ (2371 469) అతని అభిమానులకు పుష్కలంగా ఆనందం అందజేసే పన్నెండు పాటలూ వున్నవి. వీటిని గురించి యింకా వివరాలు కావలసినవారు కేరాఫ్ జ్యోతి రిప్లై కార్డేయ వచ్చు.

ఒంగోలులో మీకు వలసిన రికార్డులన్నీ అందించగల డీలరు ఎవరో తెలుసా? నవాజ్ ఎలక్ట్రానిక్స్, ట్రంక్‌రోడ్, ఒంగోలు.

ఒక్క కొలంబియా విడుదల "ఆవకాం పెణ్ దానే" చిత్రంలో మన జమునా రాణి అత్యద్భుతంగా నిత్యనూతనంగా పాడిన పడుచుపాట 'ఎల్లారుంకొళ్ళండైగళ్' 45 G E 10077 లో వింటే మరి కొనకుండా ఆగలేరు మీ డీలర్ దగ్గర లేకపోతే ఆర్డరిచ్చి తెప్పించమనండి

హెచ్. ఎం వి. ఎల్. పి లు "ప్రేమ్ కహానీ" "ఇష్క్ ఇష్క్ ఇష్క్" భలే

రి. బం, రి. కం. వై, రి. శ్రో. స.

తా. క ఆంధ్రదేశంలో ఒకరకం వారు ఆవురావురుమంటూ ఎదురు చూస్తున్న 'సూదిలో దారం సందులో దారం' పిల్లెత్తు కొని యింకా తేలేదు కనుక రికార్డు రాలేదు. ★

# సినిమా

## రంగుల సంగీత వైభవం!

ఎ. వి. యం. సీజర్ సమర్పించు 'బాబు' చిత్రం నయనానందకరమైన వర్ణవిన్యాసం చేసేదే కాక, సంగీతంలో అసామాన్యపు విలువలు సంతరించుకొని తయారౌతోంది. ప్రఖ్యాత దర్శకుడు కె. యస్. ప్రకాశరావు కథ సమకూర్చిన యీ చిత్రానికి ఆయన కుమారుడు కె. రాఘవేంద్రరావు దర్శకుడవడం విశేషం ఇప్పటికే దర్శకత్వపు శాఖలో అశేషానుభవం గడించిన యీ యువదర్శకుని సారధ్యంలో రంగుల సంగీత వైభవంగా తయారయిన ఈ చిత్రంలో కథానాయకుడు శోభన్‌బాబు, వాణిశ్రీ, లక్ష్మి, హిందీ తార అరుణా ఇరానీలు 'గ్లామర్ గాల్స్' గా కన్పించే యీ చిత్రానికి సంగీతం చక్రవర్తి.



'చల్లని తల్లి' లో సుమిత్ర

'చీకటి వెలుగులు' లో కృష్ణ, రాజబాబు





'ముత్యాల ముగ్గు.' లో శ్రీధర్, సంగీత

## సెంచరీ చిత్రాలు!

25 సంవత్సరాల పైబడి తెలుగు చలన చిత్ర పరిశ్రమలో మూల స్థంభాలుగా నిలబడిన ఇద్దరు గొప్ప నటులు పద్మశ్రీ ఎన్. టి. రామారావు పద్మశ్రీ ఎ. నాగేశ్వరరావు వీరు నటించిన నిప్పులాంటి మనిషి (ఎన్. టి. ఆర్) దొరబాబు (ఎ. ఎన్. ఆర్) చిత్రాలు శతదినోత్సవాలు జరుపుకున్నాయి. నిప్పులాంటి మనిషి శత దినోత్సవం విజయవాడలో ఘనంగా జరిగింది. పద్మశ్రీ భానుమతీ రామకృష్ణ అధ్యక్షతన.

## దొరబాబు

మద్రాసులో విజయ గార్డెన్స్‌లో జరిగిన దొరబాబు శత దినోత్సవ విశేషాలు. నలుగురు పద్మశ్రీల కలయిక: ఈ సభ సందర్భంగా నలుగురు పద్మశ్రీలు ఒకే వేదికపై కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. ఈ పద్మశ్రీలు శివాజీ గణేశన్, ఎన్. టి. రామారావు, ఎ. నాగేశ్వరరావు, భానుమతీ రామకృష్ణ. అధ్యక్షత వహించిన శివాజీ గణేశన్ అవసరమైన మరో పని మీద వెళ్ళిపోతూ ఎన్. టి. రామారావును అధ్యక్షుడుగా ఆహ్వానించి సభా కార్యక్రమం నిర్వహించమన్నారు. బహుమతి ప్రదానం భానుమతి చేతులు మీదుగా జరిగింది.

ఉపన్యాస విశేషాలు: దొరబాబు నూతన తరహా కథా నాయకుడిని తెలుగు ప్రేక్షకుల కందించిన చిత్రం (కథా రచయిత గొల్లపూడి). దొరబాబులో కథానాయకి మంజుల తెర నిండుగా మెండుగా కన్పించింది. 'మాంసంలేని' ఆంగ్ల తార ఆడ్రీ



'బలిపీఠం'లో ప్రసన్నరాణి

హెప్‌బర్న్‌లా గాక (పాటల రచయిత దాశరథి). శత దినోత్సవాలను చేసుకొనే బదులు ఫెయిలయిన చిత్రాల గురించి నలుగురం ఒకచోటు కూర్చుని చర్చించు కొనడం ఉపయోగకరంగా ఉంటుంది (నటుడు సత్యనారాయణ). ఈ చిత్రాన్ని పూర్తిగాకుండానే విడుదల చేశారు. ఇంకా కొన్ని సన్నివేశాల చిత్రీకరణ జరగవలసి వుంది. నిర్మాతల ఇబ్బందుల వలన అలా చేసి వుండవచ్చు. తెలుగు ఫిలిం ఇండస్ట్రీకి త్వరలోనే 'స్లంపు' వస్తుంది. ఈ స్లంపు రావాల్సిందే. ఆ తరువాత వచ్చే కొత్త ఆలోచనలూ, కొత్త రక్తం పరిశ్రమకు మేలు చేస్తాయి. మంచి చిత్రాలు వస్తాయి (పద్మశ్రీ నాగేశ్వరరావు). మనకు ప్రధానం ఎన్ని ఎక్కువ చిత్రాలు విజయవంత మౌతుయా అని. పరిశ్రమను దెబ్బతిన నీయకూడదు. ఈ పరిశ్రమలో వున్న ప్రతి వ్యక్తి తన బాధ్యత నెరిగి ప్రవర్తిస్తే, పరిశ్రమ బాగుపడుతుంది. ప్రేక్షకులు కోరు కొంటున్నంత కాలం డభై ఏళ్ళ వయసు

'స్వతంత్రం వచ్చింది' లో ఒక దృశ్యం



యినా కత్తి యుద్ధాలూ చేస్తాం. గుర్రపు స్వారీలూ చేస్తాం. ఇవి 'హీరో వర్షిప్' ఉన్న రోజులు. హీరోని బట్టి చిత్రాలు విజయవంత మౌతున్న రోజులు. ఇలా అంటున్నందుకు భానుమతిగారు క్షమించాలి. (అవసరంలేదు. నేను నటించే చిత్రాలలో నేనే 'హీరో'ని గనుక-భానుమతి) క్రమ శిక్షణ కావాలి. పట్టుదలతో అందరం కృషి చెయ్యాలి (పద్మశ్రీ ఎన్ టి రామారావు) దొరబాబు నా అభిరుచుల కనుగుణంగా లేక పోయినా హీరో (నాగేశ్వరరావు) గారు చాలా బాగా నటించారు. ఇది అంతర్జాతీయ స్త్రీల సంవత్సరలో నేమో నిప్పులాంటి మనిషి శత దినోత్సవానికీ దొరబాబు శత దినోత్సవానికీ కూడా నన్ను వేదిక నెక్కించారు. నాగేశ్వరరావుగారు పరిపూర్ణ. ఆరోగ్యవంతులైనందుకు చాలా సంతోషం. ఆయన మరెన్నో మంచి చిత్రాలలో నటించాలని కోరుకొంటున్నాను (పద్మశ్రీ భాను మతి) ఊ(. అ(। నేను చిన్నవాడిని-ఇ( వూ। అంత పెద్ద ఊ వారు ఊ( ఊ( అ( శత దినో అ( ఊ త్సవం మామ్ మా సంతోషం ఊ మం మా ఎన్నో ఆ ఆ వూ(



'జీవనజ్యోతి'లో వాణిశ్రీ, బేబి వరలక్ష్మి

జరగాలి ఈ అవకాశ మిచ్చినందుకు కృతజ్ఞతలు (సరదా సీరియస్ రాజబాబు)

## విడుదలకు ముందే విదేశ ప్రశంశ!

నిర్మాత యు. విశ్వేశ్వరరావు (పద్మపి రాజన్ కథకు) స్క్రీన్‌ప్లే మాటలు, పాటలు, దర్శకత్వపు బాధ్యతలు నిర్వహించి నిర్మించిన 'తీర్పు' చిత్రం విడుదలకు ముందే విదేశీయుల ప్రశంశల నందుకొంది అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ సందర్భంగా ఢిల్లీలో యీ చిత్ర ప్రదర్శన

విజయలక్ష్మి ఇంటర్నేషనల్ 'నీడలు-నిజాలు' సాంగ్ రికార్డింగ్ జరిగినప్పటి దృశ్యం





'తీర్పు' లో సుజాత

జరిగింది. ఆ సందర్భంగా యీ చిత్రాన్ని చూసిన ప్రతివారూ విశ్వేశ్వరరావు ప్రతిభను కొనియాడారు పద్మశ్రీ ఎన్. టి. రామారావు న్యాయమూర్తి పాత్రనూ, నిర్మాత విశ్వేశ్వరరావు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాత్రనూ నిర్వహించిన యీ చిత్రంలో చాలామంది కొత్త తారలు కన్పిస్తారు. త్వరలోనే యీ చిత్రం విడుదల

## మా ఊరి గంగ

రాధికా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న యీ చిత్రం దాదాపు అయిదు రీళ్ళు తయారైంది తయారైన వరకూ పత్రికా విలేఖరులకు చూపించారు నిర్మాతలు ఇటీవల చిత్రీకరణలో కొత్తదనం కన్పించింది కథా నాయకి లక్ష్మి నటన 'సూపర్బ్'గా వుంది. సత్యనారాయణ, జగ్గయ్య, ధూళిపాళ, శుభ, పి. ఆర్. వరలక్ష్మికూడా నటించే యీ చిత్రానికి కథ వై. సరోజినీదేవి. నిర్మాత. సంగీత దర్శకుడు. యార్లగడ్డ రామచంద్ర రావు, దర్శకత్వం కె. యస్. ఆర్. దాస్.

## మరో విప్లవ వీరుడు!

ఆంధ్రదేశం గర్వించదగ్గ విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు గాధను అద్భుతమైన చలన చిత్రంగా రూపొందించి విజయం పొందాడు నటుడు కృష్ణ చరిత్ర పుటలలో నుంచి ఇప్పుడు మరో విప్లవ వీరుడిని వెలికితీసి, తెర కెక్కిస్తున్నారు శ్రీ రాజ రాజేశ్వరి మూవీస్‌వారు నూజివీడు సంస్థానాధిపతి నారయి అప్పారావు బ్రిటిషువారిని ఎదిర్చి పోరాడిన విషయం అంతగా ప్రచారం పొందలేదు. కాని ఈ వీరుడి కథ చరిత్రలో నిక్షిప్తమై ఉంది రచయిత ఆరుద్ర ఆ గాధను వెలికి తీస్తున్నారు, ఓ. యస్. ఆర్. ఆంజనేయులు దర్శకత్వంలో నిర్మించబడుతున్న యీచిత్రంలో జగ్గయ్య,

కాంతరావు, ముక్కామల, రావి కొండల రావు. ప్రస్తుతానికి నిర్ణయించబడ్డా తారాగణం ఈ చిత్ర నిర్మాతలు టి. యం. కె. మూర్తి, జె. పి. రావు.

### కులాలెందుకు?

ఈ లోకంలో కులాలు రెండే రెండు అవి మంచీ, చెడూను. మంచి అన్నది, 'మాల' అయితే నేను మాలనే అవుతాను అన్నాడు గురజాడ. ఎంత వృద్ధుడైనా మగవాడికి పునర్వివాహావకాశా లుండగా, బ్రతుకే తెలియని బాల వితంతువు కెందుకుండదా హక్కు అని ప్రశ్నించారు, కందుకూరి వీరేశలింగం—ఈ సంఘ సంస్కర్తల ఉపదేశాలు మనపై ఎంత ప్రభావం చూపాయి. మన మెంత ప్రగతి పొందాము? నవలగా ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూపిన రంగనాయకమ్మ రచన 'బలిపీఠం', ఇప్పుడు పై ప్రశ్నకు సమాధానంగా నిర్మించబడుతోంది.

రంగుల్లో నిర్మితమవుతున్న యీ చిత్రంలో శోభన్‌బాబు, శారద, రాజబాబు రోజారమణి, ముఖ్య పాత్రలలో కన్పిస్తారు. నిర్మాత సునీల్ చౌదరి. దర్శకత్వం దాసరి నారాయణరావు. సంగీతం: చక్రవర్తి.

### 'చల్లని తల్లి' పూర్తయింది

లలితా మూవీస్ పతాకం క్రింద జగదీష్ చంద్ర ప్రసాద్ నిర్మిస్తున్న 'చల్లని తల్లి' చిత్రం పూర్తయింది. ప్రముఖ నిర్మాత డి. మధుసూధనరావు కథ సమకూర్చిన

'అమ్మాయిల శపథం' లో రామకృష్ణ, చంద్రకళ





'మాయామశ్చీంద్ర' లో వాణిశ్రీ

యీ చిత్రంలో హీరో (విజయకాంత్), హీరోయిన్ (సుమిత్ర) యిద్దరూ కొత్త వారే యస్వీ రంగారావు, అంజలీదేవి, కాంతారావు, జయంతి, రాజబాబు, రమాప్రభ, అల్లు రామలింగయ్య, సూర్యకాంతం ముఖ్య పాత్రలలో కన్పిస్తారు గొల్లపూడి మాటలతో, రాజేశ్వరరావు సంగీతంతో తయారైందీ చిత్రం. దర్శకత్వం కె ఎస్. రామిరెడ్డి.

జీవనజ్యోతి

డి. వి. యస్ రాజు నిర్మిస్తున్న 'జీవనజ్యోతి' జనవరి చివరి వారంలో ఊటీకి వెళ్ళింది శోభన్, వాణిశ్రీల పై మూడు పాటల చిత్రీకరణమే గాక, వీరిద్దరితో పాటు వాణిశ్రీ, సత్యనారాయణ, శుభ, రాజబాబు పాల్గొన్న ముఖ్య సన్నివేశాలు కొన్ని చిత్రీకరించబడ్డాయి వాణిశ్రీ ద్విపాత్రాభినయం (తల్లీ కూతురు) విశేషాకర్షణగాగల యీ రంగుల చిత్రానికి దర్శకుడు కె విశ్వనాథ్. కె.వి. మహదేవన్ సంగీత కర్త. ఉగాదికి విడుదల కాబోయే చిత్రమిది.

మనస్సాక్షి!

ముక్కుపచ్చలారని ఓ పసిపాపను రక్షించే ప్రయత్నంలో తన నిండు జీవితానికే ముప్పు తెచ్చుకున్న ఓ రవి కధ యిది అంతవరకూ సాఫీగా నడుస్తున్న జీవితం యీ 'మంచి' కార్యం ఫలితంగా ఒడిదుడుకుల పాలై, కోర్టుల కెక్కింది. కన్నతండ్రికీ, ప్రేమించిన యువతికీ క్షోభ కలిగించింది మహాధైర్యం, ఆత్మవిశ్వాసం నిండుగావున్న ఏమీ చేయలేని పరిస్థితిలో పడ్డాడు రవి 'మనస్సాక్షి' చిత్రం యీ కధ. తాలూకు పూర్తి వివరాలు తెలుపుతుంది.

వాసిరెడ్డి సీతాదేవి కథ సమకూర్చిన యీ చిత్రాన్ని పి. సాంబశివరావు దర్శకత్వంలో, అమరారామ సుబ్బారావు నిర్మిస్తున్నారు కృష్ణ, భారతి, జానకి, జగ్గయ్య, గిరిబాబు, ఉమ, కాంతారావు మొదలైనవారు నటిస్తున్నారు.

### జెమినీ చిత్రం!

విజయవంతమైన ఎన్నో చిత్రాలను నిర్మించిన సంస్థ జెమిని దక్షిణాది భాషలలోనుగాక హిందీలో కూడా యీ సంస్థకి గొప్ప పేరుంది. ఈ సంస్థ కొత్తగా నిర్మిస్తున్న చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషలలో ఓకేసారి నిర్మించబడుతోంది. 'భూతయ్యా నమగ అయ్యా' అన్న కన్నడ చిత్రం ఆధారంగా నిర్మిత మవుతున్న యీ రంగుల చిత్రపు తెలుగు వెర్షన్‌లో శోభన్‌బాబు, మంజుల ప్రధాన పాత్రలలో కన్పిస్తారు. యీ త్రిభాషా చిత్రానికి దర్శకుడు యస్. యస్. బాలన్. 1974 లో ఉత్తమ 'కెమెరామాన్' బహుమతి పొందిన డి. వి. రాజారాం కెమెరా నిర్వహిస్తున్నారు. సంగీతం: వి. కుమార్.

### 'వయసొచ్చిన పిల్ల'

ముకుటంలోనే 'ఆకర్షణ' గల యీ చిత్రం కృషివలా ఫిలింస్‌వారు నిర్మిస్తున్నారు, పి. వి. సుబ్బారావు నిర్మాణ నిర్వహణలో కోటిపాటి మురహరిరావు, పెడగు రామిరెడ్డి నిర్మిస్తున్నారీ చిత్రాన్ని. 'వయసొచ్చిన పిల్ల' రకరకాల వ్యక్తులదృష్టికి రకరకాలుగా కన్పిస్తుంది ఒకరి దృష్టికో గృహిణిగా, ఇంకోరి దృష్టిలో విలాసినిగా, మరొకరి దృష్టిలో ప్రేమమయిగా, మరో దృష్టికి మంచి స్నేహితురాలిగా కన్పించవచ్చు. యీ నాలుగు రకాల దృష్టిగల పాత్రలను గిరిబాబు, మురళీమోహన్, ఎం. రంగారావు, శరత్‌బాబు నటిస్తున్నారు ఇంతకీ వయసొచ్చిన పిల్ల లెవరో తెలుసా? లక్ష్మి, చంద్రకళ: యీ చిత్రానికి కథ, మాటలు వెంపో, సంగీతం టి చలపతిరావు, దర్శకత్వం: పి లక్ష్మీదీపక్.

### అభిమానవతి!

ఆస్తిపాస్తులే ఆడంబరాన్ని పరువు ప్రతిష్టల్ని తెచ్చిపెడతాయని నమ్మే అత్తగారూ, అనాథాశ్రమంలో పెరిగినా క్రమశిక్షణతో, కష్టాల్నెదిరించగల ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో పెరిగిన యువతి కోడలు. కాలేజీ చదువుతో గాక పుట్టుకతో సభ్యత, సంస్కారం, సౌశీల్యం అలవరచుకొన్న

'అన్నదమ్ముల కథ' లో రాజేశ్వరి, ప్రభ





'పుట్టింటి గౌరవం' లో భారతి

దీమె. జీవిత పయనంలో వీరిద్దరి అభి ప్రాయాల సంఘర్షణ జరగటం సహజం. ఆ సంఘర్షణలో విజయం కుటిలమతులకు లభించదనీ. పవిత్రమైన ఆలోచనలున్న వారినే వరిస్తుందనీ చాటి చెప్పే చిత్రం అభిమానవతి. డూండీ దర్శకత్వంలో అత్తగా యస్వరలక్ష్మి. కోడలుగా వాణిశ్రీ నటిస్తున్న యీ చిత్రంలో కృష్ణ ద్విపాత్రాభినయం చేస్తున్నాడు త్రిమూర్తి ప్రొడక్షన్స్ పతాకం క్రింద యీ చిత్రాన్ని నిర్మించింది జి. సాంబశివరావు, పి బాబ్జీ కధ, మాటలు ప్రఖ్యాత రచయిత్రి కె. రామలక్ష్మి సమకూర్చిన యీ చిత్రానికి సంగీతం చక్రవర్తి నిర్వహింవారు.

'బాపు' కొత్తచిత్రం

దర్శకుడిగా చిత్ర చిత్రానికి చిత్రమైన అనుభూతుల్నందిస్తున్న బాపు ఇంత వరకూ నిర్మించిన ప్రతి చిత్రమూ ప్రత్యే కత కలిగివుంటోంది. సాక్షి, బంగారు పిచిక, బుద్ధిమంతుడు, అందాలరాముడు సాంఘిక చిత్రాలకో బాపు ముద్రవేసు కొన్న రత్నాల మాలలు, ఇక పౌరాణిక చిత్రం బాపు చేత తీయించాలన్న 'మార్కు' తెచ్చేసుకొన్న యీ దర్శకుడి కీర్తి కిరీటంలో ఎగిరి కూచున్నాయి 'సంపూర్ణ రామాయణం' 'శ్రీరామాంజనేయ యుద్ధం' బాపు ఇప్పుడు 'ముత్యాల ముగ్గు' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. శ్రీరామా చిత్ర వారు రంగుల్లో నిర్మిస్తున్న యీ చిత్రానికి నిర్మాత యమ్ వి. ఎల్. నరసింహారావు. బాపు దర్శకత్వ వహిస్తున్న చిత్రానికి రచనెవరిదంటే ముళ్ళపూడి వెంకటరమణదే అని చెప్పాలి మరి! శ్రీధర్, సంగీతాలు ప్రధాన భూమికలలో కన్పించే యీ చిత్రానికి మహాదేవన్ సంగీతం, ఇషాన్ ఆర్యా (గరమ్‌హవా కెమెరామాన్) కెమెరా నిర్వహిస్తున్నారు.

# జగన్మోహన రాగం!



'కళ' ఎప్పటికప్పుడు నవ్యతనాహ్వాన్ని ఇస్తూనే వుంటుంది. కళాప్రాతిపదికపై నడిచే సినిమా పరిశ్రమకు ఎప్పటికప్పుడు నూతన రక్తం అవసరమవుతూనే వుంటోంది. సినిమా ప్లేబాక్ గాయకుడ నవ్వాలని ఉత్సాహపడుతున్న యువకుడు ప్రక్క ఫోటోలోని జగన్మోహన్. కర్ణాటక సంగీతంలో శిక్షితుడైన యీ గాయకుడు అందంగా పాడటమే గాదు అందంగా వుంటాడు కూడా. కె. బి. కె మోహనరాజు, చిత్తరంజన్‌లతో పాటు హైదరాబాదులో ఎన్నో కచేరీలు జరిపాడు. కీ॥శే॥ ఘంటసాల, కె వి మహాదేవన్, చక్రవర్తి, టి. చలపతిరావు మొదలైన ప్రఖ్యాత సంగీత దర్శకుల సమక్షాన తన పాటల బలంచూపి వారి ప్రశంసలందుకొన్నాడు సంగీతంలో దిట్టనిపించుకున్న హిందీచిత్రాల సంగీత దర్శకుడు నౌషద్ ప్రత్యేక ప్రశంసలు పొందిన ప్రతిభా శాలి జగన్మోహన్. బాంక్ ఆఫ్ బరోడాలో ఉద్యోగం చేస్తూన్నాడీ కామర్స్ మరియు ఇంజనీరింగ్‌లలో పట్టభద్రుడైన యువకుడు సంగీత దర్శకులు. చక్రవర్తి టి చలపతిరావులు యీ యువ గాయకుని ప్రతిభను గుర్తించి త్వరలోనే సినిమా పాటలు పాడే అవకాశం కల్పించ బోతున్నారు 9 D/5 శివాజీ స్ట్రీట్, టి. నగర్, మద్రాసు-17 లో నివసిస్తున్న జగన్మోహన్‌కి 'సినిమా ప్లే బాక్ సింగర్ గా ఉజ్జ్వల భవిష్యత్తు నాశించవచ్చు

---

## మరారీ మాయల శృంగారం!

రంగుల్లో భారీ ఎత్తున్న బాలనాగమ్మ చిత్రాన్ని నిర్మిస్తున జయకృష్ణ పత్రికా విలేఖరులకు పసందైన నాట్యపు విందు చూపించారు. మాయల మరారీ (సత్యనారాయణ) ముందు ముగ్గురు సుందరాంగనలు పురాతన మినీ డ్రస్‌లతో (రాజశ్రీ, హాలం, మరో జ్యోతిలక్ష్మి (జ్యోతిలక్ష్మి చెల్లెలు) నాట్యం చెయ్యడాన్ని చిత్రీకరిస్తున్నారా రోజు. సత్యనారాయణ నటుడిగా ఆకాశపు టంచుల్ని చూస్తున్నాడిప్పుడు. ఈ తరుణంలో సత్యనారాయణ మాయల మరారీగా నటించడం బాలనాగమ్మకు పెద్ద ఎస్సెట్. కొన్ని ఇతర విశేషాలు: చిత్రీకరణ రంగుల్లో జరపడం; కథను మధనంచేసి దానికి లాజిక్ చేర్చి మరింత ఆసక్తికరంగా తయారుచేయడం, ఖర్చుకు వెనకాడక ఖరీదైన సెట్లు నిర్మించుకోవడం, ప్రత్యేక శ్రద్ధతో యీ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న సి. యస్. రావు. సుసర్ల దక్షిణామూర్తి సంగీతం

సంక్షిప్త సమాచారమ్!

★ మాయాబజార్ (సాంఘిక చిత్రం!) నిర్మిస్తోంది అజంతా మూవీస్ సంస్థ. విజయాగార్డెన్స్‌లో సాంగ్ రికార్డింగ్‌తో చిత్ర నిర్మాణం ప్రారంభ మయింది 14-2-75 న.

★ ఎ. వి. కె. ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న 'లక్ష్మణరేఖ'లో జయసుధ, సుమ, ఛాయాదేవి, గుమ్మడి, చంద్రమోహన్, మురళీమోహన్, కె. వి. చలం నటిస్తున్నారు. సత్యం, సంగీతం, ఎన్. గోపాలకృష్ణ దర్శకుడు.

★ పి. శ్రీనివాసరెడ్డి దర్శకత్వంలో యస్. వి. యస్. ఆర్. పిక్చర్స్ 'ఉత్తమురాలు' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గుమ్మడి, జగ్గయ్య, విజయలలిత, జయంతి, పద్మనాభం, రాజనాల మొదలగువారు నటిస్తున్నారు.

★ పద్నాలుగు రీళ్ళు పూర్తి అయి, మరొక్క షెడ్యులుతో చిత్రం తయారయ్ స్టేజిలో వుంది రంజిత్ మూవీస్ వారి చీకటి వెలుగులు. కృష్ణ, వాణిశ్రీ, పద్మప్రియలు నటించే యీ రంగుల చిత్రపు దర్శకుడు కె. యస్. ప్రకాశరావు నిర్మాత కె. రంజిత్‌కుమార్.

★ కన్నడంలో 'సూపర్‌హిట్' అయిన బంగారుద మనుష్య తెలుగులో నిర్మి నిర్మిస్తున్నారు పూర్ణిమా పిక్చర్స్‌వారు. కృష్ణ, మంజుల, జానకి, వెన్నిరాడై నిర్మల, రాజబాబు, చంద్రమోహన్ మొదలైనవారు నటించే యీ చిత్రానికి దర్శకత్వం పి యస్. రావు, నిర్మాత: డి. ఎన్. రాజు.

★ శ్రీ భాస్కర చిత్ర ఈస్టమన్ కలర్లో నిర్మిస్తున్న చిత్రంలో ఎన్.టి. రామారావు, జగ్గయ్య, గుమ్మడి, వాణిశ్రీ, విజయలలితలు నటిస్తున్నారు. బి. వి. ప్రసాద్ దర్శకుడు నిర్మాత ఎ. పుండరీకాక్షయ్య.

★ ఎమ్. బాలయ్య సమర్పిస్తున్న అమృతా ఫిలింస్‌వారి 'అన్నదమ్ములకథ' తయారైంది. బాలయ్య, సత్యంద్రకుమార్, చంద్రమోహన్, ప్రభ, రోజారమణి, సుజాత, పండరీబాయి మొదలయిన వారు నటిస్తున్న ఈ చిత్రానికి కథ: ఎమ్. బాలయ్య, డి. ఎస్. ప్రకాశరావు దర్శకుడు.

★ పద్మనాభం దర్శకత్వంలో (హిందీ చిత్రం కువారా బాప్) 'పెళ్ళికాని తండ్రి' చిత్రం నిర్మించబడుతోంది. చక్రపాణి ఆర్ట్ పిక్చర్స్ వారు నిర్మిస్తున్న చిత్రమిది.

★ పద్మనాభం దర్శకత్వంలో మరోచిత్రం (హిందీ చిత్రం కాజల్ ఆధారంగా) శ్రీ కోదండరామా మూవీస్‌వారు నిర్మిస్తున్నారు. 'కంటికి కాటుక-ఇంటికి ఇల్లాలు' పేరుతో నిర్మిత మయ్యే ఈ చిత్రంలో కృష్ణ, జమున, సరోజాదేవి, రామకృష్ణ, పద్మనాభం మొదలైనవారు నటిస్తున్నారు. ఒక ముఖ్య పాత్రలో హరనాధ్ కన్పిస్తాడు. ★

## అద్భుతమైన ఫోటోల ప్రదర్శన!

భారతదేశంలోని ఫోటోగ్రాఫర్ల ప్రతిభను వేనోళ్ళ చాటుతూ నిలిచాయి మద్రాసులో ఫిబ్రవరి 14, 15, 16 తేదీలలో జరిగిన ఫోటోగ్రాఫిక్ ప్రదర్శనలోని ఫోటోలు. వైవిధ్యమున్న రకరకాల అంశాలు—చిత్రాలు, సృష్టి సౌందర్యం, వన్యమృగాలు . వీటన్నిటినీ రంగుల్లోనూ, నలుపు తెలుపుల్లోనూ నిలిపి చూపారీ కళాకారులు. ఈ ప్రదర్శన ప్రారంభించిన తమిళనాడు విద్యాశాఖా మంత్రి నెడుం జెళియన్ తమిళనాడులో ఫోటోగ్రాఫిక్ అకాడిమీని స్థాపించేందుకు తప్పక తన సహకారాన్నిస్తామన్నారు. రోజు వారీ జీవితాలు మరీ యాంత్రికంగా తయారై పోతున్న యీ రోజుల్లో యీ టెన్షన్స్‌కు దూరంగా నిలిచి కళా రసాస్వాదనాను భూతికి దోహదంచేసే యిటువంటి ప్రదర్శనల నెంతో ప్రోత్సహించాలి. మన జీవితంలో చక్కని రిలీఫ్ నందించని కళలే మరి!



రోలింగ్ షీల్డ్ గెలుపొందిన ఛాయా చిత్రం. కలకత్తాకు చెందిన బెనూసేన్ తీసిన బ్యూటీ ఈజ్ బోర్న్ (సౌందర్యం జన్మించింది) ఫోటో ఇది.
(మద్రాసు ఫోటోగ్రాఫిక్ సొసైటీ సౌజన్యంతో)

# జ్యోతి నవలానుబంధం



## (మూడవ భాగము)

"ఇలా కోపంగా చూడకు. పోనీ దూరంగా కూచోనులే "

"ఏయ్!" అంటూ రాణీ ఒక్కటి వెయ్యబోయింది.

వీర్రాజయితే తెలివిగా తప్పుకున్నాడు. కాని ఆ దెబ్బమాత్రం వచ్చి. "వేరు శెనక్కాయలు కావాలా?" అంటూ అప్పుడే వాళ్ళ మధ్యకి వస్తూన్న ఓ పన్నెండేళ్ళ కుర్రాడికి తగిలింది దాంతో వాడి జంగిడిలో కాయలు ఇటూ అటూ చెల్లాచెదరై పోవడం, వాడు బిక్కమొహంతో రాణీకేసి చూడడం, అనుకోకుండా జరిగిన ఆ పొర బాటుకి రాణీ బాధపడడం "ఏం జరిగిందా?" అని వీర్రాజు విస్తుపోవడం, అన్నీ ఒక్క సారిగా జరిగిపోయాయి

వీర్రాజు కంగారుగా క్రిందపడిన కాయలన్నీ ఏరి వాడి జంగిడిలో పోసేసి తనో పావలా కాయలు వాడిదగ్గర కొని. వాడిని బుజ్జగించి పంపించాడు.

"పొరబాటయింది" అన్నట్లు రాణీ వీర్రాజుకేసి చూసింది.

"నువ్వు కొడితే, ప్రేమించిన నేరానికి కిరీటి అనబడే ఈ వీర్రాజు పడతాడు కాని, వీధినిపోయే వాళ్ళందరూ పడతారా మరి?"

బేలగా చూసింది రాణీ

"ఇంతటితో కాలేదు జనాన్ని తీసుకువస్తాడిప్పుడు. వాళ్ళకి నువ్వు సంజాయిషీ ఇవ్వాలి వాడిని ఎందుకు కొట్టావో అడుగుతారు."

"నిజంగా?"

"ఆ! ఇందాకటి పైల్వాన్ ఉన్నా బాగుండిపోను ఇప్పుడు నిన్ను రక్షించి వుండును "

"మీరున్నారు కదా?"

"నేనేం చెయ్యగలను అంతమంది వస్తే. బక్కవాడిని."

"అలా అనకండి. ఇప్పుడు తెలిసిందిగా? మీరు ఎంతమందినైనా ఎదిరించ గలరు."

"నేనేం గామానా, పైల్వానునా? అధమం నూటఏభై పౌన్లైనా లేనే? ఎత్తు కూడా అయిదడుగులకి తక్కువే. పోనీ ఛాతీ చూద్దాం అంటే ." వీర్రాజు మాట మధ్యలో ఆగిపోయాడు ఆమె కన్నీళ్ళు చూసి. 'ఎందుకు నన్నిలా ఏడిపిస్తారు?' అన్నట్లున్నాయి ఆమె చూపులు

మరి ఆమెని ఏడిపించ కూడదనుకున్నాడో ఏమో. "సరే అయితే- నేను వెళ్ళి వాళ్ళని సర్ది వస్తాను. అందాకా నువ్వు ఎక్కడ వుంటావు? వాళ్ళ కంటికి కనిపించ కుండా ఎక్కడేనా దాక్కుంటే మంచిది. ఆ పొదరింట్లో అయితే బాగుంటుంది. కాని నువ్వు వెళ్ళనంటున్నావుకదా అక్కడికి?" అన్నాడు వీర్రాజు

"వెళతాను."

"అయితే నడు" అని ఆమెని తీసికెళ్ళి గుబురుగా వున్న పొదకింద కూర్చో బెట్టి, తను పదినిముషాలు అటూ ఇటూ తిరిగివచ్చాడు. రేగిపోయిన జుట్టుతోనూ నలిగి పోయిన బట్టలతోను. అతని రూపాన్ని చూసి రాణీ వణికిపోసాగింది. "ఏమిటలా వణికిపోతున్నావు?" అన్నాడు ఆమెని దగ్గరగా తీసుకుంటూ వీర్రాజు.

"మీకేం దెబ్బలు తగలలేదు కదా?" అతని వళ్ళంతా నిమురుతూ అడిగింది రాణీ.

"తగిలినా ఫరవాలేదు. తర్వాత ఇలాంటి హస్తస్పర్శ లభించే మాటయితే" అన్నాడు అరమోడ్పు కన్నులతో తన్మయత్వంలో తేలిపోతూ. రాణీ సిగ్గుపడి చేతులు అతనిమీంచి తీసేసి దూరంగా జరగబోయింది.

"వద్దు రాణీ-ఇలాగే వుండిపో" అంటూ ఆమెని మరింత దగ్గిరగా తీసుకున్నాడు వీర్రాజు ఎంతో తమకంతో.

అతని కౌగిలిలో కరిగిపోతూ, మాటలకందని మధురానుభూతిలో తేలిపోతూ, అపురూపమైన ఆనందంలో మునిగిపోతూ, రాణీ ఎంతసేపు ఉండిపోయిందో అలా.

చుట్టూ ముసురుకుంటున్న చీకట్లు చూసి ఉలిక్కిపడి "అమ్మో ఎంత ఆలస్యం అయిపోయిందో మావయ్య తిడతాడు" అంటూ లేచింది రాణీ-వీర్రాజు కూడా లేచి, రాణీని కొంతదూరం ఆటోరిక్షాలో తీసుకువచ్చి, ఆటోని, యజమాని గేరేజీలో వుంచి, బయలుదేరినప్పటిలాగే తిరిగి నడిపించి తీసుకువచ్చాడు ఇంటికి. అంత ఆలశ్యంగా వచ్చినా రాణీ అనుకున్నట్లు రవణయ్యేం కేక వెయ్యలేదు వాళ్ళని చూసే చూడనట్లూరుకున్నాడు.

## 9

పారం మధ్యలో, ప్రస్తావన వశాత్తూ ప్రొఫెసర్ చెప్పిన చిత్రమైన న్యూరాలజీ కేసుల గురించి ఆలోచిస్తూ, తలవంచుకొని పరధ్యానంగా కేంటిన్‌వేపు నడిచి వస్తూన్న శేఖర్, వెనకనుంచి ఎవరో తనని పిలిచినట్లు అలికిడి అయి, వెనక్కి తిరిగి చూశాడు.

మాధురి!

పెదిమలమీద మందహాసం చిందిస్తూ, చేతిలోవున్న నోట్‌బుక్‌ని విలాసంగా ఊపుకుంటూ, గబగబా అడుగులు వేసుకుంటూ తనవేపే వస్తోంది ఆమెని చూడగానే శేఖర్ హృదయం, ఆనందంతో నిండిపోయి, వెంటనే ఏదో అర్థంకాని నిరుత్సాహంతో కృంగిపోయింది.

మొట్టమొదట, రేడియో నాటికలో పాల్గొనవలసిందిగా ఆమెని అభ్యర్థించడానికి తనూ కిరీటీ వెళ్ళినపుడు. వాళ్ళ చీడీ మెట్లమీద విద్యుల్లతలా మెరిసినప్పుడే, మాధురి తన ఆలోచనల్లో చోటుచేసుకొంది. ఆ తర్వాత ఆమెతో పరిచయం అయి, రేడియో

నాటిక రిహార్సల్స్ కోసం తరుచు కలుసుకోవడంతో చనువు పెరిగి చిత్రమైన స్నేహంగా రూపొందింది. ఆ స్నేహానికి మమతని జోడించి జీవిత మాధుర్యాన్ని పండించుకోవాలనే కోర్కె, సన్నని మొలకలా గుండెల్లో చిగురించేసరికి, ముందు సంకోచించి తటపటాయించినా, తర్వాత ఆమె నవ్వుతూ మాట్లాడే తీరునీ, ఎరమరికలు లేకుండా ప్రవర్తిస్తున్న పద్ధతినీ చూసి, ఆశల్ని పెంచుకొని ఆత్మీయతని అధికం చేసుకున్నడు.

కాని ఇంతలో మాధురికి కిరీటిమీద మనస్సు వుందని అనుమానం తగిలింది తనకి. దానికితోడు రేడియోనాటికలో తనప్రక్కన వేసే హీరోగా కిరీటినే ఆమె ఎన్నుకోవడం. ఏదైనా వాదన వచ్చినపుడు విధిగా ఆమె వాడినే సమర్ధించడం, ఆఖరికి అతని ఎంగిలినీళ్ళు తాగినప్పుడు కూడా ఆమె ఏం బాధ పడకపోవడం, ఇవన్నీ చూసేసరికి మాధురి, కిరీటిని ప్రేమిస్తోందనే నమ్మకం తనకి బలంగా ఏర్పడింది. ఆ నమ్మకాన్ని పరీక్షించడంకోసమే, తెల్లారితే రేడియో రికార్డింగ్ అనగా, 'వాడిని తీసుకువెళితే తెల్లవారికాని పంపవద్దు అని ఒకమాట అని చూశాడు. ఆమె అలాగే చేసి తన నమ్మకాన్ని నిర్ధారణ చేసింది. అయితే ఓ రాత్రివేళ వాడు రూంకి ఎందుకు తిరిగివచ్చాడో, మర్నాడు రికార్డింగ్ రోజున అటు మాధురీ, ఇటు కిరీటీ కూడా ఎందుకు ముభావంగా వుండి ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోలేదో, తనకి ఈ నాటికి అర్థం కాలేదు ఎన్నిప్రశ్నలు వేసినా కిరీటి సమాధానం చెప్పలేదు, మాధురిని ప్రశ్నించడానికి తనకి అవకాశమే లేకపోయింది వాళ్ళిద్దరి స్నేహంలోనూ కన్పించిన ఈ చిన్న మార్పు మినహా, మరి ఏదో వాళ్ళ ఆత్మీయతని తక్కువగా చూడడానికి కానీ, తన మనస్సులో తలయెత్తిన ప్రేమని పెంచుకోడానికి కానీ, దోహదం చెయ్యలేదు. ఫలితంగా 'మాధురి కిరీటిని ప్రేమిస్తోంది' అనే నమ్మకం బలంగా స్థిరపడింది.

తను ఎంతగానో అభిమానిస్తూ ప్రాణానికి ప్రాణంగా చూసుకుంటూన్న కిరీటిని మాధురి ప్రేమిస్తూన్నప్పుడు, తను ఆమెమీద ఎలా ఆశలు పెంచుకుంటాడు! అందుకే మనస్సులో జనించిన మమతని మనస్సులోనే అణి చేసుకుని పైకి మామూలుగా ఉంటున్నాడు. ఇలా మాధురిపట్ల ఒకవైపు ప్రేమా, మరోవైపు ఉదాసీనత తన గుండెల్లో ఒకదానిపక్క ఒకటి వుంటూనే వుంది ఇన్నాళ్ళ నుంచీను. అందువల్లే, ఆమెని చూసినప్పుడు హృదయం ఆనందంతో పొంగిపోవడం అంతలోనే నిస్పృహతో క్రుంగి పోవడమూను.

"ఏమిటి పరధ్యానంగా వున్నారు?" అంది మాధురి మడిచి చేత్తో పట్టుకున్న స్టెతోస్కోపు కేసి చూస్తూ నిలబడ్డ శేఖర్‌ని పరిశీలిస్తూ.

శేఖర్ ఏం మాట్లాడలేదు.

"క్లాసు అయిపోయిందా? ఇంక వర్క్ లేదా?"

తల అడ్డంగా ఊపాడు శేఖర్.

"వెరీగుడ్. నాకూ గంటదాకా ఇంక క్లాసు లేదు. అలా కేంటీన్‌లోకి వెళ్ళి కాస్సేపు కూర్చుందాం రండి."

శేఖర్ మౌనంగా ఆమె వెనకాలే నడవసాగాడు.

"ఏవిటి అలా ముభావంగా వున్నారు? అయినా మీరీమధ్యన చాలా రిజర్వుడుగా వుంటున్నారు. ఎందువల్ల?"

ఆమె కళ్ళల్లోకి చూసి, "చెప్పమంటావా? చెప్పినా ఏమని చెప్పాలి? నాలో ఆశలు రేకెత్తించి అంతలోనే అణచేశావు కనక ఇలా అయ్యానని చెప్పాలి. చెప్తే ఏం లాభం? నీలో మార్పురాదు. కిరీటిని మాని నువ్వు నన్ను ప్రేమించవు. ఒకవేళ ప్రేమించినా, ఆ ప్రేమ నాకు ఆనందాన్నివ్వదు కిరీటి బాధపడితే నాకు కామా? అందు కని ఇంక ఇది ఇంతే" అనుకున్నాడు శేఖర్ మనస్సులో.

క్లాసులు జరుగుతున్న సమయం కనక కేంటీన్‌లో జనం లేరు. శేఖర్‌తో కలిసి వెళ్ళి ఓ మూల టేబిల్ దగ్గర కూర్చుంది మాధురి. దగ్గరకొచ్చి నిలబడ్డ సర్వర్‌కి రెండు కాఫీ ఆర్డరిచ్చి మళ్ళీ శేఖర్‌కేసి తిరిగింది.

నవ్వుతూ "మీ ఫ్రెండ్ ఎలాగా పెసరపప్పే! మీరుకూడా ఏవిటి ఈ మధ్య ఇలా తయారయ్యారు! ఆయనగాలి సోకలేదు కదా?" అంది.

శేఖర్ నీరసంగా నవ్వాడు

"మొదట్నుంచీ బుద్ధావతారాలయితే ఫరవాలేదు కాని, కొన్నాళ్ళు జోక్స్ వేస్తూ నవ్వుతూ నవ్విస్తూ ఔట్‌పేషెంటు వార్డులాగ సందడిగా వుండే మనుష్యులు, హఠాత్తుగా ఆపరేషన్ థియేటరులా సీరియస్‌గా మారిపోతే మాత్రం కష్టం సుమాండీ చూసే వాళ్ళకి అసలు అంతకంటే ట్రాజెడీ వుండదు"

శేఖర్ నవ్వి "ఆపరేషన్ థియేటర్‌ని కూడా ఔట్‌పేషెంట్ వార్డు చేసెయ్య గలరు మీరు" అన్నాడు

'మీకు పుణ్యం వుంటుం ఆ సర్టిఫికేట్ మాత్రం పడెయ్యకండి రేపొద్దున్న ఎప్పుడూ హౌస్‌సర్జన్ ఇవ్వరు నాకు"- మాధురి భయంతో బతిమాలుతున్నట్లు ముఖం పెట్టింది. సర్వర్ తీసుకువచ్చిన కాఫీని సిప్‌చేసి ముఖం వెగటుగా పెట్టాడు శేఖర్.

"ఏం కాఫీ బాగోలేదా?" అంటూనే తన కాఫీ రుచి చూసింది మాధురి

మాధురి ముఖంలో వచ్చిన మార్పులు చూసి "మీ కాఫీలో కూడా పంచదార వెయ్యడం మరిచిపోయాడా?" అన్నాడు శేఖర్.

"మరిచిపోవడమా? మణుగున్నర పంచదార వేస్తే-మీకు అసలు వెయ్యలేదా? అదీ అలా చెప్పండి మీ కప్పులో వెయ్యవలసిన పంచదార కూడా నాదాంట్లో వేశాడు. వెరసి మీకు చేదు కషాయం, నాకు తీపి పానకం."

"సరే ఇంకనేం! ఎవరికెలా ఇవ్వాలో అలాగే ఇచ్చాడు. అతనికి తెలుసు. కొందరు ఎప్పుడూ చేదే మింగాలనీ, కొందరికి తీపి తప్ప మరేదీ ఇవ్వకూడదనీను."

"వాడి మొహం, ఇప్పుడెలా? మొత్తం రెండు కప్పుల్లో రుచీ కలిపి రెండెట్టి సమానంగా భాగహారి స్తేనేకాని అసలు రుచి రాదు."

శేఖర్ ఉలిక్కిపడ్డాడు. యధాలాపంగా అందా లేకపోతే ఇందులో వేరే అర్థం ఏమైనా ఉందా? కాఫీ వంకతో, తమ ఇరువురి జీవితాలూ మేళవించి, బ్రతుకుని సమానంగా పంచుకొని హాయిగా జీవిద్దాం అనే అభిప్రాయాన్ని వెల్లడించడంలేదుకదా? మళ్ళీ అతని హృదయంలో ఆశ తలెత్తింది చూస్తే మాధురి ముఖంలో అతను ఆశించిన భావాలేం కనిపించలేదు. అయినా నిరాశ చెందకుండా సంభాషణని ఆ మార్గంగా పోనిచ్చాడు.

"ఇద్దరం కొద్ది కొద్దిగా రుచి చూశాంకదా? ఇప్పుడీరెండు కప్పులలో కాఫీ కలిపేస్తే ఎలా?" అన్నాడు శేఖర్.

"అబ్బే ఊరికే థీరీ చెప్పాను. ప్రాక్టికల్‌కోసమా?" అంటూ మాధురి సర్వర్‌ని పిలిచి అవిపట్టికెళ్ళి అవతలపోసి వేరే కాఫీలుచేసి పట్టుకురమ్మని ఆర్డర్ ఇచ్చింది.

మాటల్లో దొరకడంలేదు మాధురి. మరి మనస్సులో ఏం ఉందో. తనగురించి ఆమె అభిప్రాయం ఏమిటో తెలుసుకోవడం ఎలా? ఇలా ఆలోచిస్తూ టేబిల్ అంచుని వేళ్ళతో నిమురుతూ ఉండిపోయాడు శేఖర్.

సర్వర్ తిరిగి తీసుకువచ్చిన కాఫీని సిప్‌చేస్తూ "అవును కానీ ఈమధ్య మీఫ్రెండ్ దర్శనాలు పూర్తిగా కరువయిపోయాయేం? రేడియోనాటిక అయిపోయింది. మన అవసరం తీరిపోయింది. ఇంక వీళ్ళతో స్నేహం ఎందుకులే మనకి అనుకున్నారా ఏమిటి?" అంది మాధురి సీరియస్‌గా.

నోటిదగ్గర పెట్టుకోబోయిన కప్పుని టేబిల్‌మీద ఉంచి ఆశ్చర్యంగా "అదేవిటి? కిరీటి. మీకు కనిపించనే లేదా అప్పటినుంచీ? ఒకటి రెండుమార్లు రూమ్‌కి ఆలశ్యంగా వచ్చావేమిటిరా అని అడిగితే, మాధురితో కబుర్లుచెబుతూ కూర్చుండిపోయాను అవి చెప్పాడే!" అన్నాడు శేఖర్.

"ఏమిటి నాతోటి కబుర్లా? రికార్డింగ్ అయిన తర్వాత నాకు ఆయన అసలు కనిపిస్తేనా? ఒకటి రెండుసార్లు మీరూమ్‌కివస్తే తాళంవేసి ఉంది. మీరూలేరు ఆయనా లేరు. అక్కడికీ ఒకసారి ఆబిడ్స్‌లో కనిపిస్తే ఆయన్ని గట్టిగా కేకేసిపిల్చాను. వెనక్కి తిరిగి చూసీ కూడా పలక్కుండా వెళ్ళిపోయారు" మాధురి కంఠం గద్గదికం అయింది ఈమాటలు చెప్తూంటే.

"చిత్రంగా ఉందే! వాడామో ఈమెని తరుచు ఎక్కడో అక్కడ కలుసుకుంటు న్నట్లే చెప్తాడు. ఈమె ఏమో వాడినీమధ్య అసలు చూడనేలేదని చెప్తోంది. ఇద్దర్లో

ఎవరిది నిజం! వాడింత నిలువునా అబద్ధం ఆడగలడా? మరైతే మాధురే తమాషా చేస్తోందా? తనదగ్గర ఈ సంగతి దాచడనవల్ల ఈమెకి ఏం లాభం?'' ఇలా తనలోతాను తర్కించుకొంటూన్న శేఖర్ తలెత్తి ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె చెప్తూన్నది నిజమే అనిపించింది. వివర్ణమైన ముఖం దైన్యంగాఉన్న కళ్ళూ చూస్తే ఆమె ఎంత బాధపడుతూన్నదీ అర్థమైంది శేఖర్‌కి. అతని మనస్సు కళవళ పడింది. గుండె జాలితో నిండిపోయింది ఆమెని ఆస్థితిలో చూడలేకపోయాడు అందుకు కారణమైన కిరీటిమీద విపరీతమైన కోపం వచ్చింది ఆ కోపంతోనే అన్నాడు ''వాడొక ఇడియట్ వాడు కని పించలేదనీ మాట్లాడలేదనీ మీరు బాధపడడందేనికి?'' అని

మాధురి చకితురాలైంది ఆమాటకి. 'ఇలా అంటాడేవిటి?'అని ఆశ్చర్యపోయింది. వెంటనే సర్దుకుని ముఖంలో సాధ్యమైనంత నిర్లక్ష్యాన్ని కనబరుస్తూ ''అవును నాకేం? ఆయన మాట్లాడకపోతే నాకు తోచదా? అయినా ఆయనేమంత పెద్ద మాటకారిఅని! పోనీ మీలాగ నాలుగు జోక్స్‌వేసి నవ్వించి కబుర్లుచెప్పే మనిషి అయితే అయ్యో ఆయన మాట్లాడడంలేదే అని అనుకోవచ్చును.'' అంది

తనగురించి మాధురికి అంత అభిప్రాయం ఉన్నందుకు సంతోషించాడు శేఖర్. అంతేకాకుండా ఈమె కిరీటి కంటే తననే ఎక్కువ అభిమానించడం లేదుకదా అనే అనుమానం వచ్చింది అతనికి ఏమైనా ఇవాళ అటో ఇటో తేల్చుకోవాలి. దానినిబట్టి ఈమెమీద ఆశలు పెంచుకోవడమో, ఇంతటితో ఈమెని మరిచిపోవడమో నిర్ణయించు కోవచ్చు అనుకున్నాడు.

''మీకిప్పుడు తొందరగా వెళ్ళవలసిన క్లాసేంలేదుకదా?'' అన్నాడు శేఖర్

''ప్రాక్టికల్స్ ముందుగా అయిపోయాయి అందువల్ల ఇంకో అరగంటదాకా క్లాసు బెంగలేదు'' అంది మాధురి వాచీ చూసుకుంటూ శేఖర్ 'హమ్మయ్య' అనుకున్నాడు. కుర్చీలో వెనక్కి జేర్లబడి స్థిమితంగా కూర్చుంటూ జేబులోంచి సిగరెట్టుపేకెట్ తీశాడు. అగ్గిపుల్ల గీయఁబోయి వెంటనే ''సారీ అన్నట్లు మీకు సిగరెట్టుపొగ పడదుగా? 'అంటూ పేకెట్ తిరిగి జేబులో పెట్టేసుకున్నాడు.

మాధురి 'థేంక్స్' అంది తన ఇబ్బందిని గుర్తించి అతను సిగరెట్టు మానేసినం దుకు కృతజ్ఞతగా.

అగ్గిపెట్టెని తమాషాగా టేబిల్‌మీద దొర్లిస్తూ ''మీరు కనీసం ఈవాసననేనా అలవాటు చేసుకోవాలి కొద్దిగా. లేకపోతే రేపొద్దున్న ఇబ్బంది పడతారు ఒక్కమాటుగా సర్దుకోవాలంటే'' అన్నాడు శేఖర్ కంటిచివరనుంచి ఆమెకేసి చూసి.

మాధురి నవ్వుతూ ''ఎందుకు ఇబ్బంది?'' అంది

శేఖర్ చుట్టూ కలయజూసి, ఎవరూ తమమాటల్ని వినటంలేదని నిర్ధారణ చేసుకుని, గొంతు బాగా తగ్గించి నెమ్మదిగా ''అహ! రేపొద్దున్న ఆ వచ్చే ఆయన

కెవరికో సిగరెట్టు అలవాటుంటే?'' అన్నాడు. కావాలని ఆమె కళ్ళల్లోకి కొంటెగాచూస్తూ.

ఆ మాటలకి సిగ్గుతో మాధురి ముఖం మందారం అయింది. కాని వెంటనే గాంభీర్యాన్ని తెచ్చుకుని సీరియస్‌గా ''ఇప్పుడా ప్రస్తావన ఎందుకు? ప్రస్తుతం నాకు ఆవాసన కిట్టదు. అంతే '' అంది

''ఇప్పుడు కాకపోయినా ఓ ఏడాది రెండేళ్ళతర్వాత అయినా మీకా ఇబ్బంది రాకుండా ఉంటుందా?''

''రావాలని ఏం ఉంది?''

శేఖర్ గతుక్కుమన్నాడు ఈమె అసలు పెళ్ళే చేసుకోదా? ఆ ఉద్దేశంలోనే అన్నదా ఇలా-అంతలోనే అతనికి మరో ఆలోచన వచ్చింది. బహుశా సిగరెట్లు కాల్చని వాళ్ళని చేసుకుంటాను. లేదా ఆ అలవాటుని ఏమైనా మానిపిస్తాను అని కాబోలు ఈమె అభిప్రాయం.

''ఈరోజుల్లో సిగరెట్టు కాల్చని వారెవరు? అలవాటంటూ ఒకమారు అయ్యాక మానగలిగినవారెవరు?'' అన్నాడు శేఖర్ మాధురి సమాధానం చెప్పలేదు ఈ సంభాషణ ఆమెకి రుచించినట్లులేదు. మర్యాదకోసం కూర్చునిఉంది కాని, లేకపోతే ఈపాటికి 'లేద్దామా?' అని ఉండును.

''మనం చూస్తున్నాంకదా? ప్రతి మెడికోకి ఓ చేతిలో స్టెత్. మరో చేతిలో సిగరెట్టూ''

ఈమాటూ మాధురి మాట్లాడలేదు.

''మీరెలాగా డాక్టర్ని వివాహం చేసుకుంటారు ''

"అని మీకు రూఢిగాతెలుసా?''

ఆ మాటలోని తీక్షణతనిచూపి, దెబ్బతిన్నవాడిలా ఆగిపోయాడు శేఖర్, ఏదో అనబోయినవాడల్లా. కళ్ళప్పగించి చూస్తూన్న శేఖర్‌వైపు కొంచెంఅయినా తిరక్కుండా, ఎటో చూస్తూ'' మెడిసన్ చదువుతున్నానుకదా అని నాకీ చదువంటే ఇష్టమనీ, డిగ్రీ తెచ్చుకున్నాక ప్రాక్టీసు పెడతాననీ, డాక్టర్నే పెళ్ళిచేసుకుంటాననీ మీరూహించారు అఫ్‌కోర్స్ ఎవరేనా అలాగే అనుకుంటారనుకోండి. కాని '' అంటూ వాక్యం పూర్తి చెయ్యకుండానే కుర్చీని పెద్ద చప్పుడయ్యేలా వెనక్కిజరిపి, విసురుగాలేచి, ''మరి నాకు క్లాసుంది. మీరింకా కాస్సేపు కూర్చుంటారా?" అంటూ అతని సమాధానంకోసం ఆగకుండా అక్కడనుంచి వెళ్ళిపోయింది మాధురి.

ఆమె వెళ్ళినదిక్కే విస్తుబోయి చూస్తూ ఉండిపోయాడు శేఖర్. చాలాసేపటి తర్వాత అతను విడిచిన దీర్ఘమైన నిట్టూర్పుకి, అంతవరకూ అతను కట్టుకున్న పేక మేడలు, పడిపోనారంభించాయి. అప్పటివరకూ మిణుకు మిణుకు మంటూన్న ఆశకాస్తా అదృశ్యం అయిపోయింది. ఇదీ అని తన మనస్సులోని భావాన్నేమీ ఆమె స్పష్టంగా చెప్పలేదు. అయినా శేఖర్‌కి ఆమె హృదయం అర్థం అయిపోయింది. ఆమె మనస్సులో

కిరీటి ఉన్నాడో లేదో కాని తనుమాత్రం లేడు. అంతవరకూ తనకి తెలిసింది. వివరంగా ఆమె చెప్పలేకపోయినా తెలిసింది ఆ సంగతి.

ఇది జరిగిన వారంరోజుల తర్వాత "ఏవిటిరా మనస్సులోఉన్నది చెప్పవు. పలకరించినా మాట్లాడవు. కాలేజీకి వెళ్ళడం మానేసి, ఇరవైనాలుగు గంటలూ శరీరాన్ని నడ్డిదాకా అలా చాపమీదపరిచి, కాళ్ళని గోడకి నిలువుగాజేర్లేసి సిగరెట్లుకాలుస్తూ వెల్లకిలా ఆ పడకేవిటి? నీకేం వచ్చింది? అద్దంతెస్తాను గెడ్డంచూసుకో ఎలా మాసిపోయిందో! అస్తమానూ అరుస్తూ పాడుతూ అల్లరిచేసే కొక్కిరాయి వెధవ, కళ్ళుమూసుకుని ఏదో ఆలోచిస్తూ ఇలా మౌనంగా పడి ఉంటే ఏడుపు వస్తుందిరా చూడలేక" అన్న కిరీటి మాటలకి, జవాబేంచెప్పక తడి అయిన కళ్ళని కనిపించనియ్యకుండా మొహం అటు తిప్పుకున్నాడు శేఖర్.

# 10

డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చుంటూ "అమ్మా మాధురీ!" అంటూ కేకేశాడు జగత్పతిరావు. హాలూ గదులూ ప్రతిధ్వనించాయి కాని మాధురి మాత్రం జవాబివ్వలేదు. కాస్సేపాగి మళ్ళీ పిలిచాడు. రెండుమూడుసార్లు అలా పిలిచాక ఎక్కడో మారుమూల గదిలోంచి "ఏం?" అంటూ విసురుగ్గా వచ్చింది మాధురి బాగా చిక్కిపోయి, కాళ్ళూ చేతులూ వసి వాడిపోయి, ముఖం నీరసించి పదిపదిహేను లంకణాలు చేసినదానిలా ఉంది. కూతురుని ఆస్థితిలో చూసేసరికి జగత్పతిరావు మనస్సంతా వికలం అయిపోయింది కడుపులో చెయ్యిపెట్టి కలచివేసినట్లయింది. తనపక్కన కూర్చుని భోజనంచేసీ, తనతో నవ్వుతూ మాట్లాడీ సుమారు రెండు నెలలు అవుతోంది అదిగో ఆరోజున అర్ధరాత్రి వేళ బావాజీతో తనువచ్చి, మాధురితో సరసాలాడుతూన్న కిరీటిని అప్పటికప్పుడు ఇంట్లోంచి పంపించేసింది లగాయతు, ఇదీ వరస కలిసి భోంచెయ్యదు. పూర్వంలాగ నవ్వుతూ కబుర్లుచెప్పదు. ఎంతసేపటికీ ముభావం, విసుగూ, కోపం, ఇరవైనాలుగు గంటలూ మూల గదిలో కూర్చుని ఉంటుంది "ఏం?" అంటే 'నాకు పరీక్షలు నన్ను పలకరించకు' అంటూ కస్సుమంటుంది.

జగత్పతిరావుకేం పాలుపోవడంలేదు. అది ఎందుకిలా ఉంటోంది? తనమీద ఏదో విపరీతమైన కోపంవచ్చి ఉండాలి. లేకపోతే ఇలా సత్యాగ్రహం చెయ్యదు గెంతుతూ. నవ్వుతూ తన మాధురి ఎలా ఉండేది? సరదాగా కూనిరాగాలు తీస్తూ, ఇల్లంతా అలంగం తిరుగుతూ, నౌకర్లని ఏడిపిస్తూ బట్లర్‌ని వెక్కిరిస్తూ, మధ్యలో తన మెడచుట్టూ చేతులువేసి చిలిపిచేష్టలుచేస్తూ, చలాకీగా ఉండేపిల్ల, మాట్లాడకుండ ఓ మూల కూచుంటే ఇల్లెంత చిన్నబోతుంది! తన ప్రాణం ఎంత విలవిల్లాడిపోతుంది! ఇంకీ కోపాన్ని ఇలా ఉండనియ్యడానికి వీలులేదు. తన మాధురి మళ్ళీ మామూలుగా ఉండాలి. ఇల్లు తిరిగి కలకల్లాడాలి.

"అన్నం తిందాంరా అమ్మా" అన్నాడు జగత్పతిరావు.

"నేను ఇందాకే తినేశాను"-విసురుగా అంది మాధురి.

"ఎప్పుడు తిన్నావమ్మా పొద్దుటినుంచీ కోపగృహంలోనే కూర్చున్నావు కదా?"

"తిన్నాను కావలిస్తే బట్లర్‌ని అడుగు"

"పిచ్చి తల్లీ! బట్లరే చెప్పాడు నువ్వు తినలేదని."

మాధురి మాట్లాడలేదు

"ఎందుకమ్మా నామీద కోపం? ఏం కావాలో నాకు చెప్పకూడదూ? నాతో నువ్వు సరిగ్గా మాట్లాడి, నా పక్కన కూర్చుని భోజనంచేసీ ఎన్నాళ్లయిందో తెలుసా?"

మాధురి కళ్లు నీళ్ళతో నిండిపోయాయి.

జగత్పతిరావు లేచి మాధురి దగ్గరగా వెళ్ళి అప్యాయంగా తలమీద చెయ్యివేసి నిమురుతూ "నాకు నువ్వు తప్ప ఇంకెవరున్నారు చెప్పమ్మా" అన్నాడు. మాధురి కళవళ పడి 'డాడీ!' అంది గద్గదికమైన కంఠంతో.

"అవునమ్మా. నీ మనస్సులో ఉన్నదేదో చెప్పకుండా ఇలా కోపంగా ఉంటే ఎలా తెలుస్తుంది? చెప్పు అమ్మా-నీకేం కావాలో చెప్పు"

"ఏం వద్దులే డాడీ! నువ్వేం బాధపడకు."

"అలా కాదు. ఏదో ఉంది చెప్పాలి"

"అలాగే చెప్తాలే ముందు భోజనం చెయ్యి బట్లర్! డాడీకి అన్నం వడ్డించు. పోనీ ఈ పూట నా చేత్తో వడ్డిస్తాను తిను డాడీ" అంటూ పైట బొడ్డులో దోపుకొని చేత్తో గరిటె తీసుకుంది మాధురి

"తింటాను కాని రెండు షరతులు."

"ఏమిటవి?" అన్నట్లు చూసింది మాధురి.

"ఒకటి-నువ్వు నాతో కలిసి భోజనం చేసి, ఇప్పటినుంచీ మామూలుగా నవ్వుతూ అల్లరిచేస్తూ సరదాగా వుండాలి. రెండు-ఇన్నాళ్ళూ నువ్వు ఇలా ఎందుకు నామీద కోపగించావో చెప్పాలి ఏం? ఒప్పందమేనా?"

మొంజేత్తో కళ్లు తుడుచుకుని, ఆ తర్వాత అతి ప్రయత్నంమీద నవ్వి, అలాగే అన్నట్లు తల ఊపింది.

ఆ పూట భోజనాల దగ్గర జగత్పతిరావు ఎన్నిసార్లు మారు వేయించుకొన్నాడో-నవ్వుల మధ్యలో మాధురికి ఎన్నిమార్లు పొలమారిందో లెఖ్కలేదు.

టవల్‌తో చెయ్యి తుడుచుకొని హాల్లోకి వెళ్ళి సోఫామీద కూర్చుంటూ "ఊ ఈమాట చెప్పు నా బంగారు తల్లికి వాళ్ల డాడీమీద కోపం ఎందుకు వచ్చింది?" అన్నాడు జగత్పతిరావు. మాధురి ఏం మాట్లాడలేదు. చేతివేళ్ల కేసీ గోళ్ల కేసీ చూసు కుంటూ తల వంచుకొని నిలబడి ఉంది. అమ్మ వుంటే తన మనస్సులో మాట చెప్పి

ఉండేది. కాని నాన్నకి ఎలాగ? మొదటిసారిగా అమ్మ లేని లోటు ఏమిటో తెలిసింది మాధురికి. తలఎత్తి తండ్రికేసి ఒకమాటు చూసి తల దించేసుకుంది. ఏదో చెప్పలేక సంకోచిస్తోంది అని గ్రహించాడు జగత్పతిరావు. అంత చనువుగా ఉండేదానికి, తన దగ్గర మొహమాటం ఏమిటి? అర్థం కాలేదు జగత్పతిరావుకి. "సరే ఇప్పుడు కాకపోతే తర్వాత అయినా చెప్పు నీ ఇష్టం. నేనలా ఓమారు సికింద్రాబాద్ స్టేషన్‌కి వెళ్ళి రావాలి" అంటూ బట్టలు వేసుకోడానికి లేచాడు జగత్పతిరావు.

"స్టేషన్‌కి యూనివర్సిటీ మీంచే కదూ వెళ్ళడం?" అని అడిగి, వెంటనే ఎందుకు అడిగానా అని నాలుక కరుచుకుంది మాధురి

జగత్పతిరావు ఆగి, "అవునమ్మా. ఏం?" అన్నాడు. మాధురి కాలి బొటనవేలితో నేలమీద గీస్తూ, "ఇవాళ్టితోటి ఎమ్. ఏ వాళ్ళకి పరీక్షలు అయిపోతాయి. ఇవాళే ఆఖరి పరీక్ష" అంది.

"అహా "

"పరీక్షలు రాశాక అందరూ ఇళ్ళకి వెళ్ళిపోతారు కాబోలు!"

జగత్పతిరావుకి కూతురు అమాయకత్వం చూస్తే నవ్వు వచ్చింది. "మరి వెళ్ళరూ? పరీక్షలయ్యాక ఎవరి ఊరు వాళ్లు వెళ్ళకుండా ఇక్కడ ఉండిపోతారా?" అన్నాడు.

"కిరీటికూడా?" అనుకోకుండా అనేసింది మాధురి

"ఆ! ఏం? వెళ్ళనని అతను చెప్పాడా?"

"ఎదీ? మళ్లీ నాకతను కనిపిస్తేగా చెప్పడానికి? రేడియో రికార్డింగ్ రోజున తప్ప, నువ్వా అర్ధరాత్రివేళ అతన్ని మనింట్లోంచి పంపించేశాక, నాకు తిరిగి కనిపించనే లేదు" అంది మాధురి బొంగురుపోయిన కంఠంతో.

ఒక్కమాటు, జరిగిన సంఘటన వచ్చి జగత్పతిరావు కళ్ళముందు నిలిచింది. అప్పటికప్పుడు మాధురిని కిరీటి తరుముతున్నట్లూ, ఆమె మీదకి వాలి స్వాధీనం చేసుకోబోతున్నట్లూ ఆ దృశ్యం తను చూస్తున్నట్లూ ఫీలయ్యాడు కోపంతో కళ్ళు ఎర్రబడ్డాయి

"అవును పంపించను మరీ? నయం కీలుకి కీలు విరిచి మరీ పంపి ఉందును. బావాజీ కనక అడ్డుకోకపోతే "

"కానీ, అందులో ఆయన తప్పులేదు డాడీ! నేనే ఆయన కళ్ళజోడు తీసుకుని పరిగెట్టాను "

"అయితే?"

"నా దగ్గరనుంచి తిరిగి ఆ జోడు తీసుకోవడం కోసం, నాతో ఆయన పెనుగులాడారు. ఆ సమయంలో నువ్వు చూశావు. అంతే."

"మరైతే ఆ సంగతి నాకు చెప్పొచ్చుగా? పొమ్మనగానే అలా తల వంచుకు పోతే ఏం అర్థం అవుతుంది? తప్పు చేశాడు కనకే తల వంచుకు వెళ్ళాడు అను కున్నాను."

"పైగా అర్ధరాత్రివేళ అలా ఇంట్లోంచి పంపించేస్తే ఒక్కరూ రూమ్‌కి ఎలా వెళ్ళారో ఏమో ఆయన కసలే భయం కూడాను చీకటంటే."

"ఆహా! అయితే చాలా అవస్థపడి ఉంటాడే పాపం! పోనీ నువ్వయినా చెప్పకపోయావా అప్పుడు నాతో."

"నేను చెప్పబోయాను. కాని నువ్వొక్క ఉరుమురిమి 'నోరు మూసుకో' అన డంతో భయంవేసి ఊరుకున్నాను"

"అలాగా? చాలా అన్యాయం జరిగింది అయితే మరి తర్వాతయినా నువ్వు నాకీ సంగతి చెప్పలేదేం?"

"చెప్తే ఏం లాభం? పాపం ఆ అర్ధరాత్రి నిర్దాక్షిణ్యంగా ఆయన్ని ఆ చీకట్లోకి తరిమేశాక?" అంది కోపంతో మాధురి తండ్రికేసి ఫుల్తూ ఫుల్తూ చూస్తూ.

"అదా అమ్మా నీ కోపం ఇన్నాళ్ళనుంచీ? సరే అర్థం అయిందిలే. ఏదో ఆ ఆవేశంలో అలా కేకలేసి పంపించేశాను కాని, అతను దాన్ని మనస్సులో పెట్టుకుని బాధ పడుతున్నాడనీ, నువ్వూ అందుకే కోపగించి నాతో మాట్లాడ్డం మానేశావనీ నేను అనుకోలేదు. నేను ఆ సంగతి అంతటితో మరిచేపోయాను"

"అయితే నీకు ఆయనమీద కోపం లేదన్నమాట!" ఉత్సాహంగా అడిగింది మాధురి.

"కోపంలేదు కాని, అతను నీతో అంత చనువుగా ఉండడం నాకు నచ్చ లేదమ్మా నువ్వా పెళ్ళి కావలసిన పిల్లవి! అతనా పరాయివాడు!"

"ఆయన్ని అలా అనకు డాడీ!"

"ఇంకెలా అనమంటావమ్మా. కిరీటి మనకి పరాయివాడు కాకపోతే కావలసిన వాడా?"

"నేను అలా అనుకోవడంలేదు" అంది నెమ్మదిగా మాధురి తల వంచుకుని.

"మాధురీ!"

జగత్పతిరావు ఇంకేం అనలేదు. అలా అనుకోవడం లేదూ? అంటే? అత నిలో ఆలోచనలు శరవేగంగా తిరిగిపోతున్నాయి కిరీటి మంచితనం - అతని అమాయ కత్వం - అతని కబుర్లు చెబుతూ మాధురి మురిసిపోవడం - అతని ప్రస్తావన వచ్చినప్పు డల్లా ఆమె కళ్ళు కాంతితో వెలిగిపోవడం-అతనిపట్ల మాధురి చూపిస్తూన్న ఆప్యాయత.

వీటి అన్నింటినీ కలిపి ఆలోచిస్తే?-కాస్సేపాగి జగత్పతిరావు "కిరీటి తెలివైన వాడే మంచివాడే - కాని అతని తల్లిదండ్రు లెవరో, అతని స్థితిగతులేవిటో " అన్నాడు.

"అవన్నీ మనకెందుకు డాడీ?"

"అయితే సరే - వాటి గురించి ఆలోచించక పోయినా, అతని అభిప్రాయం ఏమిటో, నువ్వంటే అతనికున్న ఆప్యాయత ఏమిటో-ఇదైనా"

"ఆ సందేహం ఏం అక్కర్లేదు, నాకు తెలుసు."

"అలాగా? ఇంకేం అయితే? నీ కోరిక ప్రకారం కానియ్యడంకంటే నాకు కావలసిందేముంది తల్లీ!"

"డాడీ!"

జగత్పతిరావు మాధురిని దగ్గరగా తీసుకుని తలమీద ముద్దు పెట్టుకుంటు న్నప్పుడు, రెండు కన్నీటి చుక్కలు ఆమె పాపిట్లో పడి ముత్యాలులా మెరిశాయి

"అయితే అతను ఊరు వెళ్లిపోకుండా ఇప్పుడే వెళ్ళి మనింటికి తీసుకు వస్తాను"

"ఇప్పుడాయన యూనివర్సిటీలో ఆఖరి పరీక్ష రాస్తూంటాడు."

"అక్కడికే వెళతాను."

* * *

"నమస్కారం అండీ"

తలెత్తి, సిల్కులాల్చీ, సిల్కుపంచే, పైమీద జరీ ఉత్తరీయం, పచ్చగా మెరు స్తూన్న బట్టతలా, కంటికి ఖరీదైన ఫ్రేమ్ కళ్ళజోడూ ఈ రూపంతో సంపన్న గృహ స్థులా కనిపించిన జగత్పతిరావుని చూసి "కూర్చోండి" అని ఎదురుగుండా ఉన్న కుర్చీని చూపించి, "జస్ట్-వన్ మినిట్" అంటూ ఏవో కాగితాలమీద సంతకాలు పెట్ట సాగాడు తెలుగు ప్రొఫెసర్

జగత్పతిరావు గది అంతా కలయజూశాడు.

ఎదురుగుండా గాజు పలక అమర్చిన టేబిల్‌కి అటువైపున ఖరీదైన గాడ్రెజ్ స్ప్రింగ్ ఛైర్‌లో, చెంపలు బాగా నెరిసి నల్లని వెడల్పాటి ఫ్రేమ్ ఉన్న దళసరి కళ్ళ జోడుని మాటిమాటికీ సరిజేసుకొంటూ పచ్చగా మిసమిసలాడుతూన్న ప్రొఫెసర్. ఆయనకి కుడిపక్క పెడస్టల్ ఫేనూ, ఎడంపక్క టేబిల్‌కి అమర్చిన బజర్ నొక్కే బటనూ, ఎదురుగుండా గాజుపలక టేబిలూ, దాని చుట్టూ విజిటర్స్‌కోసం వేసి ఉంచిన కుర్చీలూ, టేబిల్‌మీద ఓ పక్క స్టీల్ ట్రే, మరోపక్క పెద్దపెద్ద రిఫరెన్స్ పుస్తకాలూ కాగితాలూ, పేపర్ వైటులూ. ప్రొఫెసర్‌కి వెనకగా వున్న గాడ్రెజ్ బీరువా, దానిని ఆనుకొని ఉన్న చిన్న కర్టెనూ కలిసి ఆ గదిలో వెనకభాగాన్ని దాచి ఉంచితే, గాలికి ఎగురుతూన్న కర్టెన్ మాత్రం దాపరికాలు లేవంటూ, ప్రొఫెసర్‌గారు విశ్రాంతి తీసుకొనే ఆ భాగాన్నే, మధ్యమధ్య అందరికీ స్నేప్‌షాట్స్‌లా చూపిస్తోంది కర్టెన్ ఎగిరినప్పుడల్లా ఒకమారు ఈజీఛైరూ, మరోమారు వాష్ బేసినూ, ఇంకోమారు కూజా, గ్లాసూ, వేరొక మారు గోడకి అమర్చిన చిన్న అద్దం పౌడరూ, దువ్వెనా, హేంగర్‌మీద ఉన్న నేప్

కిన్నూ, తమాషా తమాషాగా కనిపిస్తున్నాయి. ఎదురుగుండా కూర్చున్న జగత్పతి రావుకి

ప్రొఫెసర్ కాగితాలు పేడ్‌లో పెట్టి ముడివేస్తూ, ఎడంపక్క నున్న బటన్ నొక్కాడు బజర్ మ్రోగి బయట స్టూలుమీద కూర్చున్న బంట్రోతు వచ్చాడు "ఈ ఫైల్ తీసికెళ్లి వైస్ ఛాన్సలర్‌గారి స్టెనోకి ఇయ్యి" అని బంట్రోతుని పంపించి, టేబిల్ మీద నున్న పేపర్ వైట్స్‌ని మాట వరసకి ఓమారు ఇటూ అటూ కదిపి, కళ్ల జోడు సర్దుకుని, కుర్చీలో వెనక్కి జేర్లబడి ఈజీగా కూర్చుంటూ, "ఊ చెప్పండి, మీరు వచ్చిన పనేమిటో!" అన్నాడు ప్రొఫెసర్.

"అఫీషియల్ వర్కేం కాదండి. చిన్న పెర్సనల్ ఫేవర్"

"చెప్పండి."

"మీ దగ్గర ఎమ్ ఏ. చదువుతున్నాడు కిరీటి అని "

"దట్ యంగ్ చాప్? ఫైనలియర్?"

"ఫైనలియరే ఏదో పల్లెటూరునుంచి వచ్చాడు, సిగ్గు ఎక్కువ పచ్చని ముఖం. పద్యాలూ, నాటకాలూ రాస్తూంటాడు."

"మీ రంత వివరంగా చెప్పక్కర్లేదు. ప్రీవియస్‌లోనూ, ఫైనల్‌లోనూ కలిపి ఉన్నది ఒక్కడే కిరీటి. ఆ పేరుతో ఇంకెవరూ లేరు"

"అయితే అతనే. అతను హాల్లో పరీక్ష రాస్తున్నట్లున్నాడు. పరీక్ష అయాక ఒకమాటు మా యింటికి రమ్మని చెబుదాం అని వచ్చాను."

"అందాకా కూర్చుంటారా? లేకపోతే నేను తర్వాత కబురుచేసి పంపించ మంటారా?"

"మీ ఇష్టం ఎలా చేసినా సరే. కాని ఒక్క సంగతి మిమ్మల్ని అడుగుదాం అని వచ్చాను"

"చెప్పండి"

"మరేం లేదండీ. అతను ఎలా చదువుతాడో, అతని కాండక్టు ఏమిటో."

అప్పటిదాకా చూపిస్తూన్న బింకాన్నీ, ముఖావాన్నీ వదిలేసి, కుర్చీలో ఇంకొంచెం వెనక్కి వాలి పకపకా నవ్వాడు ప్రొఫెసర్. నవ్వి, ఆ తర్వాత సర్దుకుని కూర్చుంటూ సీరియస్‌గా ముఖం పెట్టి "మీకు అతని గురించి అనుమానం ఎందుకొచ్చింది?" అన్నాడు

"అనుమానం కాదు సార్-తెలుసుకుందాం అని"

"అతనికేం అవుతారు మీరు?"

"ప్రస్తుతానికి ఏం కానండి. రేపొద్దున్న పిల్లనిస్తే మావగారిని అవుతాను"

"ఐ. సీ అదా మీ ఇంట్రెస్టు?"

జగత్పతిరావు తల ఊపాడు.

"అయితే వినండి. అలాంటి కుర్రాడు ఒక్క మా తెలుగు ఫేకల్టీలోనే కాదు, మొత్తం ఈ యూనివర్శిటీలోని ఆర్ట్సు కాలేజీలో నే లేడు. మంచి బుద్ధిమంతుడు. తెలివికి తెలివి, వినయానికి వినయం అన్నీ ఉన్నాయి. ఈ రెండేండ్లలోనూ కాంప్లిమెంటే కాని, ఎవరూ ఎప్పుడూ ఏ కంప్లైంటూ ఇవ్వలేదు అతని గురించి. ఇంక చదువు సంగతి అంటారా "

"చాలండి ఇంక నాకేం అక్కర్లేదు. అతని చదువు యెలా వున్నా యేమైనా, రేపొద్దున్న అతను వుద్యోగం చేసినా చెయ్యకపోయినా నాకేం ఫరవాలేదు. రెండు తరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తి నాకుంది. ఒక్కర్తే కూతురు. నాకు కావల సిందల్లా అతని కాండక్టు గురించే. రోజూ చూసేవారు మీకు బాగా తెలుస్తుంది కదా అని అడిగాను. మీరు మంచిమాట చెప్పారు. అది చాలు."

"వెరీగుడ్. అయినా అతని చదువుకూడా కాండక్ట్ కేం తీసిపోదు, తొంభై పాళ్లు ఫస్ట్ క్లాసు రావచ్చు అతనికి వస్తే యిక్కడే రీసెర్చికి అవకాశం కల్పించి సెంట్రల్ గవర్నమెంట్ స్కాలర్ షిప్పుకి రికమెండ్ చేస్తాను."

జగత్పతిరావు కళ్ళు ఆనందంతో చెమ్మగిల్లాయి "వస్తాను సార్! థేంక్స్" అంటూ లేవబోయాడు.

"అవును ఇంతకీ అతనితో యెవరు వచ్చారని చెప్పమంటారు? మీపేరు? మీరేంచేస్తూ వుంటారు?"

"నాపేరు జగత్పతిరావు. ప్రస్తుతం ఏం చెయ్యడంలేదు. ఇదివరలో నాటకాలు వేసేవాడిని."

"ఏవిటి? పాతిక ముప్పైయేళ్ళ క్రితం వుద్యోగ విజయాలు, పాదుక, తులాభారం, చింతామణి, రంగూన్ రౌడీ, విడాకులా నాటకాల్లో ?"

జగత్పతిరావు నవ్వుతూ "అవునండి "

ప్రొఫెసర్ ఆశ్చర్యంగా కుర్చీలోంచి లేచి "అరే-ఆ జగత్పతిరావుగారు మీరేనా? ఇవాళ యెంత సుదినం? మిమ్మల్ని చూశాను. ఆ రోజుల్లో అంటే నాకు పదిహేను ఇరవై యేళ్లు వున్నప్పుడు మీ నాటకం వుందంటే టిక్కెట్లకోసం యెలా యెగబడి పోయేవాళ్ళం అని? ఓ మాటు కొత్తగా ఆ రోజునే కుట్టించుకున్న నా సిల్కు షర్టు చిరిగి పోయింది కూడా ఆ హడావిడిలో ఊ చాలా సంతోషం మిమ్మల్ని కలుసుకున్నందుకు" అంటూ, టేబిల్ మీంచి అడ్డంగా చెయ్యి చాపి షేక్ హేండ్ యిచ్చాడు. మర్యాద కోసం జగప్పతిరావు కూడా కుర్చీలోంచి, నగానికి లేచి చెయ్యి అందించాడు.

ఇద్దరూ తిరిగి కుర్చీలలో కూర్చున్నాక "కిరీటిలాంటి అల్లుణ్ణి సంపాదిస్తున్నందుకు మొదట మిమ్మల్ని అభినందించాలి అనుకున్నాను. కాని ఇప్పుడు అతణ్ణే అభినందించాలి, మీలాంటి మావగారు దొరికినందుకు" అన్నాడు ప్రొఫెసర్.

జగత్పతిరావు, కళ్ళజోడు తుడుచుకొనే వంకని, లాల్చీ జేబులోంచి చేతి రుమాలు తీసుకుని, కళ్లజోడు తుడుస్తూ, ఆ చేత్తోనే కళ్లల్లో నిలిచిన నీళ్లు అద్దుకుని సర్దుకొని కూర్చున్నాడు

అవధులులేని సంతృప్తి, జీవిత ధ్యేయాన్ని సాధించిన గర్వం కళ్లల్లోనూ, ప్రొఫెసర్‌పట్ల విపరీతమైన గౌరవం, ఆయన అందించిన అభినందనలకి ఆనందం ముఖంలోనూ, ప్రతిఫలిస్తూంటే, మౌనంగా కూర్చున్నాడు జగత్పతిరావు సంపదా, సౌజన్యం, సంస్కారం సహృదయతా వున్న ఒక వుత్తమశ్రేణి కళాకారుణ్ణి కలుసుకున్నాం అన్న సంతోషం గుండెల నిండా నిండి పోవడంతో, అతనికేసే చూస్తూవుండి పోయాడు ప్రొఫెసర్.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ "మరి వెళ్ళివస్తానండి, కిరీటి పేపరు రాయడం పూర్తి చేశాక నేనో మీరు మా యింటికి రమ్మన్నానని కబురు చేస్తారు కదూ?" అంటూ లేవబోయాడు జగత్పతిరావు

"ఉండండి కాఫీ తీసుకొని వెళుదురుగాని" అంటూ బటన్ నొక్కాడు ప్రొఫెసర్. బజర్ మ్రోగింది. కాని బంట్రోతు రాలేదు "ఓ అన్నట్టు వాడిని అలా పంపాను కదూ? కూర్చోండి ఇప్పుడే వస్తాను" అంటూ, జగత్పతిరావు మాట వినిపించుకోకుండా పక్క డిపార్ట్‌మెంటుకి వెళ్ళాడు ప్రొఫెసర్, ప్యూన్ యెవరేనా కినిపిస్తే కాఫీ కోసం, కిరీటికోసం కూడా కబురుచేసే వుద్దేశంతో.

ప్రొఫెసర్ అలా వెళ్ళిన రెండు నిముషాలకి "అయ్యా లోపలికి రావచ్చా?" అంటూ చేత్తో పుస్తకం ఒకటి పట్టుకుని రవణయ్య లోపలికి ప్రవేశించాడు జగత్పతిరావుని చూసి అతనే ప్రొఫెసర్ అనుకొని "నమస్కారం అండి" అన్నాడు

"కూర్చోండి" అంటూ జగత్పతిరావు పక్కనున్న కుర్చీ చూపించాడు.

"కూర్చోడానికి కాళీలేదు వెళ్ళాలి. ఎమ్ ఏ. వాళ్ళకి పరీక్షలవుతున్నాయని ఇందాకా యెవరో అంటేనూ 'అయ్యో కిరీటి పుస్తకం మన దగ్గరే వుండి పోయిందే! పాపం పరీక్షల్లో అతనికి అవసరమేమో అనుకున్నాను. అతని రూం తెలియదు. అందువల్ల సరాసరి ఇక్కడికే పట్టుకొచ్చా. కాని అతను పరీక్ష హాల్లో వున్నాడు ఇప్పుడు కలుసుకోడానికి వీలులేదు అన్నాడు ప్యూన్. పోనీ మీకిస్తే అతనికి అందే యేర్పాటు చేస్తారని " అంటూ రవణయ్య శృంగార నైషధాన్ని అందించాడు జగత్పతిరావుకి.

"అలాగే, ఇలా యివ్వండి. అవునూ? కిరీటి మీకెలా తెలుసు? మీ బంధువా?" అంటూ పుస్తకాన్ని అందుకున్నాడు జగత్పతిరావు, రవణయ్య అదో మాదిరి నిర్లక్ష్యం నవ్వు నవ్వి" ఏదో దూరపు బంధుత్వం వుందనుకోండి! రేపు పెళ్లి అయితే అదే దగ్గరవుతుంది."

"పెళ్ళా?"

"అవునండి. మారాణీని అతనికిచ్చి పెళ్ళిచేస్తే "

"ఏమిటి మీరంటున్నది? ఏ కిరీటి గురించి మీరు మాట్లాడేది?"

"ఇంకే కిరీటి? ఇక్కడ తెలుగు ఎమ్మే చదువుతున్నతనే. అతణ్ణి చేసుకోడానికి మారాణీకూడా యిష్టపడింది."

"ఆః మీ అమ్మాయికి యిష్టమా? అదిసరే-అతను యిష్టపడొద్దూ?"

"అతనా?" రవణయ్య ఒక నవ్వునవ్వి "అతనికి యిష్టం వుంది కనకే రోజూ మా యింటి చుట్టూ, అంతకంటే ముఖ్యంగా మారాణీ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాడు. పైగా ఒకటి రెండుసార్లు అతని నోటి వెంట అతను 'నిన్ను పెళ్ళి చేసుకుంటాను' అని రాణీతో అంటూండగా నేను రహస్యంగా విన్నాను కూడా" అన్నాడు.

జగత్పతిరావుకి ఒక్క క్షణం తల తిరిగి నట్లయింది మరు క్షణంలో యితను చెప్తున్నదంతా అభూత కల్పన అనిపించింది. అనుమానంగా రవణయ్యకేసిచూశాడు.

రవణయ్య నిర్లక్ష్యంగా నవ్వి "ఏవిటలా చూస్తారు ఆశ్చర్యంగా? ఇంత బుద్ధిమంతుడైన కిరీటి యేవిటి ప్రేమించడం యేవిటి అనా? బుద్ధికీ ప్రేమకీ సంబంధం లేదండీ-కుర్రాళ్లు పైకి బుద్ధిగానే కనిపిస్తూ వుంటారు సాగించే గ్రంధం సాగిస్తూనే వుంటారు. అది అంతే. మరి వస్తాను. ఆ పుస్తకం అతనికి అందించే యేర్పాటు చేయించండి. చాలా రోజుల క్రితం చదువుకుంటుందని మారాణీకిచ్చాడు. అప్పటి నుంచీ పట్టు కెళ్లనేలేదు వస్తాను శలవు" అంటూ వెళ్ళిపోయాడు.

జగత్పతిరావుకి కాళ్ళ క్రిందనేల కదిలినట్లూ కళ్ళు తిరిగినట్లూ అనిపించింది. రవణయ్య యిచ్చి వెళ్ళిన పుస్తకంమీది 'కిరీటి' అనే అక్షరాలు వెక్కిరిస్తూ కనిపించాయి. పట్టలేనంత కోపంవచ్చి ఆవేశంతో ఊగిపోయాడు జగత్పతిరావు.

'మాధురి మనస్సులో కోటి కోరికల్ని రేపి, ప్రేమిస్తున్నట్లు నటిస్తూ, వెనకాల ఈ కిరీటి ఆడుతూన్న నాటకం యిదా? తన కూతుర్ని మోసంచేసి దాని బతుకుతో చెలగాటం ఆడుతూన్న వీడిని ' పళ్లు పటపట కొరుకుతూలేచి, ప్రొఫెసర్ వచ్చేదాకా ఆగి చెప్పి వెళదాం అనే ధ్యాసేనా లేకుండా, వెంటనే బయలుదేరాడు యింటికి, అగ్ని పర్వతంలా అడుగులు వేసుకుంటూ.

గుమ్మంలో అడుగు పెడుతూనే "అమ్మా మాధురీ!" అంటూ పిల్చాడు జగత్పతిరావు అపుకోలేని ఆవేదనని కంఠంలో ధ్వనిస్తూ.

నౌఖరు వచ్చి "అమ్మాయిగారు యిప్పుడే అలా వెళ్లారండీ" అన్నాడు. వాడికేసి తేరిపార చూడ్డం తప్ప యేం మాట్లాడలేదు జగత్పతిరావు

అతని హృదయం మండి పోతోంది

మెదడు కాగిపోతోంది

ఆవేశంతో వళ్ళంతా ఊగిపోతోంది.

'ఈ కిరీటి తన బంగారు తల్లి కలల్ని యిలా కాలరాచేస్తాడా? పుట్టినప్పటినుంచి మాధురిని కంట తడిపెట్టనియ్యకుండా తను యెంతో గారాబంగా పెంచాడే! అలాంటి దిప్పుడు ఈ స్కౌండ్రల్ కారణంగా అది గుండెలు మండేలా బాధపడడమా? వీల్లేదు! ఒక్కనాటికి అలా జరగడానికి వీలులేదు వీడిని తలదన్నేలాంటి కుర్రాణ్ణి తెల్లారేటప్పటికి తను తీసుకు వస్తాడు మాధురికిచ్చి పెళ్ళి చేసేస్తాడు. అతణ్ణి చూశాక మాధురి ఈ కిరీటిని మరిచి పోతుంది ఆ! . కాని ఇప్పుడిలా తన కన్నతల్లిని మోసంచేసినందుకు వీడిని యెలా శిక్షించడం? ఏం చేస్తే తన హృదయాన్ని దహించేస్తూన్నమంట చల్లారుతుంది? వీడి మీద యెలా తను కక్ష తీర్చుకోవడం?"

అస్థిమితంగా అటూ ఇటూ తిరిగాడు.

ఒకమాటు గన్ తీశాడు

ఇంకోమాటు యెదురుగుండా మేకుని వేళ్ళాడుతూన్న పెద్దకొరడాకేసి చూశాడు.

మరోమాటు డ్రాయర్ సొరుగులో వున్న పిస్టల్ తీసి అందులో యెన్ని రౌండ్స్ వున్నాయో లెఖ్ఖపెట్టాడు

ఎటూ నిర్ణయించుకోలేక సతమతమౌతూ. నుదుటిని రెండు గుప్పిళ్ళతోనూ నొక్కుకుంటూ, మోచేతుల్ని టేబిల్‌మీద ఆన్చి వేగిపోతున్నాడు జగత్పతిరావు

ఆ సమయంలో ' నమస్కారం అండీ! ఏవిటి నా కోసం యూనివర్సిటీకి వచ్చారట!'' అంటూ ప్రవేశించాడు కిరీటి

అంతదూరంలో కిరీటిని చూడగానే, జగత్పతిరావు గుండెల్లో మండుతూన్న మంట ఒక్కమారుగా లేచి నాలికల్ని జాపుకుంటూ భగ్గుమని జ్వలించింది.

భయంకరమైన సింహంలా లేచాడు

''యూ స్కౌండ్రల్! గెటవుట్!''

బిల్డింగ్ అంతా ప్రతిధ్వనించిన ఆ అరుపుకి పై ప్రణాలు పైకేపోయి, ఆ మట్టునే నిర్జీవంగా నిలబడి పోయాడు కిరీటి.

నౌఖరూ, పని మనిషీ, బట్లరూ, తోటమాలీ అంతా హడిలిపోయి పడుతూ లేస్తూ పరిగెత్తుకుని వచ్చారు హాల్లోకి

అదే సమయంలో, ప్లాస్టిక్ సజ్జలోంచి పెద్ద పూల చెండు ఇవతలకి కొద్దిగా తొంగి చూస్తూంటే, ఆ సజ్జని విలాసంగా ఊపుకుంటూ మధురమైన ఆలోచనల్లో తేలిపోయి తనలో తాను సన్నగా యేదో పాడుకుంటూ, పార్లర్‌లోకి అడుగుపెట్టిన మాధురి, తండ్రి కేకవిని, చేష్టలు దక్కవటికిపోతూన్న కిరీటినిచూసి, ఏం జరిగిందో అర్థం కాక, నోటమాట లేక దిగ్భ్రాంతురాలై నిలబడిపోయింది.

' ఫో! మళ్ళీ కనిపించావంటే ప్రాణాలు తీస్తా-జాగ్రత్త!''-పిచ్చిగా అరుస్తూ మూలనున్న గన్ తీశాడు జగత్పతిరావు.

"డాడీ!"

"అయ్యగారూ!"

"ఆగండి!"

"బాబయ్యా!"

అంతా ఒక్కసారి వెఱ్ఱిగా అరిచారు

ఒళ్లు తెలియని ఆవేశంతో ఒక్క పరుగున తండ్రి దగ్గరకివెళ్ళి "ఏమిటిది డాడీ!" అంటూ చేతిలో వున్న గన్ లాక్కుంది మాధురి.

జగత్పతిరావు కోపంతో ఊగిపోతున్నాడు

అగ్ని గోళాల్లాంటి కళ్ళతో కిరీటిని దహించేస్తూ చూస్తున్నాడు.

ఎదురుగుండా కిరీటి!

వేష్టలు దక్క, భయంతో ఒళ్ళంతా బిగుసుకుపోయి. ప్రాణంలేని కట్టెలా నిలబడి వున్నాడు ముఖం పాలిపోయి, పళ్ళు గిట్ట కరుచుకుపోయి, గాజు గుడ్లతో చూస్తున్నాడు

ఆ చూపులో జీవంలేదు

ఆ ముఖంలో చలనం లేదు.

ఆ శరీరంలో ప్రాణంలేదు.

తండ్రినీ కిరీటినీ మార్చిమార్చి చూసింది మాధురి.

ఇద్దరూ చలనంలేని స్థాణువుల్లా నిలబడి వున్నారు ఒకరి నొకరు చూసుకుంటూ.

ఒకరి కళ్ళల్లో ప్రాణం తీసేసే కోపం.

మరొకరి కళ్ళల్లో ప్రాణాలు పోయేటంతటి భయం

మాధురి, తండ్రి దగ్గర్నుంచి లాక్కున్న గన్‌ని దూరంగా విసిరేసి, కిరీటివైపు తిరిగి బొంగురుపోయిన కంఠంతో "వెళ్లిపోండి ప్రస్తుతానికి దయవుంచి వెళ్లిపొండి" అంటూ బావురుమంది.

ఒక్కగంట క్రితం. ప్రత్యేకం యూనివర్శిటీకివచ్చి, తనని యింటికి రమ్మని చెప్పవలసిందిగా ప్రొఫెసర్‌తో అన్న జగత్పతిరావు ఇప్పుడిలా అవమానపరచి బయటికి గెంటించడానికీ ఆఖరికి చంపడానికీ కూడా యెందుకు సిద్ధం కావలసి వచ్చిందో అర్థంకాక, దిగ్భ్రాంతుడై నిలబడిపోయిన కిరీటికి, మాధురి మాటలు కాని యేడుపుకాని వినిపించనేలేదు.

గద్గదికమైన కంఠంతో "అలా చూస్తారేమర్రా? ఆయన్ని పంపించేసి తలుపు వేసెయ్యండి" అంటూ నౌఖర్నీ బట్లర్నీ హెచ్చరించింది మాధురి ప్రాణంలేని కట్టెని తోసినట్లు కిరీటిని బయటకు తోసి వాళ్లు తలుపులోపల గడియపెట్టారు.

"హమ్మయ్య!" పెద్ద గండం తప్పినట్లు భారంగా నిట్టూర్చింది మాధురి.

"వెళ్ళండిరా-మీపని చూసుకోండి" అని నౌఖర్లనీ వాళ్ళనీ కసురుకొని పంపించేసి, జంకుతూ జంకుతూ తండ్రిని సమీపించి "ఏమైంది డాడీ!" అంది.

జగత్పతిరావు వెంటనే సమాధానం చెప్పలేదు

కొంచెం సేపయ్యాక దీర్ఘంగా శ్వాసవదిలి "ఏమైందా? చెప్తా అంతా చెప్తా" అంటూ ప్రొఫెసర్ గదిలో తను ఒంటరిగా కూర్చున్నప్పుడు రమణయ్య రావడం దగ్గర్నుంచి, జరిగిందంతా సవిస్తరంగా చెప్పాడు జగత్పతిరావు ఆ సంగతి వినేసరికి మాధురి ముఖం పాలిపోయింది "నిజంగానా? కిరీటి ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాడా?" ఏమో. ఎంతసేపు ఆలోచించినా నమ్మకం తోచలేదు, కిరీటికి ప్రేమించడమే తెలిస్తే తనకీ ఇబ్బందులన్నీ ఎందుకు? అది తెలియకనే కదా ఈ అవస్థలు ?

"నువ్వు విన్నది అబద్ధమేమో డాడీ?"

"ఈ పుస్తకం అతను ఆ అమ్మాయికి యివ్వడం కూడా అబద్ధమేనా? ఈ పుస్తకం కిరీటిది అనడం? ఇదీ అబద్ధమేనా?" అంటూ జగత్పతిరావు శృంగార నైషధాన్ని టేబిల్ మీదకి గిరవాటేశాడు అంది మీద కిరీటి పేరు చూసి మాధురి మారు మాట్లాడలేదు

"వాడు నిన్ను మోసం చేశాడమ్మా " తండ్రి మాట విని మాధురి గతుక్కుమంది. కిరీటి తనని ఏం మోసం చేశాడు? నిన్ను ప్రేమించానని ఒక్కమాటైనా అన లేదే ఇంతవరకూ తనతో?

"వాడి తల దన్నినవాడిని తీసుకువచ్చి నీకు పెళ్ళిచేస్తాను"-మాధురి దిగ్భ్రాంతురాలైంది? అదేవిటి? పెళ్ళా? అయినా యిప్పుడా ప్రసక్తి దేనికి?

"తను ఎంత అదృష్టాన్ని పోగొట్టుకొన్నాడో ఆ కిరీటికి తెలిసిరావాలి బాధతో కుమిలి కుమిలి కృశించాలి. ఇది మనకేం అవమానం కాదనీ, తన సంబంధం తప్పిపోయినందుకు మనకేం విచారం లేదనీ, ఆ తెలివి తక్కువ వాడికి తెలియాలి. అందుకేనా నీకు పెళ్ళి చేస్తాను నీ మనస్సు గొంచి, జరిగిన ఈ పీడకలని చెరిపేసి, నవ్వుతూ నువ్వు ఆనందంగా వుండడం కోసం, వెంటనే నీకు పెళ్ళి చేస్తాను."

"డాడీ "

"నువ్వింకేం మాట్లాడకు నేనొక నిర్ణయాని కొచ్చాను దీనికింక తిరుగులేదు నీ పెళ్ళి జరగాలి, అది తెలిసి వాడు నిలువునా క్రుంగిపోవాలి. అది అంతే!" ఆ మాటలు వింటూ నిస్సహాయంగా నిలబడ్డ మాధురి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

## 11

అరుగుమీంచి వసారాలోకీ, వసారాలోంచి అరుగు మీదకీ పచార్లు చేసిచేసి, ఎంతో సేపు ఆలోచించి,ఆలోచించి చివరకి ఓ నిర్ణయానికివచ్చి వుయ్యాలాబల్లమీద కూర్చుంటూ 'రాణీ' అని పిల్చాడు రమణయ్య.

"పిల్చావా మావయ్యా" అంటూ తడిచెయ్యి పైటతో తుడుచుకుంటూ హాల్లోకి వచ్చింది రాణీ. ఆమె చేతులకేసి చూసి "ఏం చేస్తున్నావు? వంట! అవునా? ఈ పరీక్ష నాలుగు రోజులూ నువ్వు చదువుకో. నేను వండుతా అని చెప్పాను కదా?.' అన్నాడు రవణయ్య.

రాణీ నవ్వి. "భలేవాడివి మావయ్యా పరీక్షలైతే ఇంక వంట వండకూడదేమిటి? అయినా ఆడవాళ్ళకి వంట వండుకోవడం ఇల్లు సర్దుకోవడం ఇవి ముఖ్యం కాని పరీక్షలు, పేసవడం, డిగ్రీలు ఇవి యెందుకు? ఎంతయినా చివరకి వంటింట్లోకి రావలసిందేగా?" అంది.

"అందుకని పరీక్షల్లో చదవడం మానేసి తాలింపులూ తిరగమోతలూ పెడుతూ కూర్చుంటావా?

"నిజానికి వీటిలో వున్న సరదా వాటిలో ఏం వుంది? కావ్యాలు చదవడంకంటే కాకరకాయ కూరవండడం సుఖం. చిన్నయసూరిని బట్టీ పట్టడం కంటే చింతకాయ పచ్చడి నూరడం నయం, ఆవకాయ అన్నంలో పెరుగు వేసుకుతిన్న ఆనందం ఎన్ని అలంకారాలు చదివితే వస్తుంది మావయ్యా?"

"అవునవును. పాకశాస్త్ర ప్రవీణ అనే బిరుదుతో పోలిస్తే భాషా ప్రవీణ అసలు బిరుదేకాదు. ఏవంటావు?"

"ఉన్న విషయం చెప్పకపోవడం యెందుకు మావయ్యా నాకు ఇంటి పనుల మీదవున్న ఆసక్తి ఆ పుస్తకాలమీదలేదు"

"మరీ సంగతి ఇన్నాళ్లూ చెప్పలేదేం? ఇంకా నువ్వేదో కష్టపడి చదువుతున్నావు అనుకున్నాను నేను"

"చెబుదాం అనుకున్నాను కాని నువ్వు చెప్పిన ప్రకారం చదవకపోతే నీకు కోపం వస్తుందనీ, చదివితే కాని నీ కిష్టం వుండదనీ "

"నా ఇష్టం కాదే తల్లీ! ఈ రోజుల్లో చదువుకోపోతే ఆడపిల్లలకి పెళ్లి కావడం లేదు. చదువులేదంటే, వాళ్లు, ఆ పెళ్ళి కొడుకులు, ఇష్టపడడంలేదు. వాళ్ళకోసం కాని నా కోసమటే చదువుకోమన్నది?" అన్నాడు రవణయ్య విసుక్కుంటూ

"ఎవిటి? ఎవరికో యిష్టం వుండదనా నేను చదువుకోవడం? అయితే అసలు చదవను."

"మరి పెళ్ళి?"

"కాకపోతే కాకపోతుంది, చదువే ముఖ్యం, పిల్ల ముఖ్యంకాదు అనే పుస్తకాల పురుగుని నేనసలు చేసుకోను.

"రెండూ ముఖ్యమే-అధమం భాషా ప్రవీణ అయినా చదవకపోతే నిన్ను యెవడు పెళ్ళి చేసుకుంటాడనే కదా నిన్ను చదివిస్తున్నది?"

"వాళ్ళ కోరికల ప్రకారం మనం ఎక్కడ తయారౌతాం మావయ్యా! మన అంచనాల ప్రకారం వాళ్లుంటారా? ఏదీ వుండమను ఆరడుగుల పొడవూ. నూట ఎనభై పవునుల బరువూ, గాలిపీలి స్తే "

రవణయ్య కోపంగా చూడడంతో రాణీ వాక్యం పూర్తి చెయ్యకుండా ఆపేసింది.

"నువ్వా పెళ్ళి అయ్యేదాకా నేనా కాస్త చదువు.ఆ తర్వాత అంటావు-నీ ఇష్టం."

రాణీ ఏం మాట్లాడలేదు.

"పెళ్ళికూడా తొందరలోనే చేసేస్తాను. పెళ్లికొడుకుని కూడా నిర్ణయించాను."

రాణీ అదిరిపడింది.

"ఇంకా పెళ్ళికొడుకు నీకు నచ్చాడో లేదో తెలుసుకోవటం ఒక్కటే తరవాయి. అది అడుగుదాం అనే నిన్నుసలు ఇప్పుడు పిలిపించింది "

రాణీ గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. రవణయ్య ముఖంలోకి వేలగా చూసింది.

"కిరీటి గురించి నీ అభిప్రాయం ఏవిటి?"

రాణీ హృదయం కుదుట బడింది.

"అతను మంచివాడే కదూ?"

రాణీ అవునన్నట్లు తల ఊపింది.

"బుద్ధిమంతుడు. అవునా?"

రాణీ కాదనలేదు. రవణయ్య నవ్వుకున్నాడు.

"అతనికి నువ్వంటే ఇష్టం అని నేను గ్రహించాను. మరి నీకు అతనంటేనో?"

"ఫో ఏం ప్రశ్నలివి మావయ్యా" అంటూ చేతుల్లో ముఖం కప్పుకుని సిగ్గుతో అక్కడనుంచి వెళ్ళిపోయింది రాణీ. ఇంతలో వీధిలో ఆటోరిక్షా ఆగిన చప్పుడైంది

"ఎవరొచ్చారో చూడు రాణీ" అని ఇంకా రవణయ్య అంటూండగానే. విజిల్ వేసుకుంటూ కాకీపేంటూ కాకీచొక్కా మెళ్లో గళ్ళ రుమాలూ ఎగదువ్వుడు క్రాఫ్‌తో వీర్రాజు వసారాలోకి ప్రవేశించి, ఎదురుగుండా ఉయ్యాల బల్లమీద కూర్చున్న రవణయ్యను చూసి విస్తుబోయి వెంటనే కంగారుతో తొట్రుపడ్డాడు. ఆ రూపంలో అతణ్ణి చూసి కొంచెంసేపు ఎవరో అర్థంకాక తెల్లబోయి ఆ తర్వాత గుర్తువచ్చి ఆశ్చర్యంగా "ఎవరూ? నువ్వా కిరీటీ?" అన్నాడు రవణయ్య

వీర్రాజు తడబడుతూ "మి మి మ్మీరు ఇంకా షైరు వెళ్ళలేదూ?" అన్నాడు.

"ఈపాటికి వెళ్ళాళలసిందే. కాని రాణీతో ఏదో మాట్లాడుతూ వుండిపోయాను అవునుగానీ-నువ్వీ వేషం ఏవిటి?"

"నే నా? వేషమా?... అవును! వేషం. ఇవాళ మా కాలేజిలో ఫేన్సీడ్రెస్ వేశాం 'కాలేజీ డే' సందర్భంలో."

"కాలేజీ డే ఇవాళేమిటయ్యా, పరీక్షలెప్పుడో మొన్నే అయిపోతేనూ?"

"మొన్నా? ఆ అవును మొన్నే!"

"నేను నీకు పుస్తకం కూడా పంపించాను మీ ప్రొఫెసరుద్వారా. అందిందా?"

"పుస్తకమా? ప్రొఫెసరా?.. యూనివర్శిటీకి వెళ్లారా మీరు?" వీర్రాజు వణికిపోతూన్న కంఠంతో భయపడుతూ అడిగాడు.

"అదేవిటయ్యా-శృంగారనైషధం పుస్తకం నీ కిస్తానని పుచ్చుకున్నాడు మీ ప్రొఫెసర్, ఇవ్వలేదూ?"

తప్పనిసరిగా ఇంక గతిలేక నవ్వి "ఓ ఆదా? ఇచ్చాడండి" అన్నాడు వీర్రాజు.

"అవునూ? కాలేజీలు మూసేశాక ఇప్పుడు 'కాలేజీ డే' ఏవిటి, ఫంక్షను ఏవిటి?"

"ఇవాండీ? ఇవీమధ్యన ఇలాగే చేస్తున్నారు ఇదేం చూశారు? ఈ ఏడు సంవత్సర ప్రారంభంలో జరగవలసిన మా సారస్వత సంఘ ప్రారంభోత్సవమూ, సంవత్సరాంతాన్న జరిగే ముగింపు సమావేశమూ రెండూ ఒకేరోజున ఒకే వేదికపై తెల్లారితే కాలేజీలు మూసేస్తారనగా, ఝామ్మని ఇద్దరు అధ్యక్షుల్ని పెట్టి జరిపించేశారు"

"నిజంగా?" అంది రాణీ

వీర్రాజు రాణీకి రవణయ్య చూడకుండా సంజ్ఞ చేశాడు

"ఇనాగరల్, వెలిడెక్టరీ అల్లా జరిపించి, కాలేజీ మూసేశాక కాలేజీ డే అన్నారా?" అన్నాడు రవణయ్య

"అవునండీ, ఈ మధ్యన కాలేజీ వ్యవహారాలన్నీ ఇలా అస్తవ్యస్తంగానే జరుగుతున్నాయి. మొన్నటికి మొన్న ఓ కుర్రాడు "నేను పరీక్షకి కూచోలేదు మొర్రో" అంటే యూనివర్శిటీవారు అలా కాదని చెప్పి, వాడి నోరు మూయించి "నువ్వు పేసయ్యావు. పో" అని చెప్పి సెప్టెంబరు ఫలితాలు మార్చిలో ప్రకటించి, అప్పటికి కాన్వొకేషన్ అయిపోయింది కనుక డిగ్రీని పోస్టులో పంపించేశారు. తీరా చూస్తే అది థర్డ్‌క్లాసు ఎమ్మే డిగ్రీ, వాడు చదివిందేమో ఎమ్. ఎస్‌సీ. "బాబోయ్ నాకీ థర్డ్‌క్లాసు ఎమ్మే డిగ్రీ ఎందు కుపయోగిస్తుంది" అని లబోదిబోమంటూ వాడు ఒకటే గోల. సిండికేట్‌కి అప్లికేషన్ పెట్టుకుంటే "ఇచ్చిన డిగ్రీ కేన్సిల్ చెయ్యడం యూనివర్శిటీ ప్రతిష్టకి భంగకరం. అందువల్ల ఆ డిగ్రీ అలాగే అట్టే పెట్టుకో. కావలిస్తే ఈ ఏడాదికి థర్డ్‌క్లాసు వాళ్ళనికూడా సెకండ్‌క్లాసు వాళ్ళతో సమానంగా చూసి ఉద్యోగాలు ఉదారంగా ఇవ్వవలసిందిగా అనుబంధ కళాశాలలకి ఆజ్ఞాపత్రం పంపుతాం అన్నారు."

"పోవయ్యా-నువ్వు మరీ తమాషాగా చెప్తావు" అన్నాడు రవణయ్య నవ్వుతూ.

"నిజం అండీ" అన్నాడు వీర్రాజు అమాయకంగా.

"అది సరే-నువ్వీ ఆటోరిక్షా డ్రైవరు వేషం ఏమిటీ?"

'ఆ సంగతే కదాండీ చెప్తున్నా. కాలేజీ డే అని తలో కళ్ళం, తలో ఫ్యాన్సీ డ్రెస్సూ వేశాం. అందులో నేనిది వేశాను."

"మరిల్లా వచ్చేశావేం? ఫంక్షన్ అయిపోయిందా"

"లేదండి తీరా అంతా సిద్ధం అయ్యాక స్టూడెంట్సుకీ స్టాఫ్‌కీ ఆడవాళ్ళ సీట్లు ఏర్పాటు చెయ్యడం దగ్గర తగాదా వచ్చింది లేడీస్ సీట్లు మా ముందు ఉండాలి అంటే మా ముందు ఉండాలి అన్నారు వీళ్ళ తగాదా తీర్చలేక చివరికి మా యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాలు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలరూ కలిపి ఈ ఏటి కాలేజీడేని, ఎప్పో ఏటికి పోస్టుపోన్ చేసి, ప్రస్తుతానికి ఈ సమస్యని ఇలా పరిష్కారం చెయ్యగలిగాం కదా అని ఒకళ్ళనొకళ్ళు అభినందించుకున్నారు"

"ఈ వేషం వెనకాల ఇంతకథ ఉందన్నమాట!"

రవణయ్య ఏ ఉద్దేశంతోటి ఆ మాట అన్నాడో కాని, అది వినడంతో వీర్రాజు గుండె కలుక్కుమంది "ఈ ముసిలాడు అసలు రహస్యం కనుక్కోలేదు కదా కొంపదీసి యూనివర్సిటీకి కూడా వెళ్ళొచ్చానంటున్నాడు కిరీటిగాడిని కలుసుకున్నాడేమో దుర్మార్గుడు అసలే అపలిస్తే పెగుల చెప్పేటకం"-ఇలా అనుకొని రాణీకేసి చూశాడు వీర్రాజు, "నువ్వేం చెప్పలేదుకదా' అన్నట్లు ముఖంపెడుతూ "భయంలేదు భక్తా!" అనే అర్థం వచ్చేటట్లు నవ్వింది రాణీ-దాంతో వీర్రాజు గుండెలు కుదుటపడ్డాయి

"కాలేజీల్లో ఇలా ఫేన్సీడ్రెస్‌లు వెయ్యడం ఎందుకో ఇపుడు నాకు అర్థం అయింది" అన్నాడు వీర్రాజు ఏదో మాసి ఆలోచిస్తూ

"ఎందుకుట" అన్నట్లు మాశారు రవణయ్య రాణీను.

"ఎందుకంటే-ఈ బియ్యేలూ ఎమ్మేలూ పేసయి డిగ్రీలు చేత్తోపుచ్చుకుని దేశాటన చెయ్యడం, ఎక్కేగుమ్మం దిగే గుమ్మం అంటూ అన్ని ఆఫీసులూ దర్శించడం, ఇంటర్వ్యూ అనే నాటకంలో ప్రతి అనామకుడూ అడిగే తెలివితక్కువ ప్రశ్నలకి వినయంగా సమాధానం చెప్పడం, ఇలా ఉద్యోగ ప్రయత్నం అనే వైకుంఠపాళీ ఎంత ఓపిగ్గా నువ్వు ఆడినా, ముచిక దగ్గరకొచ్చి నీ శ్రమ ఫలించబోయేసరికి, ఏ అందమైన అమ్మాయి రూపంలోనో, అమాత్యవర్యుని మేనల్లుడు వేషంలోనో, ఐశ్వర్యవంతుని కుమారుని ఆకారంలోనో, పెద్దపామువచ్చి గుటుక్కున నీకు రావలసిన ఉద్యోగాన్ని కాస్తా తను మింగేస్తుంది. దాంతో ఉద్యోగంలేక, బ్రతుకుతెరువు దొరక్క, నువ్వు మలమల మాడిపోవలసి వస్తుంది అలాంటి ప్రమాదం జరక్కుండా ఉండాలంటే, నీకు అప్పటికే మొలతాళ్ళూ పిన్నీసులూ రిబ్బన్లూ అమ్ముకునే తెలివో, రిక్షాలూ ఆటోరిక్షాలూ

ఉక్సీలూ నడపగలిగేనేర్పో వచ్చి ఉండాలి. ఇలాంటివేవో నేర్చుకుంటే ఉద్యోగం లేకపోయినా ఆ వృత్తులు చేసుకుని బ్రతుకవచ్చు. అందువల్ల "నాయనా, కాలేజీలో చదువుకొనే రోజుల్లోనే ఈ వృత్తుల మెళుకువలు నేర్చుకో అని పెద్దలు ఫేన్సీడ్రెస్‌లు ఏర్పాటు చేశారు''-వీర్రాజు మాటలువిని, రాణీ,పైటచెంగు నోటికి అడ్డుపెట్టుకుని నవ్వితే రవణయ్య పగలబడి నవ్వాడు. ఇద్దరూ అలా నవ్వుతుంటే, అతి సీరియస్‌గా నిలబడి ఉన్న వీర్రాజు, జీవితంలో తను ఎదుర్కొన్న భయంకర సత్యం వికటాట్టహాసంతో తనని పరిహాసం చేస్తున్నట్లు ఫీలయి, తన గతచరిత్రా, ప్రస్తుత పరిస్థితీ జ్ఞప్తికివచ్చి, తలవంచుకొని విషాదంగా ఉండిపోయాడు. తనేదో నవ్వుతాలకి చెప్పాడనుకుంటున్నారు వీళ్ళు-ఇది తన బ్రతుకులో చవిచూసిన చేదునిజం అని వీళ్ళకేంతెలుసు! హుం! విదూషకుడి కన్నీళ్ళలోకూడా వినోదాన్నే చూసే లోకం ఇది, అనుకున్నాడు.

''అయితే ముందు ముందు పనికొస్తుందని ఈ ఫేన్సీ డ్రెస్ వేశావన్నమాట!'' వస్తూన్న నవ్వుని ఆపుకొంటూ అన్నాడు రవణయ్య. వీర్రాజు ఏం మాట్లాడలేదు. అతని జీవితానికి సంబంధించిన ఒకటి రెండు నిజాల్ని ఇంత క్రితమే తెలుసుకున్న రాణీ మాత్రం, వీర్రాజు ముఖంలో కన్పించిన విషాదరేఖల్ని గమనించి కళవళ పడింది. మాట మార్చడంకోసం ''మావయ్యా నీకు షైరు వెళ్ళవలసిన టైమయింది'' అంది.

రవణయ్య ''అవునవును. వెళ్ళాలి. ఏమయ్యా కిరీటీ! నువ్వు కాస్సేపు కూర్చుంటావా, వస్తావా?'' అంటూ లేచాడు. వీర్రాజు తన ఆలోచనల్లోంచి తేరుకొని, ప్రయత్నపూర్వకంగా నవ్వి ''మొత్తం ముగ్గురం వెళదాం. ఆటో రిక్షా ఉందిగా!'' అన్నాడు

''ఏవిటీ? నువ్వివాళ కొత్తగా ఈ ఫేన్సీ డ్రెస్‌కోసం ప్రాక్టీసు చేసిన ఆ డ్రైవింగ్ ప్రావీణ్యాన్ని నమ్ముకుని నీ ఆటోరిక్షా ఎక్కాలమ్మా? చాలు చాలు స్వర్గానికి దగ్గరదారి అంతకంటే ఉండదు.''

''అలా భయపడనక్కర్లేదు మావయ్యా - ఆయన ఆటోరిక్షా బాగానే డ్రైవ్ చేస్తారు'' అంది రాణి

''నీ కెలాగ తెలుసు?''

రాణీ ఇబ్బందిలో పడింది. ఎలా చెప్పడం? ఏమని చెప్పడం?

''ఇంతక్రితం ఎప్పుడేనా డ్రైవ్ చేశావేమిటయ్యా?''

వీర్రాజు కొంచెంసేపు తికమకపడి, తర్వాత తేలిగ్గా నవ్వేస్తూ ''నే నింత క్రితం ఆటోరిక్షా నడపాలేదు, రాణీ ఆ రిక్షా ఎక్కాలేదు. అయితే మామూలుగా కొంచెం తెలివితేటలున్నవాడు ఏ విద్యనైనా ఇట్టే గ్రహించేస్తాడుకదా! ఆ దృష్టిలో రాణీ అనేది ఉంటుంది నన్ను తెలివైనవాడిగా జమ కట్టేసి. ఏం అంతేకదా రాణీ!'' అన్నాడు.

"హమ్మయ్య! రక్షించారు!" అని మనస్సులో అనుకొని "అంతే అంతే" అంది రాణీ

"కిరీటి తెలివీ, నేర్పూ, సామర్థ్యం - వీటిమీద అంత నమ్మకం నీ కుంటే సరే- బయలుదేరు. అలా టేంక్ బండ్ కేసి వెళ్ళివద్దాం అతని ఆటోరిక్షామీద" అంటూ లేచాడు రవణయ్య.

టేంక్ బండ్ మీద ఉన్న ఒక సిమెంట్ బెంచీ దగ్గరికి నడుస్తూ "నిజమేనయ్యా! మంచి ప్రావీణ్యం ఉన్న డ్రైవరులా నడిపావు ఆటోరిక్షాని. మధ్యలో ఏం ప్రమాదం తీసుకువస్తావో అని ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని కూర్చున్నాను ఇంతసేపూ" అన్నాడు రవణయ్య.

వీర్రాజు ఏం సమాధానం చెప్పలేదు. వాళ్ళకి ఎడంగా నడుస్తూ, దూరంలో బోట్ షైరు చేస్తూన్న ఒక నవదంపతులుకేసి కళ్ళప్పగించి చూస్తూన్న రాణీని పరిశీలిస్తూ ఉండిపోయాడు

రాణీ తమ ఇద్దరికీ కొంచెం దూరంలో ఉండడాన్ని గమనించి "మరైతే పరీక్ష లయి పోయాయికదా నువ్వు నరసాపురం వెళ్ళవ్!" అన్నాడు రవణయ్య.

వీర్రాజు పరధ్యానంగా "ఎందుకు?" అన్నాడు

"ఎందుకేవిటయ్యా? మీ అమ్మగారిని చూడాలనీ స్వంత ఊరు వెళ్ళాలనీ లేదా ఏవిటి నీకు?"

"అవు నవును వెళ్ళాలి .వెళ్తాను "

"వెళ్ళబోయేముందు నీతోటి కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి. నాతో చెప్పకుండా మాత్రం వెళ్ళకు సుమా."

"అబ్బే ఎందుకు వెళ్తాను? వెళ్ళను అఫ్ కోర్స్ వెళతాననుకోండి మీకోటి చెప్పి వస్తా ఈ ఆటోరిక్షా ఇచ్చెయ్యాలి టైమయిపోయింది" అంటూ, "ఉండవయ్యా కాస్సేపు ఆగితే అంతా కలిసే వెళ్ళొచ్చు" అంటూన్న రవణయ్య మాటని వినిపించుకోకుండా! ఆటోరిక్షా స్టార్ట్ చేసి రయ్ మని వెళ్ళిపోయాడు వీర్రాజు. "భలే వాడే!" అంటూ తృప్తిగా నిట్టూర్చాడు రవణయ్య. రాణీ మాత్రం బోట్ షైర్ చేస్తూన్న ఆ దంపతుల్ని చూస్తూనే ఉండిపోయింది.

# 12

చుట్టబెట్టిన పక్క బట్టల్ని ఆనుకొని, దాదాపు పడుకున్న భంగిమలో జేర్లబడి కూర్చుని, దూలాలకేసి చూస్తూ సిగరెట్టు కాలుస్తూ పరధ్యానంగా ఆలోచిస్తూన్న శేఖర్ ని చూసేసరికి, వీర్రాజుకి మనస్సులోంచి ఆపుకోలేనంత వెఱ్ఱి బాధ వచ్చేసింది.

"ఒరేయ్ ఏమిట్రా ఇది? నెల్లాళ్ళనుంచి చూస్తున్నాను ఆ పరకా ఆలోచనా ఇంక తెముల్చేమిటి?"

శేఖర్ మాట్లాడలేదు

" రీక్ష లేమైనా పాడు జేశావా? ఎంత పలకరించినా మాట్లాడవేమిట్రా?"

"నన్ను విసిగించకు ఒరేయ్!"

"నిక్షేపంలా నవ్వుతూ తుళ్ళుతూ సరదాగా ఉండేవాడివి ఏం వచ్చిందిరా నీకీ మధ్య"

జవాబు లేదు

"ఎన్నాళ్ళయిందిరా నువ్వు నాతో సరదాగా మాట్లాడి?"

వీర్రాజు కంఠంలో వినిపించిన ఆవేదనకి ఉలిక్కిపడి తల తిప్పి చూశాడు శేఖర్.

వీర్రాజు కళ్ళల్లో నీళ్ళు

వెంటనే గదిమూలకి సిగరెట్టుని విసిరికొట్టి లేచికూచుంటూ "ఏమిట్రా అది? ఆడపిల్లలా" అంటూ కసురుకున్నాడు శేఖర్.

వీర్రాజు మాట్లాడలేదు.

"ఆ కన్నీళ్ళు ఏమిట్రా బుద్ధి లేకపోతేనూ?"

"ఎవరెన్ని కన్నీళ్ళు కార్చినా నీ మనస్సెం కరగదుగ?"

శేఖర్ నీరసంగా నవ్వి "నా మనస్సు గురించి నీ కంత బెంగ ఎందుకురా?"

"అవున్లే. నీకు నే నేమైనా అన్నగారినా తమ్ముడినా? అధమం కిరీటిలా రూమ్‌మేట్‌ని అయినా కాదాయెను. ఏ సంబంధం లేనివాడిని. నువ్వేమైపోతే నాకేం?"

"ఓరి పిచ్చి సన్నాసి - నే నేం అయిపోవడంలేదురా నువ్వు అనవసరంగా కంగారు పడుతున్నావు కాని"

"అదీ- నేను కంగారు పడుతున్నాను అవునా? ఒరేయ్! ఎందుకురా నా దగ్గర దబాయిస్తావు!"

శేఖర్ ఏం మాట్లాడలేదు.

"నేను కనిపెట్టడం లేదనుకున్నావా? ఒ మారు నెలా పదిహేను రోజులనుంచి నువ్వు కడుపునిండా భోజనం చేశావా? కంటినిండా నిద్రపోయావా? ఏ వేళ వచ్చి చూసినా నువ్విలా వెల్లకిలా పడుకొని సిగరెట్టు కాలుస్తూ ఏదో ఆలోచిస్తూ ఉండడం లేదూ? ఏమిట్రా ఇది అంటే పైగా మీదపడి కరుస్తావా? సర్లేరా సరే నువ్వు నన్నంత పరాయివాడిగా చూస్తూ నీకున్న సమస్యేదో నాకు చెప్పకపోతే, నే నే నేమిటి నీకోసం వెఱ్ఱివాడిలా బాధపడేది?"

"వీర్రాజూ!" అన్నాడు శేఖర్ బొంగురుపోయిన కంఠంతో.

కింది పెదవిని పై పంటితో నొక్కి, వచ్చే కన్నీటిని ఆపుకొంటూ "ఇన్నాళ్ళ

నుంచీ ప్రాణానికి ప్రాణంగా ఉంటున్నాం మనిద్దరిమధ్యా రహస్యాలు లేవనుకున్నాను ఇద్దరం ఒకటే అనుకున్నాను. అది కాదని ఇవాళ నువ్వు నాకు బుద్ధి చెప్పావు పోన్లేరా పోనీ ' అన్నాడు వీర్రాజు.

ఆ స్థితిలో వీర్రాజుని చూసేసరికి శేఖర్ కదిలిపోయాడు. దగ్గరగా వచ్చి మీద చెయ్యివేసి "ఎందుకురా అలా బాధ పడతావు? నువ్వు తీర్చే సమస్య అయితే నీకు చెప్పకుండా ఉంటానా?" అన్నాడు.

"తీర్చకపోతే- కనీసం అర్థం అయినా చేసుకోలేవా? నా మీద ఆ మాత్రమేనా నమ్మకం లేదా?"

"ఒరేయ్ నువ్వు మరీ సెంటిమెంటల్‌గా తయారవకు"

"అంతకంటే, నీ కేసంగతి చెప్పనబ్బాయ్ అని ఒక్క మాట చెప్పు చాలు. ఆ తర్వాత నిన్ను మళ్ళీ అడిగితే ఒట్టు"

శేఖర్ తుళ్ళిపడి "బాధ పడకురా. అంతా చెప్తాను సమయం వచ్చినప్పుడు. నీకు చెప్పకపోవడం ఏమిటి? నువ్వూ కిరీటీ తప్ప నాకు మాత్రం ఆప్తు లెవరున్నారు?" అన్నాడు

కాస్సేపు ఆగి దీర్ఘంగా నిట్టూర్చి "సరే- నీ నీ ఇష్టం వచ్చినప్పుడు చెప్పు. మరి నే వస్తా"

"ఉండు. నేనూ నీతో అక్కడిదాకా వచ్చి టీ తాగివస్తా" అంటూ శేఖర్ లేచాడు.

టీ తాగి ఓ అర గంట అటూ ఇటూ తిరిగి రూమ్‌కి చేరుకొనేసరికి, అక్కడ చాలాసేపటినుంచి వేచి ఉన్న మాధురి కనిపించింది శేఖర్‌కి. ఆ సమయంలో అక్కడికి మాధురి రావడాన్ని చూసి విస్తుపోయాడు. ఆమె ఎందుకు వచ్చినట్టు? తనకోసమా? తనకోసం ఎందుకు వస్తుంది- తనపట్ల ఆమెకి ఉన్న అభిప్రాయం ఏమిటో ఆ రోజున కేంటీనులోనే తెలిసిపోయిందిగా? ఇంకా ఎందుకు తనకీ ఆశ? శేఖర్ తనలో తనే విషాదంగా నవ్వుకున్నాడు తల వంచుకొని ఆమెని చూడనట్లే ముందుకి నడిచి గది తాళం తెరవబోయాడు శేఖర్.

వెనకనుంచి "ఏమండీ!" అని మాధురి పిలుపు! ఆ కంఠంలోని దైన్యాన్నీ బాధనీ గ్రహించి, తెల్లబోయి ఆ మట్టునే ఆగిపోయాడు శేఖర్.

"మీతో ఒక్క క్షణం మాట్లాడాలి" ప్రార్థిస్తూన్నట్లున్నాయి ఆ మాటలు.

తనతోనా? ఆశ్చర్యంగా ఆమెకేసి చూశాడు.

మాధురి కళ్ళల్లో పల్చని నీటితెర!

నిర్లక్ష్యంగా ముందుకి వెళ్ళలేక పోయాడు శేఖర్ ఎటో చూస్తూ నిలబడి ఉన్నాడు.

"ఖాళీ చేసుకుని ఒక్క అర గంట ఇంటికి రాగలరా?"

శేఖర్ తుళ్ళిపడ్డాడు. వెటకారంగా అంటోందా? లేకపోతే ఏమిటి? కేంటీను నుంచి అలా విసురుగా వెళ్ళిపోయిన తర్వాత, తనతో ఎప్పుడూ ముఖం విప్పారి మాట్లాడని మనిషి. ఎదురైనా ఏదో వంకని పక్కకి తప్పించుకొని పోయేవ్యక్తి. ఇలా ఇంటికి రమ్మని పిలవడం ఏమిటి?

ఆమెకేసి నిశితంగా చూశాడు శేఖర్.

మాధురి కళ్ళల్లో నీళ్ళూ, చూపుల్లో బేలతనం అతని పట్టుదలని సడలించాయి.

"సరే రేపు సాయంత్రం" అన్నాడు అప్రయత్నంగా.

"నిజంగా? మరిచిపోరుకదూ?" అంటూన్నప్పుడు మాధురి కళ్ళు సంతృప్తిగా మెరిశాయి

మర్నాటి సాయంత్రం బయలుదేరే దాకా, సముద్రంలో అలలు లాగ ఎడ తెరపి లేకుండా ఒకటే ఆలోచనలు శేఖర్ మనస్సులో కెరటాలు లాగే ఎవేవో కొత్త కొత్త ఆశలు ఉవ్వెత్తుగా లేచి కింద పడుతున్నాయి. తన అభిప్రాయాన్ని అర్థం చేసుకునీ కూడా ఆరోజున కేంటీన్ తనని మర్యాదగా తిరస్కరించిన వ్యక్తి ఇవాళ ఇలా ఇంటికి ఆహ్వానించడం ఏమిటి? ఆమెలో ఏదైనా మార్పు వచ్చిందా? గతంలో ప్రవర్తనకి పశ్చాత్తాప పడుతోందా? కొత్తగా తనంటే అనురాగం ఏర్పడిందా? అయితే కళ్ళల్లో నీళ్ళెందుకు?

గుమ్మం దగ్గరే ఎదురై 'రండి' అంది మాధురి.

ఆ ఆహ్వానంలో ఏ భావమూలేదు కానయితే చాలా సేపటినుంచి తనకోసం ఆమె వేచి ఉందని మాత్రం గ్రహించాడు శేఖర్.

శేఖర్‌ని సోఫామీద కూర్చోమని, లోపలికివెళ్ళి తనే కాఫీ తెచ్చింది మాధురి. ఆమె తెచ్చుకోలేదు బట్లర్ తెస్తున్నాడేమో అని చూశాడు శేఖర్ అతని అభిప్రా యాన్ని గ్రహించి "నే నిప్పుడే తీసుకున్నాను. మీరు పుచ్చుకోండి" అంది మాధురి.

ఆమె కంఠంలో పూర్వపు చురుకుతనం కాని చిలిపితనం కాని లేదు విషాదంగా సౌమ్యంగాఉన్న కంఠం కొత్తగా వినిపించింది శేఖర్‌కి

నిరాడంబరంగా ఉన్న మాధురి రూపాన్ని చూస్తూ కాఫీ తాగుతున్నాడు శేఖర్.

ఇల్లంతా అతి నిశ్శబ్దంగా ఉంది.

పనివాళ్ళ సందడి కూడా ఏం వినిపించడం లేదు.

"నాన్నగారు ఇంట్లోలేరా?"-ఏదో మాట్లాడాలి కనుక మాట్లాడాను అన్నట్లుంచి అతను అడగడం ఆ ప్రశ్నకి ఆమె దగ్గరనుంచి సమాధానాన్ని శేఖర్ ఊహించలేదు.

ఆ ప్రశ్నతో మాధురి హృదయం అంతా కలగిపోయింది, కళ్లునీళ్లతో నిండి పోయాయి బాధతో ముఖం అంతా వాడిపోయింది. అతి కష్టంమీద వస్తూన్న దుఃఖాన్ని ఆపుకొని "రండి చూపిస్తా" అంటూ పక్కగదిలోకి దారితీసింది.

శేఖర్‌కి ఏం అర్థంకాలేదు మౌనంగా మాధురి వెనకాలే పక్కగదిలోకి నడిచాడు.

అక్కడ:

నరాలు ఉబ్బి, ముఖం జేవురించి, శరీరం అంతా కుష్కించి, కళ్ళు మూసుకుని మంచంమీద అచేతనంగా పడుకొని ఉన్నాడు జగత్పతిరావు. పక్కని స్టూలుమీద ఉన్న మందు సీసాలో, గ్లూకోజు పేకెట్టూ, దగ్గర్లో ఉన్న ఐస్‌బేగూ, అతను చాలా రోజుల నుంచి అస్వస్థతగా ఉన్నట్లు చెప్తున్నాయి

"ఏవిటిది? ఎప్పటి నుంచి ?"

"పదిహేను ఇరవై రోజుల నుంచి" — మాధురి కంఠం బొంగురు పోయింది

కొంత సేపయాక, మాధురి వెనక్కి తిరిగి మళ్ళీ హాల్లోకి వచ్చేస్తే, చేతుల వెనక్కి పెట్టుకుని ఆమెతోపాటూ తనూ ఇవతలకి వచ్చాడు శేఖర్

చాలా సేపటివరకూ ఎవరూ మాట్లాడలేదు

"ఎవైంది? ఏవిటి జబ్బు?" అన్నాడు శేఖర్.

"హైపర్ టెన్షన్ తీవ్రమైన ఆవేశంవల్ల పట్టలేని ఆందోళనా ఆవేదనావచ్చి రోజుకి నాలుగైదుసార్లు ఇలా స్పృహలేకుండా ఉంటున్నారు"

"ఆవేశం, ఆవేదనానా?" ఆశ్చర్యంగా అడిగాడు శేఖర్.

తను కూర్చున్న సోఫామీద వేలితో ఏవో అర్థంలేని గీతలు గీస్తూ, ఆరోజు కిరీటిమీద జగత్పతిరావు వెఱ్ఱి ఆవేశంతో విరుచుకుపడిన సంగతి కొద్ది కొద్దిగా చెప సాగింది మాధురి, మధ్య మధ్య అగుతూ

అంతా విని, "అలాగా? ఈసంగతి నాకింతవరకూ తెలియదే! అందుకవ మాట ఆరోజు కిరీటి అంత హఠాత్తుగా వెళ్ళిపోయాడు ఆఖరి పరీక్ష రాసేసి!" అం కున్నాడు శేఖర్.

"కిరీటి నన్ను మోసం చేశాడనుకోవడంతో ఆయన మనస్సు బాగా దెబ్బతింది నిజానికి ఇందులో కిరీటినన్ను మోసంచేసింది ఏం లేదు. నన్ను ప్రేమించానని అతః నాతో ఒక్కమాటు అనలేదు. అటువంటప్పుడు అతనా ముసలాయన మేనకోడల ప్రేమిస్తే ఏం, మరొకర్ని ప్రేమిస్తే ఏం? నన్ను ప్రేమిస్తున్నా డనుకోవడం నిజాః నాదే తప్పు" ఈ మాటలంటున్నప్పుడు మాధురి కంఠం బొంగురు పోయింది.

"కిరీటీ ప్రేమించడమూనా అయ్యోరాత వాడికామాత్రం తెలిస్తే ఇంకే కావాలి?" అనుకొన్నాడు శేఖర్.

"మామూలుగా అయితే మా డాడీ ఆ ముసలాయన చెప్పింది నమ్మి ఉండే పోను. ఈ పుస్తకం కూడా చూసేటప్పటికి " అంటూ మాధురి లేచి వెళ్ళి ఉ మారులో పుస్తకాల వెనకాల దాచి ఉంచిన శృంగార నైషధాన్ని తీసుకువచ్చిం

ఃపుస్తకాన్ని చూస్తూనే శేఖర్ గతుక్కుమన్నాడు కిరీటిచేత వీర్రాజుకి ఆ పుస్తకాన్ని
లవంతంగా ఇప్పించింది తను. ఆ రోజున కిరీటి అననే అన్నాడు 'ఒరేయ్-ఇక్కడ
ఃనో కిరీటిన్ని ఉండగా వాడి నింకో కిరీటిని చేస్తే ఆనక కొంపలేం అంటుకుంటాయో,
ఃని-చివరకి అనుకున్నంతా అయిందన్నమాట. శేఖర్ ఆలోచనలో పడ్డాడు

"నాగురించి కిరీటి అభిప్రాయం ఏమిటో నాకింతవరకూ తెలియదు మా డాడీ
ాత్రం కిరీటి మొదట నన్ను నమ్మించి, తర్వాత ఆ అమ్మాయి నెవర్నో పెళ్ళిచేసుకో
ోతున్నాడనీ అనుకుంటున్నారు"

శేఖర్ ఇంక అసలు విషయం చెప్పకుండా ఉండలేకపోయాడు అందుకే
ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోబోతున్నవాడు కిరీటికాదు. వీర్రాజు! అసలు జరిగిం
విటంటే " అంటూ మాధురి ఆశ్చర్యపోయింది.

"నిజంగా? అయితే ఈసంగతి డాడీకి ఇప్పుడే చెబుదాం" అంటూ పట్టలేని
త్సాహంతో లేచింది మాధురి

కాని శేఖర్ వెంటనే ఆమెకి వారించాడు. 'న్యూరాలజీ' లో తనకి తెలిపిన
జ్ఞానాన్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ" అంత హైపర్ టెన్షన్‌లో ఉన్న వ్యక్తికి బాధ కలి
ంచేవి ఎలా చెప్పకూడదో ఆశ్చర్యం, పశ్చాత్తాపం కలిగించే విషయాలు కూడా,
ాగే చెప్పకూడదు. అసలు సంగతి నెమ్మదిగా స్థిమిత పడ్డాక చెప్పవచ్చు. ప్రస్తు
నికి ఆయన బ్లడ్ ప్రెషర్ తగ్గేపద్ధతి ఆలోచించాలి" అన్నాడు. మాధురి ఏం
ాట్లాడలేదు. తలవంచుకొని కూచుంది.

"కిరీటిమీద అలా కేకలు వెయ్యడంతోటే ఆయనకి బ్లడ్ ప్రెషర్ వచ్చిందా? లేక,
ర్వాత ఇంకేమైనా సంఘటనలు జరిగాయా?"-ఆ ప్రశ్నలో, ఏం జరిగిందో తెలుసుకో
లనే కుతూహలం కంటే, అసలాయనకి ఆ షాక్ ఎందుకు వచ్చిందో వివరంగా
ుం చేసుకోబోయే డాక్టర్‌యొక్క ఆదుర్దా, ఎక్కువగా కనిపించింది.

ఆ ప్రశ్నకి మాధురి వెంటనే సమాధానం చెప్పలేదు. కాస్సేపాగి ఆ తర్వాత
ంకేసి చూస్తూ నెమ్మదిగా చెప్పసాగింది. "అఫ్ కోర్స్-ఆ రోజుల్లా నమ్మించి మోసం
ాడన్న బాధతో వుండుండి కిరీటి గురించి కోపంగా ఏవేవో అంటూనే వున్నారు ఐతే
కోపం క్రమంగా మర్నాటికి మరో రూపం దాల్చింది "

శేఖర్ "ఏమిటి?" అన్నట్లు చూశాడు.

"మర్నాటినుంచీ" ఇది నాకు తీరని అవమానం. తను తృణీకరించడానికి నా
తురికి ఏం లోటని? తల్చుకున్నానంటే వారం తిరక్కుండా తనని తలదన్నే కుర్రాడిని
ంకువచ్చి నీకు పెళ్ళి చేస్తాను ఏవనుకున్నాడో ఏమో అలా చేస్తేనే వాడికి అర్థం
ుతుంది వాడు యెంత అదృష్టాన్ని పోగొట్టుకొన్నదీ వెయ్యాలి నీ పెళ్ళి గ్రాండ్‌గా

చెయ్యాలి అప్పుడు కాని మండుతూన్న నా మనస్సు శాంతించదు. అవమానం పొందిన నా హృదయానికి ఊరట వుండదు'' అంటూ మొదలెట్టారు.''

''ఊఁ''

''కాని నేనే ఆ ప్రయత్నాన్ని సాగనివ్వలేదు ఇప్పుడు నా పెళ్ళి ప్రయత్నాలేం చెయ్యొద్దనీ. నేను కొన్నాళ్ళదాకా పెళ్ళి చేసుకోననీ గట్టిగా చెప్పాను కాని . కాని నేనంత దృఢంగా చెప్పి ఆయన ప్రయత్నాన్ని యెదిరించడం వల్లనే ఏమో — డాడీకి ఈ షాక్ ఇలా వచ్చింది''-మాధురి గొంతు జీరబోయింది

''అంటే-ఏం జరిగింది? మీరు కాదన్నాక ఆయన ఏం అన్నారు ''

''ఏం అనలేదు నాకేసి తెల్లబోయి చూసి ఆ మట్టునే కుర్చీలో కూర్చుండి పోయారు. తర్వాత కళ్ళుమూసుకుని వెనక్కి జేర్లబడి చాలాసేపు వుండి తనలో తానేదో అదే పనిగా అనుకోసాగారు ''

''ఆ అనుకున్న దేమిటో చెప్పగలరా?''

''ఆ ఏం వుంది? నాకు తెలుసమ్మా నీకా కిరీటి మీదే మనసుంది వాడేమో నిన్నిలా మోసం చేశాడు నువ్విలా వేదనతో బాధపడుతూంటే చూసి నేనిలా విలవిల్లాడిపోతూ వుండి పోవాలి .. అవునా? నువ్వు పెళ్ళి చేసుకుంటే నీకు నాకూ కొంత ఊరట కలుగుతుంది జరిగింది మరిచి పోవచ్చు కాని నువ్వు చేసుకోవుగా? చేసుకోవు . అంటూ అదే పనిగా అనసాగారు.''

''ఆ తర్వాత స్పృహ గోల్పోయి యిలా పడిపోయారు. అవునా?''

మాధురి మాట్లాడలేదు.

శేఖర్ ఆలోచిస్తూ ''మీరు తాత్కాలికంగానైనా పెళ్ళికి ఒప్పుకొని వుండవల సింది అలాచేసి వుంటే ఆయనకీ మానసికమైన వేదనా బాధా వచ్చి వుండేది కాదు. కావలిస్తే ఆ పెళ్ళి జరక్కుండా కొన్నాళ్ళ జాప్యంచేసి, నిర్ణయం అయిన ఆ పెళ్ళి కొడుకుతో సంప్రదించి మీతో కొన్నాళ్ళ సహకరించి నటించి, మీ డాడీ కోలుకొన్నాక అసలు సంగతిచెప్పి, ఆ తర్వాత అతణ్ణి తెర వెనక్కి తప్పుకొనే యేర్పాటు చెయ్యవల్సింది అయితే అలా తప్పుకోడానికి ఒప్పుకొనే పెళ్ళికొడుకు దొరకాలి. అది కొంచెం కష్టం'' మాధురి ఆలోచనలో పడింది.

నిజమే' తనకి కిరీటిని తప్ప యింకెవరినీ పెళ్ళి చేసుకోవడం యిష్టంలేదు. ఈ పరిస్థితిలో డాడీ చెవిని అతనిపేరు పడడానికి వీలులేదు అలాగని తను పెళ్ళి సంగతి రానియ్యకుండా యిలాగే వుండిపోతే డాడీ కోలుకొనే యెత్తు కనిపించడంలేదు డాడీకి మామూలు ఆరోగ్యం రావాలంటే, తను అనుకూలుడైన ఒక వరుణ్ణి పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా వున్నట్లు నటించాలి. ఆ వరుడు కూడా ఆ విషయంలో తనతో సహకరించాలి. తమ ఇద్దరి అన్యోన్యతనే చూసి, జరిగినదంతా మరిచిపోయి డాడీ మళ్ళీ మామూలు మనిషి అవుతాడు. అప్పుడు నెమ్మదిగా డాడీకి జరిగిందంతా చెప్పి ఒప్పించి ఆ వరుణ్ణి

కాదని కిరీటిని తాను పెళ్ళాడాలి. ఈ ప్రయత్నంలో తనకి ఏ పుదారుడు తాత్కాలికంగా వరుడుగా నటించి, సహకరిస్తాడు?

ఎంత ఆలోచించినా మాధురికి ఒక మార్గం కన్పించలేదు. మొదట దాడికి కూడా నచ్చే యోగ్యుడైన వ్యక్తి దొరకాలి కదా! అతను సానుభూతితో తన పరిస్థితిని అర్థం చేసుకోవాలి కదా? చివరకి తనని కిరీటికి అర్పించే త్యాగబుద్ధి చూపించాలి కదా! ఇన్ని యోగ్యతలున్న వ్యక్తి యెవరు దొరుకుతారు? చాలాసేపు ఆలోచించాక కాని మాధురికి ఒక ఆలోచన రాలేదు. వచ్చినా ఆ తర్వాత నిరుత్సాహంతో నిట్టూర్చింది.

కొంచెంసేపు తటపటాయించింది.

చివరకి ఒక నిర్ణయాని కొచ్చింది.

తలెత్తి శేఖర్ వంక చూసింది.

శేఖర్ ఎటో చూస్తూ ఆలోచిస్తున్నాడు.

మాధురి తల ఒంచుకొని "మీరు సహ క రి స్తే " అంటూ మాటని మధ్యలోనే ఆపేసింది.

విద్యుద్ఘాతం తగిలినట్లు నిస్తేజుడైపోయి 'ఆ!' అంటూ అర్థంలేని ఒక వెర్రి అరుపు అరిచాడు శేఖర్

తల యెత్తకుండా యింకా నేలకేసే చూస్తూ "ఈ త్యాగం చెయ్యమని మిమ్మల్ని ప్రార్థించడానికి నాకు అర్హతలేదు కాని కాని" అంటూ నిశ్శబ్దంగా యేడ్చింది, మాధురి.

అతను కాదన్నా, నిర్దాక్షిణ్యంగా తిరస్కరించినా, 'ఏం ఆనాడు నా మనస్సులో అభిప్రాయాన్ని వినకుండా విసురుగా వెళ్ళిపోయావే ఇవాళ ఈ త్యాగానికి నేను కావలసి వచ్చానా' అని అతను అవమాన పరిచినా, అతని దగ్గర్నుంచి ఏ రకమైన సమాధానం వచ్చినా. అందుకు సిద్ధం అయే, అన్నింటికీ కొంగు పట్టడానికి తయారయే, ఆ మాట అంది మాధురి

శేఖర్‌లో చలనం లేదు

ముఖంలో చైతన్యం లేదు

మెదడులో శూన్యత. హృదయంలో స్తబ్ధత

నిర్జీవంగా వుండి పోయాడు.

ఎదురుగుండా కన్నీళ్ళతో దోసిలిపట్టి నిలబడ్డ మాధురి!

—(సశేషం)

---

Edited and Published by V. Leelavathy Raghavaiah, 40/1 Moosasait Street, Madras-600 017 and Printed by D. Hanumantha Rao, at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600 001.